
C PS01E571

ಪಕ್ಷಿಗಳು ಮಾತನಾಡಿದರೆ ಏನು?



CI

PSOIES71

తనలోతాను

(కదంబం)

జలసూత్రం
రుక్మిణీనాథశాస్త్రి

సంకలనం :
కె. వి. రమణారెడ్డి

నవోదయపబ్లిసహాక్ విజయవాడ-2
గుంటూరు-2

TANALOTAANU

- JALASOOTRAM RUKMININAATHA SASTRY

NAVODAYA PUBLISHERS
Vijayawada-520 002

First Edition :
AUGUST 1983

894.8227 JAL
T:20 - 85
4144

Printed at :
NAGARJUNA PRINTERS
Vijayawada-520 002

Price .
Rs. 13-00

IV

పేరడీ సూరీడు

సాహితీ చంద్రుడు



జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి

ఇదీ వరస....

"రెంటికిం జెడిన రేవడ ?" కాదు !	IX
రుక్మిణీనాథ శాస్త్రి	XIV
తనలో తాను	1
ప్రభావతి	101
ఉష	112
సీత	124
ధాన్యమాలిని	133
శకుంతల	142
దమయంతి	148
లేఖలు	161

"రెంటికిం జెడిన రేవడ"? కాదు !

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి రాసిన ఉత్తరంలో, రుక్మిణీనాథ శాస్త్రి తాను రెంటికి చెడిన రేవడ నయ్యానని ఆక్రోశం వెలిబుచ్చాడు. ఇహ పరాలకు రెంటికి అని చెప్పడమే తన ఉద్దేశమా? అయితే అది తన సొంత ఘోష. ఇహంలో రచయితగా పూర్తిగానే తాను అటు సాంప్రదాయికతకూ ఇటు ఆధునికతకూ చెందజాలక పోయ్యాడని ఆ మాటలకు మనం అర్థం చెప్పుకుంటామనుకోండి— అప్పుడేమిటి ?

సంప్రదాయం పాదులో పెద్ద పెద్ద మానులమ్మే చెట్ల వల్ల అంతగా ఎత్తుకెదగలేని, ఆశ్చర్యం కొల్పలేని రచయితగా తానూ పుట్టి పెరిగినమాట నిజమే కావచ్చు. బందర్లో తిరుపతి వేంకట కవులకు సహాయ శిష్యుడుగాక, చిట్టి గూడూరు సంస్కృత పాఠశాలలో చేరి 'ఉభయ భాషా ప్రవీణ' పట్టా కోసం పొట్టకూటికి పనికిరాగల విద్య నార్జించుకున్నాడుగాని ఆ పట్టా తనకు చేజిక్కింది కాదు. ఏ స్కూల్లోనో పిల్లలంతా గేలిచెయ్యక తప్పని సజీవ వినాయకమూర్తిలా నౌకరీ చెయ్యలేదు. నిజమే. కాని, చరిత్రలో తనది యుగసంధి అని తానే గుర్తించగలిగాడు. ఎప్పటికప్పుడు మారే పంచ భూతాత్మక ప్రపంచంలో సమాజమూ, కంటికి కనిపించనంత సూక్ష్మంగానూ మారే సన్నివేశాలు, ఎప్పుడూ వుంటాయి. మరొకప్పుడు ఈ మార్పు వురుములా వురిమి మెరుపులా మెరిసి పిడుగులా పడి దిక్-భ్రమ-భ్రాంతి కలిగించే మహా ఘటనలూ ఉంటాయి. మొదటిరకం మార్పే అనేకుల రచనలలో వారికే తెలీకుండా నిలిచి వుంటుంది. రెండోరకం మార్పు కొద్దిమంది రచనలకు అనన్యమైన ఊపునీ ఉరవడినీ కలిగించి, అద్భుత మనిపిస్తుంది: యిలాంటి రచయితల పేరనే యుగాలనీ శకాలనీ కొండగుర్తులు చలామణికి వస్తాయి. అందరూ అంతటి వాళ్ళయితే, ఆక్షికలోకం మెరుపుల దండుతో క్రిక్కిరిసి ఉరుముల ఫెళఫెళలతో గుండెలవియించి అద్భుతం మీద అద్భుతంతో బుద్ధిని ఉన్మత్తం చెయ్యదూ ?

'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ మొదలు మరో 'కవి సమ్రాట్' పై డిపాటి దాకా అని ఒక కూటమినీ, చలం మొదలు రావూరి భరద్వాజ దాకా అని మరొక కూటమినీ, శ్రీశ్రీ మొదలు నారపరెడ్డి దాకా అని మూడో కూటమినీ 1930–60 ల నాటికి తర తమ భేదాలతో సహా సాహిత్య పురుషాంతరాన్ని నిర్ధారణ చేశామనుకోండి— వీటిలో జల సూత్రం రుక్మిణీనాథశాస్త్రి స్థానం ఏ కూటమిలో ?

ఈ యక్షప్రశ్నకు జవాబిచ్చుకునే ధర్మరాజెవరు ?

On the one hand, on the other hand (సరిగ్గా ప్రూధాంచి తాత్వికుడైన ప్రూధా (Proudhon)ను హేళనచేస్తూ The Poverty of Philosophyలో మార్క్స్ అన్నట్టు) అనవలసి వస్తుందా జవాబుగా ?

ఇందుగలడందు లేడని
సందేహము....

అక్కర్లేదు; ఇతడు "సర్వోపగతుడు", "ఎంచెంచు వెచకిఁజూచిన నందందేఁగలఁడ"నవలసి వస్తుందా ?

ఉభయ చరజీవి అనవలసి వస్తుందా శాస్త్ర పరిభాషలో ?

ఈలాంటి సంకటం యిప్పటి నిన్నూ నన్నేకాదు, ఆనాటి జల సూత్రాన్నీ, పిలకానీ, హనుమదింద్రగంటినీ, సంపత్‌నీ— మరెందర్నో— వేధించి, "జవాబు చెప్పుకొండ"ని— వేధించి డోలాందోళన కలిగించి వుండాలి. సాంప్రదాయికత తెరలో త్తిగించి తొంగి తొంగి ఆధునికతను దొంగ చాటుగా జూసి కన్నుగీటిన చంచల హృదయులు కారు వీళ్ళు. "కొత్తపాతల మేలుకలయిక" అని గురజాడ ఆశించినదాన్ని మనసారా ఆశించి, టి. యస్. ఇలియట్ తరహాగా సంప్రదాయం అనేది ఒక నాగటి చాలైతే అందులో మొలిచిన పంటమొక్కలే ఆధునికమనీ లెక్కకు రాగలవనీ, పాతవాటి చేవా, కొత్తవాటి నవనవా కలిసి వస్తాయనే అనుకుందామంటే, మొత్తంగానే వీరందరినీ ద్వంద్వ ప్రకృతి గలవారిని చేసినట్లౌతుంది. అది మంచిది కాదు.

మరి ?

ఎవరికి వారినిగా, వారి వారి విలక్షణమైన భౌతిక, బౌద్ధిక పరిసరాలు

నేపథ్యంగా చూడాలి. దీనికి ఎవడూ అతీతుడు కాదు; అతీతుణ్ణని అను కోవచ్చుగాని తనకు తెలీకుండా కూడా అధీనుడే అవుతాడు.

అలా చూస్తే—

జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి శ్రోత్రియ సంప్రదాయంవేసిన మొగ్గయి, పువ్వయ్యాక, కొత్తకూ వింతకూ మోజుపడి కొన్ని రేకులు విప్పార్చి, మళ్ళీ క్రమంగా తన అభిమానాలను ముకుళింపజేసుకుంటూ సంప్రదాయ వాదాన్ని తనకుతానై కనిపెట్టుకుని, చివరికి సంప్రదాయ శోభనే పట్టుకుని 'శ్రీ విద్యోపాసన'కు పూనుకున్నా, శ్రీ శ్రీ మాటల్లో "ఖద్ద ఛాందస శ్రోత్రియ"త్వానికి పర్యాయపదం కాలేదు. లోని కోరికా, పైటి పనీ పూర్తిగా నమసించక, రెంటికీ జెడని విధంగా రెంటినీ జోడించుకుంటూనే వచ్చాడు- కొద్దిగానో, గొప్పగానో, ఆధునికత నట్టింటికి వచ్చి కొంతకాలం కాలూని నిలిచి, మళ్ళీ సాంప్రదాయికత చీకటింటివైపు తన బుద్ధినీ, రచననీ నడిపించు కెళ్ళాడు, అధునికతా వాసనలు పూర్తిగానే వెనక విడిచెయ్యకుండా మోసుకు పోతూ. ఇవి ఏ రచయితకైనా క్లిష్ట పరిస్థితే. జలసూత్రం శాస్త్రి పట్ల కొంత పిల్లి మొగ్గ వెయ్యనందుకే తృప్తిపడాలి. క్రమం తప్పినట్లు అనిపించే అతని పీతనడకలో శ్రేత గమనంలో కూడా ఒక క్రమం ఉంది. మొగ్గ పువ్వై, పిందై, కాయై, పూర్తిగా పండ బారకముందే చెట్టు వేళ్ళవద్దనే రాలి పడింది.

2

దూషకుడు అపకేకాదు. విదూషకుడు తనిపించిన యీ విచిత్ర వ్యక్తి నిజానికి అదీ కాదు. లోపలి గంభీరతను దాచే హాస్యం పైపైదే— అది వేషం మాత్రమే. ఎటునుంచి జోరుగా నైనా మని గాలి తోలితే ఆ తృణా వర్తుడి వూపుకి వుప్పరాని కెగసి, వాన్లో బాలకృష్ణుడిలా అవలీలగా చంపి కింద పడెయ్యకుండానే వాడికి తన బుద్ధిబలాన్నీ అభిమానాన్నీ నమర్పించు కుని, యీ "కలగా పులగపు విలయావర్తపు బలవత్ సురవత్ పరివర్తన"నే రచయితగా తన వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నాడు. సొంతం అనేది లేనంతగా, లేదా స్థూలదృష్టికి కనిపించనంతగా, అన్యాక్రాంతమయ్యాడు.

విశ్వనాథ సత్యనారాయణంటే భక్తి, గుడిపాటి వెంకటాచలమంటే ఆసక్తి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రంటే గురుభావం, శ్రీశ్రీ అంటే స్నేహ భావం, బందరంటే మిఠాయి తిన్నంతగా నోరూరి చవులు పుట్టడం, అపాంక్తేయు లనిపించుకున్న నటుల్నీ పంక్తికి పిలవడం, గాయకుల్ని మెచ్చడం: పై దికుల పరిభాషలను తవ్వి త్రచ్చిలాగి తీసి చూపుతూ కూడా వెంపటి నాగభూషణం (వి. యన్. భూషన్) వెల్లటూరి సోమనాథం వంటి వారి రచనల, చాటువుల సొగసులు చూపడం; స్వర్గంలో ఇచ్ఛాదీక్షితైన యథేచ్ఛా స్నేహాలూ మొహాలూ చూపుతూ ఇలలో చలం చెప్పిన వాటిని కల్పనలో చూడడం మొదలు పిల్లి గురించో పెళ్ళి గురించో కథలు రాయడం— సుడిగుండంలో చిక్కుకు అన్ని దిక్కుల్నీ తనవిగానే చేసు కుని దానిలోనే తనివి చెందడం— ఇవీ రుక్మిణీనాథశాస్త్రిని గిరగిరా గిరగిరా తిప్పేసి ఆటలాడించీ అలసట కలిగించజాలని బౌద్ధికమైన 'విధి'

వ్యక్తిగానే కాదు, రచయితగా కూడా తనకు ఎలాంటి మనస్సంకో చాలు (inhibitions) వున్నట్టనిపించదు. ఆరుద్ర ప్రయోగం 'సిజరెట్' పొగనే ధూపంచేసి శ్రీవిద్యోపాసన చెయ్యగల యీ ఆహితాగ్నికి ఆంక్షలూ ఆజ్ఞలూ వర్తిస్తాయా అని అనుమానం. తాను సాంప్రదాయికులలో నవ్యుడు, నవ్యులలో చివరనైనా సాంప్రదాయికుడు. రుక్కులు రాయించుకున్నాడు, రుక్కాయి అనిపించుకున్నాడు, జలాలుద్దీన్‌రూమీ అనిపించుకున్నాడు, కాని తాను తానుగా లోపల్లోపల అంటీ అంటనంత తనీగా వుండిపోయాడు.

పేరడీ గారడీ విద్యకు ఆద్యుడూ అనవద్యుడూ అనిపించుకున్న తాను, ఆర్యా వృత్తంలోనో పరో అసాధారణ వృత్తంలోనో స్వకీయంగా అసాధారణమైన ఉపజ్ఞతో అచ్చమైన ప్రతిభతో కవితలు రాశాడు. ఎవరికీ 'ఇమిటేషన్' అనిపించని కథలు రాశాడు. ఇంకా, మరుగున పడక తప్పని మైనంపాటి నరసింగరావు లాంటి హాస్యకథకులనూ, ప్రసక్తాను ప్రసక్తంగా త్యాగరాజు శిష్య ప్రశిష్యులనూ వెలుగులోకి తెచ్చాడు. సమకాలికులైన కాశీ నాథుని నాగేశ్వరరావు, విశ్వనాథ సత్యనారాయణ, డి. వి. సుబ్బారావు, వి. యన్. భూషణ్‌లాంటి వారి సిద్ధినీ చూపెట్టాడు. జలసూత్రం రుక్మిణీ

నాథ శాస్త్రిది రెండుగా విడిపోయిన మనస్తత్వం మాత్రమేకాదు (రెండు నాలుకల మనిషి అసలేకాదు.), అతని చేతుల సంఖ్య రెండుకంటె ఎక్కువే.

బహుముఖమైన యీ రచనా వ్యాసంగంలో పేరడీలలో తప్ప మరెందునా యింత బూడిద వెయ్యలేకపోయాడా? వేశాడు గాని చాలినంతగా వెయ్యలేదు. దేనికోసం, యీ 'చాలినంత'? ప్రసిద్ధి, ప్రశస్తి, ప్రఖ్యాతీ— వీటికోసం 'శతకోటి బోడిలింగాల'లో తానూ ఒకటయ్యాడా, అంటే, అదీ కాదు. ఇంగ్లీషు నేర్వకుంటే మానె, సంస్కృతాంధ్రాల 'ఉభయ భాషా ప్రవీణ' పట్టాకూడా చేతికి రాకుంటే మానె, పరభాషలు వచ్చిన వారితో తానూ ఖత్తు కలిపాడేమో, వాటి స్పర్శ పరోక్షంగానైనా రుక్మిణీనాథశాస్త్రి రచనలమీద లలితంగానైనా మనకు తగులుతుంది. కాకుంటే, కవిత, కథ, నవల, వ్యాసం, విమర్శ— వీటన్నిటిలోనూ తన చెయ్యిపడి, ఏదైకాగ్రత తక్కువ కావడంవల్ల ఎందులోనూ పూర్తి, రాణింపు పొందలేక పోయాడేమో? ఇది ప్రశ్నార్థకం కానక్కర్లేదు. రాణింపు పూర్తి పొందకున్నా, కొంతైనా కాకపోలేదు. ఆయన రచనలు "తళుకు చెళుకురాలు" మాత్రమే కాదు, "నిక్కమైన మంచి నీలం" ఒక్కటిగాక అనేకం. అది వట్టి ఉప్పరి తట కాదు— కదంబం.

3

వేటపాలెం 'సారస్వత నికేతనం', నెల్లూరు 'వర్ధమాన సమాజం' వారి 'తిక్కన గ్రంథాలయం'— యివీ యిలాంటివీ లేకుంటే ఎడారే - జీవన్మానవులతో గూడిన చవిటిపర్రే. శ్రీ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రిగారు, వారి పుత్రులు శ్రీ భానుమూర్తి, శ్రీకాంత్‌శర్మగార్లూ, మా బంగోరె, యీ నా కృషిని ప్రోత్సహించడమేగాక తలా ఒక చెయ్యి వేశారు. 'త్రివేణి ప్లాషర్స్' అధిపతి శ్రీ భావరాజు నరసింహారావుగారు కొన్ని ముఖ్య విశేషాలు తెలియ పరుస్తూ వివరణల విషయంలో సాయం చేశారు. శ్రీ అబ్బూరి వరద రాజేశ్వరరావుగారు తమవద్దగల రుక్మిణీనాథశాస్త్రి ఉత్తరాలను పంపారు. ఇక 'నవోదయ' ప్రచురణ సంస్థ విశాల బుద్ధి, వితరణ శీలం, యీ ప్రచురణలే దాఖలాగా నిరూపితాలు.

కావలి,
1-7-1983.

కె. వి. రమణారెడ్డి

X117

రుక్మిణీనాథశాస్త్రి

"ఇతనెవరో తెలుసా? కొడవగంటి కుటుంబరావు."

రుక్మిణీనాథశాస్త్రి నాకేసి ఎగా దిగా చూసి శ్వాస ఎగపీల్చి "కాడు !" అన్నాడు.

"అదేమిటి?" అన్నాడు నన్ను పరిచయం చేసినవ్యక్తి, ఆశ్చర్యంతో.

సాహిత్యరంగంలో నకలులేని వ్యక్తిని పరిచయం చేసుకోబోతున్నానని అప్పుడే అనుకున్నాను.

"కుటుంబరావైతే కోరలూ, రక్తనేత్రాలూ, చేతిలో బరిశెలూ అవీ ఏవీ?" అని అడిగాడు రుక్మిణీనాథశాస్త్రి.

ఆ విధంగా ప్రారంభమయింది మా పరిచయం, గుంటూరు నవ్య సాహిత్య పరిషత్సమావేశంలో.

అటు తరువాత మేం అడపా దడపా కలుస్తూనే వున్నాం. ఆ రోజుల్లో నా కతడు అభినవ నారదుడులాగా కనిపించేవాడు. ప్రతి చోటికీ వెళ్ళే వాడు. రచయితలందరినీ ఎరుగును. ఊరికే ఎరగటం కాదు, వాళ్ళనూ వాళ్ళ రచనలనూ, జీర్ణించుకునేవాడు. మనుషుల్లోనూ, రచనల్లోనూ ఉండే ఆయువుపట్లు పసికట్టడంలో అతన్ని మించిన వేటకుక్క లుంటారను కోను. ఆ శక్తి పేరడీల రూపంలో కొంతవరకే వ్యక్తమయింది.

1940–42 మధ్య నేనూ, అతనూ కలిసి ఆంధ్రవారపత్రిక చూస్తూ వుండిన రోజుల్లో శ్రీపాదవారి "వడ్లగింజలు" సీరియల్‌గా వేశాం. (రుక్మిణీనాథశాస్త్రి ఆ రచనకు "బహూవ్రీహి" అని పేరుపెట్టాడు.) శ్రీపాద

వారికి పాత్రల మనఃప్రవృత్తులను చేతలద్వారా వ్యక్తీకరించడం మహా యిష్టం. రుక్మిణీనాథశాస్త్రి ఈ గుణాన్ని ఉదహరించడానికి "యాజులు పూట కూళ్ళమ్మ కేసిచూశాడు: పూటకూళ్ళమ్మ శంకరప్పకేసి చూసింది: శంకరప్ప కప్పుకేసి చూశాడు," అని ముక్తసరిగా అన్నాడు.

నేను మెచ్చుకున్నాను. విశ్వనాథ సత్యనారాయణగారి ధోరణి వేమి టని అడిగాను.

రుక్మిణీనాథశాస్త్రి మొహం గంభీరంగాపెట్టి, "ధర్మారావు వచ్చెను." అన్నాడు. చాలు నన్నాను. సత్యనారాయణగారి రచనల్లో ధర్మారావు వంటి వ్యక్తి రావడమే ఒక గొప్ప సంఘటన.

రచయితల, రచనల ఆయువుపట్లు పట్టటంలో రుక్మిణీనాథుడికి గల శక్తి తాలూకు మరో ప్రదర్శన చాలామందికి తెలియదేమో. ఒకరోజు బెజవాడలో చలంగారింటికి నేనూ, రుక్మిణీనాథుడూ వెళ్ళాం. శ్రీ శ్రీ కవిత్వం విషయం ప్రస్తావన వచ్చింది. రుక్మిణీనాథుడు శ్రీ శ్రీ "జీవఫలం- చేదువిషం — చేదువిషం జీవఫలం - వొనుగిజం. వొనుగిజం." అన్నది మృదువుగా చదివాడు. చలంగారి కళ్ళవెంబడి అశ్రువులు జలజలా రాలాయి. ఆ పొడిమాటలను రుక్మిణీనాథుడు కన్నీరు తెప్పించేట్లుగా ఎట్లా చదవగలిగా డంటే చెప్పడం కష్టం. అతనిలో ఆ శక్తి వుండేది. అతను ఉత్తపేరడీ కాస్త్రీలు పుటుకు కాడు.

ఒకసారి అతను రైల్లో మద్రాసు వస్తూ పైచెంచీ మీద పడుకున్నట్ట. కింది బెంచీమీద కూర్చున్న వాళ్ళెవరో ఏదోపత్రిక చదువుతున్నారుట. రెండు మూడు వాక్యాలు చెవిన పడగానే అతను కింపకి తొంగి చూసి "అది రాసింది కుటుంబరావు" అన్నాట్ట. నిజమేట.

సాహిత్యమంటే అభిలాష ఉండే వారున్నారు. ఎన్సైక్లోపీడియాల లాగా ప్రతి రచనా జ్ఞాపకం పెట్టుకునే వాళ్ళూ ఉన్నారు. రుక్మిణీనాథుడి

లాగా ఇంతమంది రచయితల సారాన్ని సంగ్రహించిన వాడు మరొకడుండ డేమో. అతని సాహిత్య పిపాస అనన్యమైనది.

అతను పత్రికా ప్రపంచంలోనే ఉండదగినవాడు. ఎవరన్నా ఒక ఐడియా అందిస్తే చప్పున దాని ఒడుపు గ్రహించి చక్కని రచన చేసే వాడు. ఒకసారి చక్రపాణిగారు బెంగాలీ పత్రికల్లో నుంచి ఒక ఐడియా చెప్పారు– గొప్పవాళ్ళ ప్రతి చచ్చువ్యాపారానికి సిఫార్సు లివ్వడం. వెంటనే రుక్మిణీనాథుడు ఆ ఐడియాను దించేశాడు.ఒక కూరల అంగడివాడికి విశ్వనాథ సత్యనారాయణ, తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి, మరొకరు, యోగ్యతాపత్రా లిచ్చినట్టుగా వ్యాసం రాశాడు. చాలా చక్కగా వచ్చింది.

ఎన్నో శక్తులూ, స్నేహపాత్రతా మేధాతృష్ణాగల రుక్మిణీనాథ శాస్త్రిలో అనేక సంఘర్షణలుండేవి. తనకు ఇంగ్లీషు రాదన్న దిగులు వుండేది. నిజానికి అందువల్ల అతనికొచ్చిన లోటేమీ లేదు. తన ప్రవర్తన సక్రమంగా ఉన్నట్టున్నదేమోనని, చేతికర్ర ఒకటి ఏర్పాటు చేసుకున్నాడు. అనవసరం, ఇవి చిన్న ట్రాజెడీలు. పెద్ద ట్రాజెడీ అతను రేడియోలో చిక్కుకుపోవటం. కాని ఆర్థిక కారణాలు తెచ్చి పెట్టే ట్రాజెడీలంత అనివార్యమైనవి వీటీ ఉండవు. రేడియో ఆర్టిస్టుగా అతను రచన వెనకవుండే సహజ ప్రేరణలను ఎండగట్టుకున్నాడు. బతికి నన్నాళ్ళూ బాలాకుమారుడుగా ఉండదగినవాడు వార్ధక్య లక్షణాలకు క్రమంగా గురి అయాడు. అతను మద్రాసు నుంచి వెళ్ళిపోక మునుపే ఏ పాండీ బజారులోనైనా కలిస్తే, "అబ్బాయి కులాసా? అమ్మాయి కులాసా? వరూధిని ఆరోగ్యంగా ఉందా?" అనటంతో ప్రసంగం ముగిసే స్థితి వచ్చే సింది. రుక్మిణీనాథశాస్త్రి వంటివాడు అదృశ్యమైపోతే ఏమీ మిగలకపోవటం మరీ పెద్ద ట్రాజెడీ.

కొడవటిగంటి కుటుంబరావు

23—8—1968.

తనలో తాను

'ఇవాళ ఏకాదశి, మంగళవారం! భాద్రపద శుద్ధ ఏకాదశి పరివర్తన ఏకాదశి, వర్జ్యం' అంటూ బ్రాహ్మడు పంచాంగం చెప్పాడు! ముష్టి వేయించుకున్నాడు!

గౌరవం జారిన వృత్తి వైదిక వృత్తి! మహా మహా ఘనాపాఠీలకు దిక్కూ దివాణంలేని రోజులలో, ఎందుకూ పనికిరాక, ఏ విద్యా అబ్బక, ఆకలి దప్పులకు లోనౌతూ పుట్టుకవల్ల ఏదో వొరిగిందని నమ్ముతూ, మా తాతలు నేతులు తాగారుస్మా అన్నట్లు మా పూర్వులు 'రుషులుస్మా' అని చెప్పుకుంటూ, తన పనిమీద, తన వృత్తిమీద, తన బ్రతుకుమీద, తన జన్మ మీద అసహ్యం ముద్ద కట్టినవాడు,—ముష్టికొచ్చే బ్రాహ్మడు!

నీళ్ళ కావిళ్ళ మోసేవాడు, ఎంగిలి విస్తరాకులు ఎత్తేవాడు, పీని గల్ని మోసేవాడు, ఎవరైనా ఏ వృత్తివాడు —తనకు యింత కావాలి అని

ఆడగ్గలడు? ఏ వృత్తివాడు అయినా అడగ్గలడు కాని, వైదిక వృత్తివారు అడగలేరు. యిచ్చినంత పుచ్చుకొని వెళ్ళవలసిందే! మరీ ముష్టికొచ్చే ముష్టి బ్రాహ్మడు.

పంచాంగం బ్రాహ్మడు, తిథి వార నక్షత్రాలు చెప్పి, తన మాట గోడలపరం కాగా, మళ్ళీ మళ్ళీ బిగ్గరగా అరచి, అరచి,

"వీడి పోరు తప్పదు" అని యింట్లో వాళ్ళు, నోటితో లేదనేది చేత్తో లేదు అనగా, ఆ వేసిన ముష్టే పదివేలు అనుకుని వెళ్ళాడు, పాపం ఆయన!

నిగ్రహానుగ్రహ సమర్థులయిన వారి సంతతి, పాపం, బ్రతుకుమీద వేదనలతో వుంటోంది!

అయినా అహంకారం పోదు! ఎట్లా పోతుంది! పుట్టుకతో వచ్చిన అహంకారం, వయస్సుతోపాటు పెరిగిన అహంకారం! అనేక దశలలో పోరాడి, అనేక స్థితులలో వేసారి, అనేక భ్రాంతులలో మోసపోయి, అనేక కష్టాలతో కనలికనలి నానా జన్మలలోనూ నలిగి నలిగి నాశనం కావడమే పరమార్థంట. శ్రీ రమణ భగవాన్ చెప్పిందీ ఇదే.

"అహ మపేతకం నిజవిభావనం
మహదిదం తపః" అని.

భగవాన్ శ్రీ రమణుల మాట గుర్తుకు రాగానే, వారి సమాధికి మనసా ప్రణమిల్లి, ఆ అరుణాచలం కొండకు మనసా సాగిలపడి, నెమ్మదిగా, బడికిపోయే మారాంపట్టిన పిల్లవానివలె ముందుకు పోతూన్న పంచాంగ బ్రాహ్మణ్ణి చూస్తున్నాను!

ఆయన్ను చూస్తూంటే విచారం వేసింది!

ఈ అలవాట్లు, ఆచారాలు అంతరించాయి!

ఎక్కడో, సకృతుగా గమనించ తగినంతగా వినబడుతున్నాయిగానీ వినబడ్డా, వీమిటో—

ఏకాదశినాడు ఉపవాసం వుండడం, రాత్రి జాగరణ చేయడం, ద్వాదశి నాడు బ్రాహ్మడికి భోజనం పెట్టుకోడం, అవంతా జరిగిపోయిన నాగరికతా చిహ్నాలుగా వున్నాయి! నెలకు ఒకటి రెండు రోజులయినా వుపవాసం వుండడం శరీరారోగ్యానికి చాలామంచిది అని ఆంగ్లబాషీ వైద్యులు చెప్పినా మనం వినం! వీటో ఒకటి, ముఖ్యంగా విషప్రాయమైన కాఫీ త్రాగుతూ వుంటేనేగాని రోజు గడవదు మనకు !

ఉపవాసం ఉండడం, అంటే భోజనం మానుకోడం అర్థం రావడమే మిగిలింది !

భోజనం గూడా మాని, వైవచింతనతో గడపడం అనేది — హుష్ కాకీ అయింది!

ఉప సమీపే వాసః అన్నది పోయి 'ఉపోషం' అయి అరగంటసేపు కాఫీ తాగకపోటానికి పర్యాయపదం అవుతోంది! బాగుంది!

సరేగాని, పరివర్తన ఏకాదశి అన్నాడేమిటి?

పూర్వం 'మురుడు' అనే రాక్షసుడుండే వాడట !

ఇతగాడు గాడెక్కి, దేవతాళిని గజగజ లాడించడం, గడగడ లాడించడం ప్రారంభించాడు! వాడి ఢాకకు దేవతలు తాళలేకపోయారు ! వాడి పేరు వారికి సింహస్వప్నం అయింది! విష్ణుమూర్తి దగ్గరికి వెళ్ళి మొరపెట్టుకున్నారు !—

ఇక్కడే చిక్కు.

ఎప్పుడూ ఎవడో ఓ రాక్షసుడు వీరో అఘాయిత్యం చేస్తాడు !

ఈ దేవతలు తక్కువవాళ్ళు కారు.

అమృతం తాగిన భడవాలు, అంచేత చావరు ! మరి వీళ్ళకు యిదేం పోయేకాలం ! రాక్షసులకు హడలడం !

యింకా,

వీళ్ళు మాంచి బలాఢ్యులు! ఆ రాక్షసుణ్ణి యింతమంది ఎందుకు చంపి పారెయ్యరు! యింతమంది కలిసినా, ఆ వేలెడంత వెధవనూ నంపి పారెయ్యలేక పోతారా?

మరి పదే పదే ఆ విష్ణుమూర్తి దగ్గరికిపోయి, ఘోషిస్తారేం !

అదే గమత్తు.

నేటి జగత్తులో శిక్షాధికారం సర్కారు వారిదైనట్లు, దేవతలలో గూడా శిక్షాధికారం విష్ణుమూర్తిది కాబోలు! శిక్షాధికారం ఉన్న వారిదగ్గర మొరపెట్టుకున్నారన్నమాట! జరగవలసిన తీరు అది! అంతే, తాము చెయ్యి చేసుకోరాదు! వారు తాపై చేయి చేసుకోరు !

దేవతల గోడు విని విష్ణుమూర్తి బయలుదేరాడు!

మురాసురుడేం తక్కువవాడా ?

విష్ణుమూర్తి అంతవాణ్ణి ముప్పతిప్పలూ పెట్టాడు !

విష్ణుమూర్తికి గూడా వీణ్ణి చంపటానికి ఉపాయం వెదకాలిసొచ్చింది అన్నమాట !

ఏం తనే చంపేస్తేనేం....

తాను చంపితే, చచ్చినవాడికి మోక్షం వస్తుంది !

నీళ్ళల్లో నీళ్ళలాగా, తైలంలో తైలంలాగా సైవంలో, వాడు కలిసిపోతాడు!

సైవం ఏదయినా యిస్తుందిగాని, మోక్షం యివ్వదు!

ఏం, ఎంచేత?

మోక్షం ఒకరు ఇచ్చేదికాదు!

అన్ని వాసనలూ కాలి, మనస్సు గూడా మాడిపోతే, మరి అంతా మోక్షమే! విష్ణుమూర్తి మురాసురుడికి కర్మవిపాకం ఇచ్చగించలేదు! విష్ణు మూర్తి దేహంనుంచి ఓ కన్య ఆవిర్భవించింది. ఈవిడే ఏకాదశి!

ఏకాదశీదేవి విష్ణుమూర్తి పంపున వెళ్ళింది! మురాసురుణ్ణి ఎదిరించింది. యుద్ధం చేసింది! సంహరించింది!

విష్ణుమూర్తి మురారి అయినాడు!

"నటన సూత్రధారీ మురారీ!"

ఈ ఉపకారం చేసినందుకు, ఏకాదశిని, 'ఏం కోరుకుంటావు' అని అడిగాడు!

"నేను సర్వకాలాల్లోనూ మీ ప్రియురాలుగా వుండేటట్లుఅను గ్రహించండి! అన్ని తిథులలో ప్రధానమైన థితిగా వుండేట్లు అనుగ్రహించండి! నా పేరిటి తిథినాడు భక్తిశ్రద్ధలతో ఎవరు ఉపవాసిస్తారోవారు ముక్తిని పొందాలి"అని వరాలు కోరింది!

విష్ణుమూర్తి ఏకాదశికి వరాలు ఇచ్చాడు!

అప్పట్నించీ ఏకాదశులుండడం, ఏకాదశి వ్రతాలు ఆచరించడం ఏర్పాటు అయిందట!

ఇదొక పురాణగాథ.

మోహినీ రుక్మాంగద అందరికీ కొట్టిన పిండే!

ఐతే ఇదొక ఉదాహరణం!

ఇక్కడో సంగతి గమనించాలి!

నెలకు రెండు ఏకాదశులు!

సంవత్సరానికి పన్నెండు మాసాలు! అంటే ఇరవై నాలుగు ఏకాదశులు వస్తాయి. ఈ ఇరవయి నాలుగు ఏకాదశులకూ కామద, వరూథిని, మోహిని, అపర, నిర్జల, యోగిని, శయన, కామిక, పుత్రద, పరివర్తిని, ఇంద్ర, రమాప్రబోధిని, ఉత్పత్తి, మోక్షద, సఫల, పుత్రద, పటీల, జయ, విజయ, పాపమోచిని అంటూ మనవాళ్ళు పేర్లు పెట్టుకొన్నారు.

ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి దాకా చాతుర్మాస్యాలు అనుకున్నారు.

ఈ నాలుగు నెలలూ విష్ణుమూర్తి నిద్రిస్తాడు! అంటే- విష్ణుదేవతాకం అయిన నక్షత్రం, ఆకాశాన కనబడదు!

చాతుర్మాస్యాలు, వర్షప్రాబల్యం ఉన్నకాలం! మనవూళ్ళల్లో నడవడం కష్టం! ఏ పని చెయ్యడానికీ వీలుగాని కాలం! సంపాదనలు తగ్గుతై- అందుకే "వర్షర్తు మష్టౌ ప్రయతేత వృష్ట్యై" అని వర్షాకాలం భుక్తిని, మిగిలిన కాలంలో సంపాదించుకో అని హితోపదేశం చేశారు! కృష్ణదేవరాయలు ఈ హితోపదేశాన్ని మరీ రమ్యంచేశారు ఆముక్త మాల్యదలో!

ఆముక్తమాల్యద—

ఏం గొప్పకావ్యం! అ-బ్బ రాయలవారికి భాషలో పర్‌వర్సిటీ వచ్చి పడిందిగాని, ఆయన భాషగూడా ప్రసన్నంగా వుంటేనా....!

కాళిదాసు :

"శాపాంతో మే భుజగ శయనాదుద్ధితే శార్ఙపాణౌ
శేషాన్ మాసాన్ గమయచతురో
లోచనే మీలయిత్వా"

అన్న శ్లోకం 'కాళిదాసు మేఘదూత' చదవని వాళ్ళకూడా తెలుసు.

'లోచనే మీలయిత్వా, కళ్ళు మూసుకుని నాలుగు నెలలు గడుపు' అన్న భాష తెలుగుగా వుంది గనుక, కాళిదాసు తెలుగువాడు, అనుకునే వాళ్ళే!

కాడు!

తెలుగువాడు కాడు అని ఆ శ్లోకమే సాక్ష్యం ఇస్తుంది!

కాళిదాసు తెలుగువాడైతే వొరిగిందేమిటి, కాకపోతే తరిగిందేమిటి?

ఆయన కవిత్వం ప్రపంచ సౌభాగ్యాలలో ఒకటి! చాలదా?

ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి భాద్రపద శుద్ధ ఏకాదశికి వ్యవధి రెండు నెలలు! నిద్రించిన రెణ్ణెల్లకు విష్ణుమూర్తి నిద్రలో అటూ యిటూ తిరుగు తాడట. పరివర్తనం ఇది! కార్తిక శుద్ధ ఏకాదశినాడు నిద్ర లేస్తాడు! ఆయన, నిద్ర లేవడం మనకు గొప్ప పండుగ.

ఆనాడు క్షీరాబ్ధి ద్వాదశి!

ఆనాడు మనవాళ్ళు వ్రతం చేస్తారు!

ఇలాగ ప్రతి ఏకాదశినీ పర్వంలాగ పూజించారు మన పూర్వులు.

మన పండగలూ, పబ్బాలూ— మాసిపోయినై!

నిజమేగాని, పండగ, పబ్బం అంటాంగదా, పండగ సరే, పబ్బం అంటే ఏమిటో....?

ఒకటిగా తోస్తోంది.

'పర్వం' మనకు తెలుసు.

మహాభారతంలో పద్దెనిమిది పెద్ద పర్వాలు, వంద చిన్న చిన్న పర్వాలు.

అమావాస్యా పూర్ణిమలు పర్వాలు.

పర్వం అన్నమాట, ప్రాకృత భాషలోకి దిగి, పర్వ అయింది.

తెలుగులోకి - తమిళం వెండక్కాయ, బెండకాయగానూ,

'వండి' బండిగానూ, పరుషం అయి వూరుకుంది.

'పబ్బం' పర్వం ఒకటే.

పబ్బంనాడు కొన్ని కొన్ని విధులు నిర్వర్తించాలి! అవి మనకు రుచించవు!

అయినా తప్పదు! కనుకనే, 'పబ్బం గడుపుకోటం' అన్నది మన తెలుగులో తేలింది! బాగు.

ఉపవాసం కథయిందా.

ఉపవాసాలు పోయినాయిగాని, వారం వర్జ్యం చూడడం యింకా పోలేదు! వర్జ్యంలో ఏ పనీ తలపెట్టి ప్రారంభం చెయ్యరు! ఆ గంటన్నరా ఆగవలసిందే.

ఎవరికన్నా డబ్బు యివ్వడం, పసుపు, పసుపు కొమ్ములు అప్పు యివ్వడం మొదలయినచోట్ల – శుక్రవారం, మంగళవారం యింకా అష్టు వస్తూనే ఉన్నాయి. ఏదో విధంగా వుంటయ్‌గాని నిత్యజీవితంలోంచి అన్ని ఆచారాలూ, అలవాట్లూ శుభ్రంగా తుడిచి పెట్టుకొని పోవు.

పైగా,

వయస్సు దాటేవారు, దాటుతూన్నవారు ఎప్పుడూ వుంటూనే వుంటారు! పైలా పచ్చీస్‌గాళ్ళ తృప్తీకరించడం సహజం.

యాభై దగ్గరవాళ్ళు, తాము తృణీకరించిన వాటినే, తిరిగి పూజించడం సహజం!

కాని, అసలుపోయి కొసరు మిగిలినట్లు- వెలా తెలా పోతాయి.

వేమనయోగి అంతవాడు -

దశమి యేకాదశి అటంచు వ్రతముబూని
మెతుకు లినపున్న దుర్గుణ మేలమాను!
పుట్టపై గొట్ట నురగంబు గిట్టబోదు!—అన్నాట.

ట.

ఈ పద్యం వేమన రచనా పద్ధతికీ చెందినట్లు తోచదు! కనుక వేమన్నది కాదేమో, ఆ తరువాత వాని చేర్పులూ, కూర్పులూ లోదేమో!

ఎవరిదైనా, వేమన్న అంతవాడి పేరుతో వచ్చిన ఉపదేశం అది!

వేమన్న తెలుగురుషి కదా?

తెలుగువాళ్ళం, మన జాతిలోని మహనీయుడి ఉపదేశాన్ని ఆచరణలో పెడుతున్నాం!

చాలు!

ఒక మంచి మాట విన్నా విన్నట్లే.
ఒక సుగుణం అబ్బినా తరించినట్లే.

2

"రాజూ వెడలె - రవి తేజము తోడుత
రాజూ, వెడలే - సభకూ—"

రాజు వేషగాడు అన్న చరణాన్ని, హంగుదారులు తిరిగి తిరిగి అంటున్నారు. ముందుగా ఇది వెకిలితనం అనిపించింది. కానీ—కాదు—వివిధ రీతులలో అంటున్నారు. వివిధ భావాలను సువ్యక్తం చేస్తున్నారు. తెరలు, నగలు మొదలయిన ఆహార్యం బహు తక్కువ. ఆరు బయట పందిరిలో, శబ్ద ధ్వని సహాయంతో, అంతా ద్రష్టల భావానికీ—ఊహలకి వదిలి వేస్తున్న యక్షగాన ఫణితి అది. తరువాత నచ్చింది.

రాజు తన నభకు ఇలా వెడలేవాడా అని.

ఎల్లా వెడలేవాడూ మరి?

అమిత ప్రతాపవంతులు, మహా తపశ్శక్తిసంపన్నులు, విరోధ భక్తిచే మోక్షాన్ని సాధిస్తున్న నాయకులు, ఆ రాజులు, ఆనాడు తమ తమ సభలకు ఆ లాగున వెడలే వారేమో రవితేజంతో.

ఒడ్డూ, పొడుగూ, తీవి, దర్పం, అహంకారం, మమకారం పరిపూర్ణంగా ఉన్న ఆ మహానుభావులు—ఆనాడు ఆ విధంగా వుండే వారేమో.

చెప్పలేం.

ఆనాటి మూర్తులకు ఇదంతా మన ప్రతీకం (Symbol) గానీ—ఆనాటి సాంఘిక చరిత్రలేదు. చరిత్ర లేదు. ప్రతిమలు లేవు. సరి అయిన వర్ణనలు లేవు. ఉన్నవి అయినా, భావ్య రక్తికి ఉపయోగించేవే. అందు వల్లనే మన కవులు తమ తమ సంస్కృతీ బలాన్నిపట్టి ఆ ఆ భావాలకు ఈ విధంగా రూప కల్పన చేశారు. ఏమైనా, అందమైన రూపకల్పన.

మనస్సులకు హత్తుకొనిపోయే రూపకల్పన: రాజు రవి తేజంతో వెడలడం కాదా మరి, ఆ ఆ రూపాలను కల్పించింది ఎవరూ?

ఎక్కువ భాగం వ్యాసుడూ, వాల్మీకీ.

ద్రష్టలయిన రుషులు వారు.

నిజంగానే చూచే ప్రాణాలేమో రామాయణ, భారత, భాగవతాలలో. అలాగే అయి వుంటుంది.

సుందర కాండలోని రావణ వర్ణన చూస్తే—నిద్రిస్తున్న రావణుడు, అతని రెండు చేతులు, దేహ సంపద చూస్తే—రావణునిమీద కోపం, అసహ్యం, ద్వేషం రాదు. అభిమానం కలుగుతుంది. లంకా వర్ణన ముందు అయోధ్య వర్ణన చాలా చప్పగా వుంటుంది.

మరి—

'ఇతర ప్రాణిక లభ్యమైన సిరిచే—వీకాదశా క్ష్మాహితోపతి' అయిన—దుర్యోధనుడు!

అతనికి అతనే సాటి అనిపిస్తుంది. దుర్యోధనుని వైభవం ముందు, ఆలోచన ముందు, అవతారమూర్తి కృష్ణుడు తక్కువ, తక్కువనవారు సూర్యుని ముందు దివిటీలు అవుతారు.

ఆగు.

ఎవరికి? ఈ భావన.

కనీసం, నా హృదయానికి. అంతే! మరో మాట.

గతాను గతికంగా పోయి, శిల్పులు, చిత్రకారులు, కవులు — గుడ్డి ఎద్దు చేన పడ్డట్టు, దుర్యోధనుడు పాపిగానూ, రావణుడు తొట్టి ప్రతినాయకుడుగానూ, కంసుడు క్రూరుడుగానూ చిత్రిస్తారు. గానీ, ప్రతిభావంతులు, అతి ప్రతిభులు— దుర్యోధనుని మహాభిమానిగా, రారాజుగా, యోధునిగా

చిత్రిస్తారు. రావణుని తపశ్శక్తి సంపన్నునిగా, పరాక్రమశాలిగా, కంసుని సాధకునిగా చిత్రిస్తారు.

మహానటులని పేరొందిన వారు కూడా—హిరణ్యకశిపుడు, కంసుడు, దుర్యోధనుడు మున్నగువారి భూమికలలో తాల్చి, ఆ ఆ మహా పురుషులలోని భావ సంఘర్షణా తీవ్రతను ప్రస్ఫుటించి జేజేలు పలికిస్తారు. ఎందుచేత: అప్పటికి కానీ, వారి కళాసృష్టికి పరిపూర్తి కాదు కాబోలు.

ఇంతకూ,

అసలు వ్యక్తులు ఉన్నారో, లేదో? - ఉండే వుంటారు.

సర్వసములై, ద్రష్టలయిన వ్యాస వాల్మీకులే ఈ ఈ దురంతకులైన పాత్రల్ని సృష్టించేటప్పుడు, సుఖ దుఃఖాలలాగ, వెలుగు నీడలలాగ మంచి—చెడ్డల్ని కలిసి, ఉద్ధృతమైన వేగం కలవారుగా చిత్రించారు. కర్ణుని మెచ్చనివారు అరుదు. కాని, కర్ణుడు కథారీతిలో—చెడిపోయిన పాత్ర. అర్జునుడిదే గెలుపు. ఐతేనేం, కర్ణుడు లేనిదే భారతంలేదు. కర్ణునికి జోహారు చేయని ధీర హృదయమూ లేదు. అలాగే రారాజూ, రావణుడూ, కంసుడూ, హిరణ్య కశిపుడూ - మున్నగువారు దైవోపహతులు. కాని, దైవానికి తప్ప, మరొకరికి లొంగని శూరులు!

వారి వారి శౌర్యమే మన హృదయాలను ఆకర్షిస్తూంటో ఏమో, మరి: వారి వారి శౌర్యదీధితులకన్న, వారి వారి పరాక్రమ పరిధవాలకన్న రాచసిరి ధగధగలకన్న, వారిలోని ఆత్మ విశ్వాసం బహుశా మన్ని ఎక్కువ ఆకర్షిస్తుంది.

బహుశా, ఇదై ఉంటుంది—

కావడానికి వారు దైవోపహతులు. నిజమే. దైవోపహతులమీద సానుభూతి కొంచెం వుంటుంది. అంతకంటె బలంగా, వారిలో ఉన్న

లోపాలు మనలోనూ వుండటం కారణం అయి వుంటుంది. ఈ ఆకర్షణకు కంసునిలోని భయం, రావణునిలోని కాముకత్వం, రారాజు దుర్యోధనుని అసూయ మనకూ వున్నాయి. ఎటొచ్చి, మనలో ఈ ఈ గుణాలు, మన పరాక్రమంలాగా నివురు కమ్ముకుని వుంటాయి.

వారిలో, కణ కణ లాడుతూ, భగ భగమంటూ భుగభుగలతో వుంటుంది.

పైగా వారు తమకు విధి ఎదురైందని తెలిసినా గూడా చలించని నగధీరులు, నిశ్చలులు.

మనం, ఎటు గాలి వీస్తే అటు కదిలిపోయే రావాకులం.

పైగా, వారి ఠీవీ, దర్పం, పొగరు అంతా మోక్ష సాధనకు ఉపయోగించింది.

ఇన్నిన్ని కలిసి—ఆ ఆ ధీరుల మన్ని ఆకర్షిస్తారేమో, ఏమో!

3

పసిపిల్లవాడు పొత్తిలలో నిద్రపోతున్నాడు, మహా కావ్యంలాగ! నిద్రిస్తున్న లేపలేను! అవసరం ఎంత ఉన్నా సరే, అన్నం తినేవారినీ, ఆదరాబాదరాగా నిద్రపోయేవారినీ—డిస్టర్బ్ చెయ్యలేను! మనస్కరించదు! నిద్ర పోతూన్నప్పుడు, మనిషి నిజ స్వరూపం బయట పడుతుంది! నిద్రా ముద్రితుడి నొసలు, కనులు, కనుబొమలు, పెదిమలు, అతని తత్వాన్ని పట్టి ఇస్తయ్! అన్నం ముందు కూర్చున్నప్పుడూ అంతే. మనిషి మనస్సు, మనస్సు నిలకడ, చిరచిర, తొందరపాటు, సహనం—అసహనం, నేర్పు ఇట్టే తెలిసి పోతుంది!

పైగా నిద్రా హారాలు ప్రాణికోటికి అవసరాలు! అవసరాలను తీర్చుకొనే వేళలలో—ఎవరి మనస్సూ కలత పడరాదు! కలత నిద్ర పోతూ, తెలివి వస్తే—పసి పిల్లలు ఏడుస్తారు! కాంత అయితే, కనుబొమలు చిట్లించి, నొచ్చుకుంటుంది. మరి ఒకర్ని నొప్పించి పొందే ఆనందం, నా వల్ల కాదు కనుక నిద్రించే వారిని లేపలేను !

పసిపిల్ల వాడు నిద్ర పోతున్నాడు! ఎర్రని కలువ పువ్వులాగ! చెరువులో చేప కదిలితే, పద్మం చలించినట్లు—చిన్న అలలు వచ్చినప్పుడు—ప్రతిఫలించిన చందమామ బింబం చెలించినట్లుగా చిన్నగా కదులుతాడు! సన్నగా నవ్వుతాడు, వొత్తిగిలి మైమరచి నిద్రపోతాడు.

మహాయోగికి సమాధి భంగం చెయ్యడం ఇష్టంలేనట్లుగా యివతలికి వచ్చేశాను! అరకంట చూచి ఆశీర్వదించి వచ్చేశా నివతలికి. పిల్లడు నిద్రలో ఉలిక్కిపడి లేచాడు! చిన్న పోరు పెట్టాడు! తల్లి వచ్చి ఉప్పుతో దిష్టి తీసింది!

కాస పోరు మానాడు!

ఈ దృష్టి తీయడం ఏమిటీ, యింత ఉప్పు తీసుకుని వచ్చి, ఖుద్ద తెనుగు భాషలో—యిన్ని తిట్లు ఎవరినో తిట్టిపోసి ఆ ఉప్పు, నీళ్ళలో పడేస్తే-ఉపశాంతి ఎలా కలుగుతోందో! అలాగే జేగురునీళ్ళు తియ్యడం, కచ్చికమీద చమురుపోసి దీపంగా వెలిగించి చుట్టూ తిప్పడం—యివన్నీ ఏమిటో అర్థం కానివి! ఆచారప్రాయాలు!

ఆచారప్రాయాలు అని చూస్తూ కొట్టి పారవెయ్యలేం. వాటి అవసరం వుండనే వుంది మనకు!

కొత్త కోడలుకు దృష్టి తగులుతుంది! ఆమె ఝడుసుకుంటుంది! భయపడుతుంది! ఏ చనిపోయిన మహాతల్లో వచ్చి వాలుతుంది! చికాకు పెడుతుంది! నాడు సంసారాన్ని నిలూనా ఏడిపిస్తుంది! అలాంటప్పుడు-యీ అర్థం

లేవనుకున్న, అర్థం కావనుకున్న ఆవారాలు, మంత్రాలు తంత్రాలు పనిచేసి తీరుతాయి! మనవాళ్ళు మనసుపడి ఆవేశించి, మఠం పెట్టుకూర్చున్న — బ్రహ్మరక్షస్సుల్ని, మంత్రశక్తితో పోగొట్టారు! శ్రీకృష్ణ దేవరాయలంత వాడు, మహా మనసుపడి, బ్రహ్మరక్షస్సు కథ వ్రాశారు! వాల్మీకి అంత వాడు, కవి, ఋషి,—'ఛిద్రం కా మృగయంతేస్మ విద్వాంసో బ్రహ్మ రక్షసాః' అని—కంఠోక్తిగా చెప్పాడు! అటీక సృష్టికాక, యథార్థమేమో బ్రహ్మ రక్షస్సులూ, దయ్యాలూ, దృష్టి-యిదంతా. గుండెలమీద పడుకున్న శిశువు పుస్తకంలాగ నిద్రపోతున్నాడు! కదిలితే ఎక్కడ లేస్తాడో అని నేను, కదల కుండా, మెదలకుండా పడి ఉన్నాను! ఎక్కడ నిద్రలేచి, కలతపడి, కంగారు పాలవుతాడో అని వాడితల్లి గబగబా తింటోంది! మేం ఉన్న చిన్నగదిలో, అందులోనూ సంపాదన తక్కువ అయిన వాళ్ళ చిన్నగదిలో, గాలికి గూడా భయమే! ధారాళంగా సాహసించి లోపలికి రాలేదు!

'నువ్వు తొందరపడి అర్థాకలిగా లేవకు. నేను చిచ్చికొట్టి నిద్రపుచ్చు తానులే!' అని నా భార్యకు చెప్పాలనిపిస్తుంది! చెప్తూంటే ఆ కదలికకు ఎక్కడ నిద్రలేస్తాడో అని భయం! తల్లి భోంచేసి యిల్లు సర్దుకుని వచ్చే దాకా పిల్లవాడు కదలకుండా నిద్రపోవడం, నా బాధ్యత! కదిలిస్తే కావ్యం వంటివాడు శిశువు! చిత్ర నిద్రలోని శిశువూ, భాండాగారంలో పుస్తకమూ చూడముచ్చటగా వుంటాయి! అవి కదిలాయో, కావలసినంత!

మహాకావ్యం అంతవాడు మా అబ్బాయి! అయితే మహాకావ్యం మధురంగా ఒకప్పుడు ఉండకపోవచ్చు! మా అబ్బాయి మాకు ఎప్పుడూ మధురమే! చాలాభాగం మహాకావ్యమూ మధురమే!

మహాకావ్యం చదువుతూ వుంటాం! విచ్చిన సన్నజాజి చెండువలె, కావ్యం తేలికగా, సొంపుగా, సొగుసుగా పరిమళిస్తూ వుంటుంది!

చేతిలోంచి సన్నగా జారి గుండెలమీద శిశువువలె విశ్రమిస్తుంది.

మనస్సుకు చక్కిలిగిలి. మన మనస్సే మామూలు మనోవేగాన్ని మించి పరు గెత్తుతుంది. కంటికి కనపడని, చెవులకు వినబడని, వెన్నెలవలె, చీకటివలె గుప్పిట పట్టుకోరాని సంగీతంవలె నిలచెట్టరాని ఏ స్థితికో పోతుంది, మనస్సు! ఆలిసిపోయి ఎక్కడో ఆగుతుంది ఆ మనస్సు ! ఎక్కడ ఆగుతుందో తెలి యదుగాని, ఆగినచోట గుంజాటన!

ఏ చిన్నతనంలోనో జరిగిన సంఘటన, ఏ కొత్త కాపురంలోనో అను కున్న మాటలు, ఏ అధికారి పెట్టిన హింసకో ఏడ్చిన ఏడుపు, ఏ కత్తిమీది సాములోనో తగిలిన గాయం, ఎవరెవరు చేసిన సహాయలేశం, ఉపకార అప కారాలు, ఆమోద ప్రమోదాలు, విషాద వికాసాలు, ఏవి అడ్డు తగుల్తాయో తెలీదుగాని—మనస్సు మథనపడుతుంది !

అక్షరాలు మాటలవుతై ! మాటలు ఈకెలవుతాయ్! మనోరాజ్యంలో కుహకాలు, కుట్రలు, ద్వంద్వ యుద్ధాలు, కుస్తీపట్లు, కోడిపోరులు, గొఱ్ఱె పొట్టేళ్ళ పోట్లాటలు, గుర్రాల పరుగులు, ఏనుగుల ఘీంకారాలు, సింహ గర్జనలు—చివరికి సొమ్మసిల్లడం, ఎక్కడున్నామో తెలియకపోవడం !

పచ్చని మైదానాలు, చీకటిలో పర్వతాలు, అరకంట సరసంలాగ అర్ధచంద్రుడు, పెద్దలు, చిన్నలు, పరికిణీ తొక్కాడు బాలలు, మొటిమల సోయగాన్ని మరింత మనోహరంగాచేసే వాల్చూపుల వామలోచనలు, ఆజా నూజ్వల బాహులైన అందగాళ్ళు, చిరిగిన చిత్రపటంలాంటి వృద్ధులు, జీసస్ ముఖంవంటి ముఖంకల అనాధలు, ఆపన్నులు కనబడతారు.

సంపన్నులు, సంపన్నుల దర్జా, తీవి, మృదుత్వం, వినయం, పొగరు మోతుతనం, నిర్లక్ష్యం, నిష్ఠురత్వం, కర్కశత్వం, వాళ్ళ కారుకూతలు. వాళ్ళ కారెక్కి పోవడాలు, వాళ్ళ తొందరలో వాళ్ళు ఎక్కిన కారు ఇతరుల మొహాన దుమ్ముకొట్టడం, వాన బురదనీళ్ళు చల్లడం — వొకటేమిటి — ఎందరెందరో సాక్షాత్కరిస్తారు !

నిత్యజీవితంలో ఎలా వున్నా, కావ్యజగత్తులో కావలించుకుంటారు! స్నానాల గదిలో మనిషి కనిపించినంతగా – కనబడతారు. పరమ ఆప్తుణ్ణి చూచినట్లు చూస్తారు! తమలో మనల్ని లీనం చేసుకుంటారు! మనతో తాము అణిగి మణిగి ఉంటారు! మన అనుమతితో, మన మనస్సునీ మనోహరమైన సాము చేస్తారు!

గెలుపు వారిది!

మతిమారడం-మనకు!

ఎన్ని బాకాలు వారు విసిరినా హింసలేదు. వారివన్నీ సమ్మోహనాస్త్రాలే. సమ్మోహనాస్త్రం అనేమాట, ఎంత వాడుకలోకి వచ్చింది—! ఆ అస్త్రం విలువ కాళిదాసుకు తెలుసు! ఆయన విప్పి చెప్పాడు-

'ప్రమోక్తు ర్నచారిహింసా, విజయశ్చహస్తే' అని—పుస్తకం సమ్మోహనాస్త్రం!

పుస్తకం చదవడం ఎంత గొప్పది!

అదొక యోగం.

పుస్తకాన్ని చదవడం యోగమైతే, కొనుక్కోడమో-పుణ్యం. సొంత పుస్తకం, సరికొత్త పుస్తకం, కొత్త తాటాకుల పందిరిలాగా కొత్తదనపు పరిమళాలను వెదజల్లే పుస్తకాన్ని తెరిచి- ఏదో వెర్రి సంతోషంతో వాసన చూచేవాళ్ళం చిన్నప్పుడు. నెమలి ఈక పిసరుతెచ్చి, కొత్త పుస్తకంలో పెట్టి కళ్ళకు అద్దుకొనేవాళ్ళం. ఆ నెమలి ఈక పిసరు, సరస్వతీదేవి అనుగ్రహాన్ని పెరిగి పెద్దదౌతుందని ఉవ్విళ్ళూరే వాళ్ళం! కొత్త పుస్తకాన్ని యెవరన్నా అడిగితే, ముట్టుకుంటే, చూస్తే — పుస్తకం మాసిపోతుందని గిజగిజలాడే వాళ్ళం. సరికొత్త పుస్తకం, పల్లకీలో ఊరేగుతూన్న పెళ్ళికూతురులాంటిది!

చదవటం ఎంత యోగమోగాని, చదివిన వారిని గురించి Second hand పుస్తకం మౌనంగాచెప్తుంది, చదువుతూన్నప్పుడు తమకు తోచేవన్నీ వ్రాసేస్తారు కొందరు అక్కడే! గీతలు గీస్తారు కొందరు! ఆ ఆ స్థలాలు చదివినవారి అంతస్థును—యిట్టే పట్టి యిస్తాయి! వారి వారి అజాగ్రత్తలు, అసంతృప్తి వాసనలు, భయాలు, ఆందోళనలు — అన్నీ తెలుస్తాయి మనకు.

పుస్తకం ఖరాబు చేస్తారు మరి కొందరు పుహానీయులు.

కొందరు చదివిన పుస్తకం తాజా తాజాగా వుంటుంది. ఘసా సుబ్బా రావుగారు, మల్లాది రామకృష్ణశాస్త్రిగారు చదివిన పుస్తకాలు చందమామ లాగా శుభ్రంగా, అందం చెడకుండా నవనవ లాడుతూంటాయి!

పుస్తకం ఎంత విలాస వస్తువుగానో మారింది. కొన్నవారి పేరును ఎన్ని వికారాలతోనో వ్రాసుకుని మురిసి పోవచ్చు! చిన్నప్పటినుంచీ అందరూ అనేక విధాల పిలిచిన పేరు—సవాలక్ష పర్యాయాలు సంతకం చేసిన పేరు, ప్రతిచోటా నవరసుల్లా ఆకర్షణతో, వజ్రాల మెరుపుతో మోగిపోవాలని అశలుపడ్డ పేరు, అలుగ్గుడలాగా మన దగ్గిరే ఆగిపోయిన పేరు – బహు పాత పేరు—అన్నన్నిసార్లు, అన్నన్ని వంకరలతో వ్రాసుకొని చూస్తేనే గాని వారికి సంతృప్తికాదు కాబోలు—అద్దం ముందు నుంచుని, తమ ముఖాన్ని చిట్లించి, వికార పరచి చూచుకుంటేనేగాని కొందరికి తోచనట్లు!

కావ్యంలో గంతులు వేసేది కవి హృదయమా, మన హృదయమా అని ప్రశ్న! ఎవరి సంగతో అని ప్రారంభించి, మధ్యలో మన సంగతే యిది అని విస్తుపోయి, కలిసిపోయి, కరిగిపోయి, చివరికి నిట్టూర్చడం జరుగుతుంది సాధారణంగా. ఆ కల్పిత పాత్రలు వాస్తవంగా బ్రతికినవారి కంటె నిజం అవుతారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, ద్రౌపది, కుంతి, కైక, మంధర, శూర్పణఖ, కుంభకర్ణుడు, కర్ణుడు, శకుని, కుచేలుడు, హను

మంతుడు - వీళ్ళంతా నిజంగా బ్రతికితేనేం—కవి కావ్య నిర్మాణంవల్ల బ్రతికితేనేం?

మా తాతగారినీ ఎరగను. ధృతరాష్ట్రుణ్ణీ ఎరగను.

మా నాయనమ్మనూ ఎరగను. కుంతీ మహాదేవినీ ఎరగను.

అయినా తాతగారికంటె ధృతరాష్ట్రుడు, ద్రోణుడు వీళ్ళంతా నాకు తెలుసు.

కుచేలుడు తెలుసు! కాన్పులు కని కని డీలాపడిన పేద యిల్లాలు కుచేలుని భార్య నాకు తెలుసు! కుంతీ, సీతా, ద్రౌపదీ, గాంధారీ, సత్యభామా నాకు తెలుసు!

మా నాయనమ్మ నాకు తెలియదు.

వాస్తవమైన నాయనమ్మ తెలియదు. కల్పనా వ్యక్తులయిన గిరీశం, బుచ్చమ్మ, రామప్పంతులు, పేరిగాడు, చెకుముకిశాస్త్రి తెలుసు!

అదే కవి ఘనత.

నా పసితనం నాకు తెలియదు. కాని తాను ఏమీ చెప్పకుండా, మాట లయినా రాని దశలో తెలియ చెప్పినవాడు, అబ్బాయి!

అబ్బాయి, వో మహాకావ్యం, వో మహాకవి! కవులకు కవి అయిన వాగీశ్వరుడు!

రేపు వాడు పెరిగి పెద్దవాడై అయి, ఎంత వాగి వాగి రాజకీయ నాయకుడే అవుతాడో, తక్కువ మాట్లాడి, ఎక్కువ పనిచేసి సమర్థుడే అవుతాడో! ఇతరులచేత పని చేయించి, తాను సుఖించే అధికారి అవుతాడో. కాంతల ముద్దు మాటలకు కరిగి, కాముకుడే అవుతాడో, లేక—వారిని కరిగించి సుఖపెట్టి సుఖపడతాడో—ఏమో!

4

సాయంత్రం. సంధ్యా సూర్యుడు లోకాని కంతకు కనకాభిషేకం చేస్తున్నాడు. నేల, నీళ్ళు, మొక్కలు, మోడులు, చెట్ల చివళ్ళు, ఇళ్ళు వాకిళ్ళు, గుళ్ళు, గోపురాలు—ముఖ్యంగా గుడి గోపురాలు సంధ్యా స్వర్ణ వర్ణంతో ధగధగలాడి పోతున్నయ్.

"రారా—గుళ్ళోకి పోయి వద్దాం!"

"ఎందుకు—?"

నేను రాను అన్నది నా కంఠంలో ధ్వనిస్తోంది. గుడి అంటే నాకు ఎంతో యిష్టం. కొంతకాలం అయినా, అక్కడ చేరినవారు—ఐహిక బంధాలను, బాధలను మరచి, దివ్య భావనలతో కాలక్షేపం చేయటానికని ఏర్పడ్డవి గుళ్ళు. నాగరికతకు ఒకప్పుడు కేంద్రాలు గుళ్ళు.

వేదాధ్యయన పరులు, ఘనాపాఠీలు స్వామికి సేవగానంచేసి, స్వస్తి చెప్పారు. స్వస్తి వాచనం ఫలాలు అనుభవించారు. రాజులు తమ రాజ్యం స్వామిది, తాము స్వామికి ప్రతినిధులం అనుకొన్నారు. వ్యవసాయకులు స్వామికి భృత్యులై, సర్వమూ విలిచి, అమ్మి జీవించారు. మిగిలిన కులాల వారు, తమ ప్రతి పనీ స్వామికోసం అనుకొంటూ జీవయాత్ర సాగించారు.

విద్యార్థులు ఆ గుడి గోపురాల నీడను విద్య నభ్యసించారు. కళార్థులలు తమ తమ కళలకు పరమావధిని స్వామిసేవలో చూచుకొన్నారు. కాలం, కర్మం, కలిసిరాక గుడి గోపురాలయందు శ్రద్ధ తగ్గి, మది మాన్యాలందే మక్కువ ఎక్కువై —

తుంటరులకు సమావేశ స్థానాలుగా, పిల్లలకు క్రీడా భూములుగా,

జూదరులకు అనువైన హోట్లుగా కొన్ని గుళ్ళు వెలిసినయ్. పూజ్యభావం పూజ్యమై, విచారం చేస్తుంది గుడికిపోతే. అందుకూ నేను రానన్నాను.

"రారా! భారతం పురాణం చెబుతున్నారు. తింటే గారెలే తినాలి, వింటే—భారతమే వినాలి!"

నా మనస్సు చలించింది. అవునవును. గారెలు బలవర్ధకములు. గారెలు వాజీకరణం. తెనుగు వాళ్ళకు యిష్టం. భారతమో? అమ్మో. రామాయణ భారత భాగవతాలు యావచ్చారత జాతికీ అమిత ముఖ్య గ్రంథాలయినా తెలుగు వాడికి భారతం అంటేనే యిష్టం. అల్లాగని రామాయణాన్ని కాచినడు. సీతమ్మ కష్టాలు తలుచుకొని కన్నీరు అయిపోతాడు.

ఆగు.

సహృదయత మాత్రమేకాదు స్మా!

అవును నాకు తెలుసు. రామాయణ భారతాలు తెనుగు జాతిలో, తెనుగు రక్తంలో కలిసినై. ఆడపిల్ల పుడితే సీతమ్మ, మొగబిడ్డ పుడితే రామయ్యా - అమ్మో, ఆంధ్రులు సీతారాములను స్మరించని రోజు అంటూ వుండదు.

సీతారాముల్ని ఎట్లాగ విస్మరించగలరు? సీతారాములు ఆనాడు, ఈ తెనుగు గడ్డమీద, వారి దివ్య పాదాలను మోపారు గూడాను. పాపం, కాళిదాసు కాబోలు అన్నాడు! "వంద్యౌ అంసౌ రఘుపతి పదైః అంకితం మేఖలాను" అని!

ఆనాడు సీతారాములు ఈ తెనుగు గడ్డమీద నిలిచి, ఈ తెనుగుగడ్డ గాలి పీల్చి, ఈ తెనుగుగడ్డ సమర్పించిన కందమూలాలు ఆరగించి, గోదావరీ స్వాదు జలాలను అనుభవించి - ఏం ఏం అనుకొన్నారో??

వారేం అనుకొన్నా, రామాయణం నా జాతి రక్తంలో కలిగింది.

వాడా, "అగస్త్యభ్రాత" అని ఈసడిస్తాం.

అదా లంకిణి! అని జీచ్చపడతాం.

సరి! వాడుట్రా, వాడో ఇంద్రజిత్తు! అని తెల్లపోతాం.

వాడితో నీ కెందుకురా! వాడు, కాలనేమి అంత వాడురా అంటాం.

అదా నాయనా, చెప్పవేం, అది మళ్ళీ 'మంధర' అనుకో. అని వాపోతాం.

అహా. ఏం అదృష్టం, మందోదరిలాగా ఇల్లు నిండిన కోడలమ్మా అని ప్రశంసిస్తాం.

సరి సరి. వాడు 'జాంబవంతుడ్రా!' అంటాం.

బాబోయ్. అదో చుప్పనాతి అని భయపడతాం.

చిత్రం. శూర్పణఖ అంటే—చాటలంత పెద్ద పెద్ద గోళ్ళు కలది అని గదా అసలు అర్థం.

తెనుగులో అసలు భావం మిగిలి 'చుప్పనాతి' అని కొత్త పేరొచ్చింది శూర్పణఖకు. నాతి అంటే స్త్రీ! 'చుప్ప' అంటే ఏమిటో?? ఓర్వలేనితనం. పాపాశంకి మనస్సు. ఇల్లాగ ఏమున్నా అర్థం ఉండేదేమో. ప్రాచీన కాలంలో- ఇల్లాగ రామాయణం జీవితంలో కలిసిపోయింది.

రాములవారి గుడి, రాం మందిరం, రాం భజనా అంటూ లేని గ్రామం వుండదు కదా. నిజం!

నిజం!

రామాయణం, భారతం జాతిని అంత పదును పెట్టినై. భారతానికీ భారతగాథకూ తక్కువకేదు మనలో.

వాడా శకుని అమ్మో అంటారు.

'శకుని' అంటే అదేం పేరో. శకునం అంటూ వుంది. శకునం అంటే పిట్ట. బహుశా, సర్వానర్థకారి శనీ, అంతగా మండిపడేవాడు - కుజుడూ ఈ రెండు గ్రహాల పేర్లూ కలిపి సృష్టించుకొన్న పేరేమో-'శకుని' "శల్యసారథ్యం చెయ్యవద్దురా బాబూ!" అంటారు.

'కర్ణుడులేని భారతమా!' పాపం, అంతవాడు గాబోలు కర్ణుడు.

కర్ణనౌదలనె భారత సంహిత నిల్చి చాడ్పునన్ ! అన్నాడు తెనాలి రామకృష్ణుడు గూడాను. కర్ణుని దాన వీరతకూ, వీరతకూ చేతులు జోడించని వాడు ఉండడు గదా!

ఎటొచ్చీ-ధర్మరాజే గడుసువాడు అంవరిలో. తెలుగు రుషి-వేమనఇ 'పేరు ధర్మరాజు పెనువేపవి త్తయా?' అని ఈసడించి పారేశాడుగాని-

* * *

అల్లుకునిపోయినై. భారతం రామాయణమూ మన జీవితంలో. అవునా, యిక్కడేవుంది చిక్కు గూడాను. పసితనం నుంచీ, వారూ వారి పేర్లూ, గాథలూ వింటూ వుంటామూ. భారత కథ పూర్తిగా మనకు తెలుసూ. అనలేం, తెలియదు అనలేం. ఎంచేత? పెద్దవాళ్ళు చెప్పటం, చెప్పుకోటం, అల్లాగ ఇల్లాగ, భారత కథారసం మనకు తెలుసు. తెలుసుగదా అని అసలు గ్రంథాన్ని మనం ఎన్నడూ చదవం!! అవునుస్మా.

"ఉఁ. సరే పదవయ్యా, ఇల్లాగయినా భారతం వింటం పడుతుంది" అన్నా.

5

అమావాస్యా కొత్త మంగళవారం పూటానుట్రా? మా పెదనాన్న కోప్పడుతున్నాడు. ఇంతకీ-నేను మాత్రం ఏం చేస్తానన్నానూ? చొక్కా చిరిగిపోతే-కొత్త చొక్కా తొడుక్కుంటానన్నాను.

ఇవాళ నీకు పొరికింపీ, 'అమావాస్యా కొత్త మంగళవారమా?' అని మళ్ళీ గదమాయించాడు.

ఆనాడు మంగళవారం. నిజమే. అమావాస్య కాబోలు అనుకున్నాను. కొత్త మంగళవారం ఏమిటీ? కొత్త మంగళవారం, పాత మంగళవారం అని వేరు వేరుగా వుంటాయా? పాత మంగళవారం పనికి వచ్చి - కొత్తమంగళ వారం పనికిరాదా? అనుకున్నాను. ఏం లాభం? పై కి అనలేనప్పుడూ, మనసు లోని మాట అని సౌమ్యంగా నెగ్గించుకోలేనప్పుడూ తల వంచుకొని పాత చొక్కాతోటే కాలక్షేపం - చేయాలి.

* * *

కొత్త మంగళవారం ఏమిటా? అని.

ఓహోహో !

ఆనాడు ఫస్టుతారీఖు. మొదటి తేదీ. నెల ప్రారంభిస్తోంది. ఈ నెలలో ఇది తొలి మంగళవారమూ, కొత్త మంగళవారమూనూ మరీ!

ఇంగ్లీషు నెలలకూ, మన తిథి వారాలకూ ముడిపెట్టారు పెదనాన్న! అవునవును. తూర్పు పడమర నాగరికతల సమ్మేళనం పునఃపురా తాండ విస్తోంది! !

గింజుకుంటున్నారు.

ఏం అమావాస్య అయితే—? ?

ఏం మంగళవారం అయితే- ? ? అని.

ఓహో—ఇదా ?

మనం చాంద్రమానంవాళ్ళం. మనకు తిథులనూ, శుభాశుభాలనూ, కాలాన్నీ నిర్ణయించేది చంద్రుడు. చంద్రుడు ఈ అమావాస్యనాడు సంపూర్ణంగా కనబడడు. పూర్ణచంద్రుడు శుభుడు. మధ్యచంద్రుడు మధ్యమం. క్షీణచంద్రుడు అశుభం; అనిగదా మన సంప్రదాయం. చంద్రుడు అసలే కనబడని—అమావాస్య, అశుభం కించేలెక్క-. బాగానేవుంది.

మరి మంగళవారం దాధ ఏమిటి??

మంగళవారం పనికిరాకపోవటం ఎందేత?

*　　*　　*

న కుర్యాత్ శని భౌమయోః - శనివారం, మంగళవారం చెయ్యగూడదు. కుర్వీత బుధ సోమయోః - బుధవారం, సోమవారం చెయ్యాలి. ఇలాంటి కారికలను వింటుంటాం. చేసేపనులని బట్టి, కొన్ని పనికివచ్చే వారాలూ, కొన్ని పనికిరాని వారాలూనూ అన్నమాట!

అలాగే కనబడుతోంది....

ఆడపిల్లలు శ్రావణమాసంలో పూర్ణ చంద్రుడున్నప్పుడు శుక్రవారం నాడు లక్ష్మీపూజ చేసుకుంటారు. శ్రావణమంగళవారాలు, ముత్తయిదువులను పేరంటానికి పిలుస్తారు! పున్నమి పున్నమికీ చంద్రుడికి పూజలు చేస్తారు. బుధవారంనాడు మొగపిల్ల పుడితే—వాడు భూములు ఏలుతాడు అనీ, శుక్రవారంనాడు ఆడపిల్ల పుడితే - లక్ష్మీదేవి అనుగ్రహాన అష్ట ఐశ్వర్యాలూ అనుభవిస్తుందనీ అంటారు. కొందరు, శుక్రవారంనాడు లక్ష్మీదేవికి పూజ చేస్తారు. ఆనాడు చేబదుళ్ళు ఇవ్వరు. ఆమాటకొస్తే కొందరు మంగళవారంనాడు చేబదుళ్ళు ఇవ్వరు. అవతలవాడు, నావంటివాడు, ఎంత

గిలగిల లాడుతున్నా, ఇవాళ శుక్రవారం చూడండీ అనేసి తప్పించు కుంటారు. శనివారం ఉదయం, దుర్ముహూర్తం. ఏ పనికీ పనికిరాదు అంటారు. ఆదివారంనాడు ఆఫీసులకు సెలవు ఇస్తారు. ఇల్లాగ - మరి వారాలప్రభావం మనమీద వుండనే వుంది.

లేదూ అని ధీమాగా అనలేం. అందుకేనేమో—

పెదనాన్న వొద్దని కోప్పడింది—అఁహా.

*　　*　　*

అవునా?- అనేకదేశాలు. దేశదేశాలలో చిత్రాలూ విచిత్రాలూ పర స్పరం విరుద్ధాలూ అయిన ఆచార వ్యవహారాలు ఉన్నయ్. గానీ, వారాల దగ్గర అందరూ ఏకాభిప్రాయం కలవారే ఐనారుస్మా. ఎందుచేతో??

ప్రపంచం అంతా, ఏడేవారాలు. అవీ గ్రహాలపేర్లతోనే ఉన్నయ్— ఎంచేతో??

బహుశా ఒకటయి వుంటుంది.

ఏనాడో, ప్రపంచంలో, ఏదేశంలోనో, ఎవరెవరో, ఎంచరెందరో మహామహులు కాలాన్ని లెక్కించడం, పరిగణన చెయ్యడం చేసి వుంటారు. అదే అన్నిదేశాలకూ ప్రసరించి, స్థిరపడిపోయి వుంటుంది. లేక—

లేక?

లేక - వివిధ దేశాలలోని ఖగోళశాస్త్రవేత్తలు - కాలపరిగణనలు చేస్తే- అన్నిదేశాలలోని లెక్కలూ, ఫలితాలూ ఒకటే అయివుండనూవచ్చు. కావచ్చు. కానీ—

మనదేశపు విద్వాంసులు ఎలా పరిగణనచేశారో-??

*　　*　　*

భూమిస్థిరంగా వుంటుంది. అందుకే భూమికి 'స్థిర' అని పేరు గూడాను. ఈ భూమిచుట్టూ గ్రహాలు తిరుగుతూ వుంటాయి. ఆ పరిభ్రమణంలో—చివరినుంచి చూస్తే—వాటిక్రమం— శని, గురు, మంగళ, సూర్య, శుక్ర, బుధ, చంద్రులు. మొదటిది శని అనుకుందాం. వరుసలో, ఒకదానికి నాల్గవది, రెండవదిగా వస్తుంచన్నమాట. శనికి నాల్గవది సూర్య. సూర్యుడికి నాల్గవది చంద్రుడు. చంద్రుడికి నాల్గవది, మంగళ. ఇట్లాగ అప్పుడు, మనం ఇప్పుడు వ్యవహరించే వరుసను, శని ఆది సోమ మంగళ బుధ గురు, శుక్రల వరుస వస్తుంది. ఒక్కొక్కరోజుకు ఒకొక్కరు అధిపతి. అధిపతి పేరున ఆ రోజును పిలుస్తారు అన్నమాట!

బాగానే వుందిగానీ, వరుసక్రమంలో, తరువాతది రాక—

నాల్గవది ఎందుకు వస్తుంది? అని. - అహా.

అహోరాత్రాలు, 24 గంటలు. గంటలకు గ్రహాల వరుసగా అధిపతులుగా వస్తారు. రోజుకున్న 24గంటలలో, సప్తగ్రహాలూ, మూడుసార్లు ఆధిపత్యం వహిస్తారు. ఇంకా మూడుగంటలు మిగులుతై. కొత్తరోజు ప్రారంభించే సరికి, నాలుగవ వాని ఆధిపత్యం వస్తుంది సహజంగా. ఇదన్న మాట-రహస్యం— చాలావుందే—

అయితే మరి—ప్రారంభం ఎక్కడనుంచీ అని—

ఎప్పుడో అదీ నిర్ధారణ అయివుంటుంది. లెక్కా అప్పుడే నిర్ధారణ అయివుంటుంది. చెప్పలేం—

హిందువులు, 'ఉదయా దుదయం వారం' అని లెక్కస్తారు. మహమ్మదీయులు సూర్యాస్తమయం నుంచి సూర్యాస్తమయం దాకా లెక్కస్తారు. పాశ్చాత్యులు మధ్యరాత్రి రాత్రి 12గంటలనుంచి, తిరిగి రాత్రి 12 గంటల దాకా లెక్కస్తారు.

ఎవరి యిష్టం వారిదీ— ఎవరి లెక్క వారిదీ—అంతే.

6

శ్రావణమాసం. నిండుచూలాలివంటి మేఘాలు. చంద్రునికి చుట్టూతా చేరి అందాలను కొల్లలాడే మేఘాలు. సూర్యకిరణాలను చొరనీయకుంతా దడికట్టి నట్టు అడ్డుపడగల మేఘాలు, నిమిషం నిమిషం రంగులూ, రూపాలూ మార్చుతూ, చల్ల దనమునూ, అందాన్నీ ఆనందాన్నీ ప్రసాదించే మేఘాలు, జీవనప్రదాతలయిన మేఘాలు!

కాంతల కబరీ భరంలాగా, కాటుక కన్నులలాగా, కృష్ణపరమాత్మ లాగా మేఘాలు! ఓ! అవునవును. నల్లకలువను, మబ్బును, నీలంగా వున్న ఏ పదార్థాన్ని చూచినా శ్రీకృష్ణ భావనతో మైమరచేవారట మహాభక్తులు!!

తాము గోపికలు. యావత్ప్రపంచము గోపికలు!

స్వామి?

శ్రీకృష్ణుడు!

ఎంత గొప్పభావన!!

యమునా, యమునావికుంజాలు, మధుర, బృందావనం, రాస మండలం—అన్నీ తమ హృదయకేదారమే. మహాయోగుల మనసధార రాధ! ఆహా! ఓహో! అవునవును. భ్రమరకీటన్యాయం తెలిసి, ఎలాగా కావలిస్తే అలాగా జీవి అవుతుంచని తెలుసుకున్నవారు మరి ఆ మహాత్ములు.

నిజమేగానీ-

కంసుడికి-ఎందుకు ఆ కర్మమో—

తానా, సాక్షాత్ శ్రీకృష్ణునికి మేనమామ. మేనమామ అంటే— తల్లి తరువాత తల్లివంటి ప్రాణి. లాలించి, ఎత్తుకొని - ముద్దాడి, హృదయానికి చేర్చుకొని, సంబరం పడిపోవలసినవాడు గదా మరి—కంసుడు—

వసివాడు, తన్ను పుర్రం ఆరుస్తాడు అని– ఎందుకు భయ పడ్డాడో– ??

వోవేళ, అంతగా పోవాలిసొచ్చి, పోతే-పోతాడు. ఈమాత్రం గుండె నిబ్బరం ఎందుకు లేకపోయిందో??

ప్రాణభయం. భయం ఆవరిస్తే-మనస్సుకు ప్రసన్నత్వం ఎక్కడిది? భయం, అందులోనూ ప్రాణభయం ఆవరిస్తే-అంతే జరిగేది! పైగా కంసుడు రాక్షసి!!

పైగా నారదుడు– సర్వయాదవులను సులలుగాని, నిజంబు నరులు కారు అనీ–కంసుండ వీవు రక్కసుడవనీ చెప్పాడు గూడాను!!

రాక్షసికి తగినమొగుడు కంసుడికి వచ్చినై. అంతే-

అంతేనా?

మరీ, శ్రీకృష్ణుడు, బలరాముడు, వసుదేవుడు, నందుడు, యశోద, దేవకి-వీళ్ళంతా దేవతలా? కంసుడు, వీళ్ళకు కావలసినవాడు, బంధువు రాక్షసా?

ఎల్లాగ? విచేచన చేయడం??

*　　*　　*

"రాక్షసులు" అనేజాతి వేరేజాతా? కాదు. బావ దేవుడు, బావమరిది రాక్షసి అని ఇక్కడే తేలింది! మరి మనోధర్మాన్నీ గుణాన్నీ పట్టా ??

అయివుంటుంది.

దేవతలకూ యజ్ఞాలూ, యాగాలు, బలులు, క్రతువులు, వరాలు పొందడం అన్నీ ఉన్నయ్. రాక్షసులకూ యజ్ఞయాగాది క్రతువులూ, బలులూ, వరాలు పొందడాలు వున్నయ్. ఐతే! ఒక్కటి అయివుంటుంది.

తమతమ శక్తిరక్తుల్ని - ఈశ్వరార్పణం చేసినవారు, 'అహం' అన్నదాన్ని చంపడానికి తామై పూనుకొని, తమతమ అహంకారాన్ని తామే 'స్వాహా' చేసుకున్నవారు దేవతలు.

తాము తమతమ శక్తిరక్తులు, యజ్ఞయాగాది క్రతుకలాపమూ వరాలు పొందడమూ అంతా తమతమ విజృంభణకు—

తమతమ అహంకారలీలలకు—

అనుకున్నవారు. ఆహం విజృంభకులు, రాక్షసులు—

ఓ!

కంసుడు రాక్షసుడు అంటే ఇదా తత్వం!

నేను సుఖంగా వుండాలి. ఇదంతా నా ప్రయోజకత్వం. నా మాట నెగ్గాలి. నా రాజ్యం ప్రబలాలి. నా పట్టు నెగ్గాలి, నాకంటె పరుడెవ్వరునూ లేరు. అనే బాపతు- కంసుడు.

మరి వీరికి ముక్తి! అదే, అహంకారవిమోచనం!

అవతారమూర్తులు ఇందుకు అవతరిస్తారన్నమాట.

* * *

ఇందుకు కంసునికి భయం స్థాయీభావం అయికూచ్చుంకే!

అవునుగానీ, మరోవిధంగాచూస్తే—!

* * *

లోకంలోని చండశాసకులు అందరూ కంసులే.

తమతమ కోట కట్టుకోటానికీ, తమతమ ధీరుత్వాన్ని కప్పెట్టుకోడానికి ప్రబలులూ, ప్రచండులూ అవుతారు.

మృతికి వెరుస్తారు. అంతకన్నా, తమతమ, పదవి, ప్రాబల్యం, ఘనతల చ్యుతికి గిలగిలలాడి తల్లడిల్లి పోతారు.

నసాళం పగిలేటట్టుగా, విధి దెబ్బకొడుతుంది.

త్రాహి త్రాహి అవుతారు.

త్రాహి త్రాహి అవుతారా? అని.

అందరూ కారు. కొందరే అవుతారు. మిగిలినవారు, కంసునిలాగా తమజిత్తుల్ని అన్నీ ప్రయోగించి, కంటకులై పోతారు.

నిజమే స్మా!

కంసుడే కంటకుడు కాలేదు. నేడూ, రేపూగూడా కంటకులు అంతూ వుండకపోరు.

విధే, చేయిచేసుకొని, వీరినీ ఓమార్గంలో పడెయాలన్నమాట!

ఇదా కంసమోక్షం!

ఇందుకా కృష్ణుడంతటి అవతారం సంభవించడం!

చెప్పలేం.

ఏ ఒక్కరికోసమో అయితే అవతారం సంభవించదు. మృత్యువే అన్ని తీర్పులూ తీరుస్తుంది. లోకం, ప్రపంచంలో ఎక్కడవమంది, మనుజుల ఆశాప్రతీక్షలు, ఆలోచనామార్గాలు, చేస్తున్న దురంతకాలు, దుర్బుద్ధులు, అంతా స్వార్థం, దంబం, వంచన, మోసం, ద్రోహం అయినప్పుడు, ప్రతిసాధుహృదయమూ హాహాకారాలు సలిపినప్పుడన్న మాట! అవతారం!! ఓహో!!

7

తెల్ల వారుతోంది. నిద్రిస్తూన్న విరహిణీలాగా వుంది కొండ. దీపా లలో కాంతి తగ్గుతోంది. బహుశా ఈ పాటికి, చెరువులలోని జలాలకు కాంతీ, నదులలోని జలాలకు ఉత్సాహమూ, సముద్రములోని జలాలకు ఉద్రేకమూ, విజృంభణా వస్తూవుంటయ్. పదిమెట్లు ఎక్కి కూలబడు తున్నాను. కించనుంచి గోవిందా గోవింద అని భక్తుల కేకలు. కేకలు ముందు వినబడతై. తరువాత తలలూ, బుజాలమీద మూటలూ మనుష్యులూ కన బడతారు. ఆ చీకటివంటి వేళ, గాలిగోపురం ఎక్కుతున్నాను. త్రాహి త్రాహి అవుతోంది నాకు.

'పదిమెట్లు పై కెక్కి పల్లకుండా సూడు' అనీ, కొంగు పట్టుకొనీ కొండమెట్లు ఎక్కుతాను, అనీ అన్న యాత్రికుడు నాయడుబావ గుర్తు కొచ్చాడు.

* * *

కొండ ఎక్కాం. యాత్రలో 'మహాముజా' వుంది. ఎరగనివారు, పరాయివారు, అపరిచితులు- ఆప్తబంధువులు అవుతారు. వెలుగు - చీకటి, బాధ-వ్యధ, ద్వంద్వాలు కరిగిపోతూవుంటై, తాత్కాలికంగా. కొత్త ప్రదే శం ఈశ్వర చిద్విలాసాన్ని ప్రదర్శిస్తుంది. చూస్తున్న ముఖాలలో మాలిన్యం క్షీణతమౌతూంటుంది. దాహం.

ఈ కొండమీద ఈ ప్రదేశంలో నీళ్ళెక్కడ దొరుకుతై?

యింకా కొంచెం ముందుకుపోవాలి! అక్కడ ఎవరో ధర్మాత్ములు చలివేంద్రం పెట్టారుట-అబ్బా-దాహం.

* * *

నీళ్ళు, గాలి లేకపోతే ఎంతకష్టం! ఎక్కడపడితే అక్కడ ఎప్పుడు పడితే అప్పుడు, తేలికగా దొరికే కారణాన నీరూ గాలీ మనకు తేలికఅయినై. ఏం తేలికయినై? తేలిక అయినట్లు కనబడి, ఒక్కొక్కవేళ, మన అల్పత్వాన్ని మనకు చూపిస్తూనే వుంటై - వాస్కోడిగామా, మొంబిణాక్ తీరానికి చేరినప్పుడు- మంచినీటికి కటకటపడ్డాడు.

అరబ్బీవర్తకులు ఎదిరిస్తే-తుపాకి బలంతో—బెదిరించి తనకు కావలసిన మంచినీటిని తెచ్చుకోవలసి వచ్చింది.

దాహం. అదుగో చలివేంద్రం!

క్రిందనుంచీ, బిందె బిందె చొప్పునా మంచినీళ్ళు తెచ్చి యిక్కడ-యాత్రికులకు, పాంథులకు ఇస్తున్నారన్నమాట! ఎంత ధర్మాత్ములు!!

*　　*　　*

నాటకంలోని వాక్యం పైనివాక్యం రసశిఖరానికి చేరుకున్నట్లు, మెట్లూ పైమెట్లూ ఎక్కుతున్నాను. అయినా వెంకటేశ్వరస్వామి యింత దుర్లభుడుగా, ఇక్కడే ఎందుకు వెలిశారో??

ఇక్కడ వెలవడంలోనే అందం వుంది. తనను నమ్మి, తనకోసం వచ్చేవారి గుండెనిబ్బరాన్ని శ్రద్ధనూ ఒకచూపు చూస్తున్నారు స్వామి. పైగా-

పైగా:

పైగా కష్టపడి పొందినప్పుడు గానీ, మానవహృదయంలో శ్రద్ధ దృఢపడదు. ఆఁహా. ఏం చల్లగాలి! ఇక నడవలేం—తిరిగి వెనక్కిపోదామా? బద్ధక మాలిన్యాన్ని ఎగరగొట్టేస్తోందే చల్లగాలి! కాళ్ళు మళ్ళీ చచ్చుబడినై. ఈ కాస్త కొండ ఎక్కడానికే— నేను, అల్పుణ్ణి యిలాగనుకుంటున్నానే—ఒక్క ఆశకోసం, ఒక్క ఆశయంకోసం, సౌకర్యాలులేని కాలంలో మహా మహులు ఎలాగ భూప్రదక్షిణం చేశారో- ఏ ప్రబలకారణాల వల్లనో-??

సుగ్రీవుడు భూమిచుట్టపెట్టి రావటానికి వాలి భయం కారణం. స్ట్రాబో 'ఆసియా' అంతనూ చుట్టపెట్టి, ఆసియాఘాగోళం ప్రారాడె-అతనికీ భయమే కారణం అంటామా? ఐవుండదు. అది సాహసయాత్ర. పాశ్చాత్య అమితంగా విజృంభిస్తే,—చేసిన సాహసయాత్రలు అవి. మధ్య ఆసియా చూడాలనుకొన్న మార్కోపోలో చైనాకు చేరేదాకా మనస్సునూ తరువాత తననూ తాను నడుపుకొన్నాడు. అష్టకష్టాలు పడ్డాడు. ఆశయాన్ని సిద్ధింప చేసుకున్నాడు. వుంటారు మహానుభావులు!!

అదుగో మోకాళ్ళ పర్వతం.

చిత్రంగా వుంది. ఇందాకటినుంచీ వేధించిన వికారం, విదాహం మటుమాయమైపోయినై. సూర్యుడు వచ్చి బలం ఇచ్చాడు కాబోలు. అరె! ఎంత అగాథం! ఈ రెండు కొండలనూ కలిపి వంతెన కట్టేవారిక్కూడ పూర్వకాలం. ఇంతా ఎక్కి, ఇంతా దిగి, మళ్ళీ కళ్ళ ఎట్టెయటనే అంత కొంతా కనబడుతూంటే-గుండె గుభేలుమని పోతుందేమో వారికి, ఆనాటి యాత్రికులకు! అయివుండదు. ఆనాడు ఇంత సుకుమారం బలిసిపోలేదు. పైగా, ఇబ్బందినే వుత్సాహశక్తిగా మార్చుకునే తత్వం వారికి యెక్కువ వుండి వుంటుంది.

బర్తాలోమ్యూజ్ డయజ్ మున్నగువారు యిలాంటివాళ్ళే. తుఫాను గాలులు ఎటా పెటా దంచుతూంటే, తనతో వచ్చిన స్నేహితులు విసిగించి, వేధించి, యిక ముందుకురాము అని సాధిస్తూంటే, యాత్రలు చెయ్యలేదా వారు!

చేశారు. అంతకు అంత ఆనందాన్నీ పొందారు. కేప్ ఆఫ్ గుడ్‌హోప్ కనుక్కొన్నప్పుడు, డయజ్ ఎంత ఆనందం పొందాడో మరి! అన్నట్లు కేప్ ఆఫ్ గుడ్‌హోప్ అన్నది ఇప్పటిపేరు. అతను దాన్ని— 'తుఫానుల

అగ్రం' అన్నాడు. తరువాత, ఆ దేశాధిపతి—తుఫానుల అగ్రంకాదు. శుభ సూచకాగ్రం, కేప్ ఆఫ్ గుడ్‌హోప్ అని పేరు పెట్టాడు.

అదుగో, గోపురం. ఏమకొండలవాడా ! వెంకటరమణా, నీ దగ్గిరికి వస్తున్నా తండ్రీ!! దయజూడు !!

ఒహో. సూర్యకాంతి, ఎంత మెత్తగా వుంది? ఎంత దివ్యంగా వుంది! ఈ సౌందర్యాన్ని, మన డొక్కో వుండి, మనం చూడలేమేం ??

అవునవును- అక్కడ పడివున్నప్పుడు, రకరకాలయిన వ్యధలు మనస్సును ఆవరించి వుంటయ్. ఇక్కడ అవి వైతొలగిపోయినై. అంచేత మనస్సుమీద వ్యథా ఆవరణంపోయి-సహజ సౌందర్యాన్ని గ్రహించగలుగు తోంది.

అదుగో స్వామిగుడి. ఓ ! !

దేవతలు కట్టారో, దేవత లంతవాడే కట్టారో ఈ దేవళాన్ని ! స్వామీ! జీవితయాత్రలో, నీ దగ్గిరికి యాత్రకొచ్చాను.

నాటకంలో అంతర్నాటకంలాగ. ఈ చిన్న యాత్రవెనె ఆ పెద్ద యాత్రను గూడా సరిగ్గా సాగింపించు తండ్రీ !!

8

ఎంతసేపట్నించో వెతుకుతున్నాను. దొరకదు. గుర్తులో వుండక పోతుందా? అని ఎక్కడో ఇట్టే-పెట్టివుంటాను.

ఎక్కడ పెట్టానో, ఎంత వెతికినా కనబడదు. ఎంత గింజుకున్నా జ్ఞాపికీరాదు. అక్కడనేని పుస్తకాలు, కాగితాలు, ఎన్నో ఎన్నెన్నో కన

బడతై. వాట్లమీద అప్పుడప్పుడు వ్రాసిన, గొంగళీ పురుగవంటి నా పేరులో సహా..

స్వంత పేరునేనా ఇల్లాగ అనుకోడం?

ఆఁ. విసుగేసిపోయింది, ఆ పేరుతో.

చిన్నప్పుడు మైకం అయిపోయి, మధురించిన పేరు, పలకమీద ఆదేపనిగా వ్రాసి చూచుకొన్న పేరు-పాఠం పుస్తకాలమీద నోట్సుపుస్తకాల మీద పెద్దిగా వ్రాసుకొన్న పేరు, గాఢనిద్రలో, పరధ్యానంలో గూడా, చెవిన పడగానే-ఉలిక్కిపడి, నాలోకి నన్ను రప్పించిన పేరు, కొత్త పుస్తకం, ముందుగా కొత్తకలం—చేతికి రాంగానే—ముందుగా వ్రాసుకొన్న పేరు—ముద్దుల్లో, మురిపాలలో, ముచ్చట్లో, ప్రేమలో, వివాహంలో, అప్లికేషన్లలో, చివాట్లలో, తిట్లల్లో, గౌరవాలలో, అసందర్భాలలో సుసందర్భాలలో, నానిన నాపేరు, శాశ్వతంగా నిలబడాలని కలుకన్న నా పేరు, చివరికి నాకే విసుగెత్తించింది.

అ—బ్బ! ఇప్పుడు, కావలసింది నా పేరు కానేకాదు.

పుస్తకం. ఆదీ ఎవరికో గూడా — వారికివ్వాలి. ఎక్కడ పెట్టానో ఎంతకీ కనబడదు. పోయించండీ అని నవ్వేస్తే సరిపోదు. మరీ! ఛాలివస్తోంది, వెతికి వెతికి.

ఊఁ— తప్పుతుందా? ఇంకా ఇంకా వెతుకుదాం. ఏంచేస్తాం.

అమ్మయ్య. దొరికింది. ఇక్కడా పెట్టాను?

కాదల్లేవుంది. ఉహూ, కాదు.

ఇదింతకూ పుస్తకంలాగా కూడాలేదు. ఆహా. కాదు. ఎప్పటిదో, పాత ఫోటో! !

ఎప్పటిదో ?

వీదో గ్రూపు ఫోటో, ఎప్పటిదో ?

ఆఁ. రామ్మూర్తి పెళ్ళినాటి ఫోటో.

అప్పుడు. ఇట్లా వుండే వాణ్ణన్నమాట. చాలాకాలం అయిందిస్మా.

*　　*　　*

రామ్మూర్తీ—పెళ్ళి. అంతా ఓ కల !

దేవుణ్ణయినా ధిక్కరించగల రామ్మూర్తి, ప్రేమకు లొంగి రాజ్యాన్ని పెళ్ళాడాడు. తల్లి వద్దని గోలపెట్టింది. అన్నగారు సుతరామూ వీల్లేదన్నాడు. స్నేహితులంతా భేష్ అంటే భేష్ అన్నాం. చివరికి రాజ్యాన్నే పెళ్ళాడాడు, రామ్మూర్తి బెంగుళూరులో.

కొట్ట కోలాహలంగా, శ్రీరామ పట్టాభిషేకానికి కిష్కింధా పురాగ్ర హారికులు, అయోధ్యకు తరలినట్లు, స్నేహితులం అందరం బెంగుళూరుకు చేరాం, పెళ్ళి మాంచి ఉద్రేకాలతో గడిచింది.

అవును అవును.

వెళితే స్నేహితుడి పెళ్ళికే వెళ్ళాలి.

ఎంత అల్లరయినా చేయచ్చు. నిర్భయం. నీష్ఫూచీ. అంతా హాయి హాయి. ఆనందడోలిక.

*　　*　　*

ఎక్కడెక్కడి స్నేహితులూ కలుసుకోవచ్చు. పాత కబుర్లు ఎన్ని యినా చెప్పుకోవచ్చు. తృప్తిగా ఓరంతా చక్కర్లు కొట్టచ్చు. కావలసినన్ని చిలిపిజోకులు పెట్టుకొని నెగ్గచ్చు. మనస్సులోని కిష్కింధకు కావలసినంత విహారం అది! స్నేహితులు అందరు మళ్ళీ ఎప్పుడు కలుస్తాం? ఎందుకు

కలుస్తాం? అందరితో తిరిగే, సంచరించే, సంవదించే హుషారు ఎక్కడ తట స్థిస్తుంది ? — బెంగుళూరులో అప్పుడు చాలా చిత్రం ఐంది. రామ్మూర్తి పెళ్ళి !

రామ్మూర్తి పెళ్ళికొడుకవ్వడమే, సిగ్గుగా, ఏమిటోగా — ఆ పెళ్ళి వాతావరణమే కొత్త గంధర్వలోకంగా లేదు. మామూలుగా ఎప్పటి సరదాతోనే వున్నాడు.

పెళ్ళయిన మర్నాడు, నేనూ, సూర్నాణా కలిసి బలామూరు బయలు దేరాం. సూర్నాణ అప్పటికే, మోతీబాబుతో స్నేహం చేసుకొన్నాడు. మోతీబాబూ బయలుదేరాడు మాతో. మోతీబాబుకు బెంగుళూరు కొట్టిన పిండిట. ఒక బెంగుళూకేమిటి, ఆ దేశ దిమ్మరికి-దేశం అంతా కొట్టిన పిండే, మహా అల్లరివాడూ.

సూర్నాణ మీసాలు వడేస్తూ బయలుదేరాడు. అసలే కొంటె. అందులో స్నేహితుడి పెళ్ళిలో అతిథి. బస్తీమీద సవాల్ అన్నట్లు బయలు దేరాడు. వెళ్ళి వెళ్ళి గోరీల తోట పక్కనికి చేరాం. పసుపు చల్లినట్లు ఎండ. గోరీల తోటలోని గులాబీపూలు విచిత్రంగా మెరుస్తున్నయ్. లోయ, లోయలో తోట, తోటలో గోరీలు, గోరీలచుట్టూ పూలమొక్కలు, పైని ప్రకృతి సాధించిన సూర్యుని పసోహకమైన కాంతి.

అక్కడ చేరగిలబడ్డాం.

ఆ వాతావరణంలో, ఎందరెందరు—యోధులు కావలసినవారు, ప్రేమికులు, ఆర్తులు, తలిదండ్రుల దాసినవారు, ఎందరెందరు శాశ్వత నిద్రపోతున్నారో—

ఆ వాతావరణంలో భయం మిగిలిన ఓదార్పు. ఓదార్పును మించే పశ్చాత్తాపం వుంది. తెలియకుండా నా కళ్ళు సుడిగి నీళ్ళు కారుతున్నయ్.

రేపు నేనూ ఇంతేగదా.

ఆఁ.

నేనూ ఇంతేనా? కాక, వొళ్ళు కొవ్వెక్కి, మనస్సు మధించి-అంతా నేను, నా మయం అనుకోటం తప్ప ఏముంటీ?

కళ్ళలో నీళ్ళు.

సూర్నాణ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. అతని ముఖాన కన్నీరు ధార.

ఎన్నెన్ని పాపాలో చేశానోయ్ అన్నాడు.

చిన్నప్పట్నించి చేసిన తప్పులు, మనస్సు రహదారి ఐతే—మైలు రాళ్ళలాగా నిలిచిపోయిన తప్పులు, హృదయకల్యాలు చెప్పేశాడు. చేసిన పాపం చెబితే పోతుందన్నాడు. పాపం, సూర్నాణ ఎంత హృదయం ఉన్న వాడు!

సాధారణంగా నలుగురూ గమనించని విషయాలకో గూడా, అవసరానికి చేసిన తప్పుల్లో గూడా, అతని హృదయం గాయపడింది, పాపం.

మోతీబాబు గోరీలకేసే చూస్తున్నాడు. లేచి వెళ్ళి ఇన్ని గులాబీ పూలు గిల్లుకొచ్చాడు. పడుకున్నాడు. తనమీద గులాబీ రెక్కలు చల్లుకున్నాడు. ఏడ్చాడు. అతని మనస్సులోని వ్యథ అతను చెప్పాడు.

పొద్దెంత పోయిందో, తెలీదు.

తిరిగిపోవాలన్న యావేలేదు. సూర్యుడు వాలడం ప్రారంభించాడు. జారుడులోకి పోతున్నాడు. ఏదో వెలితి వ్యథ. బరువుగాలేచి వెళ్ళిపోయింటికి పోయాం.

మా కోసం ఫోటో ఆగింది. ఆ ఏడుపు ముఖాలతోటే నుంచున్నాం.

అప్పటి ఫోటో.

జీవితం తలోదారినా పడేసింది. రామ్మూర్తి వెళ్ళిపోయాడు. రాజ్యం వెళ్ళిపోయింది. అప్పుడే—హుఁ—

ఏమిటో అంతా కల!! ఎవరికెవరమో జీవిత మహాసత్రంలో కలిశాం.

ఇంతే.

9

ఆఁ— ఎన్ని చూశాం కాదూ. కొత్తోవింతా, పాతొక రోతాను-" అంటూ ఈసడించి పారేశాడు తాతయ్య. తాతయ్యకు కొత్త అంటే అసహ్యం. 'కొత్త' అంటే శీతాకోకచిలక లాంటిది. రెపరెప లాడుతుంది. పువ్వుమీదనుంచి పువ్వుమీదికి,—కొమ్మమీదనుంచి కొమ్మమీదికి, రెమ్మమీద నుంచి రెమ్మమీదకు దుముకుతుంది. అశాంతి (Restlessness) గా పరుగులెడుతుందీ శీతాకోకచిలుక. చూడటానికి ఎంతో బాగుంటుంది - కానీ, ఏం లాభం! దాని ఆయుర్దాయం ఏపాటిదిరా, మూన్నాళ్ళ ముచ్చట గూడా కాదూ—అనంటాడు తాతయ్య. ఏదయినా సరే- పదికాలాలపాటు నిలిచేదిగా వుండాలి! అనంటాడు తాతయ్య.

నా దురదృష్టం కాబోలు. నాకు కొత్తవే ఎక్కువ నచ్చుతై. పూలు ఎక్కువకాలం ఉండవు. వాడిపోతై. ఎండిపోతై అని, పచ్చడి రువ్వే పొత్రాన్ని పూలకన్నమిన్న అనుకోగలమా అని నా క్షోభ—కానీ, ఏం అనుకొనీ లాభంలేదు. ఎప్పుడూ, తాతయ్య మాటలకే గౌరవం.

* * *

తాతయ్య అంటే—ఒక్క మానవ మాత్రుడు కాడు. ఆయన ప్రపంచంలో నిరంతరం సుప్రతిష్ఠితమై వుండే ఒక ప్రబలమైన భావానికి, ఆచారానికి ప్రతినిధి. 'పాతది అంతా బంగారం, కొత్తది అంతా కంగాళీ' అనుకోడంలో చాలా వీలుంది.

తొందరలేదు. ఆదుర్దాలేదు, ఆవేశంలేదు. ఆరాటంలేదు—నెమ్మదిగా, సరోవరంలోని చందమామలాగా, నిమ్మకు నీరెత్తినట్టుగా వుంటుంది.

నిజమే? ఆ సముద్రం క్షోభిస్తూన్నట్లు, పడుచు హృదయంలాగా తరంగితం అయివుంటుంది. ఆ అలల ఆరాటపు నృత్యకేళీమీద వెన్నెల. ఎక్కడ కక్కడికి చిన్న చిన్న దీపాలలాగ, వెన్నెల యువకులకు నచ్చుతుంది.

సరోవరంలో కదలిక లేకుండా, అచ్చంలాగా వుండే జల క్షోభమీద, వెన్నెల పెద్దవాళ్ళకు రుచిస్తుంది కాదూ?

ఎక్కడి కక్కడికే—కొత్తా—పాతానూ!!

ఏం చెప్పినా పాతలో ఉన్న సొగసు పాతలోనూ వుంది.

అలవాటు పడివుంటాం. మానవజీవితమే అలవాట్లపుట్ట.

పాతఇల్లు. కావలిసినంత ఆలోచనలకు వీలుస్తుంది. అక్కడ తాతయ్య ఈ పని చేశాడు. అక్కడ నాయనమ్మ తులశమ్మకు పూజచేసుకొనేది. ఇక్కడ నాన్న తన చిన్నప్పుడు చదువుకొన్నాడట. ఇక్కడ అమ్మ అమ్మ వారి పఠంపెట్టుకొని పూజచేసుకొనేది. ఇక్కడ మావయ్య నాకు గుల్కంద పెట్టాడు. ఇక్కడ చిన్నప్పుడు నేను చదువుకొన్నాను. అక్కడ ఆవు దూడ వచ్చిరాని పసునిపళ్ళతో గోంగూరమొక్కలు కొరికేది. ఇక్కడ ఆవుదూడ గంతులేసేది. అక్కడ ఆవుకు పచ్చిగడ్డి వేసేవాళ్ళం.

ఇక్కడ పచ్చీసు ఆడుకున్నాం. ఇక్కడ మా పిల్లవాడు తప్పటడుగులు వేస్తూ-పడి ఏడిచాడు. ఇలాగా ఎంతైనా, పాతకాలపు సంగతులు జరిగినవి, యథార్థాలు చెప్పుకోవచ్చు. కాళిదాసు అన్నట్లు-

ప్రద్యోతుడి ముద్దులకుమార్తెను, వాసవదత్తను వత్సరాజు ఎత్తుకెళ్ళాడు. ఆ రాజుగారి బంగారపు తాళ్ళతోపు ఇక్కడనే వుండేది. అని కథా కోవిదులు చెప్పుకుంటూ వుండడం అనాదిగా వుంది. మానవ సహజం.

కొత్త ఇంటికి ఈ ఆలోచనలతో పనిలేదు. ఇంకా ఎంతో జరుగుతుంది అనేదేతప్ప. కొత్తదంతా ముందు. పాతదంతా వెనక.

*　　*　　*

కనకనేనేమో, పాతది, నలిగినదారి. కొట్టినపిండిఐ, అంతా బంగారంగా కనబడుతుంది. కొత్తదంతా, అనుమానాలబాపతుఐ —పిత్తలాటకంగా కనబడుతుంది.

పిత్తలాటకం? అంటే—?? ఓహో. అదా. పత్తల్ అంటే-ఇత్తడి. హాటకం అంటే బంగారం. ఇత్తడినితెచ్చి, బంగారం అనడం అన్నమాట, పిత్తలాటకం అంటే. ఐతే, కొత్తది అంతా—పితలాటకమేనా? అని.

ఈ ఆవిర్భవించిన కొత్తమాత్రం ఎక్కడిదీ? ఏ కొత్త అయినా పాతలోంచే ఆవిర్భవిస్తుంది. మానవులలాగా. మానవులలో కొత్తగా వచ్చే వాడికి లోకం స్వాగతం ఇస్తుంది-

ఆచారాలకు, ఆశయాలకు, అభిప్రాయాలకు

ప్రతిఘటనను ఇస్తుంది.

ప్రతిదేశంలోనూ, ప్రతిచోటా వున్నదే ఇది.

నిజమేకానీ-

ఈ కొత్తనుగూడా మింగే, మరో కొత్త వచ్చిపడితే—??

ఈ కొత్త పాతలో కలిసి, మరోకొత్తదాన్ని ఢీకొంటుంది.

10

స్రాపాస మింకెవడు?

సంచడెవరోనంటి??

అని తన సహచరి, ప్రాణాధికురాలు యెంకి తనకు దూరాన వున్న ప్పుడు యేటిచరిన తానున్నప్పుడు, నాయకుడు నాయిడుబావ వ్యథపడు చున్నాడు. అలాగే, సుకుమారమైన హృదయంగల యెంకికూడా, మరో సందర్భంలో-

'వొక్కతెను నాకేల వోపజాలని సుకము'

అని మూల్గుతుంది.

ఎవరో ఒకరు, ముఖ్యంగా తమకు కావలసినవారు, తమతో వుండి, సందడి చేస్తూంటేనేగానీ, తోచదా? అని. తోచదు.

ఎవరో అతీతులు, గుండెనిబ్బరం గలవారు, ఏకాంతంలో వుండ వచ్చు. గుహలలో, చీకటిలో, గుడ్డివెన్నెలలో, ఏకాకులై—మౌన సము ద్రపు ఆటుపోటులకు తట్టుకొంటూ నివసించవచ్చు. కాని, ప్రజాసామాన్యం అలాగ ఏకాకితనమును భరించగలరా? అని.

మనలోమాట. గుహలలో, కొండచరియలలో, హిమాలయాది ధ్యానానుకూల ప్రదేశాలలో వుండేవారు మునులు. ఒక్కరూ, ఏ ఇతర సంప ర్కమూ లేకుండా వుండగలిగేవారా? అని. వారూ ఏకాకిగా వుంటారని తోచదు. నిరంతరమూ వారితోపాటు, వారి ధ్యేయమైనది, భావనారూప దైవం వారిపక్కనే వుండడం సహజం. మనసా అట్టి సాన్నిధ్యం కల్పించుకొనే వారూ వుంటారు.

ఏ ధ్యానమూ, ఏ యోగమూ, ఏ భావమూ, ఏ సహవాసమూ లేకుండా ఎవ్వరూ వుండరు. వుండలేరేమో అనిపిస్తుంది. ఎందేతో?

తొట్టెలోఉన్న శిశువు, ఏ గిలక్కాయనో, ఏ చెట్టుకొమ్మనో చూస్తూ వుంటుంది. తప్పటడుగులు వేసేపిల్ల- తనవాళ్ళు చేస్తున్న పనులు తానూ చేయాలని సతమతం అవుతూంటుంది. చదువవస్తున్న బాలబాలికలు తమ తమ నేస్తాలతో కలిసిపోతారు. అ తరువాత చదువుసంధ్యలు, పెళ్ళిపేరంటాలు, సంసారబాధ్యతలు, వృద్ధాప్యంలో కాలక్షేపాలు, ఎప్పుడూ మానవుడికి—ఏదో ఒక సావాసం అవసరం.

*　　*　　*

సావాసంలో చాలాశక్తి వుంటేపని! సావాసం చెయ్యటానికి దనీసం ఇద్దరు వ్యక్తులు అవసరంగదా. ఆర్నెల్లు సహవాసం చేస్తే—వారు వీరు అవుతారని అనుభవసారం గదా—మాసిపోతే!

ఏం మాసిపోతే-?

సహవాసంలో ఉన్న మాధుర్యమే అది. ఒకరిమీద ప్రేమ, అభిమానం, వాత్సల్యం, దయ, ఆపేక్ష, మనస్సులు కలవడం ఇవేవీలేనిదే సహవాసమే లేదు. ప్రేమాభిమానాలు కలిసిపోయినవారు, వారూ వీరూ అనే తేడా ఎందుకు పెట్టుకొంటారు?

కలిసిపోతారు. అలవాట్లు, అభిరుచులు దగ్గర్నుంచీ, మార్పు వస్తుంది.

అవసరానికి మైత్రిపాటించడం, లోలోపల స్వయంపాకాలూ, కృతఘ్నత, కూహకమూ కుట్రా, పబ్బం గడుపుకోవడం ఇలాంటి సందర్భాలలోని సావాసంలో, ఎవరికివారే గానీ—

నిక్కమైన మైత్రి వున్నప్పుడు, కష్టసుఖాలు వారివి వారికీ, వీరివి వీరికీ అనుకోవడం కల.

హృదయనిర్మాణంలోనే, సానుభూతిని, ప్రేమను ఏకమైపోవటాన్ని గూడా కలిపివేసింది ప్రకృతి.

నిజమే స్మా.

ఐతే- వ్యక్తి వ్యక్తి సహవాసం చేస్తేనే—ఇలాగ ఐక్యమైపోతాయే—గుంపులకు గుంపులు, జాతులకు జాతులు సావాసంచేస్తే-??

తమాషాగానే వుంటుంది.

కొత్తలో మర్యాదా, ప్రేమా చూపుతారు. కొస్తకూ కూస్తకూ కీచులాడుతారు. అనహ్యించుకుంటారు. ఎత్తు పై ఎత్తులు వేసుకుంటారు. పోరాడుకుంటారు. విధి శాసనానికి కట్టుబడి, ఉల్లా సీదా అవుతూంటారు. చివరికి, ఆవారాలు, అలవాట్లు, ఆలోచనలు, ఇచ్చిపుచ్చుకోవాలు, రక్త సంబంధాలు కలుస్తయ్. కొత్తసంఘం, కొత్త నాగరికత వీస్పడుతవి. కొత్తజాతి తయారు అవుతుంది.

మనదేశమే చూద్దాం:

అదిమనివాసులు, ద్రావిడులు, ఆర్యులు, సిథియన్లు, గ్రీకులు, పర్షియసులు, క్రైస్తవులు ఇంకెందరు ఇక్కడ కలిసి నివాసం చేశారు. విభిన్నసనంవల్ల. అమ్మో. విభిన్నసనం బలీయమైంది.

యుద్ధాలు చేసుకున్నారు. కలిసిపోయారు. వారి నాగరికత, వీరికి అబ్బింది. వీరి అలవాట్లు వారికి అబ్బినవి. కొత్తవికాసం, కొత్తసంస్కృతీ వికసించినయ్—కొత్తరుచులు వచ్చినయ్. కొత్త-పాత కలిసి విలీనంచెంది సుకొత్తరూపు సవరించుకొనేది. ఎక్కడైనా—ఎప్పుడైనా మంచి మిగులుతుంది. అదే ప్రకాశిస్తుంది.

మహాకవి అన్నట్లు, మంచి చెడ్డలు జగతిలో రెండే—! మిగిలేవీ, నెగ్గినిలబడి వెలిగేవే!

చిత్రమే స్మా!

అవును. దీర్ఘంగా ఆలోచిస్తే. సాహసం వల్లనే, సంపర్కం వల్లనే కొత్త–పాతల సంఘర్షణ, సామరస్యాలవల్లనే — జవమూ జీవమూ తారుణ్యమూనూ, మనిషికైనా, జాతికైనా అనిపిస్తుంది. కాదూ!

11

ఉన్నట్టుండి రివ్వున గాలి.

మాఘమాసంలో సోమరిగాలి తగిలీ తగలనట్లు, సువాసన వేసీ వేయనట్లు తీయని మల్లెపూలలాగా, సన్నని జాజి పరిమళంలాగా పలకరించే సున్నితమైన గాలి కాదు!

ఆడుకుంటూన్న పిల్లవాడిలాగా రివ్వున గాలి వచ్చి దౌడీలాగా దుమారం లేపింది.

ఆహాహా,

ఎంత హాయిగా వుంది! ఉడికి ఉడికి ఉన్న తనువులు, పువస్సులు అమ్మయ్య అనుకోవూ, నాలుగు చినుకులు గూడా పడితే!

సన్నని చినుకులు!

కొటుకకన్నుల చిలిపి చూపులవంటి చూపులు, కవ్విస్తూన్న కొంత చూపుల తూపులవంటి చూపులు....తొలి రోజుల ప్రణయ వేగంలాంటి గాలితో—చినుకులు–వర్షం!

ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి వర్షం!

వర్షానికి ఎంత మొహం వాచి ఉన్నాం! ఇన్నాళ్ళూ చల్లదనంకోసం పడి చచ్చాంగదా.

అయ్యో,

ఆగిందేం జిల్లు! ఆగలేదు! ఆగటం కావిది. ప్రాణ స్నేహితునిలాగా వచ్చి పలకరించిన వాన, వగ్గిపేళ్ళ సువాసనతోటి కుండలో చన్నీళ్ళలాంటి వాన. హాయిఐన వాన, కొంటి కోణంగి చేష్టలు చేస్తోంది!

మళ్ళీ జిల్లు.

చందమావ ముందు చంద్రకాంత శిలలాగైంది మనస్సు. వాన! తొలకరి వాన!

పంచాంగాలు పార చూస్తాం.

రోహిణీ కార్తెకు రోళ్ళు బిద్దలు కావు: కాని అట్లా అనుకుంటాం ఆ ఎండ ఘాటికి.

గాలి మార్పులు గమనిస్తాం.

యిళ్ళన్నీ దుమ్మూ, ధూళితో వుంటే సహిస్తాం.

యిళ్ళమీదా యిళ్ళల్లోనూ ఆనిర్లు తేలితే—ఓరుస్తాం.

ఆకాశం చల్లబడితే చూచుకుని—ఆరుబయట, అమాయికంగా నిద్రిస్తాం!

ఎంత నిద్ర పట్టినా, రాత్రంతా నిద్రలేక పొద్దున్నే వాపోతాం!

ఉన్న వేంద్ర చాలదన్నట్టుగా, మరింత ఘాటుగా ఆవకాయ పెట్టుకుంటాం, తింటాం! ఆవకాయ ఆంధ్రుడికి జాత్యన్నం! జాత్యన్నం అమ్మ తానిగ్గూడా పైది అని శ్రీకృష్ణదేవరాయల వారంతటివాడు ధంకా బజాయించి మరీ చెప్పాడు!

కొత్తావకాయ ఘాటు, కొబ్బరినీళ్ళ తేటలతో కాలం గడుపుకొంటూ పరాయి పంచలపడి కాలం గడుపుకొంటూన్న పరమాధిమానిలాగా కాలం వెళ్ళతీస్తూంటే—వాన.

వాన

చుట్టంలాంటి వాన.

ప్రియురాలిలాంటి వాన.

ప్రాణ స్నేహితునిలాంటి వాన!

వాన, అమ్మయ్య, వాన.

ఇక నకనక లాడిస్తోత్రాన్న మొక్కలు నవనవ లాడుతై! ఫక్కున నవ్వుతై! జీవబలానికి పుష్టి కలిగి—కొత్త పెళ్ళికూతుళ్ళలాగా కలకల లాడుతై!

వాన వచ్చింది.

మహారాజులాగా వచ్చింది వాన.

ఏనుగంబారీమీద కూచుని జమీందారు, జమ్మి కొట్టడానికి వెళ్ళేప్పుడుండేంత తీవితోనూ వచ్చింది వాన.

మా చిన్నప్పుడు చల్లపల్లి రాజా, మహారాజులాగా తీవిగా, శివగంగ నుంచి ఏనుగెక్కి ఊరేగేవాడు! రాజా వీను గెక్కేప్పుడు చూడాలని మాకు వెర్రి ఆశ ఉండేది! ఆ శివగంగ ఇసకలో చిన్నతనపు ఉత్సాహంతో ఉద్రేకంతో జీవితమే ఆట అన్నంతగా సరదాగా తిరిగేవాళ్ళం!

శివగంగ మా మచిలీపట్నం దగ్గిర చిన్న ఊరు! చల్లపల్లి రాజాలు అక్కడ బ్రహ్మాండమైన ఊరు కట్టించారు! తిరువన్నామలైలోని అరుణాచలేశ్వర దేవాలయంలో గుడిపాటి వెంకట చలంగారితో తిరుగుతూన్నప్పుడు, మా శివగంగ గుడే గుర్తుకు వచ్చింది! 'గుడి' అని చెప్పుకోతగ్గ గుళ్ళు అవి!

శివగంగ గుడిలో అమ్మవారు, మహిషాసురమార్దిని! చల్లని తల్లి.

పుష్పగిరి స్వాములవారు అంతటివారు ఆనాడు శివగంగ మహాసుర మర్దిని ప్రభకు బోహారు చేశారట!

మహిషాసురమర్దినికి ఉత్సవాలు జరుగుతై.

చివరి రోజున ఏనుగంబారీ.

పెద్ద ఏనుగుమీద అంబారీ పేస్తారు! అమ్మవారిని కూచోబెడతారు. చల్లపల్లిరాజా, అంకినీడు ప్రసాద్ బహద్దూర్ ఏనుగ కుంభస్థలంమీద కూచునే వాడాయన. ఆయన బి. ఏ. ముట్నూరి కృష్ణారావుగారికి సహాధ్యాయిట.

వెడల్పయిన ముఖం, పెద్ద కన్నులు, సొంపైన మీసాలు, తెల్లటి రవ్వల దుద్దులు, జరీ తలపాగా. ఆయన అంబారీ ఏనుగుమీద కూచుని జిమ్మి కొట్టడానికి బయలు దేరేవాడు—ఆయన తరువాత శివరామప్రసాద్ కొరా అంబారీ ఎక్కి జిమ్మికని వెళ్ళేవాడు.

అరమైలు పొడుగున జనం వుండేవారు కిటకిట లాడుతూ. టింగ్ టంగ్‌మంటూ గంట ధ్వని చేస్తూంటే కాళిదాసు చెప్పిన రఘు మహారాజు నడకలాగా ఏనుగు నడిచేది. వేలాది ప్రజలు పొద్దుపోయే ఉత్సవంలో — నా చిన్నప్పుడు నేనూ మైమరచి తిరిగేవాణ్ణి. చెల్లాయి నాతో శివగంగ వచ్చేదికాదు! చిరుతిండి తినేది కాదు! బిగ్గరగా నవ్వేదికాదు! ఓ పట్టాన నవ్వదు చెల్లాయి!

అది నవ్వాలనీ, నవ్వించాలనీ నాన్నకు!

తాయిలం తెచ్చి యిచ్చినా, మిఠాయి పొట్లం పట్టుకొచ్చి అచ్చంగా దానికే యిచ్చినా, దాని చేతికి నాన్న గడియారం కట్టినా—ఊహూ—ఎప్పుడోగాని నవ్వేది కాదు!

ఒయ్యారంగా, ఒప్పుల కుప్పలాగా, సున్నితంగా సుతారంగా నవ్వేది! అన్నట్లు అమ్మాయికి పెల్లకన్ను. పెల్లి కన్నుండా అదృష్ట వంతురాలు అనేవాళ్ళు దాన్ని. కొత్త పరికిణీ చూస్తే నవ్వేది.

పూలు అన్నా, కొత్త గుడ్డలు అన్నా, పసిపిల్లలకుండే ప్రీతి పెద్ద వాళ్ళ కుండదెందేతో....అందులోనూ ఆడపిల్లలకు!

ఆడపిల్ల నవ్వితే అందం.

మా చెల్లెలు నవ్వితే మా నాన్న నవ్వినట్లుండేది. పూజచేస్తూ హారతి ఇచ్చేప్పుడు అమ్మ ముఖం వున్నట్లుండేది.

చెల్లాయి పెద్దదైంది. పెద్దదై కళ్ళకు కాటుక పెట్టుకొని, ఉచిగా ఉభ్రంగా నడిచేది—అచ్చు మా అమ్మలాగే వుండేది.

ఈ తొలకరి చినుకులకు మా అమ్మాయి ఏమనుకుంటూందో! మా పసి మేనల్లుడితో ఆడుతూ, ఆడిస్తూ, మాటలు చెప్తూ, పూట పూటకూ, వాడో కొత్త అల్లరి చేస్తుంటే—మురుస్తూంటుంది.

వాడు మకురుపట్టు పట్టితే—

ధడుసుకుని నిద్ర పోకపోతే—

దిష్టి తగిలితే—

ఏమో, దూరాన పడి వున్నది!

సన్నని వాన జల్లులు మీదపడుతుంటే—దుప్పటి బిగ్గ కప్పుకొని, పిల్లవాణ్ణి గుండెల దగ్గిరికి లాక్కొని అలాగే నిద్ర పోతోందేమో!

లేక, చిన్నప్పటి ముచ్చట్లు చెప్తూంచేమో.

నున్నగా దువ్వుకున్న తల తడిసి పోతుందనిగాని, తొడుక్కున్న దుస్తులు తడిసి పోతాయి అనిగాని—చేతిలోని పుస్తకం ఏమయి పోతుంచో అనిగాని అనుకోకుండా తొలకరి వానలో నుంచోడం ఆనందం.

ఎండిన నేలమీద నవోదబిందువులు పడినప్పుడు వచ్చే నేల ఘుమఘుమకు – చింపి చాటల్లే ముఖం కావడం ఆనందం. ఆ కొత్త వానా వెలిశాక, ఉక్కా పోస్తూంటే—తెకతెకలాడుతూంటే — ఇదవడం ఒక ఆనందం! మబ్బులకేసి చూడడం, మబ్బులు—మూట భుజాన పెట్టుకునడిచే యాత్రికులమల్లే, నెమ్మదిగా వెళుతూంచే, కిటికీలో కూచుని చూట్టం ఒక సంతోషం. ఆ మబ్బులే— బలిసి, ఇంతింతై వటుడింతయై అన్నట్లు పెరిగి, జోరున భోరున వర్షిస్తూంచే—చెవులు గడియలు పడేటట్లుగా ఉరుములూ మెరుపులూ వస్తే— ఉలిక్కిపడి, 'అ-బ్బ!' అ-బ్బ అనుకోడం ఒక ఆనంచం.

ఇలాంటి ఆనందాలు తన చిన్న కొడుక్కు చెప్తూందేమో అమ్మాయి!

వాన జోరుగా కురిస్తే—

కాయితాలతో పడవచేసి, వాన నీళ్ళలోకి వదులుతూ

పిల్లవాడు కిలకిలా నవ్వితే—తనూ నవ్వుతుందేమో అమ్మాయి లేక,

వాళ్ళ పెంకుటింటిలో నిలబడి,

ఇల్లంతా బురద అయిపోతోందని—

ఇదుగో, అక్కడ కురుస్తోంది, అక్కడ కారుతోంది. చూరు వగ్గిర బాగు చేయించుకోవాలి. ఓసారి పెంకులు తిరిగి నేత నేయించుకోవాలి అని సంసార తాపత్రయాలు పడుతోందేమో అమ్మాయి!

మరి నాలుగు రోజులుపోతే – శ్రావణం వస్తుంది.

నాలుగు మంగళవారాలూ, శుక్రవారం, పేరంటానికి పోతారు ముత్తయిదువులు.

జేబురుమాలులో తడిసెనగలు మూట కట్టుకుని, పిల్లాణ్ణి చంకన ఎత్తుకొని అమ్మాయి యింటికి వస్తూంటే, చూడాలని వుంటుంది నాకు— ఉహూ పడనే లేదు.

అమ్మయ్య!

నేల ఘుమఘుమ లాడుతోంది.

తడిసీ తడియని నేల ఏం పరిమళిస్తుందని!

తొలకరి చినుకులు పడగానే—

ఎండి ఎండి ఉన్న నేల. గుబాళిస్తుంది. నిట్టూరుస్తుంది. తన హృదయ మాధుర్యాన్ని బయట పెడుతుంది! మత్తెక్కిస్తుంది.

ఆ మాధుర్యం ఎంత హాయిగా వుంటుంది!

వాన చినుకు భుజంమీద పడడం, నెత్తిన నాలుగు చినుకులు పడడం.

ఉత్తరీయం కప్పుకొంటూ గబగబా నడవడం, ఎంత సరదాగా వుంటుంది!

ఎండి బీటలు వారిన నేలను, కాశ్మీర్ పచ్చళాలువా పరిచినట్లుగా చేయబోతోంది ఈ వాన.

చదువుచెప్పే గురువువలె దయగా వుంటుంది వాన.

సగం మన శ్రద్ధా, సగం గురుబోధలాగ సగం ఆరు బయట పడకా, సగం వసారాలో పడకానూ. అప్పుడు!

స్మితంగా ఓ చోట ఉండనీయదు, ఆ తొలకరి వాన.

ఉక్కిరి బిక్కిరి చేస్తుంది.

ఆశపెట్టి, ఆడిస్తుంది తొలకరి వాన.

యింట్లోనే పడుకుందాం అనిపించి ఆరుబయటగాని, వసారాలోగాని చిచ్చికొడుతుంది చివరికి.

ఇంతకూ, వెక్కసమయిన ఎండ కెబ్బనుంచి హితవైన దారికి పట్టిస్తుంది కొత్త చిగురు! అవునవును. ఏ కొత్త రాకడ మనస్సును ఊరించదూ? చలించి, జ్వలించే హృదయం ఉండాలిగాని.

12

"అన్నయ్యా, ఈ మధ్య నీ దగ్గిర్నుంచి ఉత్తరం వచ్చి చాలా రోజులయింది! కారణం తెలియదు! బద్ధకమే కాదని అనుకుంటాను!" అంటూ మా చెల్లెలు ఉత్తరం వ్రాసింది.

"అన్నయ్యా" అన్నమాట, ఆమె చేతి దస్తూరీలోంచి నాచులోంచి పద్మంలాగ వికసించి, విహసించి, వినిపించించి!

'అన్నయ్యా!' అని ఎవరు అంటున్నా, అనుకుంటూన్నా, నాకు మా తమ్ముడూ, మా చెల్లెలూ గుర్తు కొస్తారు. మా తమ్ముడు, అన్నమీద ప్రేమను నాపై కుమ్మరించాడు! అన్న ఓ ఐశ్వర్యమూర్తి అన్నట్లు చూచాడు! నన్నెవరన్నా అవమానిస్తే, తానూ గిలగిల్లాడాడు! నాకు ఏదన్నా సంతోషంవస్తే, తానూ సంతోషించాడు!

అత్తవారింట్లోకి వెళ్ళేదాకా, నాకు ఏ కొత్త సుఖం వచ్చినా మా తమ్ముడు, మా చెల్లెలు అనే వుండేది!

తమ్ముడు చూపించిన ప్రేమను అజ్ఞానంవల్ల, లేమివల్లా తెలుసుకోలేకపోయాను! అజ్ఞానపు చెబ్బకయినా విరుగుడు వుందిగాని, లేమివల్ల కలిగే దెబ్బలకు విరుగుడు లేదు! జన్మ మారాలిసిందే. మళ్ళీ ఒక అమ్మకు బిడ్డగా

జన్మించేదాకా 'లేమి' ఏడిపిస్తూనే వుంటుంది! ఏమో, అప్పుడూ విడవదేమో !

వయస్సు వచ్చి, బిడ్డా పాపా కలిగి, ప్రేమ తెచ్చి, కుమారుడివల్ల చిన్నతనం గుర్తు కొచ్చినప్పుడు, తమ్ముడూ, చెల్లెలూ మళ్ళీ మనోరంగం మీదికి వచ్చారు! మనస్సు విధిలేక వాళ్ళకోసం ఏడ్చింది! వాళ్ళు, దూర దూరంగా తప్పుకొన్నారు!

'అన్నయ్య' అని పుండకపోదు! వుంటుంది! ప్రేమబంధం సళ్ళిస్తుంది కాబోలు-వుత్తరం అయినా వ్రాయడు తమ్ముడు. తమ్ముడికి ప్రేమే-తమ్ముడి పిల్లలకు అపేక్షే! కాని, 'నువ్వు ఎట్లావున్నావు' అని పుష్కరానికి ఓ ఉత్తరం అయినా వ్రాయరు!

ఇంతకాలానికి చెల్లెలు వుత్తరం వ్రాసింది.

పరాయిదానివరె, తనయింట్లో తానువుంటూ, తన కాపురం చేస్తూం డడం వల్లనో లేమో—తోబుట్టువులతో ఆడబిడుచులకు అపేక్ష వుంటుంది. వోపట్టాన పోదు. తమ్ముళ్ళకు చిటికెలో హూషాకీ అయి ఎగిరిపోతుంది ప్రేమ! ఎవరో వివేకవంతులు గాని, పెద్దవాళైనాగూడా ప్రేమను నిలుపుకోరు!

అమ్మాయి యింతకాలానికి వుత్తరం వ్రాసింది! అందులోనూ ఆడబడుచు! తప్పులు నామీదకే మృదువుగా తోసేసింది!—పెద్దకాటుక కన్నులతో వంటింట్లో పిల్లాడితోపాటు కూచుని కబుర్లు చెప్పినట్లే వుంది నాకు ఆ వుత్తరం చూస్తుంటే- పచ్చని ముఖం, ఎర్రని కుంకుమబొట్టూనూ.

నాకు చిన్నప్పటినుంచీ అంతే! పచ్చని ముఖం, ఎర్రని కుంకుమబొట్టు-కనిపిస్తేచాలు మా అమ్మ ముఖం గుర్తుకొచ్చేది! బీదతనంవల్ల పేదల సౌందర్యానికి నిలువ ఉండకపోయినా, అందమైన ముఖం మా అమ్మది. 'అందం' అనేదానికి నా ప్రమాణం మా అమ్మ ముఖమే-!

తరువాత మాచెల్లాయి! చెల్లి అంచం అయినదే. బీచకికంవల్ల ఆ అందం ధగధగాలాడి కనబడదు! అవీకుంచిదే! సంసార్ల అందచందాలు వీధినపడేవా మరీ!

ఇవాళైనా చెల్లాయికి ఉత్తరం వ్రాయాలి!

"చెల్లెలు" అనేమాటలో ఎంత మాధుర్యం!

"అమ్మ" అనేమాటలో ఎంతలో అమృతం!

చిన్నతనంలో తెలియదుగాని, అమ్మ కోప్పడ్డా అమృతమే మరీ!

ఇదంతా మన భావనేనా?

లేక ఆ మాటల్లో వుందా?

మాటలో వుండదేమిటిగాని, ఆ మాట వినగానే, నుతిమెత్తని హృదయానికి కలిగే స్పురణల్లో, అనుభవాలలో వుంటుంది అమృతం! తన తల్లిదండ్రుల ముఖం తానెరుగని దౌర్భాగ్యుడి బాధ— పాపం, ఆ కొరతను ఎవరూ తీర్చరు. తీర్చలేరు!

మిత్రుడు భావరాజు నరసింహారావు, పెద్దవాడై — ప్రయోజకుడై ప్రతిష్టావంతుడై — తనతండ్రి ఫోటోకోసం గాలించాడు! తనతండ్రి భావరాజు నారాయణమూర్తి ఆనాటి మంచినటుడు. వాళ్ళకో నాటకం కంపెనీ వుండేది. ఆ కంపెనీ పెంబళ్లను పట్టుకొని బ్రతిమాలి, బామాలి గ్రూఫ్‌ఫోటోలు సంపాదించాడు. కాని, అతని తండ్రిని గుర్తుపట్టుకోడం పడలేదు! కొడుక్కి తండ్రి పేరు పెట్టుకొని, అంతతో సంతోషిస్తున్నాడు!

తల్లీ తండ్రీ అంటే- ఇది మరి!

అనవసరంగా కోప్పడీ, తిట్టీ కొట్టీ — తండ్రి దూరం అవుతాడు ఒక్కొక్కచోట! అయినాసరే - తండ్రి, తండ్రిపేరు - మనస్సును పట్టుకొనే వుంటయ్!

ఆఫీసులో ప్రూఫులు దిద్దుతున్నాను. అందులో ఎక్కడో, ఎవరి వ్యాసంలోనో, ఎవరో ఆంజనేయులు అనేపేరు వచ్చింది. నా గుండెల్ని ఎవరో పట్టుకొని ఆపేసినట్లయింది! గుండె గుబగుబలాడి, కళ్ళనీళ్ళు కాని ఎందుకో తెలీనిబాధతో గిలగిలలాడాను కొంతసేపు—

ఏమిటో, తెలిసీ తెలియని అనుబంధాలు వుండీ వుంటాయి కాబోలును.

"ఏంరా అన్నయ్యా!"

కోపం పట్టలేనంతగా వుంది కంఠంలో! ఎదురుగుండా నిలబడింది! పెదిమలు కోపాన్ని కక్కుతూన్నయ్! ఆ పచ్చని బుగ్గలమీద నేను కొట్టిన చెంపకాయ-కుంకుమ చారలలాగ మెరుస్తోంది! నా తప్పు నాకు తెలిసి, కళ్ళ నీళ్ళు వచ్చినై!

"ఏంరా, మొండుకుడా కొట్టావు!" నిగ్గతీసి అడుగుతోంది అమ్మాయి!

ఏమని చెప్పను? ఏదో పిచ్చికోపంవల్ల మూర్ఖంవల్ల కొట్టాను! ఎందుకు కొట్టానా అని నాలో నేనే కించపడుతున్నాను మరి! తప్పుచేసినవాణ్ణి, చప్పున చప్పున, అప్పటికప్పుడు నిగ్గతీస్తే-లాభంలేదు. తెలిసినా నిగ్గదీసి అడుగుతాం!

'మరి దస్తూరీ సరిగ్గా ఎందుకు నేర్చుకోవు!'

రామరామ! అన్యాయంగా ఇరికాయిస్తున్నాను!

'ఏం నేర్చుకోకపోతే—' అంటుందేమో! అంటే! మా అమ్మాయి అనలేదు! నా భార్య అందిగాని. నా భార్యను చదువుకోమని కోప్పడితే 'ఏం చదువుకోకపోతే—నాకు చదువురాదు. నన్నిక ఏడిపించవద్దు!' అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ! ఆడదాని కన్నీరు భరించలేను నేను:

"కలికంతి కంటి కన్నీ రొలికిన సిరి, యింటనుండ నొల్లదు సుమతీ!" గుర్తుకొచ్చి అక్కడితో ఆ ప్రయత్నం మానేశాను !

చెల్లెలు 'ఏం, దస్తూరీ నేర్చుకోకపోతే—' అని అంటుంచా?

మా నాన్న దస్తూరీ బాగుండదు ! అంచేత, తన కొడుకు దస్తూరీ అయినా బాగుండాలని, నన్ను రాచి రంపాన పెట్టారు ! దస్తూరీ ఎంత క్రొక్కి ఒకీగా వుంటే, అంత అదృష్టం అని మా నాన్నకు తెలియదు కాదోలు ! గొప్పవాళ్ళ దస్తూరీలు కొకినెకీగా వుంటాయి.

ఎదురుగుండా గాంధీగారి పటం వుంది ! గాంధీగారి ఆత్మకథను మేం యింటర్లిపాటీ తెనుగులో చదివాం! గాంధీగారు దస్తూరీ ప్రాముఖ్యాన్ని నొక్కి చెప్పారు! అదీ నా ధీమా. ఇప్పుడు అనిపిస్తుంది! వొక మూర్ఖుడు తన పంక్తులను అడ్డంపెట్టుకొని, తన తోబుట్టువును అన్యాయంగా కొడతాడని, ఆ గాంధీగారుగానీ, అంత అందంగా తెనిగించిన వేలూరి శివరామశాస్త్రి గారుగానీ, అనుకున్నా వుండరుగద.

'నేర్చుకుంటున్నాను. ఒక్కసారే సరిగ్గా వస్తుంచా ఏం దస్తూరి?' అంది అమ్మాయి !

సమాధానంలేదు! తలవంచుకున్నాను ! నిన్ను కొట్టడం, నా తప్పే నమ్మా అనాలి అనిపించింది! అహంకారం, అభిమానం అడ్డం వచ్చింది.

నేను కొట్టిన బుగ్గలు చూచాను.

"సిందూరం, రక్తచందనం
బంధూకం సంధ్యారాగం
పులి చంపిన లేడినెత్తురూ !"

ఈ 'పులి చంపిన లేడి నెత్తురు' అన్నమాట శ్రీశ్రీ హృదయం లోంచి వ్యక్తం కావడానికి — శ్రీనివాసరావు కళ్ళారా చూచిన ఎన్నెన్ని

అన్యాయాలూ, దుర్భర దౌర్బల్యాలూ కారణాలో! అందుకే అతను మహా కవి !

మన మనస్సుకు సరిగ్గా చేతకాక, గొగ్గి గొగ్గిగా, గొణుగుడుగా తల పోసిన భావాలూ, మాటలూ, మనకు స్పష్టంగా సొగసుగా చూపిస్తారు కవులు.

కవులేమిటి, కళాస్రష్టలు, యోగులు, మునులు, ఋషులు అందరూ ఒకటే! అగరు వత్తులలాగా తాము కాలిపోతూ ఇతరులకు పరిమళాన్ని ప్రసాదిస్తారు!

నిజమే కాని!

నిజమే కాని—?

నిజమే కాని, దగ్గరికి చేరితే యోగులూ, కవులూ, కళాకారులూ, అల్లుళ్ళూ, అధికారులూ వెక్కసం పేస్తారంటారు! పోనీ—చగ్గరికి పోనేవద్దు! ఇంతకూ, వారి వారి అనుభవామృతాన్ని మనం స్వీకరించడం మాని, వారిని పూజిస్తే మాత్రం ఏం విలువ వుంటుంది : దూరంగానే వుంటూ వారి ప్రసాదాన్ని మనం అనుభవిస్తే సరి—నిష్పూచీ!

అటీకాక, ఏదో కోరికతో ఎక్కడికి పోయినా, ఆశాభంగమూ, బాధ, కీచులాట తప్పదు. దూరంగా వుంటే ఏ బాధాలేదు.

అందుకేనేమో, సూర్యచంద్రాదులు దూర దూరంగా వుంటూ మనకు మేళ్ళు చేస్తున్నారు.

తెల్లవారుఝామున, చేతుల గోరింటాకు కడుక్కొని, చల్లని చేయి తియ్యని వాసనల్ని మూచూస్తూంటే-పైనుంచి చందమామ, సన్నబియ్యం పరమాన్నం ముద్దలాగా, అరగదీసిన సబ్బుబిళ్ళలాగా, చల్లకుండలో వెన్న పూస ముద్దలాగా వుండి—సన్నగా, చిన్నగా నవ్వుతాడు.

మనం తప్పనిసరిగా ఆ చందమామను చూస్తాం.

మనమూ నవ్వుతాం.

"మామయ్యోవ్, నవ్వితే నవ్వావులే. మేం యిప్పుడు చచ్చి ఆరగించి ఉయ్యాల బూగుతాం!" అని చెప్తాం! చెప్తామా? అనుకుంటాం! అనుకుంటామా? ఏమో! ఉయ్యాల సరదాలో అనుకోమేమో.

వేపచెట్టుకో చింతచెట్టుకో ఉయ్యాలా.

చిన్న చిన్న ఊపులు చాలవు! ఎంత పెద్ద ఊపు అయితే అంత సరదా. అంత సంతోషం.

ఇప్పుడు నా మనస్సు ఉయ్యాల ఊపుల్ని భరించలేదు. ఎక్కడ పడి పోతామో అని భయం! ఎవరు ఉయ్యాలా ఊగినా భయమే. పసితనంలో వుండే బలము, వయస్సులో ఉండే బింకం, తగ్గకే జుట్టు నెరుస్తుంచక్లే వుంది.

నలగగొట్టి, చితకకొట్టి, వెన్నుపాం చావగొట్టి 'చేపు' అనే మహర మైన వరాన్ని మృత్యుముఖం అంత భయంకరంగా స్ఫురింపచేసి జీవిత బలాన్ని తినేస్తుంది.

"కాల్చే ఆకలి
కూల్చే వేదన!
దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ!"

ఎన్ని ఎన్ని కోట్లమంది, మనోబుద్ధి చిత్రాహంకారాలను, మట్టిపాలు చేసినాయో మరి, ఎందరెందరు, నిర్జీవ ప్రతిమలై, బల్ల, కుర్చీ సోఫాల వసు ఐపోయారో.

'ఇది మా బల్లంటీ—' డెబ్భయి రూపాయలయింది. అంటూ, యజ మానీ, యజమాని తాలూకూ గొప్ప చెప్పుకుంటూంటే,

ఆ బిల్లకొయ్య,

తాను సజీవంగా, పచ్చపచ్చగా వున్నప్పుడు, తనమీద పిట్టలువాలడం, పాటలు పాడడం, సూర్యకిరణాలు సోకడం, చంద్రకిరణాల చల్లదనానికి తాను పులకించడం, తననీడను ఆశ్రయించుకొని, కొంచరు అన్నం వండుకుని తినీ, కొంచరు నిద్రించీ, ఇంకొంచరు అదే తమ నివాసం చేసుకొనీ తృప్తిపడడం గుర్తుకువచ్చి—ఓవడికి నానా హింసలకూ గురి అయి, జీవసారం పోయి, తాను చచ్చిపోయి, ఈ యజమాని దౌర్భాగ్యుడికి కుర్చీగా పెంచీగా అయిపోయానని ఏడ్చి ఏడ్చి శపిస్తుంచేమో.

మట్టిని తొచ్చి ఇటుకలుచేసి, ఇల్లు కట్టుకొన్నవాడు
చెట్టునుకొట్టి ఇల్లు కట్టుకున్నవాడు మనిషి
ఆ మట్టీ ఈ చెట్టూ శపిస్తే—మనుష్యులు ఏమయిపోయేవారో!
జాలికిజాతే ఏనాడో మూడిపోయేది.
నేను వృధాగా కొడితే, మా అమ్మాయి ఉసూరుమంటా ?
అట్లాగే అయితే, ఆ ఉసురు తగిలి, నేను నాశనం కానా...
ఇంతకూ చెల్లాయికి ఏంరాయను సమాధానం?
ఏమీలేదు, అంతా సజావుగా వుందని వ్రాస్తే—

ఏమీ విశేషం లేనప్పుడు ఎందుకూ వ్రాయడం వుత్తరం వ్రాయడంలో విశేషం వుందిగాని, వ్రాయకపోవడంలో లేదు.

అమ్మాయి, పిల్లల, బావగారి యోగక్షేమాలు వివరంగా అడిగితే సరి! తన యోగక్షేమాలను వివరంగా తెలుసుకోటం—మనిషికి - మంచి ఊరట!

13

'పదుగురాడుమాట పాటిపై ధర చెల్లు'

లోకానుభవ సముద్రుడు అనేకాడు ఈమాటను! ఎన్నెన్ని సంవర్ణాలలో గొప్ప గొప్ప మాటలను మూర్ఖంగా తేలికచేసి, తోసిపారేసి, గేలిచేసి, కించపీడా పెడితే పాపం, పేమన్న హృదయం వేసాలెంకో .... ఎన్నెన్ని అసంవర్ణాలలో, ఎంతెంత కుమిలి కుమిలి పేమన్నహృదయం ఘోషించిందో మరి!

లేక, మానవ ప్రవృత్తిని కాచి వడబోసి, తాను కాంచిన సత్యాన్ని తనవారికి చెప్పుకోవాలన్న బలహీనత మిగిలిపోయి, సలపరిస్తూంటే – తన వివేకాన్ని తన బలహీనత కుంగదీస్తూంటే, తనలో తాను చెప్పుకున్నాడో ఏమో పేమన్న—

'పదుగురాడుమాట పాటిపై ధరచెలు'

ఎవరికివారే స్వయంరాజుగా వుండేవాళ్ళు, హనుమంతుడిలాగా తోక రూడించడం, లేకపోతే తోక ముడవడం చాతనైనవాళ్ళు, మరొకడి అభిప్రాయంతో కలవడానికి 'ససేమిరా'గాళ్ళు, ఏ విషయంలోనైనా, ఎంత వాణ్ణయినా హేళన చెయ్యడానికి ఉస్తాదులు, ఉమ్రావులు, ఒక విషయంలో-ఒకమాటను అవునని, అంగీకరించి, అన్నారంటే—ఎంత గొప్ప సంగతి!

సందేహంలేదు!

తెలుగువాళ్ళు, పదిమంది నిస్వార్థంగాగాని, స్వార్థంగాకాని, ఒక్క-మాటమీద నిలవారంటే—అపురూపమే. ఆశ్చర్యపడతగ్గ సంగతే!

ఏ ఇద్దరూ కలపరు! కలిసినా కలిసిరారు! కలిసివచ్చినా ఎవరికివారే యమునాతీరే! ఏవన్నా ప్రాణభయానికి లొంగి, ఓవేళ 'ఔ'నన్నా వెంటనే,

'తూ, నాబొడ్డుమార్' పెట్టుకుంటారు! అలాంటప్పుడు, పదిమంది, హేమా హేమీలు, ఒకమాటను శిరసా వహిస్తారా? శిరసా వహించినా, లోపల లోపల తమకు యిష్టమైనా, పైకి అంటారా ?

అమ్మో !

అవీ నిజమే !

ఎన్ని సంగతులనైనా లోపల్లోపల అనుకోగలంగాని, పైకి అనడం వీలుకాదు! అందులో Complex వంట జితించిననాడు కష్టం !

"ఎండ బాగా వేస్తోంది" అంటే,

"నిరుటికంటె తక్కువే!"

అనందే ఆగలేం.

"మల్లెపూలు బాగున్నాయి!" అని ఎవరన్నా అంటే,

"సన్నజాజులు బెస్టు!"

"ఆవకాయ కాయ యింకా రాలేదుట!"

"అబ్బే-వచ్చి నెల దాటింది! అయినా ఈ ఏడు మామిడికాయలు కుప్పలు కుప్పలు!"

"ఈ ఏడు తేళ్ళు జాస్తిగా వున్నయ్! అంటే—"

"వచ్చే ఏడు చూస్కోవోయ్. తేళ్ళే తేళ్ళు! గ్రహచారం సమా చారం! నన్నడుగు చెప్తా!"

"పన్నాలాల్ షూష్ గొప్పగా వేణువు వూదుతాడు!" అంటే—

"పాటంటే, సైగల్‌ది పాట. మిగతాది అంతా చెత్త!"

ఇలాంటి వృధా తర్కాలతో, తెలిని ఎక్కువ అయి అపోహిస్తున్నామే వనం—

మనం, పదిమందిని ఓ మాటమీద నిలబడగలమా? అలాగని అనుకోగలమా?

అదీ కష్టమే.

ఎన్ని సంగతులనైనా నకే, అనలు అనుకోం. వృధా కాలయాపన అని ఆలోచించం సామాన్యంగా! ఆలోచించినా, అది ఏమీ ఓ దారికి రాదు! అంచేతే ఆలోచించం! ఆలోచించి, అట్లా నడిస్తే, మూడో రోజున తల బొప్పి కట్టుంది!

ఆలోచిస్తామే అనుకో, తేలిన సంగతుల్ని లోపల్లోపల అనేసుకోవాలిసిందే. పైకి అనలేం! "చంపమాను హాయిగా వున్నాడు!" అంటే పక్కనే మరొకరికి ఈ మాట గుచ్చుకుంటుంది! పాపం, వారు విరహవేదన కాశ్చర్యంగా అనుభవిస్తూండవచ్చు. ఏమైనా, మాట పడడం కష్టం! వారూరుకోరు! పోట్లాటకు వస్తారు!

"కృష్ణనీరు మంచివి!" అన్నాను. మా తమ్ముడు "గోదావరి Best!" అన్నాడు! మరోసారి "గోదావరి **Water is Best!**" అన్నాను, కావాలని.

"గోదావరి దేముంటిరా! కృష్ణ నీరు మంచివి!" అన్నాడు నాతో! ఏమనుకోవాలి!

సకారణంగా మా మా అభిప్రాయాలు మారినట్లు నటించాలి సొచ్చింది! ఎంత ముఖ్యమైన సంగతి అయితే, అంత పదిలంగా పైకి అనకుంటా మన వూహలు పైకి వచ్చి గారి పీల్చి బ్రతక్కుండా, గుండెల జైలులోపెట్టి, అక్కడక్కడ తొక్కి పారెయ్యడం మంచిది! కాని, సాధారణంగా జనం ఏదో పిచ్చా పాటీ మాట్లాడుకుంటూనే వుంటారు! ఒకరి అభిప్రాయాన్ని ఒకరికి వ్రాసుకుంటూనే వుంటారు! తప్పదు! మనుష్యులు

ఎంత మదించి కొట్లాడుకున్నా, వీపైనా, సంఘటీపులు! వీకాకులూ, హూషే కాకులూ కారు. తమ తమ గాఢ వాంఛల్ని, గూఢ వాంఛల్ని, నిగూఢాభి ప్రాయాలను తమ తమ హృదయ భాండాగారంలో దాస్తూనే వుంటారు! భరించరానంతగా హృదయంమీద నృత్యం చేసేకీ, కదిలించి నిద్రాహారాలు పోనీయనివీ అయితే, పైకి ఆనేస్తారు! అట్లాంటివి కొన్ని చిత్ర ప్రభలతో చిందులాడుతై. పిచ్చాసుపత్రిలో పెరిపాడి పియానో వాద్యంలాగ!

పదిమందీ అనేమాట, వినదించేమాట, సామాన్యంగా నినాదం అవుతుంది! కనీసం నినాదతుల్యం అవుతుంది!

నలుగురు

పదిమంది

వందలాది జనం

వేలాది ప్రజలు

లక్షోప లక్షలు

కోటాన కోట్లు—

ఒకే విషయాన్ని గురించి ఒకే పద్ధతితో చింతిస్తారనడం—ఏమో! నమ్మబుల్‌గా తోచదు!

ఏ ఒక్కరో, యిద్దరో ఆలోచించి, మథనపడి, నిగ్గు తేల్చి, పైకి చెప్తారు.

పకడ్బందీగా వ్రాస్తారు!

అది బ్రతకలేని బిడ్డ ప్రాయమై, అరటాకులలో పెరిగిన పాప చందమై, నెల తక్కువ బిడ్డలాగా అయి, ప్రాణం పోక నిలిచి, ఉసురు బలిమి కరిగి, నలుగురి నోళ్ళలోనూ పడి, నలుగురి నోళ్ళలోనూ నానీ, మళ్ళీ మరుగై,

ఏ బుద్ధిశాలో ఉద్ఘటిస్తే పైకి తేలి, ఇక విజృంభిస్తుంది!

"ప్రతిక్షణ విజృంభణాల్ ఉభయబాహు కూలంకష స్తన త్యటిత కంచుకం నమత యౌవనం యోషితాం" అన్నట్లుగా బజారులోకి వచ్చి బయట పడుతుంది!

"కాళిదాసు గొప్ప కవి!"

"గ్రేటాగార్బో గొప్పనటి."

"రవీంద్రుడి గొప్పతనం అనల్పమైంది!"

"గాంధీగారు ఏమన్నారంటే—" ఇలాగ!

ఇలాంటి వాటిని ఎవరైనా ఎప్పుడైనా, ఎన్నివేల పర్యాయాలయినా అనవచ్చు! నినదించవచ్చు! భూనభోంతరాళాలు దద్దరిల్లేట్లు గర్జించవచ్చు! గర్జిస్తారు కూడా.

ఇంతమంది అనేమాట ఎంత గొప్పది అయివుంటుంది! నిజం, అప్పసలూట్ నిజం కాకపోతే—

ఇంతమంది ఎందుకు అంటారు!

చెప్పలేం, సత్యంకోసం కాకపోయినా ఫాషన్ కోసమైనా అనవచ్చు. ఆలివర్ గోల్డ్ స్మిత్ రచన గొప్పది—షెల్లీ పగ్గొప్పకవి!

మేఘ సందేశంలో చూచావూ—"కామార్తాహి ప్రకృతి కృపణాశ్" ఇలాగ అంటూంటే, ఎదటి వారికి పూజ్య భావం కలుగుచుందనుకోవచ్చు గద. ఏ అమాయకుడైనా నమ్మవచ్చుగద, ఆ కోట్ చేసినవారు, ఎంత గొప్పవారో అని! ఈ మాటను గూడా. మరీ వెర్రి అమాయకులు అనుచు గదా, నలుగురితోపాటు నారాయణా!

"నలుగురితోపాటు నారాయణా!" అనుకోవచ్చునేమోగాని, అట్లాగ వుండడం ఎంత కష్టం!

ఎదురుగుండా తాటాకు పాకలు, చిన్న చిన్న పాకలు! ఓ హూట భోంచేస్తే, మళ్ళీ భోజనం ఎప్పటిగాళ్ళు! వాళ్ళతోచేరి, "నలుగురితోపాటు నారాయణా!" అని ఏ గుమాస్తా అయినా అనుకోగలడా?

గుమాస్తా జీతం స్వల్పం! చాటుగా, మాటుగా నాలుగురాళ్ళు ఏరుకుంటే తప్ప. సవీసుగా నెల వెళ్ళదు! వాళ్ళల్లో చేరి ఏ యజమాని అయినా అనుకుంటాడా, నలుగురితోపాటు నారాయణా! అని!

ఇలాగే,

ఆ గుమాస్తా, తనకంటె ఎక్కువ తెచ్చేవారిని అనుకరించి, తన శక్తి చాలక, మిణుకుతూంటాడు!

ఆ యజమాని, తనకంటె హోషుగా ఫెళఫెళలాడే వారి పద్ధతులు అవలంబించి కిందా మీదా పడుతూంటారు! వారూ వీరూ గూడా నిట్టూరుస్తారు!

"ఉపర్యుపరి పశ్యంతః సంతపేవ దరిద్రతి!"

ఎవరూ, నలుగురితోబాటు నారాయణాగారు కారు.

సమస్తానికీ అధికారి, భోక్త, ప్రమాణం అయిన మనిషి, తను, తన తెలివితేటలు, తన శక్తిరక్తులు, తన ప్రత్యేకత అన్నీ మరచి, గుంపుతో కలుస్తాడా?

కలుస్తాడు, ఎప్పుడు? తన్ను తా మరచినప్పుడు!

తన్నుతా మరవడం—కల్ల.

పైకి నలుగురితోపాటు నారాయణా అంటూనే, ఆచరణలో "నన్ను ముట్టుకోకుగాళ్ళు!"

"నన్ను ముట్టుకోకుగాళ్ళు" వెంగలులని చూస్తూ చూస్తూనూ కొట్టి పారెయ్యలేం! వీరిలోనూ కొందరు జ్ఞానులు ఉండవచ్చుగదా.

మహాజనం వికసించిన విద్యుత్తేజంలాగా లేచి, మహోద్రేకాలతో శివం ఎత్తి చిందులు తొక్కుతూంటే....

ఈ జన సంక్షోభ సందేశాన్ని కవి గానం చేస్తూంటే—

అంతర్ముఖుడు అయినవాడు,

ఏ గుహలోనో, ఏ గుడిలోనో కూర్చుని "ముందు నన్ను బాగు చేసుకోనీ, ముందు నాకు శక్తి రానీ, ఇతరులను తరింప చెయ్యటానికి!" అనుకుని అంతర్ముఖుడుఅయినవాడు—ఈ కోలాహలాన్ని చూచి ఏమను కుంటాడు? పెదవి విరుస్తాడా? లేక అంతమందిలోనూ తాండవించే చైతన్యానికి ప్రణమిల్లుతాడా? ఇంతకూ ఆయన ఏమంటాడు?

ఏమీ అనడు. అన్నాడో వికటించి, విషమిస్తుంది.

నిజం చెప్పగూడనిది! విషంకంటె ప్రమాదకరం అయింది.

అంత చెలరేగిన జన సమ్మర్దపు కోలాహలంలో, అంతమంది ఏ మాటను అరుస్తున్నారో, ఆ మాటను తిరగేసి, బోల్లేసి, సారం తీయ బోయి, "ఇది పిప్పిరా బాబులూ!" అని చెప్తే ఎవరన్నా—వారు ఆ క్షణం లోనే పిప్పి పిప్పి అవుతారు! బైబులులోని ప్రవక్తలు—ఎంతమంది — రాళ్ళతో దెబ్బలు తిని పోలేదు!

"కీర్ణా బాహూ ర్విరౌమ్యేష నహికశ్చిత్ శృణోతి మాం!"

"చేతులెత్తి అరుస్తున్నాను! నన్నెవరూ వినడంలేదు!" అని వ్యాసుడి లాగ ఏడవాలిసొస్తుంది!

వ్యాసుడు అదృష్టవంతుడు! అమిత బుద్ధి, క్రాక్, పక్‌పక్‌ట్, అనిపించుకోలేదు! అతని రచన భగవద్గీత అయి కూచుంది!

ఆయన రచనలు భారత భూమిని అఖండ భారతం చేసినయ్!

ఏమైనా,

ప్రజాభిప్రాయానికి ఎదురయిన చేదు అయిన సత్యాన్ని వివేకులు ఎవరూ చూస్తూ చూస్తూ చెప్పరు! చెపితేనో, ముందు జరిగే సన్మానం భరించడం కష్టం!

అందుకే ఎవరూ ఎదిరించరు! కార్యసాధకులు అయినవారు కమ్మగా కబుర్లు చెబుతూ, తమ పనిని సాధించుకుంటారు!

కాక, తమ అభిప్రాయాలమీద అచంచలం అయిన విశ్వాసంవున్న వాళ్ళు, గుంపుకు వైదొలగి, దూర దూరంగా పోయి, చెట్టూ పుట్టా ఆశ్ర యిస్తారు కాదూ మరి!

పదిమంది ముందు, ఒక్కడి మనసభార ఏం అవుతుంది పాపం!

ఏం,

ఏదయినా అవుతుంది! ఎంత పనైనా చేస్తుంది. ఉన్న ఉద్రేకాన్ని దిగదుడిచి పారేసేంత కొత్త ఉద్రేకాన్ని కలిగించేదైతే సరి.

మరో పదిమంది, ఈ కొత్త మాటనే పలికి దీన్ని నినాదం చేస్తారు!

ఇంతకూ గండా గొండిచేసి, వెర్రి నమ్మకం పెట్టుకుని అరిచి, తిండీ తిప్పలూ మాని, టమ టమా, తాషామర్చా, డప్పుల చప్పుళ్లు చేసేవారు ఉండనే ఉంటారు!

ఇంతకూ వీరంతా ఎవరు? సాధనాలు! సాధకులు కారు! సాధకులు కారు గనకనే అంత ఉద్రేకం!

సాధకులు ఎప్పుడూ—ఏకాకులే, వారిది వీకాంత వాసమే!

"పదుగురాడు మాట పాటియై ధర చెల్లడం" గమనించి, ఆ పది మందినీ తమ కింకరులుగా చేసుకుంటారు!

తమ మాటకే తాము ఎదురు తిరిగేదాకా వీరికేబాధా వుండదు. కాని వీరందరూ సాధారణంగా "ఆకు మడుంగు పువ్వులు!"

ఏమైనా పదిమందీ అనే మాటా, వజ్రాయుధంకంటె పదునై నది! దానికి అదే సాటి!"

14

"వా"సనలేని పూలు, బుధ వర్గములేని పురంబు" అంటున్నా వెవరో పార్థ్-లో!

ఆ సంజెచీకటిలో, పచ్చని గరికపట్టు కూడా చీకటిముఖంవేసిన సమయంలో పై పద్యం కోట్ చేసిన వారిముఖం స్పష్టంగా కనబడలేదు. గొంతుక-ఎరిగి ఉన్న గొంతుకకాదు. కానీ ఆ అన్న ఒడుపుమాత్రం మహా-అందంగావుంది. మాంచి గడుసుగా ఆంటున్నారు.

పూలువాసన వెయ్యకపోతే—ఏం

పూర్ణో పండితులు అంటూ లేకపోతేనేం!

ఏంనష్టం!

పూలువాసన వేస్తే, కొంచరు దౌర్భాగ్యులికయినా, మనస్సుకు చక్కలిగిలి పెట్టినట్లవుతుంది. హృదయానికి, కోరికలకూ పొత్తుకుదురుతుంది. బుద్ధికీ మనస్సుకూ పోరు కలుగుతుంది. నిజమే! కాని, పూల పరిమళం— గ్రహించేవారు తక్కువ,

అయాచితంగా, కొసరి కొసరి వేసారకుండా, అమాయకంగా తలలెత్తుతాయి పూలు. చేతనైనంతగా పరిమళాన్ని ప్రసాదిస్తాయి! పూలు.

ఎంతగొప్ప సృష్టి! పూలేలేకపోతే పూలు అందూఉన్నా, వాసన లేకుండా ఉంటే- ఎంతహాయి! ఏ చక్కలిగింతా మనస్సుకుండదేమో, హాయిగా నిద్ర పడ్తుంది. వూళ్ళో పండితుడు అంటూ వుండకపోతే, దేనికీ ఆలోచించుకోనక్కరలేదు.. పండితులుచేసే గత్తరను భరించే బాధంటూ వుండదు. పూలు, పండితులు తపుకున్న శక్తిరక్తుల్ని ఎవరెవరికో అయాచితంగానైనా సరే పంచిపెటందే ఆగరు.

నిద్రాహారాలు మాని, తలిదండ్రులకు దూరమై, ఎన్నెన్ని కష్టాలో పడి—ఎంతెంత జీవనశక్తినో కర్చుపెట్టుకొని, ఎన్నెన్ని అవమానాలనో మూటకట్టుకుంటేనే గాని విద్యరాదు. ఆ వచ్చిన విద్య—వృధాగా ఎక్కడ పోతుందో అని—విద్వాంసుల క్షోభ. అందుకని, అడిగినవారికీ అడగని వారికీ చెప్తారు. చావస్తం ముదిరిందా! జబ్బ పట్టుకొని, నిలేసి అయినా చెప్పి తీరుతారు. పూలుగూడా అంతే. భూసారం, చెత్తాచెదారంతోపాటు పీల్చి-పంకాన్ని తీసుకుని, పరిమళంగా మార్చుకొనే దైవమిచ్చిన శక్తిని, వృధాగా నైనాసరే వెదజల్లుతాయి. ఎదుటివారికి ఏవే వికారాలు కలుగుతాయోనని ఆ పండితులూ గమనించరు! ఈ పూలూ పట్టించుకోవు.

వాసనలేని పూలు అంటూవుంటాయా? ఎందుకు ఉండగూడదు?

వుండడం కష్టం.

'గంధవతీ పృథివీ' పృథివికి లక్షణం గంధం కలిగివుండడం.

ఏదో ఓ వాసన అంటూవుండడం భూమిపై వస్తువులకు సహజం.

పరిపూలు!

మొగతొడిగింది మొదలు, పరిమళాల పంటభూములాపె పూలు!

ఐనా. కొన్నిపూలు, పరిమళంలేని వరంకోరుకొని వుంటాయి కాబోలు. అలాంటి వాటికి, కంటికి ఇంపైన రంగులు వుండవామరి.

పీనాసికి కాంతం అనేగుణం వెన్నంటి వున్నట్లు!

ఏ గుణం లేనివారికి ఐశ్వర్యమో అధికారమో వున్నట్లు.

మనలో మాట—

ఐశ్వర్యమూలేక, అధికారమూలేక, చదువులూ సంధ్యలూ లేక, అందమూ చందమూలేక—ఎందరెందరు అభాగ్యులు లేరు ఈప్రపంచంలో! వుండివుంటారు పైకి కనబడకపోయినా. కొట్టవచ్చినట్టు గుణాంచకపోయినా ఎంత నిక్కృష్టుడికిగూడా, ఏదో ఓ సుగుణం అంటూ వుండివుంటుంది! ఏ సుగుణమూ ఏదుర్గుణమూ లేనివారు అంటూ వుండరు. 'దృష్టం కిముపిలోకే స్మిన్, అని ర్దోషమనిర్గుణం' అని దేవుడిమాట!

సుగుణమూ, సువాసనా వుండక తప్పదు.

ఈ సృష్టిచిత్ర మేమిటోగాని, దుష్టం అయినవయినా అది వుండక పోతేంవెళ్ళి తప్పదు! శకుని లేకుంటే భారతంలో అందమేలేదు. శూర్ప ణఖ అంటూ లేకపోతే—రామాయణంలో రక్తి లేదు, కాని—తప్పదు. వాసన లేని పూలూ వుంటాయి. విబుధవర్గంలేని పురాలూ వుంటాయి! 'విబుధవర్గం అంటే దేవుళ్ళు అనా అర్థం? విబుధవర్గం అన్నమాట అర్థాన్ని 'బుధ వర్గం' అని పద్యంకోసం కొట్టేశాడా కవి! వివాదంచవలసించే. 'దైవవర్గం' అంటే, దైవంమీద మనకున్న భావనల రూపం. దైవములేని తావు లేదు! ఈదౌవాన్యమిదం నర్వం! దైవభావనలు లేనివారు ఉండవచ్చు! ఉంటే, ఏం హాయి వుంటుందీ?

దైవభావం అంటూ వుంటేనే — పాలు, పూలు, పూజ, సంబరం, తృప్తి కలుగుతాయి జీవితంలో!

వలుగురు చేరడం, ఆ చేరినవారు సంతోషంతో సంబరంగా - వుండడము, ఏదో తృప్తిగా చేసేపని, ఆ సమష్టి — పనిలో సంతోషం, ఇవన్నీ

మనిషి వొదులుకుంటాడా ? వొదులుకుంటే జీవితము జడప్రాయం అయి పోదా?

నేనే తప్పుగా వూహిస్తున్నానేమో! విబుధవర్గంకాక, బుధవర్గమేనేమో పండితుడు చాదస్తంవల్ల! కంపుకొట్టినా, అతని విద్యా పరిమళాలు ఎంత అవసరం!

'శాస్త్ర దృష్టి' అతనికి అధికం! విశ్వవిఖ్యాతులు జీవితాన్ని మథించి, తేల్చి చెప్పిన వారి అనుభవాలు అతనికి కొట్టినపిండి! తెలుసుకుందాం అని అతని దగ్గరికిపోతే—అతను పంచిపెట్టేది, కాంతి ప్రవాహముగాని, కట్టే కంపా కాదు మరి!

వాసన వున్నపూలూ అవసరమే, బుధవర్గమూ అవసరమే!

కాని, కొన్ని పూలకు వాసన వుండదు. కన్నులకు ఇంపుగానూ వుండవు.

మరి....

వాటికి ఓషధిఐన యోగ్యత అయినా వుంటుంది!

ఉమ్మెత్తపూలు, రోడ్డువారను రాలిపడే తంగేడు పూలు, ఏమంత వాసన వేస్తయ్? ఏమంత కన్ను చెదరగొడతై? కాని, రెండూ రెండు మందులు మరి!

వాసన లేకుంటే నేం....!

వాసనే ముఖ్యమా?

ఆహా. ముందు ఆకర్షించేది వాసనే-తరువాతనే వుపయోగం.

వాసన....!

వాసన అంటే ఏమిటీ?

ముత్తుస్వామి దీక్షితులు—సరస్వతీదేవిని స్తుతిస్తూ —

'వాసనాత్రయ వివర్జిత వరముని భావితమూర్తే!' అన్నారు.

వాసనాత్రయం అంటే- ?

పువ్వులకున్న వాసన, ప్రేంకులకున్న వాసన, కొత్త పుస్తకాలకున్న వాసన, మంచిగంధం వాసన లాంటి వాసనేనా ఇక్కడా అని. ఎందరెంద రినో అడిగాను! వారి వారి చిత్తం వొచ్చినట్లు చెప్తారు! తెలిసి చెప్పకపోనీ- తెలియక చెప్పనీ - నిజం రాలేదు.

సీతారామాంజనేయంలో కంటబడింది! వాసనలు మూడు-లోక వాసన, దేహవాసన, శాస్త్రవాసనలు అవి !

లోకం తెలియడం, లోకంలో అందరూ తనను మెచ్చుకొని, సన్మా నాలుచేసి, డబ్బా వాయించి, శిలాప్రతిమలు ప్రతిష్ఠించి-ఉక్కిరి బిక్కిరి చేస్తే సంతోషించే వాసన ఒకటి.

తాను, తన అందం, తన సొగసు, తన శరీరం కాంతి, వన్నె, వర్చస్సు, అది మారుతూంటం. మనకు ఇష్టంలేని కొన్ని మార్పులు రాకుండా ఉండాలనీ, ఇష్టమైన మార్పులే రావాలి అనీ, ఈ శరీరంతో అత్య ధిక కాలం భోగాలను అనుభవించాలనీ కోరుకునేది మరో వాసన.

అన్ని శాస్త్రాలూ చదవాలనీ, సమస్త శాస్త్రాలూ చదివి, అలా చదివిన ఇతరులతో డిక్కీకొట్టి, ఓడి, గెలిచి, వారు చిన్న ముఖం చేసుకుని, తలవొంచుకుని, మనకు పాదాక్రాంతులై — జయ జయధ్వానాలు చేస్తూవుంటే-సంతోషపడే వాసన ఒకటి ! కాదా, శాస్త్రాలలో ఇలా వుందని మూర్ఖపు పట్టు పట్టుక్కూచోడం గూడా ఆ వాసనేనేమో.

ఇవీ వాసనలు.

ఇట్టి వాసనలు లేక, అంటే, ఏ కోరికలూ లేక, మనస్సును కూడా కట్టిన ముసులు భావించిన మూర్తి నీది తల్లీ అని ముత్తుస్వామి దీక్షితులవారు సరస్వతీదేవిని స్తవం చేశారు!

ఎంత గొప్ప సంగతిని గానంచేశారు దీక్షితులవారు !

మహానుభావులు !

పూలవాసనలు వేరన్నమాట.

సాయింత్రం. సంధ్యారాగం యింకా రాలేదు ! చందమామ తెల్లని మొహం వేసుకొని, నేను ఉన్నానర్రోయ్ అనడంలేదు. బాటలమీద నీళ్ళు చల్లలేదు! వాతావరణంలో ఉడుకు తగ్గలేదు, కూజాలలోని నీళ్ళు కూడా ఇంకా వెచ్చ వెచ్చగానే వుంటున్నాయి— !

ఇన్ని మల్లెపూలో, సన్నజాజి పూలో నీళ్ళలో వేశాం—

కాస్సేపటికి నీళ్ళు చల్లబడ్డాయి.

ఇంకాస్సేపటికి నీళ్ళకూ సువాసనలు అబ్బుతున్నాయి!

పూలు పకపకా నవ్వినై.

పాటిని చూచి మన మనస్సులూ పులకించినాయి !

పూలే లేకపోతే, ఏ కాలంలోగాని అందం ఏమి వుంటుందీ?

పరిమళమే లేకపోతే, పువ్వుల సుఖం ఏమి వుంటుందీ?

ఎంత అందం.

ఆహా! అంత స్వార్థమూ వుంది మనకు.

చెట్లను పూలకోసం పెంచే యిది, చెట్టునున్న పూలనుగిల్లే తొందర, గిల్లుకొచ్చిన పూలను — దోహదాలతో వికసింపచేసే యావ, వికసించిన

పూలను, చెండ్లుగా గుచ్చి బంధించే తహ తహ, తల్లో పూలు పెట్టుకొని సంతోషపడక !

అట్లా పూలుపెట్టుకొన్న వారితో, మేమూ పూలు పెట్టుకున్నాం అని గొప్పకుపోవడం, పూలు తలలో పెట్టుకోని వారితో, 'మేం పూలు పెట్టు కున్నాం' అని గొప్పకుపోవడం—

ఇదంతా ఏమిటి ?

స్వార్థం కాదూ ?

అమాయికంగా కొమ్మలను తలఎత్తి చూచే పూలను చూచి తృప్తి పడిపోక, తుంచిపారేసే గుణం, తుంచిన పూలను మూచూడక యింకొకరికి ఇవ్వక, చొక్కా జేబులో వేసుకొని, ఆ విషయం మరచి, మన్నాడు ఆ చొక్కాను అట్లాగే యిస్త్రీకి పారేసే గుణం మనలో ఇంకా వుండనే వుంది గదా! అందుకే కవీశ్వరుడు—కృష్ణశాస్త్రి

దారి తలయెత్తు నింత సౌందర్య లవము
వదిలిపోలేరు, చంపెడువరకు – వీరు,

అని పడినఖేద న్యాయమైనదేగదా మరీ.

మాటలయితే ఎన్నయినా అనుకోవచ్చుగానీ, మనిషి పువ్వులను విడిచి వుండలేడు మరి! ఎంత దరిద్రులయినా, మల్లెపూలను మంగలాన వేయించలేరు మరి! గులాబీపూవు రెక్కలను తుంపి తినకుండానూ ఆగలేరు! పూవును విడిచి మనిషి వుండలేడు. 'స్వార్థం అనుకో. మరేమైనా అనుకో. అందుకేనేమో, శ్రీ రవీంద్రనాధటాగూర్ — కలవపూవును, పూర్వజన్మ నుంచీ తెచ్చుకున్నాను' అని మహోన్నతంగా అన్నాడు.

పూలను చూచి మనిషి మారతాడు! తనకు తెలియకుండానే వికసిస్తాడు, పూలతో వర్తకంచేస్తే తప్ప !

పూలను చూచి వికసించనివారూ, సంగీతానికి మైమరవనివారూ అసాధారణులట. మనుష్య ధర్మాలకు అతీతులట. వారికేంగాని, సాధారణులం మనం, పూలను విడిచివుండం.

అలాంటి పాపిష్టి కాలమే సమీపిస్తే— కాయితంతోనైనా పూలు చేసుకొని ఆనందిస్తాం! నల్లరాతిలోనైనా, మల్లెపూవును చెక్కుకొని ఆకారాన్ని చూచి అయినా తృప్తిపడతాం. మనిషికీ పూలకూ అంత గట్టి సంబంధం!

నిజమేగానీ—ఇంత వాంఛనీయమైన పూలు, ఎక్కువకాలం ఉండవు! అల్పాయువులు మరి పుష్పాలు. పదిరోజులు వుండే సన్నజాజి, మరింత ఎక్కువకాలం వుండే మల్లెలు — ఇట్లా మన కోరికలతోపాటు పూలను ఎందుకు సృష్టించడో సైవం. అవి, ఎప్పుడూ అందుబాటులోనే పడివుండే. వాటి విలువ తగ్గుతుంటని కాబోలు.

ఆమాటా నిజమేగాని—

ఇన్ని అనుకుని, ఇన్నింటికి చేయివేసి, ఇన్నివిధాల గెలిచి ఓడి విర్రవీగే మనిషికి ఉందా, దీర్ఘాయువు! లేదు. కొచ్చో గొప్పో తేడా తప్ప ! అన్నీ అల్పాయుస్సు గలవే !—

జ్ఞానులు ఒకరు చెప్పారు—

మనిషి యోగంలో ప్రవేశించి, యోగశక్తిని సాధించినప్పుడు — ఎక్కువకాలం జీవించవచ్చు.

అతనికి సాధన పూర్తికాకపోతే, మళ్ళీ పుట్టడం, పెరగడం అంతా కాలహరణ! అనవసరం. ఈ శరీరంతోటే, ఆ సాధన పూర్తిచేసుకుందాం అనుకుంటే, ఆ యోగి వందలకొలది సంవత్సరాలు వుంటాడు ! కాని — కోరికలు అతనికి ఉండవు! ఈశ్వరదర్శనం కోరే కోరికే అతనిది!

అలాకాక, అదీ యిదీ కావాలని కోరినప్పుడు - మామూలు మనిషే అతనూ. అవతారమూర్తులు, ఋషులు, యోగులు, జ్ఞానులూ ఎక్కువకాలం

భూమిమీద ఉండాలని కోరుకోరు. వచ్చినపని చూసుకొని త్వరత్వరగా వెళ్ళిపోతారు అని.

ఐతే పూలు ఎంత జ్ఞానులో! ఋషులో? దేవతలో మరి! అంతా మౌనసంగీతమే పాడి, ఉదాహరణప్రాయంగా జీవించి, త్వరలోనే ఈశ్వర సన్నిధికి చేరుకుంటున్నయ్ పూలు....ఎంత అదృష్టం పూలది!!

15

అర్ధరాత్రం! కార్తికపూర్ణిమ! ప్రపంచం అంతా పాల సముద్రంలో తేలి ఆడుతూన్నట్లుంది! చలిచలిగానూ వుంది! బుట్టబయలులాగ, గుంభనలేని సంసారంలాగా, అంతా తెలిసిపోతూన్నట్లుంది పరిసరప్రాంతం! వెన్నెట్లో, అరుణాచలంకొండ మనోజ్ఞంగా వుంది! అహోరాత్రాభిమాన దేవతలు శ్రీ చక్ర స్వరూపం అయిన ఆ కొండచుట్టూ ప్రదక్షిణం చేస్తూంటారు కాబోలు! ఎవరెవరో విదేశీయులు కొండను చుట్టడానికిపోతూ నన్నూ రమ్మన్నారు! బద్ధక సార్వభౌముణ్ణి మరి నేను! వారి మాటలు వింటానా....! శ్రీచక్రం అయిన ఆ కొండను, మనసా వాచా ప్రదక్షిణం చేశాను! బెంగం రోడ్డునుంచి మలుపులు తిరిగి కొంతదూరంపోతే—ఎన్నో విశేషాలు!

కొండ కెదురుగా నిలబడి గట్టిగా అరుస్తే, ప్రతిధ్వని వస్తుంది! మనస్సులోనే అరిచి ప్రతిధ్వని మనస్సులోనే విన్నాను!

ఇరుకురాళ్ళ దగ్గిర తాపీ ధర్మారావుగారు గుర్తుకొస్తారు! వారినీ, వారి రచనలనూ గుర్తుకు తెచ్చుకున్నాను!

పసుపులై స్వాములవారు ఎక్కువగా మకాంచేసే సత్రంలో దాహం కాకపోయినా, మనస్సులోనే దాహం తీరాను. పెద్ద గుడిముందు నిలబడి,

రథచక్రాన్ని చేతితో తాకి, అరుణాచలేశ్వరులకూ అపీతకుచాంబకూ నమస్కరించాను! శ్రీ రమణాశ్రమం దగ్గిర నిలబడి భగవాన్ సమాధికి జాగిలబడ్డాను.

ఇదంతా-రెండు నిమిషాలు!

ఆ అరుణాచలం కొండకు ఎన్ని సొగసులో. ఓ రోజు ఉదయం - వెంకటచలంగారు చూడమన్నారు అటుకేసి, చూస్తే -

సూర్యకిరణాలకు ఆ ఎర్రనికొండ మెరిసి విచ్చిన మందారపుష్పం లాగుంది! ఆ కాస్తలోనే మబ్బుకమ్మి కొంతభాగం నల్లకలువలాగుంది!

కావ్యకంఠుల శ్లోకాలూ, కాళిదాసు వర్ణనలూ గుర్తుకువచ్చి నాలో నేను బిగ్గరగా చదువుకున్నాను....

ఇంతలో మైకం వచ్చింది కాబోలు—

మబ్బులు నిర్మలాలు అయినయ్, మళ్ళీ యింతలో మూసుకున్నయ్! కాస్తసేపు చంద్రుణ్ణి దోబూచాడి తప్పుకున్నయ్!

ఛాందోగ్యంలోని,

అశ్వఇవ రోమాణి విధూయ పాపం,
చంద్ర ఇవ రాహోర్ముఖాత్ ప్రముచ్య
ధూత్వాశరీర మకృతం కృతాత్మా -
బ్రహ్మలోక మభిసంభవామీత్యభి సంభవా మీతి—

అన్న కోరికలాగ వుంది ఆకాశ సామ్రాజ్యం!

నక్షత్రాలు ప్రయాణిస్తున్నాయి! చిత్రంగా వుంది! బాటసారులలాగ, తిరునాళ్ళలో ప్రజలలాగ పోతున్నాయి నక్షత్రాలు!

కొన్ని ఒకచోట గుంపులుగా చేరినయ్!

అద్భుతం....!

ఈలాంటి కలలు ఈ మధ్య వస్తున్నయ్!

అలవాటు గూడా అవుతూన్నయ్!

నక్షత్రాలు తమాషాగా ఓ ఆకారం తాల్చినయ్! వీదో అక్షరం! ఏ లిపో తెలియదు, గాని అది ప్రణవం, ఓంకారం అని మనస్సుకు తెలు స్తోంది!

ఎవరో స్త్రీలు!

ముగ్గురు, ముగ్గురు! వారి వారి దుస్తులు, ఆభరణాలు, సలక్షణత చూస్తే, నా చేతులు, హృదయం, తల వారికి నమస్కరించినయ్! వారు నాకు నమ్యులు!

ఆ ఉన్నత తుంగనాస, నీలపటాభిరామ, ఊర్వశి అనిపించింది! అతితెల్లని ఆమె వంటిరంగు—శరీరంలోని రక్తప్రసారాన్ని గూడా తెలియ నిస్తోంది! పాలూ, కుంకుమపువ్వా తేనె కలిసి ఈమెగా అయిందా అనిపిం చింది!

"నా నమస్కారం స్వీకరించండి—తాము వూర్వశి!"

నాజంకు కొంకులు ఎక్కడికి పోయినాయో! అనేశాను.

ఊర్వశి మందహాసం చేసింది. ఆ నవ్వు ఒక్కటే చాలు, ఎంత వయస్సు వచ్చినా, ఎంతకాలం గడిచినా సౌందర్యానికి ముదిమి, చావు లేవు అని చాటడానికి!

గొప్ప గొప్ప శిల్పులు, కవులు సౌందర్యవతులను ఎందుకు భావిస్తారో అప్పుడు తెలిసివచ్చింది! అందం అంటూ వుండాలేగాని, అది ఎన్నడూ మాసిపోదు!

ఊర్వశి నవ్వు నా నరాలమీద సంగీతం వాయించింది! ఆమె కన్నులు, దేవులపల్లి కృష్ణశాస్త్రి చూస్తే ఏపని వర్ణించేవాడో!

ఆమె కన్నులలో అనంతాంబరంపు నీలినీడలు కలవు .... అనేవాడు అప్రయత్నంగానే!

నిజమే, ఆమే ఊర్వశి!

వేదాలలో ప్రస్తుతింపబడిన ఊర్వశి, పురాణాలలో పరిఢవం చూపిన ఊర్వశి, రవీంద్ర మహాకవిని ఉక్కిరి బిక్కిరి చేసిన ఊర్వశి ఈవిడా ?

ఆవిడ కాలిగోటికి కూడా నేను తలవొంచుతున్నాను.

ఎవరో పిలిచినట్లు అయి, తలతిప్పి చూచాను!

పరిమ్లానముఖి ఈమె.

ఈవిడే మాళవికట.

ఓ, కాళిదాసు నాటక నాయికలు!

అమ్మా, మీరు శకుంతలా ?

తల్లీ, నీ బిడ్డపేరుతో మేము భారతీయులం అయినాము! నీ బిడ్డడే చక్రవర్తి కాకపోతే, ఫరాత్ నదీతీరం నుంచి — ఇంతదూరం వచ్చి, ఈ దేశాన్ని పాలించకపోతే, ఈ దేశానికి ఆ బేరట్ (ఫరాత్) రాజులదేశం అనే పేరు రాకపోతే-ఆనాడు మమ్మల్ని ఏమనేవారో....!

శకుంతలలో మార్పులేదు!

"మీ మాటలు నా రక్తంలో ఇంకినయ్! మీరు కనీసం పాతిక సంవత్సరాలకు పైగా నాలో కలిసిపోయారు! అదే మరో మాటగా, నా కష్ట కాలంలో—మీ మాటల్ని తలుచుకుని ఊరట పొందాను.

బిచ్చగాడు, పొద్దున్నే వేషం వేసుకొని, పరాయిదేశంలో బిచ్చానికి బయలు దేరినట్లు, తొలిసారి బతుకు తెరువుకోసం మద్రాసు వీధులకు బయలు దేరేప్పుడు—

"కథమి వ తాతస్య అంకాత్ పరిభ్రష్టా
మలయలతోన్మూలి తేవ చందనలతా
దేశాంతరే జీవితం ధారయిష్యే !"

అన్న వాక్యం బలంగా చేసుకొని కదిలాను!

వసనే పరిధూసరే వసానా,
నియమక్షామముఖీ ధృతైకవేణీ
అపినిష్కరుణస్య శుద్ధ శీలా
మరుదీర్ఘం విరహవ్రతం బిభర్తి

అన్న మహాకవి మధురవాక్కు చదివి చదివి కుమిలి వీచ్చాను !

శకుంతల చలించలేదు!

నిజమే, తప్పు నాదే మరి! పరాయి ఆడదానితో, నీవు విరహంలో వేగిపోతూంటే—నీ విరహం చూచి నేనూ కుమిలి వీచ్చాను అని అంటే ఆవిడకు ఎలాగుంటుంది!

ఈ మాట అన్నది దుష్యంతుడు. తన భార్య, తనకోసం విరహ వేదన పడుతూంటే—నాయకుడికి సానుభూతితోపాటు కొంత తృప్తి గూడా వుంటుంది. అదే, ఎవడో దారిన పోయేవాడు, బహు కాలానికి తారసిల్లి పాపం, నీ భార్య నీ కోసం విరహవేదన పడుతోంది! నేను అది కవి వాక్కులలో చదివి బహు విచారపడ్డానయ్యా అంటే—

కావ్య గత జీవితం గనుక, దుష్యంతుడూ, ఆయన దేవేరి శకుంతలా, సామాన్యుణ్ణి, బహు పేదవాణ్ణి నేనూ, సమానంగా మాటా మంతీ అనుకోడానికి వీలు అయిందిగాని—జీవితంలోనే అయితేనో—ఏమయ్యేదో మరి !

నన్ను నేను చిన్న అద్దంలో చూచుకున్నాను!

నా తల తిక్కలల్లో నేనుండి, వ్యాస వాల్మీకుల్ని, నన్నయ తిక్కన పోతన్నలనూ చదివి, మరి ఎవరినీ తృప్తిగా ఆనందించ లేకపోయాను. ఎంకిని మినహా, తెనుగు వాంగ్మయంలో మరే నాయికా నాలో కలిసి పోలేదు. పొగరుమోతుతనం కళ్ళకు ఎగదట్టి, కాళిదాసునే కాదన్న ఘటాలు వున్నాయి. తప్పంతా నాదే కదూ! ఉఁహూ, జరిగిందానికి ఏం చేస్తాం! చేసిన తప్పు మళ్ళీ చేయకుండా ఉంటేసరి.

నా జన్మలో నేను ఎన్నడూ పల్లెత్తు మాట అనలేకపోయింది ఒక్క సీతమ్మను గురించి! కుంతీదేవిని గురించి! మిగిలినవాళ్ళ కష్టసుఖాలు, ఆమోద ప్రమోదాలు అంతగా నా ప్రాణాలను గిలకొట్టలేదు! వారిద్దరి తరువాత—శకుంతల!

"సీతమ్మ తల్లిని గౌరవించినంతగా, మిమ్మల్ని గౌరవంగా చూచుకుంటాను!" అన్నాను.

శకుంతల కన్నులు ఎత్తి చూచింది.

శకుంతల గంభీరురాలు.

"నేటికి కాళిదాసు నాయికలు దర్శనం ఇచ్చారు. ధన్యుణ్ణి!"

"మాకు తెలుసు" అంది మాళవిక.

నన్ను గురించి ఏం తెలుసో వారికి మరి! అనేక అవస్థ లున్నాయ్ నాకు.

మంచిని ముంచెత్తే చెడు ఉన్న జాతకులలో ఒకణ్ణి మరి!

"చూడండి!"

ముగ్గురు దయగా నన్ను చూచారు.

"మాళవిక రాజకుమారి. ఇరావతీ సన్నిధానంలో, ఆమె ఎంత వ్యధ అనుభవించారో! తలుచుకున్నప్పుడల్లా—

ఆ ఇరావతి,

అవిశ్వసనీయాః పురుషాః, మయా ఆత్మనో వంచనావచనం ప్రమాణీకృత్య, వ్యాధగీత రక్తయా హరిణ్యేవ ఆశంకితయా నవే జ్ఞాతం వీతత్" అనీ,

విశ్వసనీయోసి, మయానామ, న విజ్ఞాత మీదృశాం వినోద వస్తుకం ఆర్యపుత్రేణ ఉపలబ్ధమితి, అనీ అంటూంటే—

మాళవికకు ఏమేమి గుర్తుకొచ్చాయో మరి! అదోలాగు చూచింది!

ఆ చూపు ఉదాత్త ప్రకృతులకే చెల్లు!

దీర్ఘాక్షం శరదిందు కాంతి వదనం బాహూనతా వంసయోః
సంక్షిప్తం నివిడోన్నత స్తన మురః పార్శ్వే ప్రమృష్టే ఇవ!"

కాళిదాస మహాకవికే చెల్లింది మీ రూపాన్ని చిత్రించడానికి! ఎంత పొగసిపోయారో వారు ఆనాడు!

యక్షపత్ని మరి యిద్దరితో ముందుకు వచ్చింది!

ఈవిడ 'మద్గోత్రాంకం విరచిత పదం గేయముద్గాతు కామా' అని ప్రియుడిచేత అనిపించుకున్న ధన్యురాలు! అంతే.

నన్నెందుకో మేఘసందేశం ఎక్కువ మత్తెక్కించలేదు. ఆ మత్తు అనుభవించినవారు శ్రీ రవీంద్రనాథ టాగూర్!

యక్షపత్ని పక్కలను, పరమపూజ్యురాలు, గంగవంటిది, అరుంధతి వంటిది, మా తల్లి పార్వతీదేవి వంటిది పూజ్యురాలు వుంది—

"అమ్మా! సీతమ్మా!"

— మా అమ్మ పేరు సీతమ్మ. అమ్మ అనే భావం రాగానే మా అమ్మే నాకు కనిపించేది. ఆ పేరే నోటికి వచ్చింది!

సీత తలఎత్తి చూచింది!

"అమ్మా, నీవు సీతమ్మవా?"

భవభూతి ప్రాణాలలో చిందులాడిన తల్లివా? వాల్మీకికి గొప్ప దనం తెచ్చిపెట్టిన తల్లివా? వాల్మీకిని మించి మా కాళిదాసు నిన్ను రచించా డమ్మా.

"సాహం తపస్సూర్యనివిష్టదృష్టి
ర్యూర్ధ్వం ప్రసూతేః చరితుం యతిష్యే!
భూయో యథా మే జననాంతరేపి
త్వమేవ భర్తా, న చ విప్రయోగః!"

అన్న సందర్భంలోని ఏడెనిమిది శ్లోకాలూ, కాళిదాసు గొప్పతనానికి, వాల్మీకిని మించిన గొప్పదనానికి నిదర్శనం, తల్లీ — అంటూనే ఆవిడకు పాదాభివందనం చేశాను!

అయోనిజ అయిన సీతమ్మ, జీవితమంతా ఇబ్బందుల పాలయిన సీతమ్మ, నేనీసారి పుట్టి పెరుగుతూన్న తెలుగుగడ్డమీద కూడా అడుగుపెట్టి ఆచంద్రార్కం నా తెలుగుజాతిని పవిత్రం చేసిన సీతమ్మ — లంకేశ్వరుడు వస్తూంటే చూచి,

'ప్రావేపత వరారోహా, ప్రవాతే కదళీయథా' అయిన సీతమ్మ హనుమంతుడి మాటలో — లంకలోని అశోకవనంలో,

ప్రతి పత్ప్రాత శీలస్య విద్యేవ తనుతాంగతా' అయిన సీతమ్మ కాముకుడు అయిన శ్రీరామునికి దేవేరి అయికూడా,

'భూ యో యథా మే జననాంతరేపి
త్వమేవ భర్తా— న చ విప్రయోగః' అనగల్గిన ధీమాగల సీతమ్మ, పాదాలకు నమస్కరించాను!

నా ప్రాణాలకు హాయి.

నా పాపాలకు పరిహారం. నా దౌర్భాగ్యం పటాపంచలు! చాలు. జీవితంలో ఒక్క గడియ ఐనా, యింతది వుంటే!

'నాయనా,'

ఎవరీ చల్లని తల్లి?

సీతమ్మ చెప్పింది. సుదక్షిణాదేవిట! అబ్బ! మనుష్యేశ్వరధర్మ పత్ని ఈ యిల్లాలు.

సార్వభౌముడికి భార్య అయికూడా, ఆవును కాచిన యిల్లాలు, రఘు మహారాజు అంతవాడికి కన్నతల్లి: గోపూజా తత్పరత్వంలో పండిపోయిన మహారాణి—

ఆమ్మా!

చిలిపినవ్వులు వినిపించినయ్: గుర్రం మెడలో మువ్వల మోతలాగు! ఊర్వశి నవ్వుతోంది!

అందానికి మారుపేరు ఊర్వశి! ఊర్వశిని గురించి తెలియాలి అంటే, రవీంద్రనాథ టాగూర్ ఊర్వశి చదవాలి! బెంగాలీ భాష నాకు రాదు గనుక, వేలూరి శివరామశాస్త్రిగారు, నాకు రవీంద్రుడి ఊర్వశిని చదివి చెప్పారు చోడవరంలో వారి తోటలో!

ఊర్వశి నవ్వితే, మానవ మాత్రుడు, ఆగలేడు!

నిజమేగాని, ఊర్వశిముందు, మహాకవి కాళిదాసూ చలించాడా?

"నిజం, ఆ మహాకవి చలించారు!"

అయి వుంటుంది! రచన గూడా అలాగే వుంది!

'తెలుసుకున్నావా?'

కొత్త గొంతుక!

ఆజానూజ్వల బాహువు, సాలప్రాంశువు, బ్రహ్మవర్చస్వి, కుంకుమాంకిత లలాటుడు, ఎవరో మహాపురుషుడు!

అప్రయత్నంగా హృదయం ప్రణమిల్లించి!

ఆయన కాళిదాసు!

నిజంగానా?

ముప్పై సంవత్సరాల తపస్సు ఫలించింది!

చిన్నతనంలో, చిలిపితనంలో, ఆటపాటల్లో, యవ్వనంలో, పొగరు మోతుతనంలో, మూర్ఖత్వం వేళల్లో, ఆమోద ప్రమోదాలలో, రహస్యమా వేశాలలో, మరి ఎవ్వరికీ తెలియగూడని సందర్భాలలో—ఒకటేమిటి - నన్ను వెన్నంటి వుండి నన్ను నా పశుత్వాన్ని సహించి, నన్ను మృగాన్ని మనిషినిగా చేసిన మహాపురుషుడా, మహాకవి కాళిదాసా? మహాకవి, కనకదుర్గగుడి కొండలాగు చలించడు. మహాగంభీరుడు!

కాక, ఆయన దర్శనం నాకు కొత్తగాని, ఆయనకో ....

నాలాంటి భక్తులు ఎంతమందో! లక్షలమీద కోట్లమీద వుండి వుంటారు!

కాళిదాస మహాకవి లలాటాన కుంకుమాగ్ని మెరిసింది!

నాతోపాటు మాళవికా, శకుంతలా, వూర్వశీ ఆయనకు నమస్కరించారు.

'చెప్పవేం!'

'ఏమిటి?'

'నేను చలించానంటున్నావుగా!'

చెప్పేందుకేముంది? మా విక్రమోర్వశీయం అపూర్వ సృష్టి! ఋగ్వేదం దశమ మండలంలోని, ఊర్వశీ సూక్తంలో —

హయే జాయే మనసా తిష్ఠఘోరే
వచాం సి మిశ్రా కృణవావహై నా!
ననే మంత్రా అనుదితాస్స ఏతే
మయస్కరనే పరత రేచ నాహాన్

అని పురూరవుడు అంటే—

కిమేతా వాచా కృణవాత స్తవా హం
ప్రాక్రమిషముష సామగ్రి యేవ!
పురూరవః పునరస్తం ఏకేహి
దురాపనావాత ఇవాహా మస్మి!

అని అంటుందే మరి.

ఆ నిర్లక్ష్యం, కాళిదాసు రచనలో వుంటుందా మరి!

అలాగే,

"గోషాః శతసా నరంహాః
అవీరేవ్రతా విదవిద్యుతంనో
రానమా యశ్చితయం తధునయః॥ అన్న వైదిక పురూరవుడేనా, కాళిదాసు పురూరవశ్చక్రవర్తి! ఎంత తేడా వుంది!!

నా వూహలో, కాళిదాస మహాకవే పురూరవుడైనాడా విక్రమోర్వశీయంలో అనిపిస్తుంది!

"ఇదో భ్రమ కాబోలు" అన్నారు మహాకవి!

"నిజమే! తప్పుదిద్దుకుంటున్నాను! కవిని, యోగిని ఈశ్వర శబ్దంతో కలిపి చెప్తారు! కవీశ్వరుడు, యోగీశ్వరుడు అని! సర్వం తాను అయిగూడా, ఈశ్వరుడు తదతీతుడు ఎట్లా అవుతాడో.

తిక్కన,

త్రిభువన భుకద్భృఢ పంజర
విభవమవేతు నమే సమస్త విష్టప నిర్మో
క భుజంగపతికి, నిఖిల జగ
ద ధిన్నరూపునకు భావనాతీ తునకున్

అన్నట్లుగా, అట్లాగే కవీశ్వరుడుగూడా అవుతాడు! కావ్యగత సర్వమూ వాడే! సర్వ పాత్రలూ కవే! పైగా కవి తదతీతుడు గూడాను! మహాకవీ— దయవుంచి— చెప్పండి!

కాళిదాసు నొసలు లేచినయ్!

"మీ నాటకాలలో నాయకుల్ని మూడు విధాలుగా చిత్రించారు! నాయికల్ని మూడు విధాలుగా చిత్రించారు!"

కవిగారి కుంకుమబొట్టు మెరిసింది!

"పూర్తిగా నా వూహను విన్నవించుకుంటున్నాను! అగ్నిమిత్రుడు గంధీరుడే కాని, పురూరవుడికి తమ్ముడు! ఆ పురూరవుడూ తీరా వచ్చి పిచ్చివాడైనాడు! కాని,

తాను, తన తప్పువల్ల తల్లడిల్లి వున్నా, ఎంతగా విరహ వ్యధలో గిజగిజలాడుతూన్నా,

యేన యేన వియుజ్యంతే
ప్రజాః స్నిగ్ధేన బంధునా!
సస పాపాద్భృతే తాసాం
దుష్యంత ఇతి ఘుష్యతాం!"

అన్న దుష్యంతుని ముందు, మిగిలినవారు తగ్గిపోతారు. అలాగే, రఘువంశంలో—అర్ధరాత్రి, తనగదిలోవున్న స్త్రీతో—

కా త్వం భద్రే, కస్య పరిగ్రహో వా
కింవా మదభ్యాగమకారణం తే!
ఆచక్ష్య మత్వా వశినాం రఘూణాం
మనం పరస్త్రీ విముఖప్రవృత్తిః!

అని ధీమాగా చెప్పగలిగిన కుశమహారాజుకూ....

భవతునామ, అనిర్వర్ణనీయం పరకళత్రం! అన్నది మీ తత్వం లాగుంది!

శకుంతలను వెంటబెట్టుకొని వచ్చిన శార్ఙ్గరవుడు,

"యదిపూర్వవృత్త మన్యాసంగాత్ విస్మృతో భవాన్ తత్కథ మధర్మభీరుః"

నిలదేస్తూంటే,

భవంత మేవాత్ర గురులాఘవం పృచ్ఛామి।
మూఢస్యామహ మేషావా వదేత్ మిథ్యేతి సంశయే
దారత్యాగీ భవామ్యాహో, పరస్త్రీ స్పర్శపాంసులః

అనీ అన్నాడు దుష్యంతుడు.

ఈ శక్తి మీ దుష్యంతుడికే చెల్లింది!

మహాకవి తలకాస్త కదిలింది!

అగ్నిమిత్రుడూ, పురూరవుడూ, దుష్యంతుడూ ముగ్గురూ స్త్రీలకు వశ్యులేకాని—

మాళవిక నవ్వు అణచుకుంది.

ఊర్వశి గమత్తుగా చూచింది. ఎలాగైనా జగత్తును చూచినది ఆవిడ!

శకుంతల మారీచాశ్రమంలో ఉన్నట్లుగానే వుంది !

క్షమించాలి మహాకవీ! పురుషవర్ణనలో మీ వర్ణనలు నిస్తులాలు.

అంత రతీదేవి విలాపమూ అజవిలాపంయుంచు తీసికట్టుగానే—

కాళిదాసు కంఠం చిత్రంగా సకలించింది. ఏం అంటారో ఏమో! ఆయన ఏమీ అనలేదు.

"రతీవిలాపం కాస్త అతి ఆయిందనిపించింది."

"స్త్రీ విలపిస్తోందిగదూ!"

అదా రసరహస్యం! నిజమే!

దయితా స్వనవస్థితా రతిః
నఖలుప్రేమ్ణ చలం సుహృజ్జనే!"

ఎంతగొప్ప సత్యం!

"అహమేత్య పతంగవర్త్మ నా పునరంకాశ్రయిణీ భవామి తే!"

ఇక్కడ పతంగ, శబ్దానికీ సూర్యుడు అనిగూడానా....మహాకవి నా కేసిచూచారు!

ద్వావిమౌ పురుషౌలోకే సూర్యమండలభేదినౌ
పరివ్రాట్ యోగయుక్తశ్చ రణేచాభిముఖోహతః!"

అన్న వ్యాసవాక్యానికి విరుద్ధం. మీరు వాల్మీకికే శిష్యులు కారు. వ్యాసుడికీ శిష్యులే!

సుదక్షిణాదేవి, "పపౌ నిమేషాలస పక్ష్మదృష్టిరుపోషితాభ్యా మివలో చనాభ్యాం"అన్నది మీరు, వ్యాసులవారి దగ్గర్నుంచి తీసుకున్నారా .... లేక మా గుడిపాటి వెంకటచలంలాగా, సహజంగానే రచించారా....!"

కాళిదాసు గంభీరంగా చూచారు! ఆ త్రికాలవేత్తకు మా వెంకటచలం కనబడివుంటాడు!

"రణం హృదయక్షేత్రంలోగూడా జరగవచ్చుగదా" అంది పూర్వశి! అప్పుడు వ్యాసవాక్యానికి సరిపోతుందే!

కాళిదాసు కన్నులలో మందహాసం కనిపించింది. ఆ నవ్వు ఆయన బడిగడ్డంలోంచి మధురంగా కనబడుతోంది!

"ఇంకా...." అన్నారాయన.

"మార్గం మనుష్యే శ్వరధర్మపత్నీ
శ్రుతేరివార్థం స్మృతిరన్వగచ్ఛత్!"

అన్నారే ఎంతగొప్పమాట!

"ఎన్నడు బెండుపర్చ్-దవదుమీకు!"ఐనా, మాళవిక తనలో తను—

"హృదయః సుఖితతయా, అలం ఉపస్థితోయం
విభవఇతి కథమాత్మానం మోచయితుం అధవా
ఇదానీం ఏతదేవ మే మృత్యుమండనం భవిష్యతి" అని

అనుకున్న మాటలు చురుక్-మనిపించేవే!

అలాగే, ఊర్వశికూడా చెలికత్తె చిత్రలేఖతో

"నతావదుపసర్పిష్యే, తిరస్క-రిణీ ప్రతిభన్నా
పార్శ్వవర్తినీమాత్మా శ్రోష్యేతావత్
పార్శ్వవర్తినా వయస్యేన సహ
విజనే కింమన్త్రియన్ తిష్ఠతీతి"

అన్నవి బాగానేవున్నయ్ గాని, మీరు, మీ హుందాతనానికి తగ్గట్టు కనబడదు. శకుంతలో....మీ శకుంతలకుసాటి మీ శకుంతలే—రచనగూడా,

ఇటికమీద ఇటికపేర్చి ఇల్లుకట్టినట్లుగా కట్టారు. మీ పరిణతికి అది అద్దం! ఎలాగైనా మీ చివరి రచన గదా....!

"ఈ మాట ఎవరు చెప్పారు?"

"నేనే వూహించుకున్నాను. రఘువంశం మీ చివరి రచన అనీ, ఆ రచనలో మీకు రుషిత్వం సిద్ధించిందంటారు. శాకుంతల రచనలో తపురు రుషి అయినారు అనీ, అదే మీ చివరిరచన అనీ భావిస్తున్నాను!

"కారణం?"

"ఏ రచయిత అయినా ప్రారంభదశలో ఎంతో వూహించా ననుకుని, అదంతా రచనలోకి రావాలని ఎంతో చెప్తాడు. మాటలు వస్తూన్న పిల్ల వాడు గబగబా మాట్లాడేసినట్లు — పరిణతి కలిగిననాడు అతడే, బహు క్లుప్తంగా మాట్లాడుతాడు. రుషి అయినవాడు, రుషిత్వాన్ని అందుకొనే వాడూ, ఛాంకోగ్యంలోని 'సద్విద్య' అనుభవించివుండి—మాట, అంపే తన లోని తేజస్సును బహుభద్రంగా కాపాడుకుంటాడు.

రుతుసంహారంలో రుతువును గురించి ఒక సర్గదాకా విస్తరించే మీ పూనిక, శాకుంతలం దగ్గిరికి వచ్చేసరికి—

"దివసాః పరిణామరమణీయాః" అన్న కాస్తముక్క-లో ఇమిడింది.

రఘువంశంలో అజమహారాజును వర్ణించే వైతాళిక గానంవుంది. నాలుగైదు శ్లోకాలు, విడివిడిగా సవివరంగా వర్ణించారు. శాకుంతలంలోనో.

యాత్యేకతో Zస్తశిఖరంపతిరోషధీనాం
ఆవిష్కృతారుణ పురస్సర ఏకతోఽర్కః।
తేజోద్వయస్య యుగపద్వ్యస నోదయాభ్యా
లోకోనియమ్యత ఇవాత్మదశాంతరేషు!

అన్న ఒక్క శ్లోకంతో చాలింది. మహాకవీ, ఎంకిపాటలు రచించి, అనితరసాధ్యంగా వాటిని పాడిన మానండూరి సుబ్బారావుగారు, ఈ శ్లోకాన్ని నేను తెనిగించి చెప్తూంటే, ఎంతగా ఆనందించారో—నేను వివరించలేను.

ప్రపంచాన్ని ప్రపంచాన్నే ఇమిడ్చాడు కాళిదాసు అన్నారాయన!

మనలోమాట,

మీ భరతవాక్యాలుచూస్తే చాలదా....?

మాళవికలో—

ఆజ్ఞాస్యమీతి విగమప్రభృతి ప్రజానాం
సంపత్స్యతే నఖలుగోప్తరినాగ్నిమిత్రే

అన్నది సాధారణమైనమాట! నేనైనా వ్రాయగలను.

విక్రమోర్వశీయంలో—

"సర్వస్తరతుదుర్గాణి,
సర్వో భద్రాణి పశ్యతు।
సర్వోసుఖ మవాప్నోతు
సర్వస్సర్వత్ర నందతు"

అన్నదీ ఎవరైనా వ్రాయవచ్చు. అదేం లోకోత్తరం కాదు! కాని, శాకుంతలంలో—

"మమాపిచ క్షపయతు నీలలోహితః
పునర్భవం పరిగత శక్తి రాత్మభూ!"

అన్నదో—అమ్మో. మహాకవి తిక్కన్న రచించాడు మళ్ళీ అట్లా.

"ఉపలాలితుండగు డింభకుండు తనకొలంది యెఱుంగక మహాపదార్థంబు వేడు విధంబున బ్రహ్మానంద స్థితింగోరి సర్వాంగాలింగిత మహీతలం

బగు" నమస్కారం చేశాట్ట! అంత మహాభారతాన్ని పూర్తిచేసి — శూన్య ప్రాయం అయిన సత్వంతో—

"హరిహరనాథ సర్వభువనార్చిత నన్దయచూడు మెప్పుడున్ —"

అని నమస్కరించి ఊరుకున్నాడు ఛాందోగ్యంలో —

"లిందుమాZభిగాం। లిందుమాZభిగాం" అన్న రుషివాక్కు మీ వాక్కు, తిక్కనవాక్కు సమానాలు. మీ శాకుంతల భరతవాక్యానికి సాటి అదే!

"నిజం"

నా వూహనిజమే? నిజమే!

కనకదుర్గగుడికొండ ఎక్కినట్లయింది!

"ప్రభూ! ఈ మాటగూడా చెప్పండి! మీ రచనలలో తపస్సు ముఖ్యం! పార్వతివంటి లోకోత్తరనాయిక, జగజ్జనని—

"నినిందరూపం హృదయేన పార్వతీ"

తనరూపాన్ని తాను నిందించుకుంది!

"అరూపహార్యం మదనస్యనిగ్రహాత్
పినాకపాణిం పతిమాప్తు మిచ్ఛతి!"

తెలుసుకుని తపస్సు చేసింది. పంచాగ్నిమధ్యన తపస్సు చేస్తేనేగాని శివుడు దిగిరాలేదు! వచ్చి ఓ ఆట ఆడించిగాని,

"అద్యప్రభృ త్యవనతాంగి।
తవాస్మిదాసః క్రీతస్తపోభిః!"

అని చెప్పలేదూ! అలాగే మీ నాయికలూ తపస్సు ప్రాధాన్యం గుర్తించి 'తపస్తప్త్వా' సుఖపడ్డారు.

"నిజమేగాని, మహానుభావా! మీ నాయికలలో ఎవరు మీకు ఆదర్శ నాయికలుగా కనిపిస్తారు ?"

"అంటే?"

"మీకు పరిపూర్ణంగా నచ్చిన మీ నాయికలు"

"అందరూ!"

"అదేంమాట?"

నోరుజారింది. గురువును ప్రసన్నం చేసుకోబోయి, గురువుతో గ్రుద్దులాటకు దిగుతున్నానా....? తప్పుతప్పు.

"తప్పు అన్నావు— నీ వూహ పూర్తిగా చెప్పు"

"చెప్పలేను. నా తప్పు నాకు తెలుస్తోంది. ఇలాంటప్పుడు మనస్సు కుంగుతుందిగాని, పొంగదు. భావజ్ఞి మన అమ్మవారు. జగజ్జనని. ఆమె అనుగ్రహం సంపూర్ణంగా ఉన్నవారు, భావజ్ఞులు మీరు. మీరుచెప్తే వింటాను.

"సరే—ఈ చెప్పబోయేవి నీ వూహలు :

రూపసంపద గొప్పదే. కాని అదొక్కటే ప్రణయ క్రతువుకు కాంతిని కలిగించదు. ఆకర్షణ వుంటుంది అంతే.

మాళవిక రూపంచూచి అగ్నిమిత్రుడు ఆకర్షింపబడ్డాడు. లోక సామాన్యం.

ఊర్వశి శరీరశోభ — ఆభరణానికి ఆభరణం, ప్రసాధనవిధికి ప్రసాధనవిధి, ఉపమానానికి ప్రత్యుపమానం. మాటల గడుసుదనం తప్ప మరేముంది? శకుంతలకో, అన్ని మెట్లూ దాటింది.

అనాఘ్రాత. పుష్పం
కిసలయమలూనం కరరుహైఃి
అనావిద్ధంరత్నం, మధునవ మనాస్వాదిత రసం—

ఇవీ బజారుమాటలే. గుంభనగా వున్నయ్.

"అఖండం పుణ్యానాంఫలం" అన్నదో.... మెట్టెక్కారు! మా నాయని సుబ్బారావుగారు—

మత్పురానేక పూర్వపుణ్యములు పండి
జాహ్నవీస్వచ్ఛవును సుధాస్వాదుమధువు
నైన నీదివ్యసాన్నిధ్య మందుకొంటి

పుడమికిన్ స్వర్గమున కొక్కముడి రచించి' అన్నదానిముందు, మా కృష్ణశాస్త్రి—

ఓరగా ఓరగా ఒరుగునింద్రుని శిరసు
విడిపోయి దిగిపోయి పడెనేమొ నామ్రాల!
వైకుంఠ మృదుకంఠ వైజయంతీమాల

అన్నదానికీ, మీ రచన సాటి!

అయినా మీకు రూపసంపద విలువ తెలుసుగనుక, శకుంతలచేత మారీచాశ్రమంలో తపస్సు చేయించిమరీ ఆమెకు ప్రశాంతిని కలిపించారు. మీ రచనల్లో కామదహనమూ దుర్వాసశాపమూ మీ రుషత్వానికి చెందినవి.

"ఇక మా మాటలు విను!"

మహాకవి నా సందేహాలు తీరుస్తున్నారు!

ఊర్వశిని సృష్టించేనాటికే — యోగంమీదకి వ్రాలింది మా దృష్టి. సగం వెన్నెలలాగా, ఉన్నసాధన ప్రారంభదశలోది. నీవు తృప్తిపడలేని మా రచన – విక్రమోర్వశీయం.

సాధన బాగాపెరిగి, లోకవాసనలు దిగజారిపోతున్న దశలో రచించింది శాకుంతలం! మాకు తెలుసు – నీవుగూడా శకుంతలతోపాటు వీడవడము, గుండె బండరాయి చేసుకొని, మారీచాశ్రమంలో తిరుగాడడం నీవు గుర్తించింది నిజమే–

శాకుంతలం పూర్తిచేసేప్పుడు, భరతవాక్యం రచించేప్పుడు

"శ్యామాచ్ఛబలం ప్రపద్యే
శబలాచ్ఛ్యామం ప్రపద్యే
అశ్వఇవ రోమాణి విధూయపాపం,
చంద్ర ఇవరాహోర్ముఖాత్ ప్రముచ్య
ధూత్వా శరీరమకృతం కృతాత్మా
బ్రహ్మలోక మభిసంభవామీత్యభి సంభవామితి"

గానేవుంది మనస్థితి. మరోసంగతి— "పూర్వశి అంత పక్వరచన గనుకనే, తిరిగి వ్రాసుకోవలసి వచ్చింది—అన్నీ కలిసి వచ్చాయి, జన్మించాము! శాకుంతలకు ఆ ఇదిలేదే, పరిపూర్ణమైన సృష్టి!"

"అవును. అవును. మీరు శ్రీ అరవిందులై జన్మించారనీ, పూర్వశిని తిరిగి వ్రాశారనీ, తిరువన్నామలైలో జ్ఞానులు చెప్పారు! ఆఁహా!"

మహాకవి నాకేసే చూస్తున్నారు!

ఒక్క-ప్రశ్న: మీరే నాయకుడు అనుకోండి! మీరు, మీ సహచరిగా మీరు ఎన్నుకునేది, మాళవికనా, పూర్వశినా, శకుంతలనా....?

"ఎవర్నీకాదు. వారు మా బిడ్డలు!"

"ఒకవేళ"

"ఆ ప్రశ్నేరాదు"

"మానవమాత్రులం. మా వెర్రి సరదాలను మన్నించండి. మాకోసం ....ఒకవేళ...."

"శకుంతలనే.... ఆమె అఖండం పుణ్యానాంఫలం..." అంటామని వుంది నీకు కాదూ!....

"అవును. శృంగారపరంగా చూచినా.... చలాపాంగదృష్టి, ఉన్నమి తై కభ్రూలత, మొదలయినవి మీ మాళవికకేవీ? ఊర్వశికేవీ".... కనకనే, చివరికి,

"సుతను హృదయాత్ ప్రత్యాదేశవ్యళీకముపై తుతే" అని దుష్యం తుడు ఆమెను ఓదారుస్తూంటే – ప్రాణాలు లేచివచ్చినట్లుగా వుంటుంది. మహాత్మా! లోకోత్తరమైన సృష్టిచేశారు!

రుగ్వేదంలోని ఊర్వశికి నాజూకుతనం నేర్పారు.

రాజకుమారి మాళవికకు, మనోనిదాఘ మాధుర్యం కల్పించారు.

మీ గొప్పతనం మరీ ఎక్కడంటే,

మీరు త్రిలోకమాత, శ్రీచక్రేశ్వరికి భక్తులు.

"తల్లీ" అని పిలుచుకున్న ముద్దుబిడ్డలు.

అయిగూడా, పార్వతీదేవి-క్రీడను వర్ణించారు!

ఆ దంపతులు- క్రీడిస్తేగాని జగద్వ్యాపారం జరగదు!

పై గా మన అమ్మవారు,

"హరనేత్రాగ్ని సందగ్ధకామసంజీవనోషధిః!"

ఆ ఒక్క నామంలోంచి కుమారసంభవ మహాకావ్యాన్ని ఓడ్చుకున్నారు!

పార్వతీదేవి అంతస్త్రీని శకుంతలను సృష్టించారు. వ్యాసులవారి శకుంతలకు ఎంతెంత మెరుగులు దిద్దారు! ఆ చల్లనితల్లి బిడ్డడిపేరనే, ఈ భరత ఖండం ప్రతిష్ఠావాచకం అయింది! ఏమండీ—

"వల్మీకాగ్ర నిమగ్నమూర్తిరురసా సందష్ట సర్పత్వచా కంఠే
జీర్ణ లతాప్రతాన వలయే నాత్యర్థ సంపీడితః!"

ఇలాంటివి ఎట్లా వూహించారంటీ! మీ తపోబలంతో ఏ యుగాలలోని మహర్షులను సందర్శించి వ్రాశారోగానీ, "ప్రాణానామనిలేనవృత్తి రుచితా...." ఇత్యాదులు మాలో గొప్పకవులు వ్రాశారు! మీ తరువాత భవభూతి గూడా అట్లాగే,

ప్రియప్రాయావృత్తిః....

రచించాడు!

మీ తపశ్శక్తికి మీ పుష్పితవాక్కు ఫలితం! ఇది లోకానికి పండగ. రఘుకుమార మేఘదూతలను, శాకుంతలాన్ని మీ పేరు చెప్పుకుంటూ చదువుకుంటున్నాము.

"కావ్యాలలో నీవు....?"

శ్రీ రవీంద్రనాథటాగూర్‌కు మేఘదూత ఇష్టం.

శ్రీ రుక్మిణీనాథశాస్త్రికి కుమారసంభవం ఇష్టం.

అభిరుచిలో భేదం. అంతే.

మహాత్మా, మనసా వాచా, కర్మణా నమస్కరిస్తున్నాను. ముప్పై సంవత్సరాల కల, మిమ్మల్ని చూడాలనుకున్న కల నిక్కాల అయింది! సాష్టాంగపడ్డాను!

లేచిచూద్దునుగదా—ఎవరూలేరు!

మచిలీపట్నం.

మా ఇల్లు—

మాఇంట్లో తిరుగుతూన్న ఆవు !

ఆవు అంబా అని అరిచింది. ఉలిక్కిపడి లేచాను!

వికసించడానికిగాను, మందారపుష్పం.

వేసారుతోంది!

ప్రభావతి

(పింగళి సూరన్న ప్రభావతీ ప్రద్యుమ్నం ఆధారంగా ఏకపాత్రం.)

(ఉద్యాన వనం, ఉదయ వేళ సూచించే ధ్వనులు....)

"నిజంగా, జగదంబ, పార్వతీదేవి, కలలో కనబడ్డదా, ఎంత అదృష్టం:" అంది రాగవల్లరి: అణచుకొంటున్న ఉత్సాహంతో. 'ఎప్పుడూ' అంది మళ్ళీ.

"తెల్ల వారుఝామునా?" అడిగింది కొసరుతూ.

"తెల్ల వారుతుంటేనోయ్" అన్నాను. ఉత్సాహం, ఉద్రేకం, ఏదో తెలిసీ తెలియని 'ఇది' నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తూంది.

నేనుట, పూజచేస్తున్నానుట. పూజముగిసెను, మంగళ హారతి యిచ్చాను. హారతిపళ్ళెం పూజాపీఠం మీద వుంచి, మంగళహారతిని కన్నులకు అద్దుకుంటున్నానోయ్. హారతి దీపజ్వాల, ఘనీభవించి, మనుష్యా

కారం తాల్చినట్లు అయింది. ఎర్రని పాదాలు, ఎర్రని చీర, ఎర్రని పూల మాలలు, ఎర్రని కిరీటం — సర్వాభరణ, సర్వమంగళాదేవి ప్రత్యక్షం అయింది. ఆ చల్లని తల్లిని చూచి వీవేవో స్తోత్రాలు చదివాను. ఆమె, ఆ జగదంబ, 'ప్రభ!' అంది—తలెత్తాను. ఆమె కన్నులు నవ్వుతున్నాయి. పరమేశ్వరి ఒక చేత్తో నా తల నిమురుతూంది. 'నీకు నిరుపమానసామిని భర్తగా సంఘటన చేస్తున్నాను' అంది. ఆశ్చర్య పోతున్నాను. "అంతటి భర్త, ఆ త్రిలోక సుందరుడు భర్త కావడం నీ అదృష్టం. మీ యిద్దరి అనురాగమూ కలకాలం ప్రజలు చెప్పుకుంటారు. మీ బిడ్డ—మీ రాజ్యాన్ని ఏలుతాడు" అంది. చేతులు జోడించి నమస్కరించాను.

"నీ పతి ఎట్లావుంటాడో చూడాలనుందా?" — అన్నది జగదంబ! సంకల్ప మాత్రంతో ఒక చిత్తరువును సృష్టించారామె. 'చూసుకో'అన్నారు. మెఱుకువ వచ్చేసింది.

కాకులూ చిలకలూ కలిసి కూస్తున్నాయి. నెమళ్ళు భయంకరంగా కేకారాలు చేస్తున్నాయి. జగదంబకు నమస్కరించి కన్నులు తెరిచాను. ఎదురుగా చిత్రపటం, అతిలోక మోహనుడు, ఎవరో!

ఈయనేనా, కాబోయే భర్త? సిగ్గువేసింది, సిగ్గు సిగ్గుగానే, ఆ చిత్తరువును చూచాను. వొళ్ళు ఝల్లుమంది. పక్కకు తిరిగాను. అటూ యిటూ తిరిగాను. ఎటు తిరిగినా, ఆ చిత్తరువు నన్ను చూస్తున్నట్లే వుంది. నే నా చిత్తరువును చూడలేక పోతున్నాను. చిత్తరువు నన్ను చూస్తూనే ఉంది. గట్టిగా కళ్ళు మూసుకున్నాను. మూసుకున్నాను కన్నులు., మూసుకో గలనా హృదయం! మనస్సును మూసుకోగలనా? బయటి చిత్తరువు మనస్సంతా నిండింది! చిత్తరువును చూడలేక పోతున్నాను ఈ జగదేక సుందరుడు నన్ను చూసి నవ్వుతున్నాడా? ఉడికిస్తున్నాడా? చూడలేక గాసెన కప్పాను చిత్తరువుపై. అబ్బ! చెప్పలేను, చెప్పుకోకుండా ఆగలేను....

అంతా విని, రాగవల్లరి తీవ్రంగా చూస్తోంది, ఆలోచనగా. ఎదురుగా ఒక హంస వయ్యారంగా నడుస్తోంది. 'ఏదీ చిత్తరువు?' అంది రాగవల్లరి హఠాత్తుగా.

"ఏం?" అన్నాను. 'ఎవరన్నా చూస్తే ప్రమాదం. మీ తండ్రి వజ్రనాభుడు మహాకఠినుడు! అయినా కన్ను పోయేంత కాటుక పెట్టుకోవడం దేనికి?' అంది. గురివింద పొదలో దాచిన చిత్తరువును తెచ్చి చూపించాను. రాగవల్లరి నిదానించి చూచింది. చూచి, చూచి, చూచి 'నీ అదృష్టం'అంది.

నాన్న పేరు చెప్పి, భయపెట్టి, యింతలో అదృష్టం అంటుందేమిటి? యింతే, ఎవరైనా. వాళ్ళ ఆలోచనలే వాళ్ళవి కాని—

"ఒక చెఱుకు విల్లు, పూవుబాణంగూడా చిత్రిద్దాం....ఎవరు చూచినా ఏం అనుకోరు...."అంది రాగవల్లరి! ఎంతైనా, మంత్రి కుమార్తె మరి! సమయస్ఫూర్తి అట్లా ఉండాలి. చిత్రించాం. చిత్తరువుకు, జీవకళ సంపూర్ణంగా వచ్చింది కాని—

కాని, నిజంగా యిట్లాంటి వరుడు ఉంటాడా? ఉండి ఉండడు. నాన్నగారు ఎందరెందరి వరుల చిత్రపటాలో తెప్పించారు. ఈ నవమన్మథుడూ నిజంగానే ఉండి ఉంటే, యీయన చిత్రపటమూ తెప్పించేవాడే— వజ్రపురాధీశ్వరుడు కోరితే, ఏది జరగదు! నాన్నగారు, నాకోసం ఏం చెయ్యరు? వుత్తది ఇది. జగదంబ చేసిన పరీక్ష. నా మనస్సును మథించి, మథించి గాని—ఏమిటో, వేల్పులు పరీక్ష చేసి గాని, వరాలు యివ్వరంటారు. ఇది గూడా ఒక పరీక్షేమో—ఎందుకో ఈ పరీక్ష. ఏమిటో పరమేశ్వరి కృప!

అంతఃపురం, రాణీవాసం. రాణీవాసంలో వుండేవారికి బయటి ప్రపంచం సంగతులు ఏం తెలుస్తాయి? ఏమిటో సర్వ సౌఖ్యాలూ అపర్చినా, ఉన్నా, ఏదో తెలియని వెలితి వెంటాడుతూనే ఉంటుంది.

తెల్లవారుతూంది. నిమిషం నెలగా, సంవత్సరంగా గడుస్తూంది. కాస్తయినా తెరిపి కలుగుతుందేమో మనస్సుకు – అని కాసారం దగ్గిరికి వెళ్ళాను. రాగవల్లరి సాయంగా వెంట వచ్చింది.

కాసారం మామూలుగా, విచ్చిన పూలతో, తెరలెడి జలపూరాలతో వుంది. పచ్చని చెట్టు, వాటిని ఒరిసి వీచేగాలి, పర్ణాల గలగలలు బాగానే వున్నాయి. ఏం లాభం? నా మనస్సే బాగా లేనప్పుడు? మళ్ళీ మళ్ళీ చిత్తరువును చూస్తున్నాను. జగదంబ నిర్మించి యిచ్చిన ప్రసాదం అని హృద్య భావం. భర్తగారిదని ప్రేమ. చిత్తచోరుడు ఈయనేనా అని ఉత్కంఠ. అన్నీ కలిసి, నిలువు నిలువునా సిగ్గు, తహతహ-మళ్ళీ మళ్ళీ చూస్తున్నాను. కన్నులు మూసుకున్నాను. గుండెల్లో చెయ్యివేసి కలుస్తున్నట్లుంది. కన్నులు తెరచి చూచేసరికి -హంస. ఈ హంస ఎందుకు వచ్చింది యిక్కడికి?

ఏం ఎందుకు రాకూడదు? కాసారం దగ్గర హంసలుండక కాకులుంటాయా? ఈ హంసను ఎక్కడో చూచినట్లుంది! ఏమో, ఒకవేళ చూచినా, హంసల్ని గూడా వేర్వేరుగా గుర్తించగల నేర్పు ఉందా నాకు!

పండి, పచ్చనై ఉన్న చేలు అన్నీ ఒకటిగా ఉంటాయి నాకు. ఎవరి పొలం ఏదో, ఎట్లా తెలుస్తుంది? అని అడిగినందుకు, నాన్నగారుగూడా నవ్వారు.

అడ్డంగా, ఒయ్యారంగా, సుతారంగా- సొగసుగా నడుస్తోంది. ఈ హంసతో ఏమన్నా పొద్దుపోతుందేమో.

'హంస'ను పట్టుకుంటే....నాకు పొద్దుపోటానికి ఒకర్ని హింస పెట్టటమా? తప్పు. ఏ ప్రాణి స్నేచ్ఛ ఆ ప్రాణిది.

ముద్దులు కులుకుతూ దగ్గరగా వస్తోంది హంస. ఇదీ బాగానే ఉంది. రమ్మని చేయిచాచాను. 'దా, దా' అని పసిబిడ్డణ్ణి పిలిచినట్లు గోముగా పిలిచాను. హంస వచ్చింది.

ఓ! పిలిస్తేనేగాని పక్షిగూడా రాలేదు. వాటికీ అహంకారం, గౌరవం, తెలివితేటలు, ఇంగితజ్ఞానం ఉంటాయి కాబోలు.

హంస అదేపనిగా చిత్తరువుకేసి చూస్తోంది. ముద్దుగా హంస మెడ నిమిరాను, తెక్కలు దువ్వాను. పసిబిడ్డ. సమాధానం చెప్పలేదని తెలిసి గూడా ప్రశ్నలు అడిగినట్లు, 'ఏం అట్లా చూస్తున్నావు, నీకు ఈయన తెలుసా?'అన్నాను. నా మాటలు విని. నేనే నవ్వుకున్నాను.

"తెలుసు" అంది హంస.

అరె! హంస మాట్లాడుతోంది. పైగా, తనకు 'తెలుసుట'— ఆఁ, నేనే గెలిచాను అంది రాగవల్లరి.

'ఈ చిత్రపురుషుడు భూమ్మీద లేడు' అన్నాను నేను. 'ఉండి ఉంటాడు' అంది రాగవల్లరి.

"పందెం అంటే పందెం'—అనుకున్నాం. ఆ మాట అప్పగిస్తోంది రాగవల్లరి.

"హంసకు, వీమి తెలుసో.....? ఎవర్ని చూచి ఎవరనుకుంటోందో ?"

హంసకు నా మనోగతాభిప్రాయం తెలిసినట్లుంది. యింకా పరిశీలనగా చిత్తరువును చూచింది. "ఆవునవును" అంది. 'ఆఁహా, వారే సందేహం లేదు' అంది.

నా గుండెల్ని ఎవరో అదిమినట్లు అయింది—ఇదేమన్నా మాయ, ఎవరిదైనా పన్నాగమా? కల రావడం, కల కల్లకాక, నిజంకూడా అయ్యేట్టుండడం, హంసలు మాట్లాడడం.... యిదంతా ఏమిటోగా ఉంది. ఈ చిత్రగత పురుషుడెవరు ? ఈ హంస ఎవరు ? యిదంతా ఏమిటీ నాటకం ?

హంస అటూ ఇటూ చూచి తక్కటూ, తారుతూ, రెక్కలు విదల్చింది. ఆకాశాని కేసి చూస్తోంది. చేతికి చిక్కిన హంస కాస్తా ఎగిరిపోతుంది కాబోలు!

హంసను ఒడిసి పట్టుకున్నాను. అక్కున చేర్చుకున్నాను. ఎంత బావుంది!

ప్రాణులు, ప్రాణుల చెలిమిని కోరుతాయి! ఈ హంస మరీ చిత్రం.

'పిలిస్తేగాని రాదు. బతిమాలితేగాని— ఏమీ చెప్పదు కాబోలు' అనిపించింది.

హంసను బుజ్జగించాను. రాగవల్లరి అందుకొని—

"హంసా...." అంది.

"నేను హంసిని, నా పేరు శుచిముఖి" అంది హంసి. స్త్రీకి సహాయం స్త్రీవల్లనే కావాలి. 'హంసి' అని తెలియగానే ప్రాణం లేచి వచ్చినట్లు అయింది.

రాగవల్లరి కేసి చూచాను. రాగవల్లరి ఏ కళనున్నదో గాని, అందుకుని,

"హంసీ! మా మాట విను. మేమిద్దరం ప్రాణస్నేహితులం. యీ క్షణం నుంచీ, మనం ముగ్గురం ప్రాణస్నేహితులం.... నీకూ మాకూ తేడా లేదు" అంది. హంసి నమ్మినట్లు లేదు. నేను, శుచిముఖిని చేతుల్లోకి తీసుకుని— ఆ మాటలే సప్రమాణంగా చెప్పాను. శుచిముఖి మెత్తబడింది.

"ఈ పురుషుడిది ద్వారకానగరం" అంది. మా కన్నులకు ఎన్నడూ చూడని ద్వారకా పట్టణం తనంత తానుగా కనబడుతున్నట్లుంది. ద్వారకా నగరం, ద్వారకా నగరం....

"ద్వారకను శ్రీకృష్ణుడు పరిపాలిస్తారు. ఆయనకు పదహారువేల మంది భామినులు. వారిలో ఎనమండుగురు మహిషులు....ఆ అష్ట మహిషులలో రుక్మిణీదేవి, పట్టపురాణి. ఆమె కుమారుడు ఈ ప్రభువు!" అంది శుచిముఖి ఒక్కొక్క మాటగా.

"పేరు?" అంది రాగవల్లరి.

"ప్రద్యుమ్నుడు!" అంది శుచిముఖి.

కలలో జగదంబ ఈపేరు చెప్పినట్లుంది. అనుమానం ఏముంది? చెప్పింది.

పరమేశ్వరి మాట మరి.

పరమేశ్వరి మాట, పక్షి శిరోమణి, శుచిముఖి మాట - తెండూ ఒక్కటయ్యాయి.

శుచిముఖి మాటలమీద గురి కుదిరినమాట నిజం! ఇంతకూ ఈ శుచిముఖి ఎవరు? ఎందుకు యిక్కడికి వచ్చినట్లు?

హంసి కాలికి గండపెండేరం వుంది. రాగవల్లరి చూచింది. చదివింది. ఇది ఈ హంసి సరస్వతీ ప్రసన్నరాలు. కావచ్చు. దేవతలు, మా సంపదచూచి కన్నుకుట్టి, ఏమైనా పిచ్చి ప్రయత్నాలు చెయ్యటం లేదు గద!

ఏం చేస్తారు? ఏం చేసినా నెగ్గలేరు. నాన్నగారి తపః ప్రభావం అట్టిది. వజ్రపురంలో ప్రవేశించాలంటేనే, వజ్రనాభుని అనుమతి కావాలి. ఎవరికైనా సరే. ఈ హంసికైనా సరే. ఆ ధైర్యం ఉంది గనుకనే, ధైర్యంగా మాట్లాడుతున్నాను.

హంసిని నమ్మాను. యిందులో ఏమీ మోసం అంటూ లేదు. నాన్నగారు, ఎవర్నీ నమ్మరు. వాతే నమ్మి వజ్రపురంలోకి రావడానికి

అనుమతి నిచ్చారంటే—మనకు యింక నిర్భయం! హంసిని, నా నెచ్చెలిని, నా అంతఃపురంలోకి తీసుకుని వెళ్ళాను. నాతో సమానంగా మర్యాదలు జరిపించాను. అటూ యిటూ చూసి హంసనక్కున చేర్చుకొని, ముద్దుగా, గోముగా, ఆశగా, ప్రార్థనగా.

"నా కోర్కె చెల్లించవా?" అన్నాను.

శుచిముఖి తల ఎత్తి చూచింది. నా కన్నులే, నా మాటలను శుచి ముఖికి చెప్పేశాయి. నా గుండెలు కొట్టుకోటమే అంతా వాఖ్యానం చేసి మరీ చెప్పాయి.

'హంసి' తల ఊపింది. "నాకు తెలుసు" అంది.

"ఏం తెలుసో" మరి.

"ఏం తెలుసు?" అని అడిగాను.

"మీరామాట అంటారని తెలుసు. కాని?—" ఆగింది.

"ఏమిటి సందేహిస్తున్నావు?"— అనడిగాను.

"ప్రభావతీ, నేను నిన్నెరుగుదును. వజ్రపురానికి ఎప్పుడూ వస్తూ పోతూంటాను. నీ అందానికి ఆ ప్రద్యుమ్నుడే తగినవాడు అని నాకు తెలుసు. నీ సౌందర్యం, ఆ మన్మధమూర్తికి చెప్పానుగూడా"— అంది.

"ఊఁ"— అన్నాను.

"చెప్పాను. వివరించి, వర్ణించి చెప్పాను. కాని, ఆ గంభీరుడు నిబ్బరంగా విని ఊరుకున్నాడు గాని— ఏమీ మాట్లాడలేదు" అంది.

నా గుండెల్లో రాయి పడింది. నేను చిత్తరువు చూచి యింత అవు తున్నానే.... అక్కడ వారికి చీమ కుట్టినట్లయినా లేదా.... ఏమిటో.... యిదేం పరీక్షో. దెందుకు వచ్చిన పరీక్ష!

'హంసి' విన్నా నాకు మరో మార్గాంతరం కనబడలేదు.

"నా హృదయం వారికి ఎరిగించి, నాపై నెనరు పుట్టింపవా...." అని అడిగాను శుచిముఖిని. ఇంతలో, ఎక్కణ్ణుంచో కిలకిలలు.... తల ఎత్తి చూద్దునుగదా, చిలుక. 'దా' అని చిలుకను పిలిచాను. రాలేదు. రాదు కాబోలు. 'హంసి' చివ్వున ఎగిరి చిలుక దగ్గిర వాలింది. ఓరకంట కనిపెడుతూనే ఉన్నాను. చిలుక హంసికి ఏదో చెప్పింది. హంసి చిలుకను ఏదో అడిగింది. చిలుక రెక్కలలో జాబు. చిలుక హంసికి యిచ్చింది. లేదు, హంసి— ఆ జాబును పుచ్చుకుంది. నెమ్మదిగా ఆ జాబు నా చేతిలో పడింది. ప్రద్యుమ్నులు వ్రాసిన జాబు! శుచిముఖి ముందు హృదయం కంఠస్థానంలో అడ్డుపడి మాట్లాడలేక పోయారుట గాని, మన స్నంతా, మమత అంతా నామీద ఉన్నదట. ఎలాగైనా, నాకు వారిపై ప్రేమ కలిగించాలని వ్రాసి పంపిన దా జాబు.

మనం ప్రేమించిన కాంతుడు, మన ప్రేమ కోరడం ఎంత ఆదృష్టం! సంతోషం కొద్దీ చిలుకకు పండ్లు, ఫలాలు పెడదాం అనుకున్నాను. చిలుక రివ్వున ఎగిరి వెళ్ళిపోయింది. 'హంసిని' మళ్ళీ బతిమాలుకున్నాను. 'వాడు యిక్కడికి వచ్చేట్లు చేయలేవా?' అని.

శుచిముఖి ఓ మాట అంది. నీ తండ్రిగారికి నన్ను గురించి చెప్పి, నన్ను వారి సన్నిధికి వచ్చేట్లు చేస్తే.... అంది. ఇది నిజమే. మా తండ్రి గారి అనుజ్ఞ లేకపోతే, ఎవరూ మా నగరంలో అడుగు పెట్టలేరు మరి. ఏం చెబుతుందో శుచిముఖి, ఎట్లా పన్నుతుందో పన్నాగం. మర్నాడు మాటల సందర్భంలో నాన్నగారికి చెప్పాను. శుచిముఖి అనే హంసి కథ.

నాన్నగారూ వినోద పడ్డారు, చూడాలని!

రోజులు రెక్కలు కట్టుకొని, ఎగిరిపోతున్నాయి!

నాట్య విద్యా ప్రదర్శనం, రాణీ వాసం వారుగూడా రావాలని పిలుపు!

శుచిముఖి నా దగ్గిరికి వచ్చింది. నాట్య ప్రదర్శనానికి రావా? అంది. వచ్చి తీరాలంది. రహస్యంగా, గుసగుసగా, అంతరాత్మ ప్రబోధంలాగా, నీ కాంతుడు వచ్చాడు. అతనే నృత్యం చేసేది అంది. నిలువునా వణికాను. నీ వొస్తావని, మీ వారికి చెప్పానే, నామాట కల్ల చేస్తావా? చేయకూ? అంది. సరే నన్నాను.

నా అరికాళ్ళు తేలిపోతున్నాయి, నా మాటలు నాకే చిత్రంగా తోస్తున్నాయి. పరీక్షా సమయం దగ్గిరికి! వచ్చేసింది పరీక్ష. నన్ను నేను పదిల పరచుకో గలనా? శుచిముఖీ, నీవు నా దగ్గరే ఉంటావు గద అన్నాను. 'ఆఁ' అంది.

నృత్యం ప్రారంభం అయింది. ఎదుట మహారాజు, మహామంత్రులు. పరివారం, ఎందరెందరో ఉన్నా, నర్తకుని చూపులు వచ్చి వెచ్చగా నా చెంపలమీద తాకుతున్నాయి. ఆయన మాటలు వ్యక్తిగా వినబడుతున్నాయి. ఆయన భంగిమలు - లోకాన్ని జయించే మహావీరుడి విక్రమ నృత్యం లాగుంది గాని, సామాన్యుల నృత్య లీలగాలేదు: నృత్యం పూర్తి అయింది. మంగళ హారతి ఇస్తూ- "నేడే నా కోర్కెల పంట పండుతుంది" అన్నారు వారు.

శుచిముఖి చెప్పింది: యీ రాత్రే ప్రద్యుమ్నులు నన్ను అనుగ్రహిస్తారు. అని—

సూర్యుడు అస్తమించాడు. చుక్కలు పొడిచాయి. నా హృదయ స్పందన నాకే వినబడుతోంది. దీపాలు వెలిగాయి. చీకట్లు తొలిగాయి. నా

కన్నులలోని తళతళ నాకే కనబడుతోంది. మల్లెలు విచ్చాయి. జాజులు పరిమళిస్తున్నాయి. నాకేదో కొత్త కొత్త నెత్తావి లాగుంది. వారు రాలేదు.

పొద్దు పోతోంది. హృదయం గిజగిజలాడుతోంది. వారు రాలేదు.

దాసీ జనం సెలవు తీసుకొని వారి దారిన వారు వెళ్ళారు. వారు రాలేదు.

నన్ను నేను నిందించుకున్నాను.... వారు రాలేదు.

తలపైని తుమ్మెద తిడుతున్నట్లుంది. తుమ్మెద ఝంకృతితోనూ, అదలించాను.

చెవి మీది కెక్కింది. విదిలించాను.

వీర పురుషుడై నిలబడ్డారు: ఎవరో.... వారే! ప్రద్యుమ్నులే!

ఇందాకటినుంచీ ఇక్కడే ఉన్నారన్నమాట! ఇదేం పద్ధతి? చాటుగా, మాటుగా, నటుడుగా, తుమ్మెదగా.... వస్తారా.... ఎంత నేర్పరులైనా.... ఇదంతా నన్ను పరీక్షించడమా....? నా తల నాకు తెలియకుండానే వంగింది.

వారే ఏవో మాట్లాడారు, పలకరించారు. మన్మథుడికి- మాటలుగూడా అస్త్రాలే !

వారు నా చేతిని పరిగ్రహించారు !

రాగవల్లరీ, శుచిముఖీ, ఒక్కసారి, ఒక్క కంఠంగా, 'శుభమస్తు' అన్నారు.

నా హృదయం పెళ్ళి సంగీతం పాడింది!- గాంధర్వ వివాహం!

ఆకాశాన, చందమామ, ప్రసన్నంగా ఆశీర్వదించాడు: జగదంబ, పరమేశ్వరి మాట, యిల్లాగ నిజమైంది.

ఉ ప

నిజంగా, అంది చిత్రరేఖ సమాధానంగా. నా చెవులను నేను నమ్మ లేకపోతున్నాను. ఒకవేళ కొంపెతనానికి అన్నదేమో. తలెత్తి చూచాను. చిత్రరేఖ నొసల విభూతిరేఖ వెన్నెలలో కర్పూరరేఖ లాగా మెరుస్తోంది. ఆమె కన్నులు- పసిపాప కన్నులవలె నిసర్గ మధురాలు. ఆమె ముఖం- సరస్సులో సగం వికసిస్తూన్న పద్మం. నాలో నేను కిందా మీదా అవు తున్నాను. నిజంగానే నాతోపాటు చిత్రరేఖ వస్తుందా? పరవశం ఎక్కు-వయి, మనస్సు పసిపాపవలె అయింది. కొసుదురూ, మళ్ళీ అడిగాను.

చిత్రా, చిత్రా, రేపు నేను అత్తవారింటికి వెళితే- నువ్వు నిజంగా నాతోపాటు వస్తావా? అని.

చిత్రలేఖ నవ్వలేదు. "వస్తా నిజంగానే వస్తా...." అంది.

నాలో ఉడికి, ఉడికి, పెల్లుబికే ఉత్సాహాన్ని అదుపులోకి తెచ్చుకుంటున్నాను. ఎందుకో తెలీదు. సాయంత్రంనుంచీ— అత్తవారింటికి వెళుతున్నట్లయింది. చీరా సారే సర్దుకొని పరివారం వస్తూంటే పల్లకీలో కూర్చుని, ఉయ్యాలలాగా ఊగే మనసుతో, మగనితో అత్తవారింటికి వెళుతూన్నట్లు....

నాకే తెలుసు, నిష్కారణంగా వొచ్చిన ఆలోచన అని. అయినా నన్ను నేను అదుపులోకి తెచ్చుకోలేకపోతున్నాను.

వెర్రిదానా....

ఇంకెవరు, చిత్రలేఖే. మహారాజ పుత్రినని — అంచరూ, నా దగ్గర భయం భయంగా వుంటారు. చిత్రకే— చెల్లు, అట్లాగే స్వేచ్ఛగా వుండడం. ఆమె యోగిని."ఎందుకీ వెర్రి ఆలోచనలు?...."అంది మళ్ళీ. మనస్సు నొప్పి పడుతోంది. చిత్రలేఖ పూరికే మాట్లాడదు. మాట్లాడిందో అది జరిగి తీరుతుంది. చిత్ర యోగశక్తి అలాంటిది!

ఏమయిందో ఏమో....

"పెళ్ళికాలేదు, భర్త రాలేదు. ముద్దూ ముచ్చటల మాటలు ఆలోచిస్తావేం?...." అంది. మళ్ళీ, "జరుగుతై, అన్నీ జరుగుతై, ఉషా.... నీ అత్తారింటికి నేనూ వస్తాను. ఏం...." అంది.

నిశ్చలంగా నవ్వింది.

గొప్పవాడు నవ్వినా గొంతుకమీద కత్తే, ఏం అవుతుందో అని.

ఏం, అట్లా అన్నావు?.... అన్నాను. నామాట నాకే వెలితిగా ఉంది. చిత్రలేఖ నెమ్మదిగా లేచింది. యోగసాధనకు సమయం అవుతూంది కాబోలు అనుకున్నాను. చిత్రలేఖ నెమ్మదిగా, వెలుగుతార నడిచి వెళ్ళినట్లు వెళ్ళింది. ఈ ప్రశాంతమైన వేళ, యోగిని చిత్రలేఖ. యోగీశ్వరేశ్వరుడు

శివుడి సన్నిధిని సాధనచేస్తుంది. ఇంతకూ ఆమె మాత్రం ఏమన్నదీ.... పంచి మాటలే అన్నది: నా ఉలుకేగాని, ఆమెలో ఏమీలేదు.... ఎందుకో భయంభయంగా గుబులు గుబులుగా వుంటుందేం....

ఏమన్నా ప్రమాదం రాబోతోందా....? భ. ఆ మాటే తలపెట్ట గూడదు.

నరమానవులకు ప్రవేశం లేని ఈ శోణపురం.... సర్వశక్తి స్వరూపుడు, యోగీశ్వరేశ్వరుడు, శివుడు తానుగా ఉండి సంరక్షిస్తూన్నారు. వేల వేరుల బలంలో, బలగంతో నాన్న పరిపాలిస్తున్నారు. మనకేమిటి, ప్రమాద మేమిటి? నిర్భయం, నిశ్చింత.

ఓ.... భయంలేదు అనుకోగానే ఎంత బరువు తీరినట్లవుతుంది. శివా, సర్వజ్ఞ మూర్తీ.... నీ దయ.... నీ కృప.

వెన్నెల, గుడ్డి వెన్నెల, వెలుగు, సన్నని వెలుగు, మెత్తని సూర్య కాంతి, మబ్బులు, చల్లగాలి, తేటనీరు, సరస్సులు, సరస్సులలో ప్రతిఫలించే సంపూర్ణ చంద్రుడు, సర్వశక్తి సమన్వితుడైన తండ్రి, ఈ శోణపురం— ఈ నా జీవితానికి ఎన్ని ప్రసాదించావు తండ్రీ.... నీ దయ. మబ్బులు— చల్లగాలి— జాజి పూలు....

ఏమిటా అడుగుల చప్పుడు. గుసగుసలాంటి సవ్వడి. మల్లెపొదలో, విప్పారిన పుష్పమూ పచ్చని వర్ణములూ గుసగుసలాడినట్లు— సన్నగా వీణమీటినట్లు — ఎవరో.... ఎవరో వస్తున్నట్లుంది.

ఎట్లా వస్తారు? శోణపురంలోకి నరమానవుడు రావడమే.... వస్తున్నాడే! కిరీటధారి, కుండలాలంకృతుడు. ఆఁ! చెంపకు చాచెడేసి కళ్ళు. సాలప్రాంశువు, నెమ్మదిగా, పరిశీలనగా, రాగభావంలాగా వస్తున్నాడు.

వినీలదేహుడు, పీతాంబరుడు, ఎవరీతను! మనవాళ్ళు చెప్పుకొనే మన్మథుడా? మన్మథుడు కాదు. శివుడంటే— మన్మథుడికి భయం. ఇక్కడికి రాడు.

వచ్చేశారు....

రాజపుత్రీ....

—వీణ మీటినట్లుంది. వీణ ఎక్కడుంటే ఇక్కడ, నా హృదయమే వీణ పలుకుతోంది.

రా, ఉషా రాకుమారీ....

ఏం గాంభీర్యం ఆ కంఠంలో! దుర్గమమైన ప్రదేశంలోకి వచ్చినా. దుందుడుకుతనమైనా, సహజ గాంభీర్యం ఎక్కడికి పోతుందీ ?

—తలయెత్తి చూచాను. నిదానంగా చూచాను. మహా పురుషుడు! సందేహంలేదు.

ఎవరు మీరు ?....

—ఇదేం పిచ్చిప్రశ్న. ఎవరై తేనేం. కన్యకాంతఃపురంలోకి, రాగూడనివారు, రారాని వేళ, ఎందుకు వచ్చారని అడగబోయి, వెర్రిదాన్ని— ఎవరుమీరు? అని అడిగానేమిటి? అందుకే చిత్రలేఖ, వెర్రిదానా అంది.

నల్లకలువలలాంటి కళ్ళలో కల్లా? కలా? అన్నట్లు చూస్తావేం ? అమృతమయమైన ఆ నీ ముఖబింబానికి అరుణిమను కల్పిస్తావేం. దానిమ్మ గింజలవంటి నీ పలువరుస, పట్టుదల పలుకుతున్నట్లుందేం—? నా శిరస్సు సిగ్గుతో వంగింది. ఎవరో ఎరగనివారు, వినరైనా వినని వారు, ఏకాంత గృహంలోకి వచ్చి— నీ వొళ్ళు, నీ కళ్ళు, నీ పళ్ళు అంటూ వర్ణిస్తూంటే. కాలసర్పంలాగు అయిపోయి, కాటువేసి చంపేయాలని వుంటుంది పని. ఎక్కడ్నించి వచ్చిందో సిగ్గు. తలవొంచుకున్నాను. ముందుకు వచ్చాడు.

ముద్దుగా, బాలా— బేలా.... అన్నారు. గులాబీపూల రెక్క-లవంటి నా చేతుల్ని తన చేతులలోకి తీసుకున్నారు. నా గుండెలు కొట్టుకుంటున్నాయి. నీకేం భయంలేదు. నేనున్నాను.... అన్నట్లు, నా రెండు చేతులనూ పరిగ్రహించారు. తన గుండెలకు అదుముకున్నారు. తన నుదుటికి, చంద్రవంక వంటి తన నుదుటికి అద్దుతున్నారు. నా చేతులు. బరువుగా నిట్టూర్చారు. ఆ ఊపిరి నా చెంపలకు వెచ్చగా తగులుతోంది. మనస్సు మణిగింది. బుద్ధి శోకోన్మీలనట్లు అయింది. హృదయం ఎగిరి గంతేసినట్లు అయింది. ఆ లాలన, ఆ ప్రేమ మాటలు, ముక్తసరి మాటలు, నేను నేను కాను.... ఇంతకూ ఎవరు ఈయన ?

ఎవరై తేనేం. దైవం నాకోసం యీ రూపంలో వచ్చారు. నాకు దైవమే ఈయన. నా జీవితమందార మృదు కుసుమమాలను, వారి కంఠానికి వైజయంతీమాలగా సమర్పించాను.

ఏమీ? ఏమీ? లేదే. ఎక్క-డికి వెళ్ళారు? ఎంత వెదికినా లేదు. కల చెరిగిపోయింది. తెలివి వచ్చింది. తెల్ల వారుతోంది. తెలతెలవారుతూంటే, ఆకాశాన ఉషా కన్యతోపాటు సూర్యుడూ పైకి వస్తూంటే— వాతాయనం దగ్గర మేముభయులమూ నిలబడి- ఈ ఉషా కన్యతోపాటు మీరు— ఆ సూర్యమూర్తులు, అందాం అనుకున్నాను. ఏరీ ? చీకటిరాసులనైనా చిర గ్గొట్టి ప్రకాశించే, ఆ ముద్దు ముఖబింబం ఏది? ఎక్క-డికి పోయింది? ఎక్క-ణ్ణించి వచ్చింది? ఎవరో, అడివినిపోయే పంచవన్నెల రామచిలుక, వచ్చి అరిచేతిమీద వాలింది. ఎగిరి వెళ్ళిపోయింది. సరస్సులో మెరిసే మత్స్య మూర్తి, వెన్నెల్లో వచ్చి— వెండివలె మెరిసి, బంగారంవలె ధగధగలాడి అపరంజి అందాలు చూపి అల్లా అల్లా మాయం అయ్యారు. ఏరీ? నా జీవిత పూజా పుష్పమాలను తన కంఠసీమను ధరించిన ఆ పుణ్యపురుషులు, ఏరీ ?

— మళ్ళీ చీకటి, మళ్ళీ—వెన్నెల, ఏమో రావచ్చు, రాకపోవచ్చు. కటిక చీకటి రాత్రులే సింహంలాగా గర్జించవచ్చు. ఏమో. ప్చ్ .... ఏమో. ఏమో....

— మామూలుగా వచ్చి పరిచర్యలు చేసే పరిజనం వచ్చారు. వెళ్ళారు. అబ్బ....ఎక్కడికి వెళ్ళితే కనబడతారు? ఎక్కడ వుంటారని వెదకడం. ఎవరో, ఎక్కడివారో తెలిస్తే గద ! ఏమయినా, నిద్రలాగా నీకసిస్తోంది ప్రాణి. కుళాధనం, సర్వస్వం కోలుపోయి, బిచ్చానికి బయల్దేరినట్టుందిగా ఉంది ఆత్మ. ఆబ్బ, గుండెలు పిండుకుని పోతున్నాయి. సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఉదయిస్తున్నాడేమిటి ? ఉదయించాడు. ఏమిటీ రాడు? యివాళ సూర్యుడు యిట్లా వున్నాడేం ఎందుకు రొదచేస్తున్నట్లుంది. ఏమిటో-మనస్సు పాడైతే-ప్రతిదీ మహా అసహ్యంగా వుంటుంది.

ఎవరది ? కాంతిధార.

ఎవరది ? ఎవరో .... వస్తున్నారా, నా దైవమూర్తి. కాదు, ఎవరో....

మళ్ళీ లడుగులు....ఎవరో.... చిత్రరేఖ.

ఇప్పుడా చెరిక త్తెలు! అందులో చిత్రరేఖ!

— వచ్చి సరసను కూర్చుంది. నిలాగా నన్ను పరికించి చూచింది, మృదువుగా నవ్వింది. చిత్ర నవ్వుతోంది. నా రహస్యం తెలిసిపోయిందా ఏం? ఏమో, యోగశక్తి గొప్పది.

ఆరాటపడకు....అంది.

—ఎందుకన్నట్లు యీ మాట ?ఎన్నివిధాలనో అర్థం అవుతోంది ఆ కాష్ఠమాటా. ఈ యోగులతో యిదే చిక్కు, చూచి చూచి మృత్యువంతమాట అంటారు.

ఎన్నెన్ని విధాలనో అర్థం అవుతుంది. మనం ఊహించుకొనే అర్థం వేరు. తాము అనే అర్థంవేరు. వారు అనుకున్న అర్థమే అవుతుంది. తల వొంచుతున్నాను.

విచారపడతావేమి, నేనున్నానుగదా నీకు ఉషా.

తలయెత్తి చూచాను. నవ్వాను.

తనూ నవ్వింది. నేను నవ్వకపోయినా బాగుండేదేమో. నవ్వేన నవ్వు, నిలూనా ప్రాణిని పట్టియిస్తుందంటారు. పోనీ, గుడ్డిలో మెల్ల, నేనున్నానుగదా అని ధైర్యం చెబుతోంది గదా. విచార సముద్రం వేలాతి క్రమణం చేస్తోంది. చిత్రరేఖ చేతులు పుచ్చుకున్నాను. చిత్ర, నా ముఖంలోకి చిత్రంగా చూచి-క్షణం కన్నులు మూసింది. ఏంచేసిందో ఏమో, ఆ యోగిని-గుండెలలోకి కొండంత ధైర్యం ప్రసరించింది.

బెంగపెట్టుకోకు-మళ్ళీ వస్తా....అంది, వెళ్ళింది.

ఎందుకు వచ్చినట్లు? ఎందుకు వెళ్ళినట్లు?

నీ రహస్యం నాకు తెలుసులే, అని చెప్పిపోడానికి వచ్చిందా? నా జీవితం అంతా, తన గుప్పిట్లో పెట్టుకొని ఆడిస్తుందా? ఏమో, ఎంత యోగిని అయినా, మంత్రికూతురు. మహారాజు ప్రాణాలు మంత్రి చేతుల్లో. మా ప్రాణాలు, మంత్రి సంతానం గుప్పిట్లో. తప్పు, తప్పు, అల్లాగ అనుకో గూడదు. నేనున్నానుగదా నీకు ఉషా....అని ధైర్యం చెప్పిన చిత్రరేఖనేనా యిలాంటి మాటలు అనుకోడం. ఛా, పాడుమనస్సు. కాస్త మనస్సు వికలం ఐతే చాలు, రారాని పాడు ఆలోచనలు వస్తయ్. అవే పెదవులమీద రాపాడు తాయి.

మళ్ళీ ఎప్పుడు వస్తుందో చిత్ర?

అయ్యో, మందమతిని, అంతే. నా తెలివి తక్కువకు నేను నిజగిజ లాడాలిసిందే. కాలుకాలిన పిల్లిలాగ తిరుగుతున్నాను నా సౌధం అంతా. ఇంత మహాసౌధం ఉందా,నాకు, తిరిగినచోటే తిరుగుతూ, చూసిన వస్తువునే చూస్తున్నాను. పొద్దుపోదు, చిత్రరేఖ రాదు.

చిత్రరేఖను రమ్మని కబురుచేస్తే.... వచ్చి ఏం లాభం, ఏకాకితనాని భరించలేను. తోడుగానన్నా వుంటుంది. వస్తే, రాకపోతే, మా మంత్రి కుమార్తె ఆ మాత్రం మాట తీసేస్తుందా ? రాకపోతే? మళ్ళీ మళ్ళీ కబురు చేస్తూంటాను. విసుగెత్తి అయినా వస్తుంది. ఏం లాభం, మనస్సు చెదిరిన తర్వాత? ఉన్న ఒక్క ఆశ, రవ్వంత ఆశ, ఆ చిత్రరేఖ. ఇంతా నచ్చు, త్వరగా రమ్మని కబురు చేశానుకాదు. ఆ కొత్త ఆకర్షణమూ అంతర్ధానం అయ్యేది.

అదుగో చిత్రరేఖ....ఏమిటో తెస్తోంది !

ఏమిటివి చిత్రా?

చిత్రపటాలు ....

ఎందుకు?

చూడు....

వీణ బుజాన వేసుకొని సంగీతం పాడుతూన్న గంధర్వులు, యక్షులు, సిద్ధులు, సాధ్యులు, తారణులు, రాక్షసులు, పన్నగులు. అందరూ యువకులే, అందరూ సర్వైశ్వర్య సంపన్నులే.

ఎందుకీవి చిత్రా?

నెమ్మదిగా చూడు. గురూపదేశం జవదాటరాదు.

మళ్ళీ మళ్ళీ ఒక్కొక్కటిగా చూస్తున్నాను.

అరుగో వాడే, చూచీ చూడగానే సిగ్గుపడ్డానుట. చెక్కిళ్ళు జాలు వారాయిట. ఒకరకం సంతోషం-నాకంఠానికి ఎగదట్టిందిట. నా మాట మారిందిట. నేను నేనుకానుట. చిత్రలేఖ చేయి, నా మెడకింద. నా నవ్వు ముఖం నాకే కనిపిస్తోంది. చిత్రలేఖ ముఖం — మార్పులేదు. పసిపాప ముఖం. సరస్సులో సీళ్ళపై తేలి నిద్రపోతున్న చంద్రబింబం.

ద్వాదశ....అంది, తనలోతాను గొణుక్కున్నట్లు. నా కనుబొమ్మలు తేచాయి.

కన్నులు విప్పారినవి.

శ్రీకృష్ణులవారి మనుమడు — ప్రద్యుమ్నపుత్రుడు. అనిరుద్ధుడు .... అంది.

ఆఁహా....అనుకున్నాను.

వస్తా.... అంది. వెళ్ళింది. ఈ పటాలన్నీ యిక్కడ విడిచి వెళ్ళిందేం? ఎవరన్నా చూస్తే....ఏమనుకుంటారు ? ఎవరు ఏమనుకుంటే నేంలే, నాన్నగారు వచ్చి చూచినా భయంలేదు. ఏ ఒక్కరి చిత్రపటమో అయితే గదా. కావలసినన్ని పటాలు. ఎవరు చూచినా ఏం యిబ్బందిలేదు. సిగ్గూవు ఏమీ వాడదు.

నిమిషం నిమిషం బరువుగా గడిచిపోతోంది. కాలానికి చీమనడక, త్వరగా త్వరగా నడవదు పొద్దు. చిత్రలేఖ ద్వారకకు వెళ్ళి ఉంటుందా ? ఏమో?

పరిచారికలు వచ్చారు. మామూలుగా సువాసనలు అలదారు. కైశ్యం అలంకరించారు. పానుపు వేశారు. దీపాలు పాముల నాలుకలవలె ఉన్నాయి. పన్నగశయనుడు శ్రీకృష్ణులవారు; వారి మనుమలా, వీరు? అరుగో, వాడే - కారు, ఎవరో చెలికత్తె ! ఆ సవ్వడి చిత్రరేక చీర మెర మెరా ? కాదు,

ఏమిటో, అదుగో చిత్రరేఖ.... కాదు, నల్లపిల్లి. పిల్లి శకునం గూడానా? యిప్పుడు. మనస్సు కలవరపడితే, త్వరపడుతూంటే, ప్రతిదానికీ ఉలుకుగా ఉంటుంది. అదుగో చిత్రరేఖ. ఏం చెబుతుందో.... ఏమయిందో. అదుగో వారే. వారిని తీసుకొని వచ్చింది. ఎరుగున్న యింట్లోకి వచ్చినట్లు రాకుండా, నీరసంగా, నిద్రమత్తుగా వస్తారేం వారు. ఏదీ చిత్రరేఖ. నిద్రపోతూంటే. తన యోగశక్తితో తెచ్చిందా వారిని. ఏదీ చిత్రరేఖ. లేదు. వారు ఒక్కరే వస్తున్నారు. ఎదురువెళ్ళాను. వెళ్ళాను; వెళ్ళామనుకున్నాను. వారే వచ్చారు. దీపాలు మామూలుగా వెలిగాయి. దీపాలు శాంతంగా వెలిగాయి. దీపాలు బద్ధకంగా వెలిగాయి. దీపాలు వెలావెలా పోతున్నాయి. గవాక్షం దగ్గిర, వారూ, నేనూ.... ఆకాశాన ఆ ఉషాకన్య. భూమిమీద యీ ఉషాకన్య.

నిరోధంలేని సూర్యుడు ఆకాశాన.

అ-నిరుద్ధులు యిక్కడ, నా పక్కన.

దీపాలు నిద్రలో ణోగి, ఆవులించినయ్. మన యింటికి మనం వెళదాం.... అన్నాను.

ఓసారి, వెళదాం.... అన్నారు.

—మనుగుడుపులు గా కాలం గడుస్తోంటే, మా వూరు అన్న మమకారం సడలిపోతుంది కాబోలు. అత్తవారిల్లు, అత్తమామలు, ఆడబిడ్డలు, ప్రతిదీ కొత్త అయిన వాతావరణం— యిదంతా నాకు ముచ్చట, వారికీ యిలాంటి ముచ్చటేనేమో.

వారికి సంగీతం అంటే చాలు. పంచప్రాణాలూనూ.

వీణ వాయిస్తున్నాను. తాంబూలారుణిమలో, సహజంగా ఎర్రవైన వారి పెదిమలు కెంపుల్లాగా మెరుస్తున్నాయి. ఎదురుగా కూర్చుని మైమరచి వింటున్నారు.

"అమ్మా, అమ్మా, మహారాజు...." అంది దాసి భయంగా. నాన్నా, నాన్నగారికక్కడి కెందుకొస్తారు. పిడుగులాగా మహారాజు వచ్చారు. చండ శాసనుడు, శివప్రసాదబలశాలి. బాణమహారాజు వచ్చారు. నేను, కుమార్తెను ఉన్నాననైనా లేదు. సరాసరి—

'ఎవరు నువ్వు?' అన్నారు— "ఎట్లా రాగలిగావు యీ కన్యాంతఃపురానికి?" అన్నారు. ఫెళఫెళా ఉరుం ఉరిమినట్లు అయింది. వారిమీద కత్తి తీశారు. నేను అడ్డం వెళ్ళాను.

క్రూరంగా నావంక చూశారు, మహారాజు. నేను చలించలేదు. నాన్నా అని మాత్రం అన్నాను. నాన్న నా మాట వింటేనా?

కూర్చున్న అల్లుడిగారి శిరస్సున చేయివేసి.... ఇక్కడే పడి ఉండు అన్నారు, భుజాల్ను కత్తి విసిరివేసినట్లు. వారు మహారాజు. శోణపురాధి వాధుబు, బాణచక్రవర్తి. వారి దారిన వారు వెళ్ళారు.

దీపశిఖలలాంటి పాము నాలికలు, వారి చుట్టూరా. ఇదేం కర్మ. ఈ పాముపిల్లలు కాటువేస్తాయా వారిని? చిత్రరేఖ చెప్పింది, నారద మహాముని అంతవారు కల్పించుకున్నారు, నా కథలో. నారద మహాముని కల్పించు కోవాలేగాని, కయ్యాలకు తక్కువా? మనుమడు కనబడడం లేదని శ్రీకృష్ణుల వారు ఎక్కడ అనుకుని పోతారో అని స్వయంగా వెళ్ళి, ఆ జగడం కూటి సత్తరువు, నారద మహాముని.... "అయ్యా, శ్రీకృష్ణా, అనిరుద్ధు శోణ పురంలో కులుకుతున్నాడయ్యా...." అని చెప్పాడుట. పురి ఎక్కించాడట. శ్రీకృష్ణులు — పన్నెండు అక్షౌహిణీల సేనతో కదిలి వచ్చారుట. నాన్నకూ, వారికీ యుద్ధం జరిగించట. అ-బ్బి, ప్రతిదానికీ యుద్ధమేనా? పెళ్ళి చేయాలి సినచోట- ప్రళయంలాంటి యుద్ధం. ఆ మాటా నిజమే. యుద్ధంలేకుండా, ఏ స్వయంవరం జరిగిందిటలే.

మా ఇలవేలుపు శివుడుగూడా యుద్ధంలో పాల్గొన్నారుట. నాన్నకు, నావల, అన్ని చేతులూ పోయి- నాలుగు చేతులు దక్కాయిట. చిత్రరేఖ

చెప్పింది. తెల్ల వాతేసరికి నా అంతఃపురం అంతా అలంకరించేశారు. నారదులవారు, శివుడు, శ్రీకృష్ణులవారు, బాణమహారాజు, నాన్న అందరూ వచ్చారు. నాన్నను చూచి తల వొంచుకున్నాను. క్రీగంట చూస్తున్నాను. శ్రీకృష్ణులువచ్చి, 'నాయనా లే....'అన్నారు. గరుత్మంతుణ్ణి చూచినట్లు అయి వారిని చుట్టిన నాగపాశం కాస్తా మాయమైంది. శ్రీకృష్ణులూ, నారదులూ నన్ను చూచి నవ్వుకున్నారు. మునిమనుమల్ని ఎత్తబోతున్నారు, ఆ నారాయణమూర్తి.

'అమ్మా....' అన్నారు నాన్న.

నమస్కరించాను.

"అత్తవారింటికి ప్రయాణం కాబోతున్నావు తల్లీ...." అన్నారు, గర్జనగా.

లాలనగా, ప్రేమగా అంటారేమో అనుకున్నాను ఆ మాటయినా. గర్జిస్తూన్నట్లు అన్నారు. ఆల్లుడి నమస్కారాలు స్వీకరించారు, వెళ్ళారు. అత్తవారింటికి ప్రయాణం అంటే- ఏమిటోగా వుంది. ఈయన ఇక్కడున్నట్లు ఉంటారో, లేదో, అక్కడ. అయినా చిత్రరేఖ వుంటుందిగదా, నాలో. నాకోసం ఎంతకైనా తెగిస్తుంది, చిత్రరేఖ.

"చిత్రా, నాతో మా అత్తారింటికి వస్తావుగదూ?" అని అడిగాను.

'ఆఁ...' అంది.

'నీ యోగం, ధ్యానం, శివసన్నిధిని నీ ధ్యానం.... నిజంగా వస్తావా చిత్రా, నిజంగా....' అని కొసుయకున్నాను, చిత్రరేఖ నిబ్బరంగా....

'వసా నిజంగా....' అంది.

చిత్రరేఖ మాట అంటే చాలు— జరిగి తీరుతుంది. వస్తుంది, నిజంగా—

కీ ర్తి

త్రల గిర్రున తిరిగినట్ల యింది. పడిపోతున్నానను కున్నాను. చీర జారి కిందపడ్డట్టుగా కిందపడ్డాను.

ఇది నదీతీరం. ప్రశాంతమైన స్థలం. చెట్టూ చేమా, నేలా నింగీ— ఉగ్రత్వం లేకుండా వుంటాయి. గాలులు మృదువుగా వీచుతాయి. కొండలు గంభీరంగా సర్వసాక్షిగా చూస్తూ తపస్సు చేస్తున్నట్లుంటాయి, అన్న స్పృహే లేదు నాకు అప్పుడు. కన్నులు చూడలేవు. చెవులు వినలేవు. శరీరం నిలపగల శక్తి లేనిదయింది. పడిపోయాను.

గత జీవితం కన్నులముందు చిత్రపటంలాగ కనబడింది జరుగుతూ.

మిధిలలో పెరగడం, నాన్నగారిమాటలు, మెల్లగా చల్లగా మాట్లాడే నాన్న గంభీరవాణి వినబడింది. శివధనుస్సుతో ఆటలాడరావమ్మా, అన్న వారి మాట వినబడింది.

పెళ్ళి సందడి.

హరధనుస్సును విరిచినవాడు నా భర్త. అంత పరాక్రమవంతుడు, భర్తగా వచ్చాడు. రాజర్షి నా తండ్రి ఆ పరాక్రమశాలికి, మహావీరుడికి నన్ను కన్యాదానం చేస్తున్నారు.

కాపురం.

అత్తమామలు, అడుగులకు మడుగులొత్తే దాసీలు. నా మాట వింటే చాలు, నన్ను చూస్తే చాలు, నేను దగ్గర వుంటే చాలు. మూడు లోకాల నైనాసరే. తృటిలో జయించగలననే ధీమాగల భర్త. శ్రీరామచంద్ర మూర్తి.

పట్టాభిషేకం. పట్టాభిషేకం కాస్తా వనవాసంగా మారడం.

అబ్బ.

రేపు మిమ్మల్ని మహారాణిని చేస్తారు. రేపే పట్టాభిషేకం అని విన్నప్పుడు-నిజం-నా మనస్సు ఎగిరిగంతేసింది. పరవశం చెందింది. మహారాణిని అయిపోతున్నానని కొంచెం సేపు—తెలీని సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాను.-తప్పు.

మళ్ళీ —

నిన్న - తప్పు చేశాను.

"సీతా నీవిప్పుడు చూలాలివి, ఏం కావాలో చెప్పు, ఏంకోరినా సరే— నీ కోరిక తీరుస్తాను." అని శ్రీరామచంద్ర మూర్తి, రామప్రభువు అన్నారు.

లోకాధినాధుడు నా భర్త, లోకైక మహారాణిని నేను. అని మళ్ళీ - సంతోష పడ్డాను: క్షణకాలం వెర్రి సంతోషం పడ్డాను.

పొరపాటు —

మరోసారి గూడా యిలాగే తప్పు చేశాను.

లంకానగరంలో, అశోకవనంలో వున్నప్పుడు, మహాయుద్ధం జరుగు తూన్నప్పుడు, వాడు, ఆ మాయలమారి ఇంద్రజిత్తు గూడా హరుడైనా డన్నప్పుడు-ఇలాంటి తప్పుచేశాను.

నాకోసం, నాకోసం యీ రామరావణ మహాయుద్ధం జరుగుతోంది. నా భర్త—జగదేక శూరుడు, నాకోసం, యుద్ధం చేస్తున్నారనుకున్నాను. తప్పు. బుద్ధి తెలిశాక-వయస్సు వచ్చాక-తెలిసి, తెలియక చేసిన తప్పులు — యీ మూడే.

అందుకే యీ శిక్షలు నేను అనుభవించాలిసింది, కాబోలు. ధర్మ సభనుంచి, అంతఃపురానికి శ్రీరామచంద్రులు వచ్చారు. రధంకాచుకుని ఉంచి, 'పురోధ్యానాలకు వెళ్ళివద్దాము' అన్నారు.

అలాగే, మీ యిష్టం అన్నాను. వెళ్ళాం. పొద్దుపోయి తిరిగి వచ్చాం.

అప్పుడే వారిని నేను కోరిక కోరాను. గంగానది జ్ఞానప్రదాత్రి. గంగా నదీ తీరం పరమ పవిత్రం, గంగానదీ తీరాన మునివాటికలు పరమ ప్రశాం తాలు. అక్కడక్కడ పెద్ద పెద్ద పర్ణశాలలు. చక్కగా అరికి ముగ్గులుపెట్టి-పూలతో అలంకరించి, గుమ్మాలకు ముందు బలులు ఉంచి, సర్వసముత్తై, చిల్ల పెంకుల్ని, రత్నాలనూ సమంగా చూసే మహామునుల పర్ణశాలలు చూడాలని వుంది. నన్ను కష్టకాలంలో ఆదరించి, ఆశ్రయమిచ్చి, ఆశీర్వ దించిన మునిపత్నులనుగూడా చూడాలని వుంది అన్నాను.

శ్రీరామచంద్రమూర్తి సంతోషంగా నవ్వారు. "గురుమూర్తుల సన్నిధికి, శూన్యహస్తాలతో వెళ్ళగూడదు"అన్నారువారు.కన్నులెగరేశాను."నేనూ అదే అనుకుంటున్నాను. మునిపత్నులకని చీరలూ, రత్నాలూ, ఆభరణాలూ తీసుకుని వెళతాను. వారితో ఒక్కరోజన్నా గడిపి వస్తాను" అన్నాను. 'శుభమస్తు' అన్నారు నా భర్త.

ఒళ్ళు తెలియని సంతోషం వచ్చి ఉప్పొంగాను. తెల్ల వారి, మరిది వచ్చి— "వదినా— అన్నగారు మిమ్మల్ని గంగాతీరానికి తీసుకు పొమ్మన్నారు" అని విన్నవించాడు. తెలీకుండానే- గుండెలు అదిరినయ్. వారు రారన్నమాట.... అని చెప్పినట్లయింది. 'ఎప్పుడు ప్రయాణం' అన్నాను.

'మీ యిష్టం. రథం సిద్ధంగా వుంది' అన్నారు లక్ష్మణులు. వొస్తున్నానన్నాను. రథం ఎక్కి బయలుదేరాం.

ముందు జరగబోయేవి ఎప్పటికప్పుడు ఎవరో తెలియచెబుతూనే వుంటారల్లే వుంది. అయోధ్య అంతా ఏమిటో అలికేసినట్టువుంది. మునిపత్నులను చూడడానికి, వారితో ఒకటి రెండురోజులు గడిపి రావటానికి వెళుతున్నానని అనిపించనే లేదు. సుమంత్రుడు మామూలుగా రథం తోలుతున్నాడు. మరిది లక్ష్మణుడు ఏదో పరధ్యానంగా వున్నాడు. ఎటో చూస్తున్నాడు. రథంలో నేను ఒక్కర్తెగానైనాను. మాటా పలుకూలేదు. ముగ్గురం వున్నాం; ముగ్గురి మనస్సులూ మూడు విభిన్న లోకాలలో తిరుగుతూన్నట్లుంది.

గంగాతీరానికి వచ్చాము. మునుల పర్ణశాలలు దూరదూరంగా కనిపిస్తున్నయ్. నెమళ్ళ కూతలు ఒకొక్కప్పుడు భయంకరంగా వినిపిస్తున్నయ్. ఉన్నట్లుండి, మరిది లక్ష్మణుడు కళ్ళనీళ్ళు తుడుచుకుంటున్నాడు.

గంగాతీరం. ప్రశాంత ప్రదేశంలో రమ్మన్నా దుఃఖం రాదు. అదే మునుల విశేషం. మునుల సన్నిధిని, విచారపడి, దిగులుపడి, కన్నుల నీరు

పెట్టుకోడం సామాన్యంగా జరగదు. ఆ ప్రశాంతతలో, ఆ పూజ్యస్థలాలలో, దివ్యస్థలాలలో దిగులు అంటూ వెయ్యదు. లక్ష్మణుడు, మహా మహా ఆపదలు పై నబడుతున్నా చలించనివాడు, విచారం అనేది ఎరగనివాడు, కన్నుల నీరు తుడుచుకోడమా? ఆశ్చర్యంగా వుంది.

'వదినా....' అన్నాడు. వున్నట్లుండి, వీడుస్తూ, నా పాదాలను పట్టుకున్నాడు. వెక్కి-వెక్కి- వీడ్చాడు. నా గుండెలు పిండుకుని పోతున్నట్లయింది.

"వీమయ్యా, వీమిటి? ఎందుకిట్లాగైనావు...." అన్నాను. మరిది ఇంకా ఎక్కి-వగా వీడ్చాడు. తనను తాను సంబాళించుకుంటున్నాడు.

శ్రీరామచంద్రమూర్తి క్షేమమేగద, అత్తలకు మరుదులకు క్షేమమేగద. ఎందుకు విచారపడతాడు?

అమ్మా.... వీడుస్తున్నాడు. కళ్ళనీళ్ళు- మాట్లాడటం కష్టంగదా అప్పుడు. "అమ్మా, నీవు మహా పతివ్రతవు. నీ రక్షణవుండగా ముల్లోకాలూ సుఖంగా వుంటాయి. నీవు తప్ప...." అన్నాడు.

"వీమిటయ్యా, యీ ఉపద్రవం. యెందుకిట్లా వీడుస్తావు?" అన్నాను. మాటలయితే అంటున్నానేగానీ—

"నాయనా, తపోభూములను చూడాలని అడిగాను. పంపారు. చూస్తున్నాము. సంతోషించవలసిన సమయంలో విషాదం ఎందుకయ్యా?"అన్నాను లక్ష్మణుడు తలవొంచుకున్నాడు.

'అన్నగారు యిట్లాగన్నారు....' అన్నాడు మరిది. "లోకాపవాదం ప్రబలంగా వుంది. లంకలో అంతకాలం వున్న సీతను రాముడు యింటికి తెచ్చుకున్నాడు. యింతే. రాజు నడిచింది ధర్మం. ఆహా... అన్నారుట

పౌరులు.... లోకాపవాద భయంవల్ల, మిమ్మల్ని శ్రీరాము ప్రభువు పరిత్యజిస్తున్నారు....” అన్నాడు అతను.

నాకు పై ప్రాణాలు పైనే పోయినట్లు యింది. ఆనాడు తండ్రి మాటలకు తమ మహారాజ్యాన్నే వదిలివేశారు శ్రీరామప్రభువు. ఈనాడు లోకుల కోసం– తన యిల్లాలిని, నిండు చూలాలిని వదిలిపెడుతున్నారా? అనిపించింది. బతికి వున్నంతకాలమూ భరించవలసిందేనా యీ నిందను?

ఎవడో మూర్ఖుడు, ఏదో అన్నారని, నన్ను వదులుకుంటారా? ఆనాడు, లంకలో యుద్ధభూమిలో రావణకాష్టం దగ్గిర అంతమంది సన్నిధిలో– అగ్నిప్రవేశం చేశానే– అబ్బ.

బతికి వున్నంతకాలమూ సీతమ్మ– యిల్లాగట అనే నిందను, నా త్రికరణశుద్ధిని శంకించే నిందను నేను భరించాలా? యిది లోకాపవాదమా, శ్రీరామచంద్రులకూ మనస్సులో వుందా? తల తిరిగిపోటం: నేను విడిచేసిన వస్త్రంలాగా పడిపోటమూ అయింది. ఎంతసేపు అట్లా పడివున్నానో తెలియదు. లక్ష్మణుడు, ఏడుస్తూ, ‘వదినా, వదినా’ అంటున్నాడు.

ఎవరో ఏదో చెబుతున్నట్ల యింది. స్పృహ వచ్చింది. ఐశ్వర్యం క్షీణిస్తూ అంతం అవుతుంది. మహోన్నత స్థితి పతనంతో అంతమవుతుంది. సమాగమాలు వియోగంతో అంతం అవుతాయి. జీవితం మరణంతో అంతమవుతుంది. మహావేదనతో యీ సత్యం నాకు అవగతం అయింది. అందుకే కాబోలు. మహామహాలు, మునులు, రుషులు - పిల్లలమీద, భార్య మీద, మిత్రులమీద, ధనంమీద– అతి ప్రసంగం చెయ్యరు. బంధం ఏర్పడుతుంచని కాబోలు. ‘అమ్మా....’ అన్నాడు లక్ష్మణుడు.

నా గుండె కొయ్యబారింది. ‘ఏం నాయనా’ అన్నాను.

అదుగో వాల్మీకుల ఆశ్రమభూమి, అంటున్నాడు అతను.

"నాయనా, నా మాట వినుతండ్రీ...." అన్నాను. నా నాలిక పిడచ కట్టుకుని పోయినట్లయింది.

లక్ష్మణుడు తలవొంచుకుని, చేతులు దోయిలించి నుంచున్నాడు.

"నాయనా, శ్రీరామప్రభువుకు యీ నా మాటలను చెప్పు తండ్రీ. ఆనాడు, అంతమంది సన్నిధిలో- అగ్ని పరిశుద్ధనయినా, నన్ను యీనాడు, లోకాపవాదంవల్ల త్యజిస్తున్నారు. ఆ వంశానికి అదే ఉచితం. ఈ నింద నాయందున్న ఏ కోపావేశంవల్లా వచ్చిపడిందికాదు. నేను ఏ పాపమ్మూ ఎరగను. జన్మజన్మాంతరాలలో చేసుకున్న పాతకాలకు ఫలితం, పరిపాకం యిది. నవ్వుతూ చేసిందాన్ని ఏడుస్తూనయినాసరే, అనుభవింపక తప్పదు.

మహారాజా, తమ దయవల్ల, మునిపత్నులను ఆశ్రయించుకుని వుంటూ నా జీవితాన్ని గడుపుతాను. కాని, తాము వుండగా, నేను మరొకర్ని శరణువేడడమే విశేషం.

అపవాదులను భరిస్తూ ప్రాణాలతో బతికి ఉండేకంటె, చచ్చిపోడం మేలు అనే అనిపిస్తోంది. కాని, గర్భవతిని. యిక్ష్వాకువంశాంకురాన్ని నేను కాపాడక తప్పదు.

ఆ చెంచెడు నీళ్ళూ పోసుకునేదాకా, సూర్యమండలాన్ని ఆ సూర్యమండలం మధ్య ఉండే పరమాత్మను చూస్తూ ధ్యానిస్తూ తపస్సు చేసుకుంటాను. మళ్ళీ జన్మ అంటూ వుండి, పుట్టడమే సంభవిస్తే, మీరే నా భర్త. అప్పుడైనా, వియోగం అంటూ వుండకుండుగాక. మహారాజులకు వర్ణాశ్రమాచారాలను పరిపాలించడం ధర్మం. భార్యనైన నన్ను మీరు విడిచిపెట్టారు. లోకంలో అందరు తపస్వినులను, చూచేట్లయినా నన్ను చూడడం...." అన్నాను.

అలాగేనమ్మా అన్నాడు మరిది. నెమ్మదిగా బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. రథం కనిపించింది. రథం జెండా కనిపించింది.

రథం రేపిన ధూళి కనిపించింది. చివరికి శూన్యం కనిపించింది. పిచ్చిగా అటే చూస్తున్నాను.

'అమ్మా....' అన్నారు.

తల బరువుగా తిప్పి చూచాను. కవిగారు- వాల్మీకి. పిట్టల్ని ఎవడో క్రూరుడు హింస చేస్తేనే చూచి ఓర్చుకోలేనంతవారు, మెత్తని మనసు, తపస్వి.

'అమ్మా....' అన్నారు.

లేచి నమస్కరించాను. ఆ మహాముని కి కన్నులు చెమ్మగిలి తడిసినయ్.

"తపశ్శక్తివల్ల తెలుసుకున్నానమ్మా.మహాసాధ్వివి. అతిశుద్ధచరితవు. నిన్ను మహారాజు శ్రీరామచంద్రుడు త్యజించాడు. నీకు శుభమవుతుంది. రా అమ్మా- నిశ్శంకగా, నా పర్ణశాలకు రా తల్లీ. నీ తండ్రి, రాజర్షి జనకుడూ నేనూ స్నేహితులం. నీ తండ్రి ఇంటికి నీవు వస్తున్నావు" అన్నారాయన. భోరున ఏడవాలనిపించింది. నిగ్రహించుకుంటున్నాను."లోకకంటకుడైన రావణుణ్ణి వధించి, ముల్లోకాలకు మంచి చేసినా, సత్యప్రతిజ్ఞుడైనా, గొప్పవాడైనా- నిష్కల్మషురాలవు నిన్ను త్యజించినందుకు, ఆ రాముడి మీద నాకు కోపం వుండనే వుంది...." అన్నారాయన. వారి పర్ణశాలకు చేరాను. తమసా నదిలో స్నానం, సూర్యోపాసన, మునికన్యలతో ముచ్చట్లతో కాలం గడుస్తూంది. శ్రావణమాసం, వర్షం పడుతోంది. రాత్రివేళ తల్లినైనాను. కవలపిల్లలు. బాలసూర్యబింబాలలాగున్నారు. పనివాళ్ళు పెరుగుతున్నారు. నన్ను విడవరు. ఎక్కడవున్నా, ఏం చేస్తున్నా, ఆడుకుంటున్నా, చదువుకుంటున్నా, విద్యలు నేరుస్తున్నా, అమ్మా అంటూ ఓ కన్ను నామీదనే వుంచేవాళ్ళు కుశుడూ, లవుడూనూ.

మహారాజు శ్రీరామచంద్రులు అశ్వమేధయాగం తలపెట్టారుట.మహా మహులకు, మహర్షులకు వార్తలు చేరినయ్. అందరూ వెళ్ళారు. కుశ లవులూ, గురువుగారితో సహా వెళ్ళారు. పెద్దవాళ్ళయినా పిల్లలు దగ్గిర లేకపోతే, ప్రాణాలు గిలగిలలాడినై. నిగ్రహించుకున్నాను. 'సమాగమాలు వియోగాంతాలు. జీవితం మరణంతో అంతమౌతుంది' అన్న అనుభవం మనస్సులో మెదులుతూనే వుంది. అందుకే కుశలవులమీదగూడా ప్రేమను, అనురాగ బంధాన్ని ముదరనీయకుండా, బలపడకుండా వుంటున్నానిన్నాళ్ళు. మహారాజు శ్రీరామచంద్రులు వార్త పంపారు. యజ్ఞవాటిక సీత రావాలి, తన శీలం విషయంలో సత్యప్రతిజ్ఞ చెయ్యాలి అని. నేను మహర్షి ఆశ్ర యంలో వున్నాను మరి. మహర్షిగూడా అనుమతించారని విన్నాను. యజ్ఞ వాటికకు వెళ్ళాను.

తల ఎత్తి వారినెవరినీ చూడాలనిపించలేదు. సీత వచ్చింది: ఏం శపథం చేస్తుందో, ఏం శపథం చేస్తుందో అని కాచుకూర్చున్నారు. మహా రాజు, మరుదులు, మునులు, ఋషులు, వానరులు, అందరూ. తలయెత్తి చూడలేకపోయినా— నిశ్శబ్దంవల్ల తెలుస్తోంది. శ్రీరామప్రభువు చూపులు తగులుకున్నై. తలయెత్తి చూచాను. అందరికీ నమస్కరించాను. "శ్రీరామ చంద్రులను కాక నేను మరెవ్వరినీ మనసా స్మరించలేదు: ఇదే సత్యమైతే- భూదేవి నాకు మార్గం కల్పించుగాక. మనస్సుతో, వాక్కుతో, పనులితో, నేను శ్రీరామచంద్రులనే పూజించాను. శ్రీరామచంద్రులను గాక మరెవ్వరినీ నేనెరుగను." అని అన్నాను. అంతే, నాకు తెలిసింది. తల్లి, భూమాత అనుగ్రహించింది. వివరం వీర్పడింది. సింహాసనం వచ్చింది. నన్ను ఎక్కించుకుంది. అంతే. జీవిత నాటకం ముగిసింది.

ధాన్యమాలిని

"ఎవరది? ఏమిటో, ఏమిటా చప్పుడు? ఎందుకూ, చప్పుడు? అనవసరం. ఐనా ఆర్భాటం. అబ్బ, క్షణం అయినా, ఏకాంతంగా ప్రశాంతంగా బతకాలనుకోటం— కత్తిమీద సాములాగా ఉంది. తల్లీ, పిల్లి కూనా, నువ్వా, వచ్చింది? బాగుంది. మంచి శకునమే. ఊఁ."

ఏమిటిట్లా నేను మారిపోతున్నాను. పిల్లి కూనను చూచినా చిరాకు పడుతున్నాను. ఇల్లు అయిన తరువాత పిల్లికూనలూ రాక బల్లులూ ఉండక

వీమవుతుంది. అందరూ నాలాగా స్తబ్ధుగా కొండంత విచారం గుండెల మీదెక్కి తొక్కుతూంటే ఏకాంతంగా, ప్రశాంతంగా వుంటారా? జీవశక్తి, చైతన్యం సాతత్య నృత్యకేళి జరుపుతూంటే!

నేనా, ఇది నా గీత, నా తలవ్రాత. ఏకాంతం, ప్రశాంతం నా నోస టన్ వ్రాసిన వ్రాత. తలిదండ్రులకు దూరంగా, తోబుట్టినవారికి వెలిగా, లంకంత మహాపట్నంలో— అల్లాడి ఆకులు మేస్తున్నాను. నిజంగా, నాబోటి దౌర్భాగ్యులు వుంటారా? ఏమో, ఎందరెందరున్నారో....

మహానాగరికత మణిప్రభలు చిమ్మే లంకలో అడుగుపెడితే చాలను కొని, మనోనువర్తులై మెలిగే సూర్యచంద్రుల నీడల్లో, లంకానగరంలో జీవించడమే చాలనుకుని, మహాశూరుడు, నీలమేఘ సుందరుడు, రావణ మహారాజు కన్నెత్తి చూస్తే చాలు, కనకాభిషేకం జరిగినట్లుగా— తలపోసి తలపోసి, నిద్రాహారాలు మాని, సిగ్గు విడిచి, తలిదండ్రులను ఒప్పించి, లంకేశ్వరుడికి భార్యనైనాను.

ఏమదృష్టం అమ్మాయిది అనుకున్నారు అమ్మా, నాన్నా. ఏమదృష్టం అనుకున్నారు చెలులు, నెచ్చెలులు. ఏమదృష్టం అనుకున్నాను, నేను గూడా.

అంతే.

ఆ అదృష్టదేవత, పెదిమ విరిచి, క్రూరంగా చూచి, సాధించి, వేధిస్తోంది. చాలు. ఈ జన్మకు చాలు. మహాప్రభో. జన్మకు ఏనీ కోరుకో గూడదు. కోరుకున్నామా, వరం అంటూ ప్రసాదింపబడిందా, మన బతుకు అవరంతో గిజగిజలాడిపోవాలిసిందే. నేను కోరిన కోరికకు— గతి, ఇదుగో, కావలసినంత ప్రశాంతం, కావలసినంత ఏకాగ్రత. ఆ, చిట్టితల్లీ, నువ్వు ఉన్నావా ఇక్కడ, నాకు తోడుగా. వీణా, వీణా, నా ఆనందానికి, నిన్ను నేను ఏడ్పించి ఉంటాను. క్షమ చేస్తున్నానని, నీకు, నీ ప్రాణా

లయిన తీగలను బిర్రబిగించి బాధించాను. మనస్సు ఎటులాగితే అటుపోయి నిన్ను ఓ మూల వేశాను. నువ్వేమీ, నన్ను శపించలేదుగద!

నా వలచినకాంతుడు అత్యద్భుతమూర్తి, సందేహం లేదు. రమణీ రమణీయమూర్తి; ఏం లాభం. నా ఇంటికే రారు; ప్రాణపతి తన యింటికి రావడం, ఉండడం తనను లాలించడం· కవ్వించడం, నవ్వించడం, మైమర పించడం— అయ్యో రాత, నాలాంటి నిర్భాగ్యురాలికి గూడానా....

వారు, నా యింటి చాయలకు గూడా రారు.

ఇది బాగానే వుంది.

నిరంతరం. నాకోసం కలవరించే వీణ అంటే నాకు అశ్రద్ధ. నేను కలవరించేవారికీ యిట్లాగే అశ్రద్ధ అయితే— వేరే అనుకోటం ఎందుకు ?

వీణా, నా తప్పు మన్నించు. గొంతెనబాసి, ఖడ్గమువలెన్ మధురో ద్ధుర నృత్యలీలలు చేయి. రా, నేనే చస్తున్నా.

వీణా, నీకూ విచారమేనా? విచారంగా వలుకుతున్నావు: ఇక నీవే నాకు సర్వస్వం. నా బ్రతుకును, నీ బ్రతుకులో అంతర్లీనం చేస్తాను.

ఎవరది. చూళిక? ఏం, వీణ తీశానో లేదో, విష్ణుదేవరవ్వు ప్రత్యక్షం అయ్యావు.

ఇందుకూ నేను నోచుకోలేదా, మహారాజు వస్తున్నారా?....

ఆఁ.

నిజంగానా ?

రాత్రే.

వారికి నా యింటి పొడైనా గిట్టదే.

రారు. అట్లా అంటేనైనా, నేను నవ్వుతానని, చూశిక అబద్దాలాడుతూంది. వారేమిటి, ఈ నిర్భాగ్యురాలింటికి రావడమేమిటి? వుత్తది.

బరువుగా అడుగుల చప్పుడు వినబడుతోంది. వాళ్ళేనేమో. నా మనోభ్రమ. గాలికి చెట్లు కదిలితే, చెట్ల ఆకులు గలగలలాడితే, గవాక్షన గాలి నిట్టూర్చితే నా ప్రాణనాథుడు, లంకేశ్వరుడు, మహాశూరుడు రావణప్రభువు, నాకోసం, నా యింటికి వస్తున్నారనుకోటం– ఈ భ్రమ, నాకు యింకా ఎంత కాలం వుంటుందో.... పోదు. పుర్రెతో పుట్టిన బుద్ధి పుటకతో వచ్చిన బుద్ధి పోదు. అడుగులు బరువుగా వినబడుతున్నయ్.

ఆ నీలాంజన గిరిసన్నిభుడు, నా గుండెలలో నడుస్తూన్నట్లున్నాడు. నిజంగానే వస్తున్నారా.

నిజంగానేనా.... నిజంగానా?

వచ్చారు. ఆఁ. వచ్చేశారు.

నాముఖం సిగ్గుతో ముడుచుకొనిపోయింది. తల ఎత్తి వారిని చూడనే లేకపోతున్నాను.

'ధాన్యమాలినీ....'

ఎన్నాళ్ళకు, ఎన్నేళ్ళకు విన్నాను. నాపేరు, నా ప్రాణకాంతులు నోరారా పిలుస్తూంటే వినాలని, ఎంతకాలానికి తీరింది యీ చిన్న కోరిక!

'ధాన్యమాలినీ....'

తల ఎత్తి చూడవు. కడకంట కాంతులు తేజరిల్లవు. ప్రేమతో, ఉత్కంఠతో, చెక్కిళ్ళు జాలువారవు. నామీద కోపమేనా ఇదంతా...." అన్నారు వారు.

మళ్ళీ మళ్ళీ వినాలనిపించే మాటలు, వింటున్నాను.

నాకు తెలీకుండానే ఓరకంట చూచాను.

లంకేశ్వరులు, కళ్ళల్లో నవ్వుదాచుకుంటున్నారు.

'ధాన్యమాలినీ....'

తల ఎత్తి చూచాను.

"నా తప్పులు క్షమించు. అనేక రావకార్యాలలో మునిగి, నీ దగ్గరికి రాలేకపోయాను."

దొంగమాటలు.

"ధాన్యమాలినీ, నీతో సావకాశంగా మాట్లాడాలి. యివాళ శివపూజ ఇక్కడే" అన్నారు రావణమహారాజు.

నిజంగానే లంకేశ్వరులు నిజంగా నాయింట, నా పంక్తిన సరసాలాడుతూ భుజిస్తారా? నాయింట సేదతీర్చుకుంటారా? నిజంగా? నామాటకేం, వారి మాటలకు, చూళిక ఉబ్బి తబ్బిబ్బులౌతూంటే! వారి పెదిమలు చలిస్తున్నయ్. ఏవో మాట్లాడబోయి ఆగినట్లున్నారు.

చూళికకేసి చుర్రుమనేట్టు చూచాను. చూళిక ఏదో పని ఉన్నట్టు వెళ్ళింది

'ధాన్యా....' అన్నారు వారు. దశకంఠులు వారుమరి. ఏ దశకు తగ్గ కంఠం ఆ దశకు వారికి సహజంగా వస్తుందాయె.

'దా, యిప్పుడే తిరిగివద్దాం.'

ఎక్కడికీ, ఎందుకూ? అని అడగడం అపశకునం. అపశకునం మాటలు ఎందుకూ అని నేనూరుకున్నాను.

గొంతుకను నొక్కుకున్నాను కాని, నా కళ్ళు నాకు తెలీకుండానే అడిగినట్లున్నాయి.

"రా,అలాగ, అశోకవనందాకా వెళ్ళి కాస్త సీతతో మాట్లాడివద్దాము. నీవూ సాయం చేద్దుగాని."

ఇదా, ఎత్తు: సీతకోసం పడే బాధలో నేనో పాచికనా....

"అలాగే సాయంత్రం వెళదాంలెండి" అన్నాను.

వారు, వింటేనా.... ఎదటివారు చెప్పే హితవు వింటం అంటూ వుంటే వారు ఇట్లా గెందుకవుతారు?

'లే మరీ.'

ఆజ్ఞాపిస్తున్నారు.

నా మనస్సు పట్టపగ్గాలు లేవు. అణచుకొన్న ఆక్రోశం పైకి పచ్చే స్తోంది, నిబ్బరించుకుంటున్నాను. అయినా ఆగలేదు.

"ఆ సీత మీకు ఎక్కడ దొరికిందండీ? ఏడుపుగొట్టు ముఖమూ అనీని. వన్నెచిన్నెలు లేవు, వచ్చోవైభవం లేదు. చివరికి తనూ సౌష్ఠవం అయినా లేదు. ఎవర్తో, దారినపోయే పెద్దమ్మారు, లంకకువచ్చి పీఠం పెట్టుకుంది...." అన్నాను.

వారు, లంకేశ్వరులు, మహారూరులు, చిత్రంగా నవ్వుతున్నారు. కోపం రాలేదు. అంతవరకు అదృష్టమే.

"మనుష్యులు నాకు గడ్డిపరకలు అని, బ్రహ్మదేవుడి దగ్గిరకూడా అన్నవారు మీరు. మీరు ఏమిటి, వచ్చి వచ్చి ఓ మానుషాంగనకు లొంగి పోవడం ఏమిటి?...." అని అన్నాను.

వారేమీ మాట్లాడలేదు.

సీతట, సీత. దాపరించింది, మా ప్రాణాలకు. ఎప్పుడు విరగడౌతుందో, ఎట్లా విరగడౌతుందోకాని—

వారి నేత్రాలు హోమగుండాలల్లే అయినై. చిన్న పర్వతం అంత వారు, చివాల్న లేచారు. మరోచూపు అంటూ లేకుండా, చివ్వున వెళ్ళారు.

వీధి చివరదాకా వచ్చి చూచాను. బరువుగా అడుగులు వేసుకుంటూ వెళుతున్నారు.

హుఁ. ఏ పిచ్చిలో పడితే ఆ పిచ్చేగాని, వెనుకచూపు లేదుగదా!

వారిని అంటున్నాను, నా తెలివి ఏమి తెల్లారింది?

ఇంటికి వచ్చిన నాథుని, రాక రాక ఇంటికి వచ్చిన వారిని, శివపూజ యిక్కడే అని, వావిడిచి చెప్పినవారిని, మాటలని పంపాను. హుఁ.

హుఁ. ఇంతే, నా జన్మ.

కాని మాటలు అంటున్నారని, కాని పనులకు పురిగొల్పుతున్నారని, గాంభ్రుతున్నానేగాని, అలాగే అలాగే అంటూ ఆలస్యం చేయనేలేదు గదా. భుజించి, హాయిగా, ఆకుమడుపులందుకునేవేళ, సన్నసన్నగా చెప్పి చూడక పోతినిగదా, ఆమాత్రం తెలివి నాకేదీ, శనిదేవతకు విడిచిని నేను. దుర దృష్టాలకు విహారవనాన్ని నేను.

ఎంతకాలం విచారపడినా లాభం లేదు. ఇంటికి వచ్చిన అతిథిని అవమానించిన రాక్షసిని నేను. నా పాపానికి ప్రాయశ్చిత్తం వుందా? కాళ్ళు ఆడడం లేదు. మనస్సు మనస్సులో లేదు. నిప్పులమీద నుంచున్నట్లుంది. నా యిల్లు నన్నే వెక్కిరిస్తూంది..... ఎక్కడికి పోతున్నాను,

నేను.... ఇదేమిటి, యీ దారిన పడ్డాను. ఛీ, సిగ్గూ ఎగ్గూ లేకుండా అశోక వనానికి పోతున్నానా.... ఏం వెళితే... నా ప్రాణపతివున్న చోటికి వెళ్ళడం తప్పా?.... బాగానే వుంది, నా అభిసారికతనం. (నవ్వి) అయ్యో రాత. అభిసారికను గూడాను. శుక్లాభిసారికనా? కృష్ణాభిసారికనా....? దివసాభిసారికనా? అశోకవనం.... అదేమిటి, అంతమంది చేరారు. వీమన్నా ప్రమాదం సంభవించిందా.... నిద్రాహారాలు మాని, ఏడ్చి ఏడ్చి, ఆ సీత యిక్కడ ప్రాణం వొదిలిందా....? యిదో పాతకంగూడాను. లేదు. అదుగో, ఓ గడ్డిపరక చేతపుచ్చుకుని ఏదో వాగుతోంది. ఎందుకా గడ్డిపరక. మనుష్యులు నాకు తృణప్రాయం అన్నవారిని, లంకేశ్వరులను, మనుష్యాంగన, తృణప్రాయంగా చూచి మాట్లాడుతున్నట్లుంది. ఎంత పొగరు. గుంపు అర్ధ చంద్రరేఖగా వుంది. తనచోట, తన రాజ్యంలో, తనవారి ముందు, లంకేశ్వరులు తిట్లు తింటున్నారా....? ఎంత దుర్గతి పట్టింకే వారికి! గుంపులో కలిశాను.

"నీ నేత్రాలు, కృష్ణపింగళాలు, క్రూరాలూ. ఆ రెండు కళ్ళూ, ఎప్పుడు నేలమీద పడతాయో అప్పుడు, నీవు నీ ఐశ్వర్యం, నేలపాలై ...." ఆ సీత, వచరుతోంది. వినరాని మాటలు, విషం మాటలు. వాగుతోంది సీత. ఒక్క దెబ్బకు నరికిపారేస్తే తీరిపోతుంది పీడ. అ-బ్బ, దానిమాట, కర్ణ కఠోరం.

పాపం. మండిన ఆ గుండెలోంచి అంతకంటె ఏం మంచిమాటలు వస్తాయ్. బలవంతాన తెచ్చి, బంధించి, ప్రాణం తీస్తుంటే, ఎవరైనా అంతే అంటారు. సీత తప్పులేదు. తప్పంతా మాదే. త్రిలోకసుందరి, మండోదరి మొదట్లోనే వారి ఆ పాడుబుద్ధిని చిదిమి వెయ్యాలిసింది. ఆ మహా యిల్లాలు పట్టించుకోలేదు. పాపం యిట్లా బద్దలౌతోంది. సీత యింకా ఏమో అంటోంది ఆగలేక పోయాను. అడ్డం వెళ్ళాను.

"ఏమిటి యీ ఆగడం, చాల్చాలు...." అన్నాను. అందరూ తెల్ల బోయారు.

"ఇందుకా పరిగెత్తుకుని వచ్చించీ...." అని వారి సరస చేరాను. తల వొంచుకున్నారు వారు.

వారి రెక్క-పుచ్చుకున్నాను, తల ఎత్తలేదు వారు. రండి....అన్నాను. మాట్లాడకుండా వస్తున్నారు. కాలదేవరకు ఏదో నామీద కరుణ కలిగినట్లుంది. లంకేశ్వరులు, మహాశూరులు త్రిలోకాలను గడగడలాడించినవారు, రావణ బ్రహ్మ, మారుమాట లేకుండా వస్తున్నారు. మౌనంగా నడుస్తున్నాను. మానావమానాలకు, ఆశానిరాశలకు, సమస్తానికీ సాక్షి ఐన సూర్యుడు, మబ్బుల చాటునుంచి మాకేసే చూస్తున్నాడు. మా యింటికి వచ్చేశాము. అమ్మయ్య. అనుకుంటున్నాను. గుమ్మంలో అడుగుపెట్టామో లేదో—

'ధాన్యా....' అన్నారు వారు. తల ఎత్తి చూచాను. "నీ యింటికి యిప్పుడు రాను, రాలేను. అక్కడా యిక్కడా అవమానమే జరిగింది. మొదట్లోనే నా మాటను తృణీకరించావు. చాల్చాలు....అన్నారు." బతిమాలుతున్నా, వినకుండా వెళ్ళారు. వెళ్ళిపోయేరు.

హుఁ. ఇంతే నీ జీవితం అని శూన్యం అయిన మా గుమ్మం అన్నట్లయింది. తిరిగి వచ్చావా? అని ద్వారబంధం పలకరించినట్లయింది. మగవాళ్ళింతే. నీ మంచి ఏమయింది. మంచికిపోయావు గదూ, అనుభవించు.... అన్నట్లయింది వీణ. చూళికా.... అన్నానుట. విరుచుకుని నేలమీద పడ్డానుట. నేలమీదబడితేనేం, నేలబడితేనేం— ఈ ధాన్యమాలిని జాతకం ఇంతే.

శకుంతల

చంద్రుడు మనస్సుకు కారకుడు. ఓషధీశ్వరుడు. వెలాతెలా పోయి-జారుకున్నాడు. ఇటు సూర్యుడు. బాలసూర్యుడు, నీలిపల్లవంలాగా, మందార పుష్పంలాగా పైపైకి వస్తున్నాడు. ఇద్దరూ మహానుభావులే. వారు జాదు కున్నారు. వీరు విజృంభిస్తున్నారు. యివి రెండు దశలు. ఈ ప్రపంచంలో ప్రతివారికీ యీ రెండు దశలమధ్యా వారి వారి దశలనుబట్టి నియామకం జరుగుతోంది.

ఇవాళ నేను అత్తవారింటికి పోతున్నాను. శకుంతల అత్తవారింటి కివాళ వెళుతోందని కణ్వాశ్రమం అంతా అదోవిధంగా వుంది. పసితనం నుంచీ యిక్కడే వుండి పెరిగిన పిల్ల. తమలో ఒకత్తుక, యిల్లాలై, తల్లి కాబోతూ అత్తవారింటికి వెళుతోంది. చెట్లు చేమలు ముళ్లాలు వేలాడ వేశాయి. ఆశ్రమ మృగాలు పిచ్చివాలకం పడి, నా చుట్టూరా తిరుగు తున్నాయి. మునులు,రుషులు, ఎంత నిస్సంగులైనా అదోవిధంగా వున్నారు. ఆశ్రమాగ్నులకు ప్రదక్షిణం చేసి, సెలవు తీసుకున్నాను. కణ్వమహర్షి, పెంచిన మమకారాన, అప్పగింతలు చెపుతున్నారు. కోకిల అనుమతి సూచ కంగా మధురంగా కూసింది. నన్ను రాజధానికి తీసుకుని వెళ్ళేందుకు తోడుగా వస్తూన్న వటువులు శార్ఙగరవుడు, శారద్వతుడూ, గురువుగారి ఆజ్ఞకు ఎదురు చూస్తున్నారు.

తండ్రిగారు, మహానుభావులు - "అమ్మా, వెళుతున్నావా నీ యింటికి...."అంటూ కన్నీరు తుడుచుకున్నారు. ఆడ తోడుగూడా వుండడం మంచిది అని వృద్ధగౌతమిని నా వెంట పంపుతున్నారు. ఆశ్రమాన్ని - సెలవు యివ్వు తల్లీ – అనుకున్నాను, మనస్సులో — ఇంతకాలం అనుభవంలో ఉన్న ఆశ్రమం, ఆదరించిన ఆశ్రమం, సంరక్షించిన ఆశ్రమం, పెంచి పెద్దచేసిన ఆశ్రమాన్ని వొదిలి వెళుతున్నానే అనేసరికి - మనస్సు మరోలాగయింది.

ఈ దేశంనుంచి ఆ దేశానికి పోతున్నాను. కొత్త దేశంలో, కొత్త పరిస్థితులలో జీవయాత్ర చేయాలి మరి. మళ్ళీ యీ ఆశ్రమాన్ని ఎప్పుడు చూస్తానో ఏమో. మహర్షి కణ్వులవారు అన్నారుగదా-"అమ్మా, నీ యింటికి వెళ్ళి దుష్యంతపత్నివి మహారాణివై బహుకాలం రాజ్యం ఏలి, బిడ్డడికి రాజ్యాభిషేకంచేసి పెద్దరికంలో అలాగే ఇక్కడకు వచ్చురుగానిలే"-అన్నారు. ఎంతమాట. వృద్ధాప్యంలో వానప్రస్థం వెళ్ళడం వుంటుంది గదా, అప్పుడు, ఏమో ఆశ్రమానికి వెళ్ళేబదులు యిక్కడికే రండి, నీవూ నీ భర్తా ఇక్కడికే రండి-అన్నారన్నమాట.

సూర్యుడు చరచరలాడి కరకరలాడాడు. చెప్పవలసిన మాటలు చెప్పి మహర్షి మమ్మల్ని పంపారు. బరువుగా కదిలాం. రాజధాని నగరం చేరుకున్నాం.

నిర్మలమూ, నిష్కలమూ అయిన ఆశ్రమాన్ని వొదిలి, ఆ బాల్య స్నేహితులయిన అనసూయా ప్రియంవదలను వొదిలి, మనోహరమయిన మాలినీ నదిని వొదిలి, ఆజన్మ సహచరులయిన తరువులను, చెరువులను వొదిలి, అలవాటు అయిన ఆమోదప్రమోదాలతోపాటు ఆత్మజ్ఞానాన్ని కలిగించే ఆశ్రమారణ్యాలను వొదిలి, ఆత్మీయమైన అన్నింటినీ వదిలి – జీవయాత్ర చేస్తున్నాను. మాయ మర్మాలు లేని ఆశ్రమంనుంచి కల్లాకపటాలు,

కార్పణ్యాలు, ఎత్తులూ జిత్తులూ వీర విహారంచేసే పట్టణానికి చేరుకున్నాము. స్వార్థం అంటూ ఎరగని మునివాటికనుంచి స్వార్థమే సామ్రాజ్యం ఏలే రాజధానికి చేరుకున్నాము. మహారాజసభకు చేరుకున్నాము. మహారాజ సన్నిధికి చేరుకున్నాము. శార్జగరవుడు, శారద్వతుడూ, గౌతమీ నేనూ మహా రాజ సభకు చేరాము. మహారాజు నన్ను చూడగానే, పరకళత్రంగా భావిం చారు. ఆ మాట ఆయన నోట వినగానే, నా గుండెలు కొట్టుకున్నయ్. మహర్షి కణ్వులవారి సందేశాన్ని శార్జగరవుడు చెప్పాడు. మహారాజుకు, నన్ను పెళ్ళాడిన సంగతే గుర్తులేదుట. అబ్బ, ఏమిటీ మోసం?

తాము ఆశ్రమానికి రావడం, నేను అతిథి సత్కారం జరపడం, వారు నన్ను చూడడం, మా చూపులు, మాటలు, హృదయాలు కలవడం, మనువులు, తనువులు ఒకటి కావడం, నేను యిదుగో చెబుతున్నాను. ఇది నా ఉంగరం. నా నామాక్షరాలు వున్నయ్ చూడు, మూడు అక్షరాలు. మూడు రోజులలో నా పరివారం వస్తుంది: నిన్ను నా దగ్గిరకే రప్పించుకుంటాను.... అన్నమాటలు-ఎలా మరవగలిగారు? రాజసభలో నా గోడు ఎవరికి పడు తుంది? అందులో, ఐశ్వర్యమత్తం అయిన ప్రదేశంలో! ఆనాడు, ముద్దుగా మురిపెంగా నా ప్రేల ఉంచిన ఉంగరాన్ని చూపించబోయాను. ఉంగరం ఎక్కడో జారిపోయింది. కాలం కర్మం ఎదురు తిరిగితే, మనమాట మనకు విరోధి, మన నీడ మనకు ప్రతికూలం. మనమే మనకు శత్రువులం కాబోలు. మహారాజు దుష్యంతులు నన్ను, నా మాటలను నమ్మలేదు. పరి త్యజించారు.

నా జీవితయాత్ర యిలా సాగుతుంది కాబోలు. పుట్టిననాడే తల్లి తండ్రీ నిర్దయగా నన్ను వొదిలేశారు. యిప్పుడు భర్త పరిత్యజించారు. ఇన్ని మాటలెందుకు? తక్కువ నోములు నోచినాను నేను. యిప్పుడు ఏం అనుకుని ఏం లాభం ? ఇంతకూ నా జీవితయాత్ర యిలా సాగుతుంది కాబోలు.

స్వతంత్రించి మహారాజు దుష్యంతులకు ఆనాడు నన్ను నేను సమర్పించుకున్నాను. ఇప్పుడు ఎవర్నని ఏంలాభం? నన్ను నేను అనుకోవాలి. హృదయం తెలియనిచోట స్నేహం చేస్తే, ఆ స్నేహం వైరంగా పరిణమిస్తుంది అన్నమాట. నా గతికి నన్ను వొదిలి, శార్జగకవుడు, శారద్వతుడూ కదిలారు. రాజపురోహితుడు పాపం, జాలిగుండెలవాడు అడ్డం వచ్చాడు.

"రాజా, యీమెను మాయింట వుంచుతాను, ప్రసవించేదాకా. నీకు చక్రవర్తి ఐన పుత్రుడు కలుగుతాడు అని పెద్దలు చెప్పారుగదా. ఆ పుట్టే బిడ్డకు చక్రవర్తి లక్షణాలుంటే సరేసరి— లేదూ, అప్పుడే కణ్వాశ్రమానికి ఆమెను పంపవచ్చు" అన్నాడాయన.

మహారాజు అంగీకరించారు. వీడుపును మింగుకోలేకపోయాను. యివతలికి వచ్చానో లేదో తేజోమేఘం ఆవరించింది. నన్ను ఆకర్షించి పట్టుకుంది. మబ్బుల్లో తేలిపోతున్నాను. స్పృహలేదు. ఏమైందో తెలియదు.

బిడ్డ కాదన వచ్చుగాని, కన్నతల్లి ప్రేమకు అవధిలేదు. మా అమ్మ మేనక నన్ను కాపాడుతూనే వుంది. మహారాజసభలో నవ్వులపాలై, వంచనపరురాలినుగానై, అక్కడే ఓ అయ్య ఇంట్లో తలదాచుకుని యాడవడం— మా తల్లికి ఎట్లా రుచిస్తుంది? పాపం, ఆమె, తన ప్రాణసఖిని సానుమతిని పంపిందిట.

కింపురుషుల పర్వతం, హేమకూటం, హేమకూటంమీద మారీచాశ్రమం. అక్కడ కన్నులు తెరిచాను. ఆశ్రమప్రదేశం అంటేనే చాలు, ప్రాణం లేచి వస్తుంది. మనస్సుకు మార్దవం, వచస్సుకు సంయమం, ఆత్మకు ఆమోదప్రమోదాలు వస్తయ్ అక్కడ. దుఃఖం అనేది వున్నా, పెద్దబావిలో

అడుగునపడివున్న చిన్న ముంతలాగా వుంటుంది. నా మనస్సుకు ముని పల్లెలకు మించిన స్వర్గం అంటూ తోచదు. అందుకే యిక్కడకు చేరి వుంటాను. మారీచాశ్రమం ఎంత గొప్పది!

ప్రాణవాయువు ఆడుతూండడంవల్ల, బ్రతికి వున్నట్లుగా, కల్పవృక్షాల మనమంటి చోట నివాసం, పైడి పద్మాలపరాగం పట్టిన నీట- ధర్మాభిషేకాలు, రత్నశిలాతలాలలో, అప్సరసలను తలదన్నే అంగనామణుల సన్నిధిలో ధ్యానం, మిగిలిన మునులు కోరుకునేవాటిమధ్య- యిక్కడ తపస్సు చేస్తారు. మరీ ఒకరు- ఏనాడు తపస్సుకోసం కూర్చున్నారో ఏమో- వారి చుట్టూ పుట్టలు పెరిగి, వారి కంఠందాకా పెరిగినయ్. పాముల కుబుసాలు, చెట్లతీగలు వారి కంఠాన్ని పెనవేసుకున్నాయి. వారి జడలలో పిట్టలు చిన్న చిన్న గూళ్ళు కట్టుకున్నయ్. సూర్యబింబాన్నే చూస్తూ ఆ తపస్వి స్థాణువులాగా ఉండిపోయారు.

తల్లినైనాను. కన్న తండ్రికి నా పోలిక అన్నారు. నాకేమో మహారాజ దుష్యంతుల పోలికలు కనిపిస్తాయి. అయితే వీడికి, స్త్రీ కుసుమ సౌకుమార్యమూ, తండ్రి వజ్రకాఠిన్యం కూడా కాబోలు!

పిల్లడు అల్లరివాడైనాడు. భరతుడు నా బంగారు బాబు, పెరిగి పెద్ద వాడౌతున్నాడు! పిల్లవాడు దుడుకు అయ్యాడు. పిల్లవాడు సమగ్రంగానూ వుంటాడు. పిల్లవాడు విని గ్రహిస్తాడు, చూచి గ్రహిస్తాడు. వాడికే తోస్తూ వుంటాయి. నిజమే. మునులు వాణ్ణి సర్వదమనుడు అంటారు. నాకేమో భరతా అంటేనే ముద్దు. కన్నతల్లి సంతోషించవలసినదే. కాని, భయం అంటే ఎరగడు. మనం కాని కాలం వెళ్ళదీస్తున్నాం నాయనా, దుడుకు పనులకు పోకు అని నెత్తిన నోరు పెట్టుకుని చెప్పినా వినడు. సింహం పిల్లలు పాలు తాగుతూంటే, వాటిని లాక్కొస్తాడు. ఆ తల్లి గూండ్రిస్తుంది. ప్రమాదం అంటే ఏమిటనే వాడితో ఎలాగ వేగడం?

సూర్యుడు రమ్యంగా ఉదయించాడు. చిత్రంగా పద్మాలు వికసించాయి. ఆశ్రమాంగనలు మధురంగా సౌమ్యంగా వారి వారి పనులు నిర్వర్తిస్తున్నారు. భరతుడు ఎక్కడికో వెళ్ళాడు. గౌరీ శంకరులకు మ్రొక్కుకుని వస్తున్నాను. భరతుడు ఎవరితోటో తర్కిస్తున్నాడు. ఆహా వాడి కంఠమే. తాపసిగూడా వుంది. ఆమె మాటల్లో గురించి చెబుతోంది. ఎవరికో మూతో కంఠం. మరి యితను మునికుమారుడు కాకపోతే ఎవరి బిడ్డ? బాగా ఎరిగున్న కంఠం. తాపసి పూరువంశజుడు, అంది. రక్షాబంధనం భరతుడి దగ్గిర్నుంచి జారిపడింది. దాన్ని ఆయన తీసి యిచ్చాడుట. ఆ రక్షాబంధనాన్ని భరతుడూ వాడి తలిదండ్రులూ తప్ప మరొకరు భూమ్మీదనుంచి తీసి యివ్వలేరు. మరొకరయితే అది పాపమై కరుస్తుంది. ఆహా, పౌరవ రాజన్నే.

ఇక్కడా వారి దర్శనం! ఈ స్థితిలోనా.... భరతుణ్ణి లాలిస్తున్నారు. మాసిన వలువలు, ఎండి, పాలిపోయిన ముఖం, అట్టకట్టిన జడలు నన్ను చూచి గుర్తుపట్టారు. వారే ముందు పలకరించారు. కన్నీళ్ళతో కంఠం పలకలేదు. వారు రాజర్షి. పౌరవ వంశరత్నం. నా హృదయసర్వస్వం. తమ తప్పు తెలుసుకుని, ఎంతగా కుమిలిపోయారో, సానుమతి చెప్పింది గదా! వారు, ఆనాటి ప్రేమతో నా పాదాలమీద వ్రాలారు.

నేను.... పరిత్యక్తను. నేను, వారిని ఓదార్చవలసి వచ్చింది; ఓదార్చాను.

మారీచులవారి సన్నిధికి వెళ్ళాము. నమస్కరించాము. సకుటుంబంగా నమస్కరించాను.

వారు దీవించారు. మారీచులవారు తెలిపారు, యిది దుర్వాసుల శాపం అని. అ-బ్బ. శాపం అనుభవించాము. జీవయాత్ర అంటే మాటలా? అనుభవించితీరాలి అంతే.

దమయంతి

ఎవరో కొట్టి నిద్రలేపినట్లుగా మెళకువ వచ్చింది. ఎందుకో భయం భయంగా నిద్రలేచాను. ఏదన్నా క్రూరమృగం సమీపించిందా? ఏ విష జంతువైనా దాపురించిందా? అయితే మాత్రం? మహామహుడు నా భర్త, నలమహారాజు నాపక్కన వుండగా భయమేమిటి? వీరీవారు? వీరీ? ఏమండీ? ....ఎన్ని రకాలుగా పిలిచినా ఏం లాభం? పక్కన వుంటేగదా పలకడానికి!

ఇప్పుడేగదా మాట్లాడుకున్నాము. ఇది నలుదారులు కలిసిన స్థలం. ఇది దక్షిణాపథానికి దారి; ఇది విదర్భమార్గం; ఇది కోసలకు వెళుతుంది; ఇది ఉజ్జయిని తెరువు. ఎటు పోదాం అన్నారు. ఎందుకో చెబుతున్నారను కున్నాను. అడవులలో నాతో ఏం ఇడుములు పడతావు, పుట్టింటికి వెళ్ళు, నీవు అయినా— అన్నారు నలమహారాజు. ఏడుపూ నవ్వూ వచ్చింది. అన్నట్లు మహారాజు అనగూడదు కాబోలు వారిని. మా రాజ్యంపోయి, మా ఐశ్వర్యం అంతరించి, మేం నిలవనీడలేక అడవుల పాలయ్యాం గదా మరి.

ఓ చెంప ఏడుస్తూనే, లాలనగా— 'పదండి మా పుట్టింటికి పోదాం-' అన్నాను.

పుష్కరుడితో జూదం అంటూ ప్రారంభించగానే ఎందుకో మన స్సులో రాయిపడినట్లయింది. అబ్బాయి ఇంద్రసేనుణ్ణి, అమ్మాయి ఇంద్ర సేననూ విదర్భకు మా పుట్టింటికి పంపించేశాను. మళ్ళీ అందరం ఒకచోట వుంటాం, మా రోజులు బాగుంటే. వారు అన్నారుగదా- "నేను రాను, సర్వస్వం పోగొట్టుకొని ఏ ముఖంతో అత్తవారింటికి వెళ్ళడం?" ఆమాటా నిజమే.

అయితే యీ మా మహారాజు ఎక్కడికి దయచేశారు? ఎక్కడికి వెళతారు నన్ను వొదిలిపెట్టి? వొదలరు. ఇందాకేగదా మరీ మరీ గట్టిగా చెప్పాను.... "భార్య దగ్గిరవుంటే, రోగార్తుడికి వైద్యుడూ ఔషధమూ దగ్గర ఉన్నట్లు. భార్యదగ్గర ఉన్నప్పుడు— ఎంతలేసి ఆపదలు వచ్చిపడ్డా, అవి వొచ్చినట్లే అనిపించవు" అన్నాను. పైగా, "నేను మీతోపాటుగా వుంటాను. అలసినప్పుడు, దాహం అయినప్పుడు, ఆకలివేసినప్పుడు, భార్యే గదా మనోవేదనను తొలగించేది అనీ అన్నాను. నేను మీకు అనుజీవితను,

అనువుతను, దయజూడవలసినదాన్ని, నన్ను విడిచి వెళ్ళకండీ," అనీ చెప్పాను. అట్లాగే అన్నారు. నిద్ర ముంచుకొని వస్తే - ఇట్లా వొరిగాను.

ఇంతలోనే వారు నన్ను విడిచి వెళ్ళిపోతారా? పోరు. మరి ఏరీ? ఎక్కడికి వెళ్ళారు? ఒకవేళ— ఒకవేళ, ఏమిటో ఒకవేళ. నిజంగానే నన్ను విడిచి వెళ్ళారా? లేక, లేక, పక్కలను ఎక్కడనో దాక్కుని ఉడికిస్తున్నారా? అట్లాగయ్యుండదు. అడవి, అడవిలో యిలాంటి స్థితిలో సరసాలూ పరాచకాలూ ఆడతారా? ఏమిటో మరి.

ఇదేదో దైవ వంచనగా వుంది చూస్తే. నిజంగా యిది దైవ వంచనేనా? అల్లాగే వుంది చూస్తే. ఈ దేవతలు ఎందుకో చిటిపి చేష్టలు చేస్తూంటారు. పులికి చెలగాటం, మృగానికి ప్రాణసంకటమానూ. దేవతలు మాత్రం అంత అవ్యక్తులా? ఎందుకని యిట్లా పరీక్షచేస్తారు? ఏమో, ఎటూ నిరర్థించుకోలేము.

పెళ్ళికి ఎందుకంత పని చేశారు. ఒక అమ్మాయి, ఒక అయ్యను పెళ్ళాడదాం అనుకుంది. ఆ అయ్య ఆ అమ్మాయినే పెళ్ళాడుదాం అనుకున్నాడు. ఇందులో వింతాలేదు, విశేషమూ లేదు. దేవతలు స్వర్గం నుంచి దిగివచ్చారు. పెళ్ళికొడుకునే తమకు దూతగా చేసి పంపారు వారు.

ఆ పరుడుకూడా తగుదునమ్మా అంటూ వచ్చి, ఆయన ఇంద్రుడు, ఈయన అగ్నిహోత్రుడు, ఈయన వరుణుడు, ఆ ప్రభువు యమధర్మరాజు, వారు నిన్ను వరించారు అంటూ చక్కట్లు చెప్తాడా?

"నేను నలమహారాజును తప్ప మరొకర్ని పెళ్ళాడను-" అన్నానని, దేవతలు, అంతవారు, స్వయంవర వేదికమీదికి నలరూపంతో వస్తారా? పెళ్ళి

కూతుర్ని అల్లరిపెడితే వారికి ఏం వొరుగుతుంది? ఏం బావుకున్నారు వారైనా యింతకీ?

ఓహో, యిదా దేవతలకు కోపకారణం? తమర్ని నేను వరించలేదని అలిగి, మమ్మల్ని యిలా సాధిస్తున్నారా? యిది తప్పకుండా దేవతలపనే. లేకపోతే, కన్నెత్తి చూడడానికి భయపడేవాడు, ఆ పుష్కరుడు, ఆయన వచ్చి— నిర్భయంగా జూదం ఆడదాం అని ఆహ్వానిస్తాడా? నలమహారాజు అంతవాడు, ఆడితే, ఆ పాడు జూదంలో— రాజ్యం పోవడమా? మా రాజ్యంలో మేము వుండలేకపోవడమా? మా రాజ్యం పొలిమేరలో మేము వుంటే— ఒక్కరు మమ్మల్ని పలకరించిన పాపాన పోకపోవడమా? చివరికి చెరువులలోని నీళ్ళుతాగి మూడురోజులు కటిక ఉపవాసాలు చేయవలసి రావడమా మేము?

ఆహా, విధి వంచన, ఎంత ప్రబలంగా వట్టుకుంటే మమ్మల్ని దుర్విధి. ఇంతకీ— యీ మహారాజు ఏరీ? ఏమండీ.... ఏమండీ అని యీ అడవి అంతా ఎక్కడ వెదకగలను? నా గతేంకావాలి? నాగతి సరే. ఆడది పాపం అని ఎవరైనా జాలి తలుస్తారు. ఈ నలమహారాజు గతేమిటని.ఏమయ్యారు? ఎక్కడికి వెళ్ళారు. ఒక్కరూ, కానికాలంలో విధి క్రూరంగా వేటాడుతున్న కానికాలంలో, పాపం, ఒక్కరూ ఏమై పోతారోగదా. పలకరించేవారు, ఆదరించేవారు, ఆలకించేవారు, కనికరించేవారు, కరుణ చూపించేవారు లేకుండా, పక్కనే నిలబడి, తన కష్టసుఖాలు తమవిగా, తన బాధలు, బాధ్య తలు తమవిగా పంచుకుని కలిసి బరువు మోసేందుకు నేనుగూడా దగ్గర వుండనప్పుడు, పాపం, ఏమౌతారో.... కర్మ. ఏం చెయ్యను, అడవి అడ వంతా గాలించడమేగద పని యింక నాకు.

అడివి చాలా అందంగా వుంటుందికాని, ఇప్పుడు నాకా, అందాలు చందాలు. చెట్టు చెట్టు వెదుకుతున్నాను. గుట్టగుట్ట వెదుకుతున్నాను. దొన దొన గాలించాను. దయగల మహారాజే, ధర్మపరుడే. ఆడితప్పనివాడే, నా మీద ప్రేమగలవాడే, నన్నుకాదని, విడిచి వెళ్ళారు. ఆఁ. కన్నీళ్ళుగూడా రానికాలం దాపురించింది. కర్మకాకపోతే, కట్టుకున్న బట్టల్నిగూడా పక్షులు ఎత్తుకునిపోతే— తెల్ల బోయి చూచారాయన. దారిద్ర్యం పరమావధిని తల పైన ధరించారాయన. నా చీర చించి చుట్టుకున్నారాయన. పాపం, అడవు లలో, పాపం పండిన పంటలు యీ అడవులు. యీ అడవులలో ఏం ఏం ఇబ్బందులు పడుతున్నారో ఏమో ఆయన. ఆకలికి తాళలేని సుకుమారుడు ఆయన. ఏ చిన్న బాధనూ ఓర్చుకోలేని మనసు మెత్తనివాడు ఆయన. ఏ కాస్త అవమానాన్నీ సహించలేనివాడు ఆయన. ఏమౌతున్నారో, ఏమో.

ఏమిటిది, యిట్లా గట్టిగా కరుచుకుంది. మింగుతోంది. "ఓ నిషధ మహారాజా, నన్నేదో పాము, కొండచిలువల్లే వుంది, మింగుతోంది. రండి, రండి కాపాడండి—" అరిచాను, ఏడ్చాను. పాపం, ఎవరో వస్తున్నారు. పాం మింగేసింది. ప్రాణాలు పోవుగద కర్మ. పాం చచ్చిపడివుంది. ఎవరో వచ్చి దాని నోరు నరికారు. నన్ను బయట పడేశారు. ఏం అసహ్యంగా వున్నాను. దగ్గిరే సరస్సు. స్నానం చేశాను. యివతల పడ్డాను.

ఎవడో పాపం, ఎరుకవాడు, పామును నరికి, నాకు ప్రాణదానం చేశాడు. కృతజ్ఞురాలిని. చేతులు జోడించి, తలవొంచి — నమస్కరించి, కృతజ్ఞురాలిని, అన్నాను, తండ్రిలాగా కాపాడాడని. పేదవాళ్ళం అంతకన్న ఏంచెయ్యగలం. పేదవాళ్ళకు మాటలే ఆస్తి మరి. విధి వంచన. నా మాటను నిమిషంలోనే నా మొహాన విసిరికొట్టింది. అతనెవరో ఎరుక, పిచ్చిగా చూడటం మొదలుపెట్టాడు. వాగుడు ప్రారంభించాడు.

అంటరాని, దగ్గిరికి రారాని, తేరి చూడరాని నన్ను, ముద్దుమాటలు పలకడం ప్రారంభించాడు. దేవతలు, యిలాంటి పనిచేసి వారి వారి చోట్లకు దయచేశారు. అరికాలిమంట నెత్తికెక్కింది నాకు. కోపం తలకెక్కింది. కాల్చేట్టు చూచాను. పాపం ఆ ఎరుక, అక్కడకక్కడ అప్పుడప్పుడు నిలువునా చెట్టు విరిగిపడ్డట్టు పడి చనిపోయాడు.

మా నలమహారాజు యీ అడవిలో లేరు. ఉంటే - ఇంత జరుగుతుంటే-తెలిసి రాకపోరు. వారు ఎక్కడికో గంపెడు దిగులుతో వెళ్ళారు. పాపం ఏమౌతున్నారో ఏమో. పుళ్ళీ అన్వేషణ. ఎక్కడా మా మహారాజు అడుగుజాడైనా కనిపించలేదు. భీకరారణ్యాలు, సూర్యరశ్మి గూడా చొరరాని అరణ్యాలలో పడి తిరుగుతున్నాను. ఎదుట ఓ మునిపల్లె. మహాతపస్సులైన మునీశ్వరులు. వెళ్ళి వారికి నమస్కరించాను. ఎవరు నీవన్నారు. చెప్పాను. ఏడ్చాను. వారు దయచూపారు. దివ్యముఖదృష్టితో చూచారు.

కొద్దికాలంలోనే మీరు కలుసుకుంటారు. మీ రాజ్యం మీకు తిరిగి వస్తుంది అన్నారు. మనుకారం వర్జించిన మహనీయులమాట దబ్బరకాదు, కాని, కొదికాలం అంటే? మనం లెక్కించుకొనేట్లైనా, లేక, అనంతమైన కాలంలో, అపరిమితమైన జన్మల్లో ఏకో, ఎప్పుడో ఒకప్పుడు అనా అర్థం? ఏమైతే మాత్రం చేయగలిగింది ఏమివుంది. వారు దీవించారు. అంతేచాలు. అదే పదివేలు. దారికి అడ్డంపడి పోతున్నాను.

చనుప.

మా నలమహారాజును మీరెవ్వరన్నా చూచారా అని అడిగాను. నా ఆకారం నాకే భారంగా వుంది, నిజం. వారిలో కొందరు, పిచ్చిది అన్నారు.

నన్ను చూచి, కొందరు పిశాచం అన్నారు. కొందరు గేలిచేశారు. కొంగరు పకపకా నవ్వారు. వారు చేదిపురానికి వెళుతున్నారట. వారితో కలిశాను. వారిని బతిమాలి వారి వెంట రావడానికి ఒప్పించగలిగాను. ప్రయాణం చేస్తున్నాం. అర్ధరాత్రి ఓ పెద్ద చెరువుదగ్గర ఆగాం. అందరూ నిద్రిస్తున్నారు. మనస్సు మాడుతూన్న మహారణ్యం లాగుంది. నాకు నిద్ర ఎట్లా వస్తుంది? ఏనుగులు వచ్చినై. నీరు తాగినై. వాటిలో కొందరలో అని, కొందర్ని తొక్కి చంపినయ్. చనుపలోనివారు బిగ్గరగా అరవడం మొదలెట్టారు.

అరుపులు విని పోతూ పోతూన్న ఏనుగులు తిరిగి వచ్చి మిగిలిన వాళ్ళను పట్టుకుని-భయంకరంగా ఎత్తి, నేలను పడేసి బాది చంపినయ్. బతుకుడామో, అనుకున్న వారినేమో చంపినై. చావురాదేమా నాకు! అని ఏడుస్తున్న నన్నేమో వదిలి వెళ్ళినయ్. బ్రతకడం అంటే బాధలు పడడం అని అర్థం కాబోలు.

మళ్ళీ ఒంటరిదాన్ని అయ్యాను, ఆ కాస్త తోడుగూడా లేదు. అల్లాగే ధూళికప్పి, జుట్టు అట్టలు కట్టి, మాసి మంగలం లాగైన వలువతో, నిద్రాహారాలులేక - పిచ్చి కళపడి, ఒక్కొక్కతెను దారిని పడిపోతున్నాను. నా మొహానే యిన్ని యిబ్బందుల్ని వ్రాశాడే విధిః పాపం, ఆ నలమహారాజు ఏం బాధలకు పాల్పడుతున్నారో ఏమో.

చేదిపురం ట అది. దారిన పడిపోతున్న నన్ను, ఎవర్తో వచ్చి ఆపింది. తనతో రమ్మంది. రాజమాత పిలుస్తున్నారంది. వెళ్ళాను. ఆ చల్లని తల్లి ఆదరించింది. తన దగ్గిర వుండమంది. నా మాటలు విండి. నేను సైరంధ్రినన్నాను. ఆమె అంగీకరించింది. గౌరవంగా చూచింది. అతకని గౌరవం భయంకరంగా వుంటుంది.

గతిలేక అక్కడే వున్నాను. ఆ రాజమాత, తన కుమార్తె సునంద అనే ఆమెతో నాకు స్నేహం కలిపింది. కాలం నెమ్మదిగా, బరువుగా, బండరాళ్ళలాగా, బాధగా, భయం భయంగా; వెలితిగా గడుస్తూంది. సుదేవుడుట ఎవరో బ్రాహ్మణుడు, వచ్చాడు. నన్ను తేరిపార జూచాడు. "ఈమె దమయంతి అన్నాడు. ఎవరీయన? ఎట్లా నన్ను గుర్తుపట్టాడు? ఆయనే చెప్పాడు– అమ్మా, నీ తోడబుట్టినవారి స్నేహితుణ్ణి. మీ వారందరూ క్షేమంగా వున్నారు. నిషధదేశంలో మీకు జరిగింది మీ తండ్రిగారు విన్నారు. మీరు వస్తారేమో అని చూచారు. ఇప్పుడు మిమ్మల్ని వెతికిస్తున్నారు— అన్నాడు." నేను వెక్కి– వెక్కి– ఏడ్చాను. నిగ్రహించుకోలేకపోయాను. ఆ సుదేవుడు, నా భ్రూమధ్యంలో పద్మరేఖలను చెప్పి రుజువు చేశారు. అప్పుడు తెలిసింది, రాజమాత ఎవరోకాదు, నాకు పినతల్లి అవుతారామె అని. విదర్భకు చేరాను. మాతల్లి నిలూనా నీరయింది నన్నుచూచి. అల్లుణ్ణి వెదికించడం పూర్తికాలేదు. నాకూ జీవితంమీద విరక్తి పుట్టింది. ఈ బ్రతుకు చాలు అనిపించింది. అమ్మతో చెప్పాను. తండ్రిగారు మరికొందర్ని మళ్ళీ పంపిస్తున్నారు, నలమహారాజును వెతకడానికని. నేను కొన్ని మెలకువలు చెప్పాను. పర్ణాదుడనే భూదేవుడు వచ్చి చెప్పాడు, నా మాటకు అయోధ్యలో సమాధానం వచ్చిందట. రుతుపర్ణమహారాజు వంటలవాడు సమాధానం యిచ్చాడట. సుదేవుణ్ణే మళ్ళీ అయోధ్యకు పంపాము. దమయంతి పున స్స్వయంవరం— అని చెప్పమన్నాం. రేపు, లేదు, ఎల్లుండే అని చెప్పమన్నాం. సుదేవుడు అట్లాగే చెప్పాడు. ఋతుపర్ణుడు రథంమీద మర్నాటికి అయోధ్యనుంచి విదర్భకు వచ్చారు. ఆ రథఘోషం వినగానే తెలిసింది నలమహారాజు రథం అని.

నలమహారాజుకు అశ్వహృదయం తెలుసు. ఆ రథధ్వని మరొకరిది కాదు. తీరాచూస్తే ఎవరో. నలమహారాజు కానేకాదు. రుతుపర్ణుడికి తండ్రిగారు మర్యాదచేసి విడిది చూపించారు. రుతుపర్ణుడికో బాహుకుడు అనేవాడూ

వచ్చాడు. అందవికారానికి పెట్టింది పేరు అన్నారెవరో, సర్వావలక్షణాలూ ఉన్నాయిట. పాలు విరిగినట్లయింది నా మనస్సు. ఐనా, చూచిరమ్మని కేశిని పంపాను. అది నాకు కావలసింది.

కేశిని వెళ్ళి బాహుకుణ్ణి మాటలలోకి దింపింది. నలమహారాజు ప్రపక్తి తెచ్చింది. భార్యను అడవిలో నిర్దయగా వదిలిపెట్టడం చెప్పింది పాపం, ఆ బాహుకుడు విని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడట. ఒకవేళ, బాహుకుడే, నా భర్తా అ-బ్బ. ఎక్కడో, కానిదేశంలో, ఒక మహారాజుకు వంటలవాడుగా కాలం గడిపారా యింతకాలం. మూడు సంవత్సరాలు ముప్పు తిప్పలూ పడ్డారా నలమహారాజు.

ఇంద్రసేనుణ్ణీ, ఇంద్రసేననూ బాహుకుడి దగ్గిరికి పంపాను. బాహుకుడు వాళ్ళనుచూచి కించా మీదా అయ్యాడుట. బాహుకుణ్ణి నెమ్మదిగా అంతఃపురానికి రప్పించాము. ఎంత ధైర్యంగా వచ్చాడని.

విజనం ఐన అడవిలో, నిద్రపోతూన్నదానిని, అనువ్రతను, అబలను, అగ్నిసాక్షిగా పెళ్ళాడిన దానిని వదిలి వెళ్ళినవారు, నలుడు తప్ప మరొకరులేరు అన్నాను మాటలలో. కావాలనే అన్నాను. ఆ మెత్తని మనస్సు నొచ్చుకుంటుందని తెలిసిగూడా అన్నాను. ఆగలేకపోయి అన్నాను. వీడుస్తూ అన్నాను. కన్నీరు తుడుచుకోలేదు, కన్నీటి ధారలమధ్య అన్నాను.

బాహుకుడు నిదానంగా చూచాడు. "కలిచచ్చి నామీద కెక్కించి. నా బుద్ధి పట్టు తప్పింది. అందుచేత వదిలాను. బహుబాధలు పడి కర్మను అనుభవించాను. తపస్సు చేశాను. నీవూ దుఃఖ భారంతో కర్మను అనుభవించావు. ఇదుగో యిప్పుడే కలి నన్ను విడుస్తున్నాడు. అందుకే యిక్కడికి వచ్చాను...." అన్నారాయన.

"సరేగాని, నన్ను అగ్నిసాక్షిగా పెళ్ళాడినదానివి, అనురక్తురాల్ని, కాదని— మరో ఆపేక్షతో లోకం స్వయంవరం ఏర్పాటు చేయడం భావ్యంగానే ఉందా?" అన్నారు.

"మిమ్మల్ని రప్పించడానికే" అన్నాను. నా ప్రాణాలు గిలగిలలాడుతున్నయ్. "నా మనస్సులో మరో పాపభావం వుంటే, మిమ్మల్ని తప్ప మరొకర్ని ధ్యానిస్తే, స్మరిస్తే— కర్మసాక్షులు అయిన దేవతలు నన్ను యీక్షణం చంపివేయరా—" అన్నాను.

ఆకాశంనుంచి దివ్యవాక్కు వినబడింది. "ఈమె పలికింది నిజం. దేవతలు ఈమెను కాపాడారు" అని. నలుడు, కర్కోటకా అని ధ్యానించారు. పైనుంచి బట్టలు పడినయ్. నలమహారాజు వాటిని ధరించారు. చురుగుజ్జు, పరకాళ్ళు, చప్పిదవడలు, మిడిగ్రుడ్లు, పిచ్చిచూపులు, వెర్రివాలకం పోయింది. పొగలోనుంచి అగ్నిహోత్రుడులాగ నలమహారాజు నిలిచారు. ఎంతకాలానికి కళ్ళబడ్డారు.

మునిపల్లెలోని మునుల మాటలు నిజం కొతున్నాయి.

కొంతకాలం వున్నాం.

కొద్దిపాటి పరివారంతో వారు నిషధకు వెళ్ళారు. పుష్కరుడితో మళ్ళీ జూదం ఆడారు.

గెలిచారు.

మా రాజ్యం మాది అయింది. మునుల మాట నిజం అయింది.

అబ్బ, జీవితం అంతా పరీక్షగానే అయింది మాకు.

లేఖలు

శ్రీ:

మ ద్రా సు,
30-9-1955.

బ్రహ్మశ్రీ వేదమూ ర్తులయిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిల వారి దివ్యసన్నిధికి నమస్క-రించి, విధేయుడు జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి వ్రాసుకొనేది —

ఈ జాబులు సేకరించి ముద్రణ కనుమతించిన డాక్టర్ చాగంటి కనకయ్య (కనక్ ప్రవాసి) గారికి కృతజ్ఞత.

నిన్న సాయంత్రం 4 గంటలకు, తమరు వాత్సల్యంతో పంపిన 'అనుభవాలూ—జ్ఞాపకాలూ' అందింది. [1] సంగతి సందర్భాలు బోధపడినవి— నిన్న రాత్రి 9-05కు ఓసారి పుస్తకం పూర్తిచేశాను. తిరిగి చదువుతున్నాను. సగం అయింది. మీ ఆజ్ఞ చొప్పున. సోమవారం నాడు- వ్రాస్తాను. చాలా విషయాలు వ్రాస్తాను. ఓ-పే-ద్ద వుత్తరమే వ్రాస్తా. మిగిలిన సంపుటాలు, అచ్చు అవుతున్నయ్యా? ఫారాలు మడిచారా? గాలీప్రూఫుల దశలో వున్నయ్యా?? మరి వాటినీ పంపాలి మీరు. పంపరూ! మీ తల్లిగారి ఫోటో, మీ పెద్ద అన్నగారి ఫోటో లేకపోవడం—[2] ఈ సంపుటానికి ఒక లోపం- ముందే అనేస్తున్నాను. అచ్చు తప్పులు రెండో లోపం- తెనుగు పుస్తకాలకు అచ్చుతప్పుల యోగం తప్పదేమో. పుస్తకం అందింది అని తెలుపుడు చేయ డానికే ఈ కార్డు. అంతే. సోమవారం నాడు- నా మనస్సు, హృదయం వ్రాస్తాను.

మీ

శ్రీరంగం శ్రీనివాసరావుగారు, [3] జ/రు/శా

C/o, అమణగిరి మొదలి వీధి, 30-9-55

మందవల్లి,

మైలాపూరు, మద్రాసు-4

---

1. రాజమండ్రిలో 'కలాభివర్ధనీ పరిషత్తు' పేరున శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి సొంతంగా 'అనుభవాలూ — జ్ఞాపకాలూను' తాలూకు మొదటి సంపుటాన్ని ప్రకటించారు. ఇవి మొత్తం 3 సంపుటాలు. చివరిది అసంపూర్ణం. శ్రీపాదవారి మృతి తర్వాత రాజమండ్రికో అద్దే పల్లివారు 1966లో వేశారు.

2. తొలి సంపుటం - మూడో సంపుటంలో వచ్చాయి, తల్లి మహాలక్ష్మి సోదెమ్మ, తండ్రి లక్ష్మీపతి సోమయాజి.

3. ఈ చిరునామా శ్రీ పాద కోరివుంటే జ. రు. శా. ఇచ్చి వుండాలి.

2

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి—

తామెంతో వాత్సల్యంతో పంపిన 'అనుభవాలూ - జ్ఞాపకాలూను' అందగానే అందినట్లు వ్రాసుకున్నాను. ఇప్పటికి గ్రంథం ముమ్మాటు చదివాను. ఇంకో రెండు మూడుసార్లు చదివేట్టున్నాను.

కారణం!

పెద్దలతో పోలికకు తగను; కాని తమకూ నాకూ ఎన్నెన్నో పోలికలున్నయ్! శ్రీపాదవారి వలె జిలసూత్రం వారున్నా— తత్రాపి— మా కోవ, శ్రీవిద్యోపాసనే తమకు ఆస్తిగా కలవారు. మా యింట, ఏ మంచి జరిగినా మా అమ్మవారి కృప అనుకుంటాము.

'భారతి' చదివినందుకు మా తండ్రిచేత దెబ్బలు తిన్నాను. నానా హింసలూ పడ్డాను. ఎందుకూ ? కవితావ్యాసంగానికనీ, స్మార్తం చెప్పుకో నందుకు—చెప్పుకున్నది మరిచినందుకు అనీ. నేను నక్షత్రేష్టి — ఇత్యాదులు చెప్పుకొన్నాను. నా పెళ్ళికి పురోహితుణ్ణి ఆగమనకుండానే మంత్రాలన్నీ నేనే చెప్పుకున్నవాణ్ణి. ఇద్దరికీ అంగ్లం రాదు. రాదు అనే దుగ్ధ ఉంది. ఇట్లానే ఎన్నెన్నో కనపడ్డవి. కాని తేడా ఒక్కటే ఉంది. అతి పెద్దది. అదేమిటంటే? తాము హఠంతో 'పారపృశ్వా' అయినారు. నేను — రెంటికిం జెడిన రేవడనైతిని. శాస్త్రిగారూ, ఇంతే—చాలదూ ?

కొన్ని మొక్కలు

నేల ఎవరో పదును చేస్తారు. కుదురు వేర్పరుస్తారు. మొక్కను పాతుతారు. నీళ్ళు పోస్తారు. శ్రద్ధ చూపిస్తారు. పెంచుతారు. మొక్క-పెరగ వచ్చు. పెట్టకీ కావచ్చు.

మరికొన్ని మొక్కలు!

కొండల్లో పుడతై. కొండను ఛేదిస్తాయ్. తలెత్తుతై- ఏ తుఫానుకూ చలించవు. ఈ కొండ చెట్టున్నది చూచారూ, ఇది అతిగా ప్రాణశక్తిని ఖర్చుపెట్టిగాని తలెత్తలేదు. తలెత్తిందా, దాన్ని తుంచడం — బ్రహ్మదేవుడికి వశం కాదు.

మీరు

గిరివృక్షం వంటివారు, ఉద్యానంలోని చెట్టు కారు. అంత జీవశక్తిని క్షణం క్షణం వెచ్చిస్తేనేగానీ—'ఇల్లు పట్టిన వెధవాడ బడుచు', 'షట్కర్మ యుక్తా', 'అపిదళతి వజ్రస్య హృదయం', 'మార్గదర్శి', 'జాగ్రత్త పడవలసిన ఘట్టాలు', 'కచ్చితమైన జవాబు' ఇత్యాది ఘన కథల రచయిత — ఏ ఆంగ్ల కథనో తెరువాటుకొట్టి వెలిగేసాటి రచయితల్లో, కేవలం సాలీడువలె-తనలోంచే అంతా సృష్టించుకొనే రచయిత ఆవిర్భవించలేడు.

ఇందుకు — ఇందుకు మీ చిన్న అన్నగారికి [1] మీతోపాటూ అందరూ కృతజ్ఞులు. ఓఁ!

వేదం, శ్రౌతం, స్మార్తం, యజ్ఞం, అగ్నిహోత్రాలు, రథంతర సామగానం, (నేను చెప్పుకోలేదు సామాలు) దగ్గిరనుంచీ, బెంగాలీ పత్రిక దగ్గరనుంచీ-అట్టకు అట్టా కదిలింది. ఎంత గొప్ప సంగతి! చదివి వీడ్చాను. నవ్వాను. పాపం, ఎక్కడా ఇంతే అనుకున్నాను. గొప్ప పుస్తకం.

కావడానికి మీరు సిద్ధాంతిగారి అబ్బాయి; కాని నవీనాంధ్ర కథకులలో ఘనాపాఠీ.

---

1. కుల విద్యకీ తనలా ము. శాస్త్రిగారు కూడా అంటిపెట్టుకుని వుండాలే గాని కళా, సాహిత్యాల జోలికి పోగూడదని వారి చిన్నన్నగారు వెంకటరమణ సిద్ధాన్తి-గొప్ప జ్యోతిశ్శాస్త్రజ్ఞుడూ, పంచాంగ కర్త-ఆంక్షలు పెట్టి ఆజ్ఞాపించి దండించేవాడు.

చెరుకు పానకం తాగరు-పుచ్చుకుంటారు. కనుకనే తియ్యటి తెలుగు వ్రాస్తారు. తెనుగు వచనం తీపి మీ సొత్తు.

నేను సిగరెట్లు తాగుతాను. చివరికి మిగిలేది నుసి.

శాస్త్రిలవారూ! నేనూ వారాలు [1] చేశానండోయ్! నేను మాధుకరం ఎత్తలేదు. శాస్త్రిగారూ, ఇంత పైదిక సంపద గనకనే. మీరు 'అయ్యో, చెడిపోతున్నారు' అని అంత విచారపడి వుంటారు గనకనే 'బ్రాహ్మణాగ్ర హారం' వ్రాశారు. "ఔటు పైనిది బ్రాహ్మణాగ్రహారమునకు", "పెంచను లేదు కుదించను లేదు" భేష్!

శాస్త్రిలవారూ, మీరు ఈ పుస్తకం రచించకనే వుంటే- చాలా నష్టం వచ్చేది.

వివరిస్తాను.

ఇది సామాన్య మానవుడి చరిత్రకాదు. క్షోభ! ఘోష!

ఆ ఘోషను ఆ సామాన్యుడు అమోఘమైన భాషలో చెప్పాడు, బాగానే వుంది. కాని ఆ సామాన్యుడు, -జీవితం - పరమపద సోపానపఠం, (వైకుంఠపాళీ) ఆడాడు. వేదం, జ్యోతిషం, శ్రౌతంలో ఎత్తాడు తెరచాప. బాబా, అది వచ్చి వచ్చి బ్రహ్మ సమాజికుడి లెవెల్‌కు దేకించింది. అంటే- కాలపురుషుడు (తంత్ర పరిభాషలో) కాళి పక్వానికి తెచ్చింది.

అవునా?

---

1. రోజూ ఒక బ్రాహ్మణ గృహంలో భోంచేసి గురువు వద్ద విద్యాభ్యాసం చేసే పాత పద్ధతి.

2. ప్రతి బ్రాహ్మణ గృహానికి వెళ్ళి భిక్ష అడిగి భోజనం సంపాదించుకునే బ్రాహ్మణ విద్యార్థుల పాతపద్ధతి.

ఇక్కడో చిత్రం ఉంది.

కాలానికి తగిన ప్రాణి, ఆత్మవిరుద్ధ వాతావరణంలో పుట్టిపెరిగింది. అసలు ఆ ఆత్మ రణ పెంకెది. చీల్చి చూస్తుంది దేన్నయినా గుడిపాటి వెంకటాచలం వలె, విశ్వనాథ సత్యనారాయణ వలె. వీరందరికీ చిత్తశుద్ధి, పట్టుదలలు సామాన్యం. మనకు ఎందుకు పోనిమ్మా అని ఊరుకోదు.

అంత తీవ్రత కలవాళ్ళు కనకనే -

సత్యనారాయణ, సు-బ్రహ్మణ్యశాస్త్రి, వెంకటాచలంగార్లు ఘనాపాఠీలు అయినారు.

'ఇదిగో మా సంపద' అని ఎవరైనా చెప్పుకో తగ్గట్టు తయారు అయినారు.

వీరికి జోహారు! క్షమించండి. జేజే, జోజో, జేతలు.

ఇక

మీ పుస్తకం సకాలంలో వచ్చింది.

విశద పరుస్తాను, నా వూహను.

వ్యాఖ్యానం చేస్తాను.

భాష్యం చెయ్యక తప్పదు.

మీరు అన్నట్టు—ఇది యుగసంధి.

కావటానికి ప్రతిక్షణమూ యుగసంధే. కాని - ముత్తుస్వామి దీక్షితులు, త్యాగయ్యల నాడు, నేడు మనకున్న భావ సంఘర్షణ, ఆచార సంఘర్షణ, ఆచరణ సంఘర్షణలు లేవు.

గతం గతంకాదు. కావలసినన్ని తల పుళ్ళు కడుక్కోడానికిగాను - సర్వరక్షకర చక్రస్వాములుగా - (1) బ్రహ్మ సమాజం (2) ఆర్యసమాజం

(3) కాంగ్రెసు (4) సోషలిజం (5) కమ్యూనిజం - ఇత్యాదిగా ఉద్యమాలు వచ్చినై. తెలుగులు ప్రతి దాంట్లోనూ గఫీమని ఉరికారు. తేట ఎవరికో ఐతే తెట్టెలు మనవి. ప్రతి ఉద్యమంలోని చెడూ మన వంటికే పట్టింది. ఇక - పైన చెప్పినవి అన్నీ గుల్లలు అని తేలింది - నాగరికతను అవేవీ పెంచలేకపోయినై. నేడు ప్రతి గుంటెలోనూ ఘోషించేది 'లాలస'.

స్త్రీ దాహం, పదవీ దాహం, ధన దాహం - ఇంతే నేటి నాగరికత ఇచ్చినవి.

ఇది నిలవదని ప్రతివారూ పైకి అంటారు. కాని అవే కావాలి.

అంటే, చిత్తశుద్ధి నశించింది.

రసికతలేని మైథునం.

అసమర్థ నిర్వహణం.

అరగని ఆరగింపులూ

వచ్చిపడి పీడిస్తున్నాయ్.

పర్వతాలంత పెరిగి ఉన్నయ్.

ఇవి నాశనం కావాలి.

ఎట్లా ?

సమర్థులు, వజ్రాయుధం వలె కలం నడపగలవారు — తీవ్ర వ్యక్తులు, తీవ్ర వాక్యాలు, ధీరులు— ఈ మాయ పర్వతాలని ఛేదించాలి. ఛేదించాలి, చూర్ణం చూర్ణం చెయ్యాలి.

బ్రహ్మచర్యం బిలువ నచ్చచెప్పి స్త్రీ దాహం కట్టాలి.

'నేను ఇంత చాటపెయ్యనా?' అనిపించి, అటువంటి అక్కల కర్ర నోటపడేసి, ఒక దాహం కట్టాలి.

జతర పుట్టా లేని వాణ్ని వాడికి వాడికే తెలియజెయ్యాలి.

ఇది మీ గ్రంథం సాధించుతుందనుకుంటాను.

మన జాతిమీద నేనా ?

కనీసం పదిమంది మీద-చాలమా?

క్రమంగా కొందరు, మరికొందరు మారుతారు.

ఆ ఆశ నాకు ఉంది.

ఐతే,

అవసరాన్ని మించి, అతిగా జీవశ క్తి ఖర్చుపెట్టాలిసిన వారయినారు మీరు, చలంవలె, విశ్వనాథ వలె.

అందుకే—

వారి వలెనే— మీరూ అతిగా చెప్తారు అనుకున్నాను కొంత చదివి. తరవాత తెలిసింది, "గ్రంథం ఉపదేశకం. పడిన వ్యథ అతీతం—" కనక ఆంత చెబుతున్నారు, అనుకున్నాను, చివరికి. ఐనా వ్రాస్తూ మీరు చిన్నప్పటి సంగతులు వ్రాస్తున్నారు కదా.

మల్లిడి సత్తిరెడ్డి [1] గారింట —

ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రికల ప్రస్తావనంలో—

"అప్పటికి కాంగ్రెసు మరకలు పడలేదు" అనడం తప్పు అనను గాని, అనవసరం. అప్పటి మీ ఉత్సాహం, వాటిని చూడగా ఆనాడు మీకు కలిగిన ఉద్రేకం వ్రాస్తే గొప్పగా వుండేది- అనుకుంటాను.

---

(1) మల్లిడి సత్తిరెడ్డి సంస్కారి, సాహిత్యప్రియుడు దాత. రాజమండ్రి వద్ద రాయవరం గ్రామం, 'రెడ్డిరాణి' పత్రిక నడిపారు. శ్రీపాద వారి మిత్రులు.

అక్కడక్కడ ఇట్లాగే—

ఈ పంక్తులు ఎందుకు వ్రాశారు? లేకపోతే పుష్టి కలిగేది కద ఇంకా— అనుకున్నాను, బహు కొద్ది సందర్భాల్లో. మన్నించండి, ఇట్లా వ్రాస్తున్నందుకు.

మీ తల్లిగారి ఫొటో, మీ పెద్దన్నగారి ఫొటో - ఈ రెండూ లేక పోవడం గ్రంథానికి మచ్చ, ఖాయం.

"చిన్నన్న కాల్చుకు తిన్నాడని ఆయన బొమ్మ వేశారా?" అని ఒక్కరుగూడా అనుకోగూడదు.

ఆ చిన్నన్న అంత పట్టు పట్టకపోతే- శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు— ఇంత పట్టుదల మనిషి, ఇంత శ్రద్ధాళువు, ఇంత ఘనాపాఠి అయి వుండరు.

నిజమే. అందుకే ఆయన ఫొటో, తండ్రి ఫొటోతో పాటు— వాస్తవమే.

కాని, తల్లిగారిదీ, మిగిలిన అన్నగారిదీ ఫొటోలు ఉంటే- ఎంత నిండు వచ్చేది అనుకున్నారు!

ఎంత సూక్ష్మంగా మీ చిన్నన్నగారు చెబ్బతినేవారు అనుకున్నాను!!

ఓ!!!

మిగిలిన సంపుటాలు ప్రింటు అయినయ్యా?

ఇంకా కాలేదా?? అబ్బ!! గబగబా అచ్చుకావాలి.

---

(1) 'అనుభవాలూ—జ్ఞాపకాలూను' రెండో సంపుటంలో సు. శాస్త్రిగారి పెద్దన్న శివరామ సిద్ధాంతి దీక్షితుల ఫొటో వుంది. జరుక్ తొలి సంపుటం గురించే రాసింది.

పరాక్రమించాలి.

శాస్త్రిలవారూ, సొంత సోదిలో పడుతున్నాను.

1952 మే మాసంలో- నాలో మథన ప్రారంభం ఐనది. తీవ్ర రూపం పొందింది. 1952 ఫిబ్రవరి నుంచే అసలు మార్పు ప్రారంభం. 1952 నవరాత్రుల నుంచీ సంధ్యావార్చందే పచ్చి మంచినీళ్ళు త్రాగడంలేదు. 1953 జనవరి 29 నుంచీ- మా పెద్దలవలె, నేనున్నూ శ్రీ విద్యోపాసకుణ్ణి— ఆ చమత్కారాలు ముఖాముఖీని మనవి చేసుకోతగ్గవి. ఎప్పుడో మీ పాదాల దగ్గిర వ్రాలి ఆ కథ చెప్పుకుంటాను.

నేడు, నా వూహలు, నా మార్గాలు; నా స్నేహితుల మార్గాలతో భేదించినవి. నా నమ్మకాలు మారినవి.

తెనుగుభాష మధురం అయినది. కాని, ఏ గొప్ప సంగతి చెప్పాలన్నా చాలదు అనిపిస్తోంది.

సంస్కృతం....!

అడిగారూ ?

కాని, ప్రజాపరంగా, మూక మొత్తంమీద చెప్పాలంటే, తెనుగే అవసరం, సంస్కృతం చాలదు.

ఇట్లాగా కొట్టుకుంటున్నాను.

ఇలాగే- 'రాజకీయాలు, నినాదాలు, ఎంత గగ్గోలు ఎత్తించినా అశాంతిని పెంచేవి కాని ఆత్మ తృప్తిని అవి కలిగించలేవు' అని నమ్ముతున్నాను.

ముఖ్యంగా, నినాదాలు, అరుపులు- చాలా - కన్నులలో దుమ్ము కొడుతున్నాయ్.

గురజాడ అప్పారావు యుగకర్త శకకర్త అని గగ్గోలు పెడుతూంటే— ఏపాటి శకకర్తో చూద్దాం అని— ఓ చూపు చూపాను. తామది చిత్తగించి ఉంటారు. నవ్వుకొనీ ఉంటారు. నినాదాలూ వీటి మహత్త్వాయీ పాటివిగాదూ శాస్త్రిలవారూ ?"

గ్రామఫోను, రేడియోలు, సంగీతాన్ని విద్యనూ చవకచేసి మొహం మొత్తించి—చంపుతున్నవి అని భావిస్తున్నాను.

'సినిమా' నటనాశక్తిని పోగులు పెట్టింది అని విశ్వసిస్తున్నాను. యంత్రం, బస్సు, బియ్యం ఫ్యాక్టరీ లేనిచోట బ్రతుకుదాం అని ఆశ పడుతున్నాను.

ఇదంతా 'రి-ఆక్షనరీ' (వెనక్కు-మళ్ళే తత్వం) అంటారు. నాకు మిగిలిన బహు కొద్దిమంది స్నేహితులు.

వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రి ఇచ్చిన తప్పు సమాచారం ఆధారంగా, 'కన్యాశుల్కం' నాటకం రాసింది జి. సి. వి. శ్రీనివాసచార్యులేగాని గురజాడ కాదని, జయంతి కుమారస్వామి అనే మారుపేరుతో రుక్మిణీనాథశాస్త్రి రాసిన వ్యాసం ఆంధ్రపత్రికలో మార్చి 13 న అచ్చుసడింది. ఇది గోలతేపి గగ్గోలుగా మారింది. నినాదాలూ, అరుపులూ, ఇవేనా 'కన్యాశుల్కం'లో వుంది? రుక్మిణీనాథ శాస్త్రికి గురజాడ గురించి లేని సద్భావం, లేదా, ఒకప్పుడుండి ఆ తర్వాత పోయిన సద్భావం, శ్రీపాదకు ఉంది గనకనే ఆయన తన 'అనుభవాలు-జ్ఞాపకాలూ'ను రెండో సంపుటిలో యీ పేరా మినహా తక్కిన జ/రు/శా ఉత్తరాన్ని అచ్చు వేయించారు.

ఇంకా ఇంకా నాలోనే నేను తలపట్లు పట్టుకుంటున్నాను.

ఇట్లాంటి వేళల్లో 'మీ అనుభవాలూ జ్ఞాపకాలూ' నాకు ఎంత గొప్పగా ఉంటాయో మీరే యోచించండి.

ఈ గ్రంథం వ్రాసింది మీరు కాక—మరెవరైనా—నా ఈడు జోడు వాడు వ్రాసి ఉంటేనా - ?

బుగ్గ నులిపి:

కావలించుకొని, ముద్దెట్టుకుని వుందును.

మరి—వ్రాసింది మీరు—అందుకని—

"ఆంగీరస బార్హస్పత్య భారద్వాజ త్రయారుషేయ ప్రవరాన్విత భార ద్వాజ సగోత్రః—

ఆపస్తంబ సూత్రః—

యజుశ్శాఖాధ్యాయీ—

రుక్మిణీనాథశర్మా - అహంభో అభివాదయే"

మీ పాదాలు ముద్దు పెట్టుకుంటున్నా—

మీ

రాత్రి 10-38

జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి

1958 జనవరిలో రాజమండ్రి 'కలాభివర్ధనీ పరిషత్తు' వెలువరించిన శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి "అనుభవాలూ జ్ఞాపకాలూను" రెండో సంపుటం మొట్టమొదటే 'చదివినవారన్న మాటలు' శీర్షికకింద వేలూరి శివరామశాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పురిపండా అప్పలస్వామి, విశ్వనాథ, ఇంద్రగంటి,జమదగ్ని, మల్లాది వగైరాల అభిప్రాయాలతోబాటు జరుక్ది కూడా అచ్చైంది.

శ్రీ మాత్రే నమః

మద్రాసు,
1-11-55,
రాత్రి 9-10.

బ్రహ్మశ్రీ వేదమూర్తులయిన శ్రీపాద సు-బ్రహ్మణ్య శాస్త్రిగారి సన్నిధికి, నమస్కరించి రుక్మిణీనాథశాస్త్రి వ్రాసుకునే విన్నపములు :

30-10-55 న తాము నాయందు అమితమైన వాత్సల్యంతో వ్రాసిన ఉత్తరం యివాళ మధ్యాహ్నం అందింది. ఈ ఉత్తరం చదివి లోగడ నేను మీకు వ్రాసినవి అచ్చుకు ఇస్తున్నారు అనుకున్నాను. నేను మీకు క్రితం వ్రాసినది వ్యక్తిగతం.

అయితే ఆల్లాగని అచ్చుకు ఇస్తే- అభ్యంతరం పెట్టను- కారణం: లేఖలు అన్నవి, పొందినవారి సొత్తు. వారి ఇష్టం ప్రకారం చేసే వీలుకలవి. అదీగాక, ప్రేమతో మీరు అచ్చుకు ఇస్తున్నారు.

నా 'ప్రవర' మీరు వ్రాసినట్లే—

ఆంగీర, బార్హస్పత్య, భారద్వాజ త్రయారుషేయ ప్రవరాన్విత భారద్వాజ సగ్రోతః ఆపస్తంబ సూత్రః యజుశ్శాఖాధ్యాయీ రుక్మిణీనాథ శర్మా అహంభో అభివాదయే! అని.

గురజాడ అప్పారావుగారిని గురించి, ఆంధ్రపత్రికలో—13-3-55న పత్రికలో పడిన నా సందేహం. వ్రాసేప్పుడు తల అమ్ముకున్నవాణ్ణే గనక, రేడియోవారు ఏమున్నా అభ్యంతరం చెప్తారేమో అన్న జంకుతో ఆ పాత పెన్ సీసుతో వ్రాశాను. ఆ జంకు తీరాక, ముడుంబై నరసింహాచార్య

స్వామి [1] గారిపై వ్యాసాలు- నా పేరనే వ్రాశాను, అంతే. అప్పారావుగారు ప్రతిభావంతులు. గొప్ప పండితులు. ఆంగ్లంలో కాని, తెనుగున వారికి సహాయం— ఇతరుల- సహాయం వుంది- అనే నేటికీ నా విశ్వాసం. ఇక, నా ఉత్తరంలో వుంచడం విషయం, పెద్దలు మీరు ఆలోచించి ఏంచేస్తే బావుంటుందో ఆలాగ చేయండి మీ యిష్టం.

గిడుగు రామమూర్తి పంతులుగారిని తామూ అడిగారా? నేనూ వారికి రాజమహేంద్రవరంలో ఆడిగాను. [2] వారు నాయందు అమిత మైన అభి

---

1. విజయనగర సంస్థాన సంస్కృత విద్వాంసులు. 'కన్యాబలక్రం' తొలి కూర్పు నాటకానికి సంస్కృతంలో నాంది శ్లోకాలు రచించారు.

2. గంజాం జిల్లాను తీసి ఒరిస్సాలో కలిపి వేశాక, నిరసనగా గిడుగు రామమూర్తి పర్లాకిమిడి వదిలి రాజమండ్రికి వచ్చారు— 1934 తర్వాత. గురజాడకు ఆ బాల్య స్నేహితులే గాక, ఆంగ్లంలోనే గాక ఆంధ్రంలోనూ గురజాడ ప్రజ్ఞను గుర్తెరిగినవారు, గురజాడను అపండితుడుగా ఆనాటి శ్రీరాముల సచ్చిదానందశాస్త్రి వంటి ఛాందస పండితులు తెగనాడి గేలిచేశారు. కాని, భాషా సంస్కరణను సూత్రప్రాయంగా— లక్ష్యంగా— గిడుగు ఎంచితే, ఆచరణలో దానికి లక్షణంగా నిలిచే రచనలు చేసింది గురజాడ. గురజాడ అ-పండితుడని ధ్వనించే మాటల్ని డా॥ గిడుగు సీతాపతికూడా వాడకపోలేదు. ఆ పాండిత్యం వల్లే పేడ దిబ్బ అని కాలం నిరూపించింది. ఆధునిక కవితా ప్రస్థానభేరి వేసింది గురజాడ అయినా, రుక్మిణీనాథశాస్త్రి తలదన్నేట్టుగా విశ్వనాథ సత్యనారాయణీయులు (విశ్వనాథ సత్యనారాయణ మాత్రంకాదు- గురజాడ గురించి ఆయన భావాలు చూడాలంటే నవ్యసాహిత్య పరిషత్ అష్టమ మహాసభలో విశ్వనాథ అధ్యక్షోపన్యాసం చూడవచ్చు) గురజాడను అ-కవిగా నిరూపించారు. శత్రువులిలా ఆయన సాహిత్య వ్యక్తిత్వాన్ని తెగనాడారంటేనే, దాని విశిష్టతను నవ్యులు ఎంతగా గుర్తించింది లోకం ఎలా అభిమానించిందీ తెలుసుకోవచ్చు.

మానం కలవారు. నవ్వారు, నా వీపు తట్టారు. అది వారి ఆశీర్వచనం. అంతే.

నేను మీకు వ్రాసిన ఉత్తరాన్ని, మీరు ఇంద్రకంటి హనుమత్ శాస్త్రి గారికీ, చెరుకుపల్లి జమదగ్ని గారికీ చూపించారా? పురిపండా అప్పలస్వామి గారికిన్నీ చాలా బావుంది' మీ భిల్లాకు నాది ఉల్లాకా? అది గొప్పగా చూపించారా? మిత్రులకు!! ఏం వెర్రివారండీ మీరు!!

శాస్త్రిగారూ!

మీయందు నా అంచనా అతిశయోక్తిగా భావిస్తున్నారా? మీ చిత్తం. నా ప్రాప్తం!

మీ గ్రంథం విషయంలోగూడా నేను వ్రాసింది అతిశయోక్తేనా....? కొన్ని కొన్ని సందర్భాలలో ఎక్కువ చెప్పారేమో అని అనుకున్నాను. అది తప్పిస్తే- మీ గ్రంథం గొప్పది కాదా? అందులో ఎంత తపన, ఎంత క్షోభ వుంది! ఆ క్షోభ కొత్తదాని తొక్కే ప్రతివారూ పడేదే అనీ, అంత ఘర్షణ, సంఘర్షణ పడ్డాక కలిగే ఫలితం పదికాలాలపాటు నిలుస్తుంది అనీ నా నమ్మకం.

శ్రీ శ్రీకి తండ్రి[1] సులక్షణ సారాదులు కొని యిచ్చి, అతని కవితా వ్యాసంగానికి దోహదం చేశారట. శ్రీ శ్రీ చెప్పాడు ఎప్పుడో. భారతిలో కథ చదువుతున్నందుకు అమ్మచేత చివాట్లూ—నాన్నచేత దెబ్బలూ తిన్నాను నేను. ఇలాగ వుంటాయ్ జాతకాలు. ఏం చెప్తాం??

మీరు ఈ మధ్య విశాఖపట్నం వెళ్ళివచ్చి ఉంటారు. పురిపండా

---

(1) శ్రీరంగం వెంకట రమణయ్య 'మాష్టారు'. ఈ ఘటనను శ్రీ శ్రీ ఎన్నోమార్లు పేర్కొన్నారు.

అప్పలస్వామిగారు ఖులాసా? నన్ను ఇంకా మరవనేలేదూ? అరె! ఆశ్చర్యం!!

మీ అనుభవాలూ జ్ఞాపకాలూ ప్రస్తుతం నా దగ్గిరలేదు. ఇప్పటికి నలుగురు చదివారు. ముగ్గురు మెచ్చారు. మిమ్మల్ని చూడాలని వుంటుంది ఎప్పుడూ. మీతో ఓ రోజన్నా కనీసం మాట్లాడాలి. ఎన్నో సంగతులు తెలుసుకోవాలి. ఎట్లా? ప్రాప్తం ఎప్పటికో!

నా శరీరం ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచీ—చాలా అసహ్యంగా తయారు అయింది. నేను రేవతీ నక్షత్రం మూడవ పాదంలో పుట్టినవాణ్ణి. అష్టమ శని. ప్రభూ, మూడుసంవత్సరాలు నన్ను ఆడించి విడిచింది—అందులో అనారోగ్యం. చావను. బతకను. ఈ మధ్య యోగాసనాలు వెయ్యలేకపోయి నాను. లంకణాలలో మనుగుడుపులు అన్నట్లు—నవరాత్రులు. 10 రోజులూ జగజ్జననికీ, మా అమ్మవారికి పూజలు ఎలా చేశానో ఆ సర్వేశ్వరికి తెలి యాలి. లేవలేను. సుస్తీ పేరు "మూలశంక". అది విజృంభించింది భావ కవిత్వంలాగ. దాన్ని అదుపులోకి తెచ్చేసరికి తాతలు దిగి వస్తున్నారు. నెల్లాళ్లు సెలవపెట్టి (డిసెంబరు అంతా) తిరువన్నామలైకి[1] పోతున్నాను. యోగసనాలు ఇత్యాదికం సాధించటానికి. సర్వరోగ నివారణి యోగం అని విశ్వాసం నాకు. సొంత సోది వ్రాస్తున్నట్టున్నాను, బంద్.

మీ 'మీగడ తరకలు'[2] అచ్చయినాయా? ప్రేమపాశం?[3] అచ్చు

---

(1) రమణాశ్రమం — చింతా దీక్షితులూ, సూరినాగమ్మా, గుడిపాటి చలం గార్లకు ఆకర్షణస్థానం.

(2) 'భారతి'లో 'శాస్త్రి' పేరున శ్రీపాద 1932 ఏప్రిల్ నుంచి 1937 ఫిబ్రవరి దాకా రాసిన చిక్కటి చిన్న వ్యాసాలు.

(3) శ్రీపాదవారి రచన.

అయితే ఒక కాపీ నాకు ఆశీర్వదించి పంపండి. శ్రీ ఇంద్రగంటి హనుమత్ శాస్త్రి ఏం చేస్తున్నారు? కొత్త కావ్యాలు[1] వ్రాస్తున్నారా? ఈ మధ్య వారు "భూసతికిన్ దివమ్మునకు" అన్నది చదివాను. బాగా వ్రాశారు. వారూ "జపం" అనే ఇదిలో పడ్డట్టు ఎందుకో అనిపించింది ఆ మధ్య. నిజం తెలియదు.[2] "బహుశాఖాహ్యనంతాశ్చ బుద్ధయో అవ్యవసాయినాం" అన్నట్లుగా వారు-తయారు అవుతారేమో అని నా భయం. ఒకటి, ఇది మనకు తారకం అనుకుంటే- దాని అంతు చూడాలి అనే నా క్షోభ. నా లాంటి భ్రష్ట జాతకులు ఏదీ సాధించలేరు. అది అల్లా వుండనీయండి హనుమదింద్రకంటి కేమి ? గొప్ప రసజ్ఞులే ! మంచి వ్రాయసి గదా ! ఏమిటో గట్టి దీక్ష వీర్పడ్డానికి గూడా మీ అనుభవాలు జ్ఞాపకాలు వంటివి స్రోత్సహిస్తయ్ అని నా విశ్వాసం.

గురజాడ అప్పారావుగారి విషయంలో తిరిగి వ్రాద్దామా అని వుంది. చెప్పవలసింది ఎంతో మిగిలిపోయింది. "పునః ప్రాణానాయమ్య" అందామా అనుకుంటున్నాను. మీరేం అంటారు ? దయయుంచి వివరంగా వ్రాయించండి.

జ/ రుక్మిణీనాథశాస్త్రి
15 ఉస్మాన్ రోడ్డు
మద్రాసు–17

మీ
జ/రు/శా

---

(1) తెలుగువీణ, దాశరాము ప్రకటించారు. కథల సంపుటం కూడా.

(2) నిజమేనని హనుమచ్ఛాస్త్రి స్వీయ చారిత్రాత్మక రచనాశకలాలనుంచి గ్రహించవచ్చు.

4

శ్రీ మాత్రే నమః

మద్రాసు
30-11-55

బ్రహ్మశ్రీ వేదమూర్తులయిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సన్నిధికి నమస్కరించి రుక్మిణీనాథశాస్త్రి వ్రాసుకొనేది. నమస్కారోభయము కుశలోపరి :-

మీరు ఈ 27న వ్రాసినలేఖ నిన్న మధ్యాహ్నం చేరింది. మీకు నా యందుగల వాత్సల్యానికి కృతజ్ఞుడను. తాము జనవరిలోనో, ఫిబ్రవరిలోనో మద్రాసు వస్తామని వ్రాశారు. ఎగిరి గంతులేసింది మనస్సు. శుభం. రండి. మంత్రశాస్త్రం సంగతులు చాలా తెలుసుకోవాలి మీ వల్ల. మరో కోర్కె గూడాసు. తిరువన్నామలైకి మనం ఇద్దరం కలిసిపోదాం. మీ నా మిత్రులు శ్రీ గుడిపాటి వెంకట చలంగారిని చూచి వద్దాం.

"మీగడ తరకలు" అప్పటికీ యిప్పటికీ బాగున్న పేరు. మీకు యిష్టం లేకపోతే—ధర్మం లేదా తత్త్వ మీమాంస— వుంచండి. ఏమయినా మీగడ తరకల దగ్గిరికి రావు. గురజాడ అప్పారావుగారిని గురించి వ్రాస్తాను. కాని నా క్షోభ యిది: ఏదీ—ఇదమిత్థం అని నేనై తెచ్చి ప్రజల ముందు పెట్టటం. ఎవరికి వారే, తీర్పు చెప్పుకొనేటట్లు చూడడం. ఆ తీర్పు ఎట్లా చెప్పుకొన్నాసరే.

రామకృష్ణ కవులు : - తిరుపతి వెంకట కవులు గుర్తుచేశారు.

---

(1) జంట కవుల సృష్టి వెనక గూడా వున్నా, గత శతాబ్ది చివరినుంచి ఈ శతాబ్ది ప్రథమార్ధం దాకా బాగా- ఒకొకప్పుడు అంటు జాడ్యంలా కూడా-పెరిగింది. ఈ వేంకట రామకృష్ణ కవులు తూర్పు గోదావరి జిల్లాలో పిఠాపురం జమీందారు ఆస్థానికులుగా గణుతికెక్కారు. కాని ప్రతిభలోనూ, ప్రభావంలోనూ తిరుపతివేంకటకవులకు వెనకే. వెంకట రామకృష్ణ కవులు శ్రీపాద వారికి గురువులు.

వో పావుగంట గీకతంలోని పద్యాలు, తిరుపతి వెంకటేశ్వరార్ధ శతకంలోని పద్యాలూ, గుర్తున్నవి చదువుకొన్నాను. మనలోమాట- నాకు తిరుపతి కవుల యందు పక్షపాతం. అల్లాగని వెం॥రా॥లను గాని, కొప్పరపువారిని [1] గాని తృణీకరించలేను. వెంకటశాస్త్రిగారిని లవలేశమూ తక్కువ చెయ్యలేను. అంత పోట్లాట ఆనాడు జరిగింది గనుకనే-అంతో యింతో సాహిత్యాభిరుచి దేశంలో జాగృతం అయింది. పోట్లాడి- వేదం వేంకట శాస్త్రిలుగారూ, [2] తిరుపతి కవులూ సాహిత్యాభిరుచిని పెంపొందించారని ఇప్పటికీ నమ్ముతున్నాను. అలాగా ఎంత శాఖ్టకులుగా పోట్లాడినట్లు కనిపించినా, రామకృష్ణ కవుల గగనపుష్పం, రామకృష్ణ మహాభారతం, వేదాల తిరువెంగళాచార్యులు గారి శ్లేషోపాధ్యాయిక, శతఘ్ని, తి॥ వె॥ అర్థశతకం, యిటు తి॥ వే॥ కవుల గీకతం, ఎంతెంతగానో యిప్పటికీ కనిపిస్తాయి. అంతటి సాహిత్య సమరాలు చేయగల యోధులు నేడు లేరు. ఆ వోపికలు అసలే లేవు. ఏ విశ్వనాథ సత్యనారాయణగారికో ఉన్నా, ఆయనకు తగ్గ ప్రతిస్పర్థి లేడు. కనక-వెంకట రామకృష్ణ కవులను గురించి కొంత వ్రాశాను గనక - యీ మక్కా- వ్రాస్తున్నాను.

ఆంధ్రపత్రికలో-యిటీవల 'విశ్వగుణాదర్శం' అచ్చు అవుతోంది. చిత్తగిస్తున్నారా? లోగడ వెం॥రా॥లు కూడా తర్జుమా చేశారు ఈ గ్రంథాన్ని. ఈ తెలుగు పిలకా గణపతిశాస్త్రి గారిది.

'ఆత్మబలి' [3] చదువుతారా? అని వ్రాస్తున్నారా?

---

(1) కొప్పరపు సోదర కవులు. అవధాన విద్యలో గట్టివాళ్ళేగాని తిరుపతి వెంకట కవులతో పొలిస్తే సూర్యుని ముందు దివిటీలలాంటి వారే.

(2) ధ్వన్యాలోకానికి వీరి తెలుగు వ్యాఖ్యానం ప్రసిద్ధమైనది.

(3) శ్రీ పాదవారి నవల.

ఏమి మాట అది ? మీరు వ్రాసింది. ఆ తేనె తెనుగు - ఎన్నిసార్లు అయినా చదువుతాను. యీ పంక్తులు వ్రాస్తూంటే - 'ఇబ్బుపట్టిన వెధవాడ బడుచు' [1] ఒక్కసారి చదవాలని ఆశగా వుంది. పోవాలి యూనివర్సిటీ లైబ్రరీకి. అక్కడ వున్నయ్ భారతులు అన్నీ.

ఈ మధ్య 'భువనఘోష' [2] అనే గ్రంథం వచ్చిందట. యిక్కడ దాన్ని గురించి అనుకుంటున్నారు. చాలా పితలాటకంగా వుందట. మీరు వస్తున్నారు గదా. అప్పుడు ఎన్నెన్నో అడగాలి.

మీ

జ/రు/శా.

30-11-1956

---

(1) వారి - గొప్ప కథల్లో ఒకటి : సంస్కరణోద్యమ ముద్రను చూపెట్టేది.

(2) ఈ సంకలనకర్త కవితా సంపుటి అయివుండవచ్చు. దీనిలోని చివరి ఖండిక అపహాస్య ధోరణిలో వున్నా నిందాస్పర్శ వుందనే అపోహ అప్పట్లో చాలమందికి వుండేది.

5

శ్రీ మాత్రే నమః

3-3-58

మద్రాసు

బ్రహ్మశ్రీ వేదమూర్తులయిన సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి నమస్కరించి వ్రాసుకొనేది. తాము నా యందు వాత్సల్యం కొద్దీ పంపిన 'అనుభవాలూ-జ్ఞాపకాలూ' 2 వ భాగం నిన్న ఉదయం అందింది. రెండుసార్లు నిన్ననే చదివాను—కనీసం మరో రెండుసార్లయినా చదువుతాను. క్లుప్తంగా ఒక నింద; ఒకస్తుతి—

1. మీ పెద్ద అన్నగారి చిత్రం ఎంత బావుందండీ. పది పన్నెండు సార్లు చూచి తన్మయుణ్ణయ్యాను. ఆయన్ను ఎరగను కాని, పండితుడని, అంతర్ముఖుడనిపించింది.

2. మీకు సాపుగా మతిపోయింది. కుతః, కొండికను, నా వుత్తరాన్ని అచ్చొత్తుతారా? యోజించండి. తప్పు. మీరెక్కడ యోచిస్తారు? మీకు మతిపోయింది గద! మీ అంతస్తు ఎక్కడా? నేనెక్కడా ? శాస్త్రిలవారూ! అన్యాయం. సరి- ఇప్పుడా చర్చ ఎందుకు ? లాభంలేదు ! అభిమానం పట్టి మిమ్మల్ని అట్టా చేయించింది. ఈ భాగంవల్ల ప్రవా పర్వతావధానులగారి బదులు [1] వీలూరిపాటివారూ, దివాకర్ల తిరుపతి శాస్త్రిగారూ, రామకృష్ణ కవులూ కళ్ళముందాడారు. గీరతంలో గుర్తున్న పద్యాలు ఓసారి నాలో

---

(1) శ్రీ పాద వారికి స్మార్తం చెప్పారు. వీరిది ప. గోదావరి జిల్లా కానూరి అగ్రహారం.

నేను పాట పాడుకున్నాను. వీరేశలింగం గారిని గురించి మీరు వ్రాసింది యథార్థం. అట్టిదే గురజాడ అప్పారావు. ఇతనికి మనవాళ్ళంటే వుండే అసహ్యం, మన సంస్కృతి యందుండే అపహ్యం ఎంతైనా గన్నాయం. మీ మూడవ వాల్యూం ఓ రెండు మూడు రోజుల్లో వస్తోంది కదూ ?

విధేయుడు

జ/ రుక్మిణీనాథశాస్త్రి

---

(1) ఈ వుత్తరంలో రెండో సంఖ్య గలదాన్ని శ్రీ పాద వారు తమ రెండో సంపుటం మొదట అచ్చు వేయించారు, అనేక ప్రశంసల్లో ఒకటిగా. 'బ్రాహ్మల్లో వున్నంత మాలకూడు' వగైరా మాటల ద్వారా అప్పారావు తన బ్రాహ్మణేతర పాత్రల ద్వారా 'కన్యా శుల్కం'లో బ్రాహ్మణ జాతినే మొత్తంగా తెగనాడాడా ? అగ్ని హోత్రావధాన్లూ, లుబ్ధావధాన్లూ వగైరాల ద్వారా వైదీకి శాఖలోని దురాచారాల్నీ కశ్మలాన్నీ బయటపెట్టాడా ? వీరేశలింగం గారిలా గురజాడ కార్యాచరణలో సంస్కర్త గాకున్నా, సమాజ విమర్శలో ఆయనది సాంప్రదాయికతకు వ్యతిరేకమైన ఆధునిక దృక్పథం. జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి వురఫ్ జయంతి కుమారస్వామికి కన్నెర్ర, గుండెమంట కలిగించిందిదే. పైగా తనది నడమంతరపు చాదస్తమాపె!

శ్రీ మాత్రే నమః

మ ద్రా సు
3-3-1958

శ్రీ శాస్త్రిగారికి—నమస్కారములు. ఇందాకే మీకు కార్డు వ్రాశాను. నా మనస్సు స్పష్టం కాలేదేమో అని మళ్ళీ వ్రాస్తున్నాను. ఏలూరిపాటి చయనులు గారిని వెలిసిన స్వాములారు ఎవరండీ, వొక సొగసు—నన్ను బహుశా ఆకట్టింది! నీకతం. ఇటు తిరుపతిశాస్త్రిగారూ అటు వెం॥ రా॥లు కూడా అయిష్టంగానే ఆ సాహిత్య సమరం నడిపారన్నమాట. చూడండి, వారిలో ఎంత నిగ్రహశక్తి ఉందో! అవును మరి— మనలో దుశ్చింత లేకుంటే— క్రాచు ఏమీ చెయ్యలేదన్నవారు నిగ్రహపరులు కారా? మీరు, వెం॥ రా॥ల దగ్గిరికి వెళ్ళినట్లే, వేదాల తిరువెంగళా చార్యులుగారూ వెళ్ళారు. రామకృష్ణ కవుల దగ్గిరే చదివారట. వారూ తిరుపతిశాస్త్రియంటే ఎంతో గౌరవం చూపుతారు. ఆ మహనీయుడు అగ్నివాడు కాబోలు. తిరువెంగళాచార్యులుగారికి వ్యాకరణ శాస్త్రం తాము చెప్తానన్నారట. ఆచార్యులుగారు చెప్పారు. మిమ్మల్ని చూడాలని వుంటుంది. మీరా మద్రాసు రారు. నేనా పంజరశుకాన్ని. దైవేచ్ఛ వుంటే, మిమ్మల్ని తప్పక కలుస్తాను. 'లలితాత్రిశతి' అని అమ్మవారి పేర స్తుతికావ్యం ప్రారంభించా. 60 శ్లోకాలదాకా అయినాయి. తమ ఆజ్ఞ అయితే తమకు నివేదిస్తాను.

నా చిరునామా :

జ/రుక్మిణీనాథ శాస్త్రి,
15 ఉస్మాన్ రోడ్డు, మద్రాసు-17.

మీ
జ/రు/శా.

7

శ్రీమాత్రే నమః

మ ద్రా సు
8-3-1958

బ్రహ్మశ్రీ వేదమూర్తులయిన శాస్త్రిలవారి సన్నిధికి— నమస్కృతి. మీ ఆదరాభిమానాలు కల కార్డు అందింది. నా ఉత్తరానికి మీకు కోపం వచ్చింది కాబోలు అని కొట్టుకుంటున్నాను, నన్ను మన్నించారు. కృతజ్ఞుణ్ణి. ఊరంతరిదీ ఒకదారి అన్న సామెతకు ఉదాహరణ నేను— అందరిలాగా 2వ వాల్యూం చదివి ఊరుకోలేను. 1, 2 వాల్యూములు ఒకే బిగిని చదివాను. వెనక తగలని, అందని కొత్త సొగసులు 1వ వాల్యూములో దొరికాయి. 2వ వాల్యూం ప్రసక్తి. నాకు తోచింది వ్రాస్తే— వ్యాసం అవుతుంది. మరొక్కసారి పరిశీలనగా, 1, 2 వాల్యూంలు చదివి వెంటిపై వ్యాసం వ్రాయాలని వుంది. ఈశ్వరేచ్ఛ. తాము నెల్లూరు వస్తారా? మద్రాసుకూ దయచేస్తారా ? నాకూ దర్శనం ఇస్తారా ? ఎంత సుకృతం! మీ ఆజ్ఞ పాటిస్తాను. సంస్కృత వచనం వ్రాసే సాధన చేస్తాను. తప్పదు. వెంకట రామకృష్ణ కవులు చెప్పిన పత్రిక [1] ను మీరు ప్రారంభించక తప్పదు. విజయదశమి కైనా తీసుకురావాలి అని నా ఆశ. మీరు మద్రాసు వస్తే - నా సోది వినడానికి ఓ పూటయినా కేటాయించండి. అంత వుంది చెప్పటానికి. మనని చేస్తాను. పిడపర్తివారి గురించి బహు తక్కువ వ్రాశారేమి? యింకో కథకూడా విని వున్నాను. వస్తున్నారుగా. ఎప్పుడు వస్తారు? ఎదురుచూస్తూ వుంటాను.

మీ
జ/రుక్మిణీనాథశాస్త్రి
8-3-1958

---

(1) క్రితంలో శ్రీపాదవారు 'అభ్యుదయ', 'ప్రబుద్ధాంధ్ర' పత్రికలు నడిపారు. ఈ ప్రస్తావన ఏ కొత్త పత్రిక గురించో వూహించాల్సిందే.

8

శ్రీ మాత్రే నమః

మ ద్రా సు
18-4-1958

బ్రహ్మశ్రీ వేదమూర్తులయిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి నమస్కరించి వ్రాసుకొనేది— నమస్కారోభయ కుశలోపరి :—

తాము నాపైని ఎంతో వాత్సల్యంతో వ్రాసిన [16-4-1958 న] కార్డు యిప్పుడే చేరింది. తాము మద్రాసుకు వస్తున్నారనీ, తమతో కొంత కాలం గడిపే అదృష్టం పడుతూంది అనీ, నేనూ శ్రీ యామిజాల పద్మనాభ స్వామిగారూ అనుకుంటూ వస్తున్నాము. సరి. ఈశ్వరేచ్ఛ ఎప్పటికో. ఎండలు దండు ముండలల్లే ధగధగలాడుతున్నయ్. ఈ స్థితిలో (Sic) నేను. బందరు వెళ్ళి రావలిసి వస్తోంది. ఎలా వెళ్ళి రాగలనో, ఈ 26 న ఇక్కడ బయలుదేరుతూన్నాను. తిరిగి మద్రాసుకు రాంగానే వుత్తరం వ్రాసుకుంటా.

విధేయుడు,
జ/రు/శా/

9

మ ద్రా సు,
23-4-58.

బ్రహ్మశ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారికి—
నమస్సులు.

ఈశ్వరానుగ్రహమువల్ల, నా కుమారుడు చిరంజీవి శివప్రసాద్‌కు ఈ 9-6-60 న బందరులో స్వగృహంలో ఉపనయనం చేస్తున్నాను. తాము మమ్ము దీవించ ప్రార్థిస్తున్నాను.

విధేయుడు,

జ/రుక్మిణీనాథశాస్త్రి

10

శ్రీ

మ ద్రా సు,
22–2–55

శ్రీ ఆబ్బూరి వరద రాజేశ్వరరావుగారికి —

చి॥ వరదకు, ఆశీః

నీ వుత్తరం.

శ్రీశ్రీని, నేను మొన్న చూచాను.[1] ఒక గంట అతనితో గడిపాను. కులాసాగానే వున్నాడు. తేరుకుంటున్నాడు. ఇంకొక 15,20 రోజులు అక్కడ వుండడం మంచిది ఆని డాక్టరు చెప్పాడు. నాకూ అదే అనిపించింది. శ్రీశ్రీ క్షేమం.

---

(1) రష్యా పర్యటన తర్వాత శ్రీశ్రీమీద 'ఆంధ్రపత్రిక'లో సాగిన అక్షర-దుమారం ఒకకారణంగా శ్రీశ్రీ తాత్కాలికంగా మతిస్థిమితం పోయి ప్రైవేట్ నర్సింగ్‌హోములో చేరాడు.

రా-వ తేవీన వ్రాసిన కార్డులు పోస్టు చేయమని, యింట్లో పిల్లలకు యిచ్చి వెళ్ళాను. పోస్టు చెయ్యడం మరిచారు, వాళ్ళు. కనపడగానే పోస్టు చేశారు. ఇవీ పిల్లల నిర్వాహకత్వం. జరిగిన దానికి క్షమించు. ఇక, కవిత పద్యాలు, ఓ వారం రోజుల్లో పంపుతాను. 'స్త్రీ' అన్నది పంపుతాను. ఆంగ్లం చెయ్యడం నావల్లకాదు. అయినా, ఓ స్నేహితుణ్ణి అడిగి చూస్తాను. అందరూ ఖులాసా అనుకుంటున్నాను. నేను వేసే విపులంగా వుత్తరం వ్రాస్తాను. పెద్ద సమాధానాన్ని కోరుతాను. శ్రీ శ్రీ విషయం ఇప్పుడే, మీ నాన్నగారికి వ్రాస్తున్నాను.

నీ

15, ఉస్మాన్ రోడ్డు,
మద్రాసు 17.

జ/రుక్మిణీనాథశాస్త్రి
25-2-1955

శ్రీ:

మద్రాసు,
26-2-55.

చి॥ వరదకు

ఆశీ:

నీ ఉత్తరం (26-2-న వ్రాసింది.)

శ్రీ శ్రీ చిరునామా తెలియక కాదు. తెలిసినా పంపను. ఇప్పుడు, అతను, వీలయినంత ప్రశాంతంగా ఉండడం మంచిది, అని డాక్టరు.

15, 20 రోజులలో, శ్రీశ్రీ మనలోకి వచ్చేస్తున్నాడు. రెండు మూడు రోజులలో నేను తిరిగి శ్రీశ్రీని వెళ్ళి చూస్తాను. 'శ్రీ శ్రీ' అవస్థ విన్నాక, నేనూ వ్రాశాను. అది చాలా పెద్దది. నీకు పంపక, ఏం చేస్తాను? నీ 'కవిత'[1] సంచికలు 2 చదివిన ఉత్సాహంతో, 'ప్రేమగీతం', 'దారి తప్పిన పసి పిల్ల', శ్రీశ్రీకి, అన్నవి తలపెట్టి, కొంత కొంత వ్రాశాను. తీర్చిదిద్ది, రామకృష్ణరావుగారికి పంపుతాను. అక్కడనుంచి నీకు. 1952లో 'స్త్రీ' అనే కవితా రూపకం వ్రాశాను. అది భారతిలో 1952 ఆగస్టులో ప్రచురితం. నిజంగా నాకు బాగుంది. చూడు. నీకో విజ్ఞప్తి చేస్తున్నాను. అబ్బూరి రామకృష్ణరావుగారి- ఊహాగానం, మల్లికాంబ, నవీ సుందరి, మంగళ సూత్రం, ఇవి, దయవుంచి తిరిగి ప్రకటించవలసిన బాధ్యత నీది. ద్రాక్ష వీధి, ప్రయాణవార్త, వాన చినుకు, మందార శిఖవు ఇత్యాదులు వేరే ఒక సంపుటంగా ప్రచురించవచ్చు. ఈ పని నీవు చేయడం ధర్మం. ఇదంతా, ఇప్పుడే, మీ నాన్నగారికీ వ్రాశాను. ఆయన ఈ 24న ఓ వుత్తరం వ్రాశారు. వారికీ ఇప్పుడే సమాధానం వ్రాశాను. మల్లాది రామకృష్ణశాస్త్రిగారిని కలిసి, నీవు వ్రాసినది చెప్పాను. ఆయన, స్వతంత్రలో ఎవరో వ్రాశారూ, ఇక వ్రాయడం బాగుండదని ఊరుకున్నాను, అని అన్నారు. వ్రాయరు. 'బిగ్గా' తెలుగు, ఆంగ్ల దినపత్రికలు పెడతారు అనీ, ఖాసాగారు[2] పీచరు పైట రుగా పోనున్నారు అనీ ఒక వార్త. నిజమా? కమ్యూనిజమా? వ్రాయగోరు తాను— సంతకాల వాళ్ళు చేస్తున్నది కాస్తా కూస్తా కాదు. అందులోనూ

---

(1) అబ్బూరి ఛాయాదేవి సంపాదకురాలుగా వెలువడిన కవితాపత్రిక సంచికలు.

(2) 'స్వతంత్ర' వారపత్రిక సంపాదకుడు, సుప్రసిద్ధ పాత్రికేయుడు, ఖాసా సుబ్బారావు.

కృష్ణశాస్త్రిగారు మహానుభావులు. ఆరుద్ర కలిశాడు. ఇవాళ, ర్వాద్దాం అనుకుంటూనే ర్వాయలేకపోయాననీ, పంచాగ్ని మధ్యంలో వుండి అల్లాగవుతున్నాను అనీ చెప్పాడు.

నీ

జ/రుక్మిణీనాథశాస్త్రి

18-3-55

12

శ్రీ: 18-3-1955

శ్రీ రమణాశ్రమం,
తిరువణ్ణామలై,
నార్థార్కాటు జిల్లా.

చి॥ వరదాయికి,

నీవు 16న ర్వాసిన జాబు యివాళ యిక్కడ నాకు చేరింది. నేను ఈ 10న బయలుదేరి ఇక్కడకు వచ్చాను. ఈ 24 దాకా యిక్కడే వుంటాను. తెలుగు ఉగాదికి మద్రాసుకు చేరుతాను. మద్రాసుకు రాగానే నా రచనలు పంపుతాను. రజనీకాంతరావుగారి అడ్రసు- ఆలిండియా రేడియో, మద్రాసు-4.

"పతాభి" చిరునామా నాకు తెలియదు.

శ్రీ శ్రీ తర్జుమాల విషయం ఆరుద్రకు చెప్పాను. శ్రీ శ్రీ ఖులాసాగానే వున్నాడు. ఆస్పత్రి నుంచి డిస్చార్జి అయినాడు. ఖుషీ. చలంగారికి ఓ ఉత్తరం ర్వాశాడు. అది చూశాను. ఖుషీ.

ఇక మల్లాది రామకృష్ణశాస్త్రిగారి సంగతి మన వల్ల కాదు. ఆయన సర్వస్వతంత్రుడు. ఆయన చేస్తాడు అని నాకు తోచదు. అయినా, నీ ఉత్తరం ఆయనకు చూపిస్తాను. ఇక్కడ నేను ఖులాసా. గుడిపాటి చలంగారితో – వుంటున్నాను. మద్రాసు మాలిన్యాన్ని ఒకించుక వదిలించుకుంటున్నాను. శ్రీ అబ్బూరి రామకృష్ణరావుగారు ఖులాసా అనుకుంటాను. వారి కీ మధ్య రెండు మూడు ఉత్తరాలు వ్రాశాను. "ప్రేమగీతం", "దారి తప్పిన పసిపిల్ల" గేయాలు వ్రాసి త్వరలోనే పంపుతాను.

నీ

జ. రుక్మిణీనాథశాస్త్రి

13-3-55

13

శ్రీ మాత్రే నమః

మద్రాసు

21-11-60

శ్రీ పురిపండా అప్పలస్వామిగారికి, కవితా సమితి సభాపతికి—

నమస్కరించి వ్రాసుకోనేది. అక్కడ మీరు క్షేమం అని భావిస్తాను. ఇక్కడ నేను సకుటుంబముగా క్షేమం. ఆనాడు నా 'కన్యక' నాటకం[1]లో,

---

(1) "కన్యక" నాటకం రాసింది ఒక్క రుక్మిణీనాథశాస్త్రి మాత్రమే కాదని వెంపటి దాని లిఖితప్రతి తన వద్ద ఉంచుకున్నాడు. ఈ సంకలన కర్త కలిసి మాట్లాడినప్పుడు ఇచ్చేస్తానని మాటిచ్చాడు.

రాజుపాత్ర సరిగా లేదని చెప్పావు! ఇతరులు ఎవరు ఏమన్నా—లెక్క చెయ్యను. నీవు సరసుడివి, సహృదయుడివి, నా శ్రేయస్సు కోరే వాడివి, ఆ పద్యాలివి, చెప్పావు అని, ఆ నాటకాన్ని పదే పదే చదివి, నా మనస్సు మార్చుకున్నాను. తిరిగి వ్రాశాను. ఆ పాత్ర యిప్పుడు, కళ్ళు చెదరగొట్టోంది. ఇప్పుడు ఆ నాటకానికి Final (Sic) Touches యిస్తున్నాను. ప్రతి పూటా నిన్ను తలుస్తున్నాను. ఎందుకు? అప్పలస్వామికి ఈసారి స్వయంగా చదివి వినిపిస్తునే—ఈ కవితా సమితికవి, ముకళీధ్వని కర్త, బహుదూర దేశాన ఉన్నాడే, అని అనుకుంటాను. ఎంత దూరాన ఉంటేనేమి, సుఖంగా ఉంటే చాలు అదే పదివేలు. అప్పలస్వామిగారూ! మీరు ఖులాసాగా ఉన్న సంగతి వ్రాయించండి. శ్రీ వెంపటి రాధాకృష్ణ[1] ఖులాసాగా ఉన్నాడు. రేపు లేదు, ఎల్లుండినుంచీ నా దగ్గిర సంస్కృతం చదువుతాడట. పెద్దలు ఇద్దర్నీ ఆశీర్వదించండి.

మీ

జ/ రుక్మిణీనాథశాస్త్రి

(1) రాధాకృష్ణ రాష్ట్ర ప్రజా నాట్యమండలి సభ్యుడు, స్వాతంత్ర్య పోరాటంలో హింసలకు గురైన వ్యక్తి, ప్రతిభాశాలి, 'మా భూమి' నాటకంలో 'అమీన్' పాత్రధారిగా రాణించిన నటుడు – 1980 సెప్టెంబరు మాసాంతాన మరణించాడు.



చలంగారింటికి నేనూ, రుక్మిణీనాథుడూ వెళ్ళాం. శ్రీశ్రీ కవిత్వం మీద ప్రస్తావన వచ్చినప్పుడు-

"చేదు విషం- జీవఫలం
జీవఫలం-చేదు విషం-
ఔను నిజం, ఔను నిజం"

అన్నది మృదువుగా చదివాడు రుక్మిణీనాథుడు. చలంగారి కళ్ళ వెంబడి అశ్రువులు రాలాయి. ఆ పొడిమాటలను కన్నీరు తెప్పించేట్లు ఎలా చదవగలిగాడంటే చెప్పడం కష్టం. అతనిలో ఆ శక్తి వుండేది.

ఒకసారి రైల్లో మద్రాసు వస్తూ పైబెంచిమీద పడుకున్నాట్ట. కింది బెంచిమీద వాళ్ళెవరో ఏదో పత్రిక చదువుతున్నారట. రెండు మూడు వాక్యాలు చెవిన పడగానే అతను "అది రాసింది కుటుంబరావు" అన్నాట్ట. నిజమేనట.

సాహిత్యాభిలాష వుండేవారున్నారు. ఎన్సైక్లోపీడియాలలాగా ప్రతి రచనా జ్ఞాపకం పెట్టుకునేవాళ్ళూ వున్నారు. కాని రుక్మిణీ నాథుడిలా రచయితల సారాన్ని సంగ్రహించినవాడు మరొకడుండడేమో అతని సాహిత్య పిపాస అనన్యమైనది. అతను పత్రికా ప్రపంచంలోనే ఉండదగినవాడు. తనకు ఇంగ్లీషు రాదన్న దిగులుండేది. నిజానికి అందువల్ల అతని కొచ్చిన లోటేమీ లేదు.

-కొడవటిగంటి కుటుంబరావు

Title : NAVODAYA

Check List

Book Number	PS01E571	Date	27/10/22
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	CT, xiii, xi, 158,160		
Missing Pages	1 to 2		
Prepared By	P. Bragathi	Cutting By	P. Bragathi
Scanned By	Suthi	Pages	211